

'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి.
పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 291

శనివారం 11-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ప్రతీక, తేజల్ గెలిపించగా...
తొలి వన్డే భారత మహిళల జట్టుదే.
ఆరు వికెట్లతో ఓడిన ఐర్లాండ్ -17లో



ఎలక్ట్రిక్ కిసిక్!
కొత్త ఏడాదిలో ఈ-ఎస్‌యూవీల జాతర.
ఆటో షోలో ఆవిష్కరణకు రెడీ -17లో




శిక్షేమీ విధించట్లేదు
హష్ మనీ కేసులో అమెరికా కాబోయే అధ్యక్షుడు ట్రంప్‌ను బేషరతుగా విడుదల చేస్తున్నట్టు న్యూయార్క్ కోర్టు ప్రకటించింది.
వివరాలు 6లో ▸



వారు రిజిస్టర్ చేసుకోవచ్చు
గతేడాది తమ కోర్సుల నుంచి డ్రాప్ అయిన అభ్యర్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్-2025కు రిజిస్టర్ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది.
వివరాలు 6లో ▸



5 రాష్ట్రాల్లో సీసీఎస్ దాడులు
డిజిటల్ అరెస్టు చేసి రూ. 5.29 కోట్లు కొల్లగొట్టిన 23మంది సైబర్ నేరగాళ్లను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు.
వివరాలు 18లో ▸



10 వేల ఇళ్లు బుగ్గి
కార్చిచ్చుల ధాటికి అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నగరం ఆహుతి అవుతోంది. ఏకంగా 10 వేల ఇళ్లు బూడిదయ్యాయి.
వివరాలు 6లో ▸

యోగ్యతకే భరోసా

పంట వేసినా, వేయకున్నా సాగుయోగ్యమైతే రైతు భరోసా ● కలెక్టర్లతో సీఎం రేవంత్

- అనర్హులు లబ్ధి పొందకూడదు.. సాగు యోగ్యంకాని భూముల జాబితా రూపొందించాలి..
- భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'
- 2023–24లో కనీసం 20 రోజులు ఉపాధి హామీ చేసినవారు దీనికి అర్హులు
- 26 నుంచి వీటితోపాటు ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ
- 11 నుంచి 15వ తేదీలోగా పథకాల అమలు సన్నద్ధత పనులు పూర్తి చేయాలి
- కలెక్టర్లు ఇన్‌చార్జి మంత్రుల ఆమోదంతో అర్హుల జాబితాలను విడుదల చేయాలి
- 24వ తేదీకల్లా గ్రామ, వార్డు సభలను పూర్తి చేయాలని ఆదేశం
- ప్రభుత్వంపై విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని సీఎం వ్యాఖ్య
- మహిళా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నెలలో ఒక్కసారైనా బాలికల హాస్టళ్లను విజిట్ చేయాలని సూచన
- జనవరి 26 తర్వాత జిల్లాల్లో పర్యటనలు, తనిఖీలు చేస్తానని వెల్లడి



సదస్సులో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన డిప్యూటీ సీఎం భట్టి, సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులు పంట వేసినా, వేయకపోయినా.. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరా భూమికి రైతుభరోసా అందుతుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతులకు ఈ విషయంలో ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావు లేదని చెప్పారు. రైతుభరోసాతోపాటు భూమి లేని నిరుపేద కూలీల కుటుంబాలకు ఏటా రూ.12 వేల నగదు సాయం అందించే 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకానికి ఈనెల 26 నుంచి శ్రీకారం చుడుతున్నామని వివరించారు. ఉపాధి హామీ పనులకు వెళ్తున్న భూమిలేని కుటుంబాలకు 'ఆత్మీయ భరోసా' పథకం వర్తిస్తుందని తెలిపారు. కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల జాబితాలు సిద్ధం చేయాలని కలెక్టర్లకు సూచించారు. సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా కలెక్టర్ల సదస్సులో సీఎం రేవంత్ సుదీర్ఘంగా మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలు, అవసరమైన
మిగతా 2వ పేజీలో ▶

మీ పనితీరు ఎబౌవ్ యావరేజ్
కలెక్టర్ల పనితీరుపై సీఎం రేవంత్!
- వివరాలు 2లో ▶

దేశంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీ

సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ 14లో



వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం వేకువజామున ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిస్తున్న భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి

ప్రత్యేక 'షో'లూ వద్దు

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

- బెనిఫిట్ షోలు రద్దు చేశామంటూ.. గేమ్‌ఛేంజర్‌కు ప్రత్యేక షోకు ఎలా అనుమతి ఇస్తారంటూ అసహనం
- ప్రత్యేక షోలు, టికెట్ల ధరల పెంపును పునఃసమీక్షించాలి
- హోంశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శికి న్యాయస్థానం ఆదేశం



సాక్షి, హైదరాబాద్: గేమ్‌ఛేంజర్ సినిమా ప్రత్యేక ప్రదర్శనలకు ప్రభుత్వం అనుమతివ్వడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఒకపక్క బెనిఫిట్ షోలు రద్దు చేశామంటూ, మరోపక్క ప్రత్యేక షోలకు అనుమతులు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించింది. ప్రత్యేక షో కూడా ఒకరకంగా బెనిఫిట్ షో లాంటిదే అని వ్యాఖ్యానించింది. వేకువజాము షోలకు అనుమతి, టికెట్ ధరల పెంపును పునఃసమీక్షించాలని స్పష్టం చేసింది. భవిష్యత్‌లో కూడా వేకువజాము షోలకు ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని చెబుతూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. భారీ బడ్జెట్‌తో సినిమాలు తీసి ప్రేక్షకుల నుంచి డబ్బు
మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

మాన్యువల్‌గానూ 'భూభారతి' దరఖాస్తులు



వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా... ఇకపై మాన్యువల్ (ఆఫ్‌లైన్)గా దరఖాస్తులకు ప్రభుత్వం వీలుకల్పించనుంది.
- వివరాలు 18లో ▶

మరిన్ని పిచ్చి కేసులతో వేధిస్తారు



రాష్ట్ర ప్రభుత్వం పసలేని కేసులు నమోదు చేసి, పార్టీ నేతలను ఇబ్బందులకు గురిచేసినా ప్రజాసమస్యలను ఎత్తి చూపడంపైనే దృష్టి కేంద్రీకరించాలని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ పార్టీ నేతలను ఆదేశించారు.
- వివరాలు 2లో ▶

నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు



రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు శుక్రవారం నుంచి నిలిచిపోయాయి. ప్రభుత్వం చెల్లించాల్సిన దాదాపు రూ. 1,200 కోట్ల బకాయిలు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ తమ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసినట్లు 'తెన్హా' ప్రకటించింది.
- వివరాలు 3లో ▶

త్వరలో 1000 'విద్యుత్' పోస్టుల భర్తీ



దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ త్వరలో 1000 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఎస్సీ వర్గీకరణ చిక్కులు తొలగిపోయాక ఈ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం.
- వివరాలు 14లో ▶

దేవుణ్ని కాను

నేను అతి సాధారణమైన నేపథ్యం నుంచి వచ్చా. నేను ప్రాథమిక పాఠశాల టీచర్‌నయినా నా తల్లి ఆనందంతో అందరికీ స్వీట్లు పంచేదేమో! అలాంటి నేపథ్యం నాది. చిన్నప్పుడు స్కూల్‌లో సాధారణ విద్యార్థినే. కేవలం పాసయ్యేందుకు చదివేవాడిని. ఇతర కార్యకలాపాల్లో ఉత్సాహంగా పాల్గొనేవాడిని.

రాజకీయాల్లో దేశమే తొలి ప్రాధాన్యం కావాలి. దేశాన్ని నంబర్‌వన్‌గా మార్చే ఆలోచన చేయాలి. అది ప్రజాసేవకు సంబంధించిన అంశం. దేశ ప్రయోజనాల పట్ల, సమాజ క్షేమం పట్ల అంకితభావం ఉన్న నాయకులను ప్రజలు కచ్చితంగా అక్కున చేర్చుకుంటారు. ఆదరిస్తారు. దేశమే ప్రథమమని భావించేవారిని సమాజం ఆమోదిస్తుంది. రాజకీయాల్లో జీవితం అనుకున్నంత సులభంగా ఉండదు.

- సామాన్యుడినే.. కనుక నేనూ తప్పులు చేశా.. వాటి వెనక ఎప్పుడూ చెడు ఉద్దేశం లేదు

తొలి పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మోదీ

- పలు అంశాలపై మనసు విప్పి మాట్లాడిన ప్రధాని.. ప్రజాసేవ కోసమే రాజకీయాలని స్పష్టీకరణ

6లో



ఒకేరోజు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 17 మంది మృతి

పండుగ ముందు పెను విషాదం

బతుకుదెరువుకు వెళ్తూ ఐదుగురు కూలీల మృతి | **పుట్టినరోజు నాడే ఓ యువకుడు దుర్మరణం** | **భార్య కళ్లెదుటే విగత జీవిగా మారిన భర్త**

కుటుంబాల్లో విషాదం నింపిన ప్రయాణాలు



జనగామ-సూర్యాపేట హైవేపై డీసీఎంని ఢీకొన్న తుఫాన్ వాహనం

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో శుక్రవారం ఒక్కరోజే వేర్వేరు జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 17 మంది మరణించారు. పొట్ట చేతపట్టుకొని బతుకుదెరువు కోసం బయలుదేరిన కూలీలు గమ్యం చేరకముందే అనంతలోకాలకు చేరుకున్నారు. పుట్టినరోజు వేడుకలు జరుపుకొని సోదరుడితో తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఆ ఇద్దరు యువకులు మరణించగా.. స్కూటీపై వెళ్తున్న భార్యాభర్తలను లారీ ఢీకొనటంతో భార్య కళ్లెదుటే భర్త దుర్మరణం చెందాడు. రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు చనిపోయారు. దీంతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొన్నది.

ఐదుగురు వలస కూలీలు దుర్మరణం

రోడ్డుపై ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో బస్సు డ్రైవర్ సహా
మిగతా 5వ పేజీలో ▶



భారీ 'ఎత్తున' చార్జీలు పెట్టినా ఇంత ఎత్తున కూర్చోవాల్సి వస్తుంది!

పండుగ ప్రయాణం సురక్షితం చేద్దాం
- వివరాలు 8లో ▶

- జాతీయ రహదారులపై ముందు జాగ్రత్త చర్యలు
- రాత్రివేళ జాగ్రత్తగా లేకపోతే ప్రమాదం జరిగే అవకాశం
- 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనపై ప్రత్యేక కథనం

క్లుప్తంగా...

కాంగ్రెస్ పాలనలో ఆగమైన గూడేలు: కవిత



సాక్షి, హైదరాబాద్: ఆదివాసీల హక్కుల కోసం, వారి సమస్యలపై బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో ఆదివాసీ గూడేలు ఆగమయ్యాయని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హామీలు, ప్రకటనలకే పరిమితం కాకుండా తక్షణమే సమస్యలను పరిష్కరించడానికి సీఎం రేవంత్‌రెడ్డి పనిచేయాలని డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న ఆదివాసీలకు సకాలంలో వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

28 వరకు హరీశ్ అరెస్టు వద్దు

ఫోన్ ట్యాపింగ్ కేసులో మరోసారి ఊరట

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్‌పై పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును ఈ నెల 28 వరకు అరెస్టు చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను మరోసారి పొడిగించింది. రాజకీయ కక్షతో చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదుతో పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన 'ఫోన్ ట్యాపింగ్' కేసును కొట్టేయాలంటూ హైకోర్టులో హరీశ్‌రావు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేశారు. అప్పటివరకు హరీశ్‌పై ఎలాంటి కఠిన చర్యలు చేపట్టవద్దని పోలీసులను ఆదేశించారు.

కల్వకుంట్ల ఖాందాన్ కాలకేయ పాలన

భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కల్వకుంట్ల ఖాందాన్ నడిపిన కాలకేయ పాలన గురించి తెలంగాణ ప్రజలకు తెలుసునని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సమైక్య సంకెళ్లను తెంచుకున్న తెలంగాణను గడీగోడలలో బంధించింది కల్వకుంట్ల కుటుంబమని ఆక్షేపించారు. సీఎం రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డిని వికారాబాద్ సీఎం అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా చేసిన ట్వీట్‌కు ఆయన శుక్రవారం రీట్వీట్ చేశారు. 'ప్రజా తీర్పు మీద, ప్రజల విచక్షణ పట్ల నీకుండే గౌరవమెంతో ఈ అహంకారపు మాటలు చూస్తే తెలుస్తుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో గడీల పాలనతో రాచరికపు జ్ఞాపకాలను తట్టి లేపింది, నామమాత్రపు పదవులతో, ఒక్కొక్కరు మూడు, నాలుగు జిల్లాలను జాగీర్లుగా చేసుకొని తెలంగాణపై గుత్తాధిపత్యం చెలాయించింది కల్వకుంట్ల కుటుంబం. పాలబుగ్గల వయస్సు నుండి నూనూగు మీసాలు వచ్చే వరకు అధికార యంత్రాంగాన్ని తన వెంటేసుకు తిరిగింది నీ పుత్రరత్నం కాదా? ఇలాంటి ఉద్దెర ముచ్చట్లు ఆపు.' అని ఆ ట్వీట్‌లో ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి హితవు పలికారు.

సాంకేతికతతోనే విద్యా రంగ పురోభివృద్ధి

సాక్షి, హైదరాబాద్: సాంకేతికతతోనే విద్యా రంగ పురోభివృద్ధి సాధ్యమవుతుందని టెక్నాలజీపై జరిగిన సదస్సులో పాల్గొన్న వక్తలు అభిప్రాయపడ్డారు. విద్యా రంగంతో వివిధ పరిశ్రమల సంబంధాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వర్సిటీ ఆఫ్ హైదరాబాద్, టీఎస్‌టీ టెక్నాలజీ ఎనేబులింగ్ సెంటర్ సంయుక్తంగా గచ్చిబౌలిలో టెక్నాలజీ అభివృద్ధి, అంచనా, బదిలీపై నిర్వహించిన రెండు రోజుల సదస్సు శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో విద్య, పరిశ్రమ, శాస్త్రీయ విభాగాలకు చెందిన పలువురు ఈ సదస్సులో పాల్గొన్నారు.

జగనన్న కాలనీల పేరు మార్పు

సాక్షి, అమరావతి: సూపర్ సిక్స్, సూపర్ సెవెన్‌లు అంటూ ఏపీ ప్రజలకిచ్చిన హామీల అమలులో శ్రద్ధ చూపించాల్సిన చంద్రబాబు ప్రభుత్వం వాటికి గాలికొదిలేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పథకాలు, కార్యక్రమాలకు పేర్లు మార్చి ప్రచారం చేసుకోవడానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ పరంపరలో భాగంగా వైఎస్సార్, జగనన్న కాలనీల పేర్లను పీఎం ఏవై–ఎన్టీఆర్ నగర్‌లుగా మారుస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంపై పేదలు మండిపడుతున్నారు. రాష్ట్రంలో ప్రతీ పేద కుటుంబానికి సొంతింటిని సమకూర్చేలా 2019–24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం అమలుచేసింది. ఈ పథకం కింద ఐదేళ్లలో ఏకంగా 71 వేలకు పైగా ఎకరాల్లో 31 లక్షల మందికి పైగా పేద అక్కచెల్లెమ్మల పేరిట ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. వీటి మార్కెట్ విలువ రూ.76 వేల కోట్లు పైమాటే. 17,005 వైఎస్సార్, జగనన్న కాలనీల రూపంలో కొత్త ఊళ్లనే నెలకొల్పారు. పేదలకు పంపిణీ చేసిన ఈ స్థలాల మార్కెట్ విలువ ప్రాంతాన్ని బట్టి రూ.2.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఉంటోంది. మరోవైపు.. ఈ స్థలాల్లో సొంతింటి నిర్మాణానికి రూ. 1.80 లక్షలు ఇవ్వడంతో పాటు, పావలా వడ్డీకి రూ.35 వేల రుణ సాయం, ఉచితంగా ఇసుక, సబ్సిడీపై నిర్మాణ సామాగ్రి సమకూర్చారు.

యాదగిరి.. వైకుంఠ సిరి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంతో పాటు అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట (పూర్వగిరి) లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. సరిగ్గా ఉదయం 5.27 గంటలకు శ్రీస్వామి వారు గరుడ వాహనంపై శ్రీలక్ష్మీనృసింహస్వామి అలంకారంలో వేంచేసి.. ఆలయ ఉత్తర ద్వారం వద్ద వైకుంఠనాథుడిగా భక్తులను కనువిందు చేశారు. అనంతరం ఆలయ తిరు, మాడ వీధుల్లో సేవను ఊరేగించారు. సాయంత్రం శ్రీస్వామిని మత్స్యావతారంలో మాడ వీధిలో ఊరేగించారు. ఇక పాతగుట్ట ఆలయంలో సైతం వైకుంఠద్వార దర్శనం ఉదయం 5.27 గంటలకు భక్తులకు కల్పించారు. వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు దంపతులు, ఐఏఎస్ కృష్ణ భాస్కర్, ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి పాల్గొన్నారు. యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం శ్రీస్వామివారిని మత్స్యావతార సేవలో పురప్పాట్ సేవగా ఊరేగించారు.



యాదగిరి క్షేత్రంలో ఉత్తర ద్వార దర్శనానికి హాజరైన భక్తులు. (ఇన్‌సెట్)లో దర్శనమిస్తున్న శ్రీస్వామి వారు

ఆప్ రాష్ట్ర కమిటీ రద్దు

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర కమిటీని రద్దు చేస్తున్నట్టు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ ప్రధానకార్యదర్శి డాక్టర్ సందీప్ పాథక్, రాష్ట్ర ప్రభారీ దిలీప్ పాండే ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటిదాకా తమ పార్టీకి వివిధ రూపాల్లో సేవచేసి, సహకారం అందించిన ఆఫీస్ బేరర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. కొత్త కమిటీ ఏర్పడే దాకా రాష్ట్ర కన్వీనర్‌గా డాక్టర్ దిడ్డి సుధాకర్ వ్యవహరిస్తారని వెల్లడించారు. త్వరలోనే నూతన ఆఫీస్ బేరర్ల నియామకం జరుగుతుందని పేర్కొన్నారు.

యోగ్యతకే భరోసా



శుక్రవారం నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు జూపల్లి, పొన్నం, శ్రీధర్‌బాబు, ఉత్తమ్, పొంగులేటి, కోమటిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

వివరాల సేకరణ, లబ్ధిదారుల జాబితాల తయారీ మొదలైన అంశాలను చర్చించారు. పలు అంశాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. వారు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. సీఎం రేవంత్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే...

''వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా చెల్లించాలి. వ్యవసాయానికి అక్కరకు రాని భూములను గుర్తించి, వాటిని మాత్రమే ఈ పథకం నుంచి మినహాయించాలి. రియల్ ఎస్టేట్ భూములతోపాటు లేఅవుట్ చేసిన వాటిని, వ్యవసాయేతర అవసరాలకోసం 'నాలా' కన్వర్షన్ అయిన భూములు, మైనింగ్ భూములు, గోదాములు, ఫంక్షన్ హాళ్లు నిర్మించిన భూములు, వివిధ ప్రాజెక్టులకు, అభివృద్ధి పనులకు ప్రభుత్వం సేకరించిన భూములు రైతుభరోసా అనర్హత జాబితాలోకి వస్తాయి. ఈ మేరకు గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల రెవెన్యూ రికార్డులు, డీటీసీపీ లేఅవుట్ రికార్డులు, సంబంధిత విభాగాల రికార్డుల్లో ఉన్న వివరాల ఆధారంగా ఈ జాబితా రూపొందించాలి. విలేజ్ మ్యాప్‌లతోపాటు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి అనర్హమైన భూములను ధ్రువీకరించుకుని, గ్రామసభలో ప్రచురించాలి. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా అందించాలి. అదే సమయంలో అనర్హులు ఒక్కరు కూడా లబ్ధి పొందకుండా చూడాల్సిన బాధ్యత కూడా కలెక్టర్లపై ఉంది. ఇందుకోసం ప్రతి జిల్లాకు, ప్రతి మండలానికో నోడల్ ఆఫీసర్‌ను నియమించాలి. గతంలో రైతుబంధు పేరిట భారీ ఎత్తున ప్రజాధనం దుర్వినియోగమైంది. వ్యవసాయ యోగ్యం కాని భూములకు కూడా పంట పెట్టుబడి సాయం అందించారు. ఈసారి అలాంటి పొరపాటు జరగకూడదు.

ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా..

రాష్ట్రంలో భూమిలేని నిరుపేద ఉపాధి కూలీల కుటుంబాలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం ఏటా రూ.12 వేలు నగదు సాయం అందిస్తాం. 2023–24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులు చేసిన భూమి లేని కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుంది. ఏళ్లకేళ్లుగా రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్న కొత్త రేషన్‌కార్డులతోపాటు గూడులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తాం. గతంలో ఉన్న అర్హత నిబంధనల ప్రకారమే కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తాం. ఒక కుటుంబానికి ఒకేచోట రేషన్‌కార్డు ఉండాలి. వేర్వేరు ప్రాంతాల్లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రాబోయే రోజుల్లో 'వన్ రేషన్.. వన్ స్టేట్' విధానాన్ని తీసుకురాబోతున్నాం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డు లబ్ధిదారుల జాబితాలను కూడా గ్రామ సభల్లో వెల్లడించాలి.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు..

ఇందిరమ్మ యాప్ ద్వారా గుర్తించిన 18.32 లక్షల మంది వివరాలను జిల్లాలకు పంపించాం. అందులో అత్యంత నిరుపేదలుగా గుర్తించిన వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరు చేశాం. అర్హుల జాబితాలను వెంటనే సిద్ధం చేయాలి. పథకాలను సమర్థంగా అమలు చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపైనే ఉంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రుల ఆమోదంతో అర్హుల జాబితాలను గ్రామసభలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డు సభల్లో ప్రదర్శించాలి. లబ్ధిదారుల ఎంపికకు సేకరించిన వివరాలు, తయారు చేసిన జాబితాలను వెల్లడించాలి. ఈ నెల 11 నుంచి 15వ తేదీలోగా వివిధ పథకాలకు సంబంధించి సన్నద్ధత పనులను పూర్తి చేయాలి. జిల్లా ఇన్‌చార్జి మంత్రుల సారథ్యంలో అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, నోడల్ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలి. 24వ తేదీలోగా గ్రామ సభలు పూర్తి చేయాలి. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు అయినందున ఈ జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకలకు అత్యంత ప్రాధాన్యముంది. ఈ రోజున నాలుగు ప్రతిష్టాత్మకమైన పథకాల అమలుకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది.

విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత కలెక్టర్లదే..

మా ప్రభుత్వానికి పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి రెండు కళ్లలాంటివి. ఈ ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తుందనే నమ్మకం, విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపైనే ఉంది. జిల్లా కలెక్టర్లే ప్రభుత్వానికి అసలైన ప్రతినిధులు. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే వారే నిర్ణయాత్మక పాత్రను పోషిస్తారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది కలెక్టర్లే. ప్రభుత్వ పని తీరుకు అదే కొలమానం అవుతుంది. కొందరు కలెక్టర్లు ఇప్పటికీ ఆఫీసుల్లోనే కూర్చొని పనిచేయాలని అనుకుంటున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాలని గతంలో మేం సూచించాం. సమస్యలు వచ్చినప్పుడు సమర్థవంతంగా ఎదుర్కోవాలి..'' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఈ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జనవరి 26 తర్వాత జిల్లాల్లో ఆకస్మిక తనిఖీలు

జనవరి 26 తరువాత జిల్లాల్లో పర్యటిస్తా. ఆకస్మిక తనిఖీలు చేస్తా. ప్రభుత్వ వ్యవస్థలో ఎక్కడ నిర్లక్ష్యం కనిపించినా కఠిన చర్యలు తప్పవు. కలెక్టర్లు క్షేత్రస్థాయి అధికారులను కూడా అప్రమత్తం చేయాలి. మహిళా ఐఏఎస్ అధికారులతోపాటు ఐపీఎస్ అధికారులు కూడా నెలలో ఒక్కసారైనా బాలికల హాస్టళ్లను విజిట్ చేయాలి. అక్కడే రాత్రి బస చేయాలి. విద్యార్థుల అవసరాలను, ఏమైనా సమస్యలుంటే తెలుసుకొని పరిష్కరించాలి. ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయికి చేరేలా చర్యలు తీసుకోవాలి.

మీ పనితీరు ఎబౌవ్ యావరేజ్

ఇంకా మెరుగుపడాలి.. కలెక్టర్లతో సీఎం!

జిల్లా కలెక్టర్ల పనితీరుపై సీఎం కీలక వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం. 'మీ పనితీరు ఎబౌ యావరేజ్. బాగానే చేస్తున్నారు. ఇంకా పనితీరు మెరుగుపడాలి. కొందరు కలెక్టర్లు ఆఫీసులకే పరిమితమవుతున్నారు. అది మంచి పద్ధతి కాదు. బయటకు వెళ్లినప్పుడే ప్రజల సమస్యలు మీకు అర్థమవుతాయి. ఇక నుంచి మీ పనితీరు మార్చుకోండి. ప్రభుత్వానికి మంచి పేరు తెండి. తెలంగాణ రాష్ట్రాన్ని సంక్షేమ, అభివృద్ధి పథంలో నడిపించే విషయంలో ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతలను నెరవేర్చే బాధ్యత మీదే' అని స్పష్టం చేశారు. మహిళా ఐఏఎస్‌లు ప్రతి నెలా కస్తూర్బా లేదంటే గురుకుల పాఠశాలలో బస చేయాలని సీఎం సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు వ్యక్తిగతంగా, వ్యవస్థీకృతంగా ఎదుర్కొనే సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయవద్దని చెప్పారు. తాను కూడా ఈ నెల 26 తర్వాత జిల్లాలకు వస్తానని, ఆకస్మిక తనిఖీలు చేస్తానని జిల్లాల కలెక్టర్లకు సీఎం రేవంత్ అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి సీతక్క, సీఎస్ శాంతికుమారి

గోండు భాషలో ప్రాథమిక విద్య

ఆదివాసీలకు విద్యా బోధనపై అధ్యయనం
ఐటీడీఏ ప్రాంతాల్లో ప్రత్యేక కోటాలో ఇందిరమ్మ ఇళ్లు
సీఎం రేవంత్‌రెడ్డి హామీ.. ఆదివాసీ నేతలతో సమావేశం

సాక్షి, హైదరాబాద్: ఆదివాసీలకు గోండు భాషలో ప్రాథమిక విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఆదివాసీ ప్రజాప్రతినిధులు, సంఘాల ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆదివాసీల సమస్యలను సంఘాల నేతలు సీఎం వద్ద ప్రస్తావిస్తూ వినతులు సమర్పించారు.

ఆదివాసీల సమగ్రాభివృద్ధికి చర్యలు

రాష్ట్రంలోని ఆదివాసీల సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'నేను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పుడు మొట్టమొదటి సభ ఇంద్రవెల్లిలోనే పెట్టాం. ఇంద్రవెల్లి అమరుల స్తూపాన్ని స్మృతివనంగా మార్చాలని, అమరుల కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని అప్పట్లోనే నిర్ణయించాం. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పూర్తి చేశాం. రాజకీయంగానూ ఆదివాసీలకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఆదివాసీలు విద్య, ఉద్యోగ, ఆర్థిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. ఆదివాసీల కోసం ప్రత్యేకంగా స్టడీ సర్కిల్, మౌలిక సదుపాయాలను వెంటనే మంజూరు చేస్తున్నాం. విదేశాల్లో చదువుకునే ఆదివాసీ విద్యార్థులకు సంబంధించి పెండింగ్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను క్లియర్ చేస్తాం. ఆదివాసీ గూడేల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాను. కేస్లాపూర్ జాతరకు నిధులు మంజూరు చేస్తాం. ఉద్యమాల్లో ఆదివాసీలపై పెట్టిన కేసులు తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఐటీడీఏ ప్రాంతాలకు ప్రత్యేక కోటాలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం. ఇందిర జలప్రభ ద్వారా ఉచితంగా బోర్లు వేస్తాం. ఆదివాసీ రైతుల వ్యవసాయ బోర్లకు సోలార్ పంపుసెట్లు ఉచితంగా అందిస్తాం' అని సీఎం వారికి హామీనిచ్చారు.

లబ్ధిదారుల పేర్లతో ఫ్లెక్సీలు

4 పథకాల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి
కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి
అత్యంత నిరుపేదలను ఎంపిక చేయండి: పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా ఎంపిక చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ భారీ ఖర్చుతో కూడుకున్నప్పటికీ రాష్ట్రంలోని పేదలకు మేలు చేయాలన్న పట్టుదలతో ఈ నాలుగు పథకాలను ఈ నెల 26 నుంచి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. నాలుగు పథకాలకు ఎంపికైన లబ్ధిదారుల పేర్లతో పాటు ఇప్పటివరకు జరిగిన రుణమాఫీ వివరాలను ప్రతి గ్రామంలో ఫ్లెక్సీల ద్వారా ప్రకటించాలని సూచించారు. గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీలను లబ్ధిదారుల ఎంపికలో భాగస్వాములను చేయాలని కోరారు.

ఒక కుటుంబానికి ఒకటే ఇల్లు: మంత్రి పొంగులేటి

కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన 13 నెలల్లో ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలను చేపట్టామని చెప్పారు. ఈ నెల 26 నుంచి అమలుకానున్న నాలుగు ప్రతిష్టాత్మక పథకాలను సమర్థవంతంగా అమలుచేసే గురుతర బాధ్యత కలెక్టర్లపై ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం అత్యంత నిరుపేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని సూచించారు. గతంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కూడా లబ్ధిదారులను ఎంపికచేసి వాటిని లబ్ధిదారుల భాగస్వామ్యంతో పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో లబ్ధిదారుల జాబితా ప్రకటించాలని, ఒక కుటుంబానికి ఒక ఇల్లును మాత్రమే మంజూరు చేయాలని ఆయన సూచించారు.

ఒకరిని ఎన్నుకుంటే.. అరడజను సీఎంలు ఫ్రీ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సీఎం సోదరులపై వ్యంగ్యాస్త్రాలు

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ ప్రజలు ఒక ముఖ్యమంత్రిని ఎన్నుకుంటే మరో అరడజను మంది సీఎంలు ఉచితంగా రావడం రాష్ట్ర ప్రజల అదృష్టం. ఇలాంటి ఆఫర్, సీఎం వ్యవస్థను స్వతంత్ర భారత చరిత్రలో ఎన్నడూ చూడ లేదు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డికి వికారాబాద్‌లో పోలీసు బందోబస్తు ఏర్పాటు, పోలీసు కాన్వాయ్, స్కూల్ పిల్లలతో పరేడ్ చేయించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోను ఉద్దేశిస్తూ కేటీఆర్ పలు వ్యాఖ్యలు చేశారు. 'వికారాబాద్ సీఎం తిరుపతిరెడ్డికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ప్రజాపాలన కాబట్టి మీ ఎనుముల సోదరుల్లో ఎవరు సీఎంగా కావాలో ఎంచుకునే అవకాశం ప్రజలకు ఇవ్వండి. సీఎం రేవంత్‌రెడ్డికి ఇదే నా చిన్న విన్నపం. దీని కోసం ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఫోన్‌లో నంబరు నొక్కి చాయిస్‌ను ఎంపిక చేసుకునే విధానం) పెడితే బాగుంటుందేమో' అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

అధిక ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు

ప్రైవేటు బస్సు నిర్వాహకులకు మంత్రి పొన్నం హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి రద్దీని ఆసరా చేసుకుని ప్రయాణికుల నుంచి అధికంగా చార్జీలు వసూలు చేసే ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఆయా ప్రాంతాలకు ఇప్పటి వరకు ఉన్న చార్జీలను మాత్రమే వసూలు చేయాలని, ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేసినట్టు ఫిర్యాదులందితే, అది నిజమని తేలితే బస్సులను సీజ్ చేయటంతోపాటు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంక్రాంతి నేపథ్యంలో 6,432 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడుపుతోందని, మరిన్ని బస్సులు తిప్పేందుకు సిద్ధమని ప్రకటించారు.

మరిన్ని పిచ్చి కేసులతో వేధిస్తారు

బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్

- నాయకుల ఆత్మస్థైర్యం దెబ్బతీయాలని రేవంత్ చూస్తున్నారు
- అయినా ప్రజా సమస్యలపైనే దృష్టి పెట్టాలి
- పార్టీ నాయకులకు మాజీ సీఎం ఉద్బోధ
- కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ
- ఏసీబీ విచారణ తీరుపై వివరించిన కేటీఆర్



ఎర్రవల్లిలో కేసీఆర్‌ను కలిసిన కేటీఆర్, కౌశిక్‌రెడ్డి, బాల్క సుమన్, కార్తీక్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పసలేని కేసులు నమోదు చేసి, పార్టీ నేతలను ఇబ్బందులకు గురి చేసినా ప్రజా సమస్యలను ఎత్తి చూపడంపైనే దృష్టి కేంద్రీకరించాలని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పార్టీ నేతలను ఆదేశించారు. 'ఫార్ములా ఈ–రేస్' కేసులో ఏసీబీ విచారణకు హాజరైన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు శుక్రవారం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. గురువారం ఏసీబీ విచారణ అనంతరం నందినగర్ నివాసానికి వెళ్లిన కేటీఆర్, శుక్రవారం తన భార్యతో కలసి ఎర్రవల్లి నివాసానికి వెళ్లారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మరో నేత కార్తీక్‌రెడ్డి కూడా కేసీఆర్‌తో జరిగిన ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీబీ విచారణలో అధికారులు అడిగిన ప్రశ్నలు, తాను ఇచ్చిన సమాధానాలు, సమర్పించిన పత్రాలు.. తదితర అంశాలను ఈ సమావేశంలో కేటీఆర్ వివరించారు. ఇదిలా ఉండగా, 'రాబోయే రోజుల్లో ఇలాంటి మరిన్ని పిచ్చి కేసులతో పార్టీ నేతలను ప్రభుత్వం వేధిస్తుంది. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మస్థైర్యం దెబ్బతీయాలని రేవంత్ పిచ్చి ప్రయత్నాలు చేస్తున్నారు. ఏదో ఒక గందరగోళం సృష్టించి స్థానిక సంస్థల గండం నుంచి బయట పడేందుకు ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా జనంతో ఉంటే వారే గుండెల్లో పెట్టుకుని చూసుకుంటారు' అని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు సమాచారం.

ఏడాదిలోనే కాంగ్రెస్ తేలిపోయింది

'అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే కాంగ్రెస్ ప్రభుత్వం తేలిపోయింది. ఉన్న పథకాలు అమలు చేయలేక, కొత్త పథకాలు తెచ్చే తెలివిలేక ప్రభుత్వం చేతులెత్తేసింది' అని కేసీఆర్ అన్నట్లు తెలిసింది. ఎన్నికల హామీలేవీ అమలు చేసే పరిస్థితి లేదని ప్రజలకు అర్థమైందని, గతంలో మనం చేసిన మంచితో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న చెడును కూడా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత బీఆర్ఎస్‌పై ఉందని ఆయన అన్నట్లు సమాచారం. 'స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన రీతిలో పనిచేస్తే ఫలితాలు మనకే అనుకూలంగా ఉంటాయి. పండుగ తర్వాత దృష్టి అంతా పార్టీ నిర్మాణం, బలోపేతంపైనే ఉంటుంది' అని కేసీఆర్ పేర్కొన్నారు.

రాజకీయాలకు తలవంపుగా కేటీఆర్

మంగళహారతులివ్వడానికి దేశ సేవ చేశారా.. దేవుని సేవ చేశారా?.. సంపత్‌కుమార్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి కేటీఆర్ రాజకీయాలకు తలవంపుగా మారారని, తెలంగాణ రాజకీయాలు ఇంత నీచంగా ఉంటాయా! అని దేశం మాట్లాడుకుంటోందని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఫార్ములా ఈ రేస్‌లో అవకతవకలు, డ్రగ్స్, ఫాంహౌస్, ఫోన్‌ట్యాపింగ్, ధరణి అక్రమాలు, ఓఆర్ఆర్ అమ్ముకోవడం లాంటి పనులు నీచమో, లేక తమ ప్రభుత్వం విద్యార్థులకు మెస్‌చార్జీలు పెంచి, రైతులకు రుణమాఫీ చేయడం నీచపు పనులో.. అన్నది ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో టీపీసీసీ నేతలు చరణ్ కౌశిక్ యాదవ్, బొజ్జా సంధ్యారెడ్డిలతో కలసి ఆయన మాట్లాడుతూ ఏసీబీ విచారణకు వెళ్లి వచ్చిన కేటీఆర్‌కు మంగళహారతులు ఎందుకు ఇచ్చారో అంతుపట్టడం లేదన్నారు. ఆయనకు మంగళహారతులు ఇవ్వడానికి దేశ సేవ చేశారా? దేవుని సేవ చేసి వచ్చారా? అని ప్రశ్నించారు. పిచ్చి మాటలు మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహం కట్టలు తెచ్చుకుంటుందని, సీఎం రేవంత్ ఒక్క సైగ చేస్తే కేటీఆర్ ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేరని అన్నారు. 'కేటీఆర్‌కు ఇదే చివరి హెచ్చరిక. ఇంకోసారి సీఎంను ఉద్దేశించి పిచ్చి మాటలు మాట్లాడితే తాట తీస్తా' అని హెచ్చరించారు. కేటీఆర్‌ను ఎప్పుడు లోపల వేస్తారా? అని హరీశ్‌రావు ఎదురు చూస్తున్నారని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని, ఆయన మెంటల్ కృష్ణ అని ఎద్దేవా చేశారు.


మాజీ మంత్రి కేటీఆర్‌పై మరో కేసు

పోలీసులను దుర్భాషలాడారని, ట్రాఫిక్ జామ్‌కు కారణమయ్యారని ఆరోపణలు

బంజారాహిల్స్ (హైదరాబాద్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మరో కేసు నమోదైంది. ఏసీబీ కార్యాలయంలో విచారణ అనంతరం బయటకు వచ్చి.. పోలీసులను దుర్భాషలాడి ట్రాఫిక్ జామ్‌కు కారణమయ్యారంటూ కేటీఆర్‌తోపాటు మరో ఐదుగురు బీఆర్ఎస్ నేతలపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ఆయనతో పాటు మరో ఐదుగురు బీఆర్ఎస్ నేతలపై కూడా పోలీసులు కేసు పెట్టారు. గురువారం సాయంత్రం ఐదుగంటలకు ఏసీబీ ఆఫీస్‌నుంచి బయటకు వచ్చిన కేటీఆర్.. తెలంగాణ భవన్ వరకు అనుమతి లేకుండా ర్యాలీ తీయడమే కాకుండా పెద్ద ఎత్తున కార్యకర్తలను పిలిపించి న్యూసెన్స్‌కు పాల్పడ్డారని, దీంతో గంటపాటు ట్రాఫిక్ స్తంభించిపోయిందని బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్సై గోవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేటీఆర్‌తో పాటు బాల్క సుమన్, మన్నె గోవర్ధన్ రెడ్డి, గెల్లు శ్రీనివాస్ యాదవ్, జయసింహ, క్రిషాంక్‌లపై బీఎన్ఎస్ చట్టం సెక్షన్ 221, 292, 126(2), రెడ్‌విత్ 3(5) కింద కేసులు నమోదు చేశారు. విచారణ అనంతరం కేటీఆర్ తాను ప్రయాణిస్తున్న కారును నెమ్మదిగా పోనిస్తూ.. మీడియాతో మాట్లాడుతుండగా పోలీసులు వద్దని చెప్పినా వినలేదన్నారు. అంతే కాకుండా మరింతమంది పార్టీ కార్యకర్తలను పిలిపించారన్నారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఎంత చెప్పినా వినిపించుకోకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ, అనుమతి లేకుండా ఈ ర్యాలీ నిర్వహించారన్నారు. దీనివల్ల బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12, కేబీఆర్ పార్క్ రోడ్లన్నీ గంటపాటు స్తంభించిపోయాయని ఆరోపించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మొండి దోమ సమస్యకు ఎల్ఈడీ బల్బుతో పరిష్కారం

- ఎల్ఈడీ కాంతిలోకి రాని యాసిడ్ ఫ్లై దోమలు
- యూఓహెచ్ విద్యార్థి 'సింపుల్' ఆవిష్కరణ



యాసిడ్ ఫ్లైనా.. 'లైట్' తీస్కోండి!

సాక్షి, హైదరాబాద్: అది అలాంటి ఇలాంటి దోమ కాదు.. కుడితే చర్మం ఎర్రగా మారిపోతుంది. భరించలేని మంట పుడుతుంది. అదే యాసిడ్ ఫ్లై దోమ. కందిరీగ మాదిరిగా ఉండే ఈ దోమను నైరోబీ ఫ్లై లేదా యాసిడ్ ఫ్లైగా జువలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిర్ధారించింది. ఇది కుడితే పెడెరస్ డెర్మటైటిస్ సమస్య ఏర్పడుతుంది. కుట్టిన చోట కాలిన గాయాల తరహాలో చర్మం మండుతుంది. కమిలిపోతుంది. ఈ దోమలతో నిత్యం ఇబ్బంది పడిన ఓ విద్యార్థి.. దానికి విరుగుడు కనుగొన్నాడు. తనతో పాటు తోటి విద్యార్థుల సమస్యను తీర్చాడు.

సమస్య నుంచి ఆవిష్కారం

హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో యాసిడ్ ఫ్లై దోమల సమస్య తీవ్రంగా ఉండేది. విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడేవారు. యాసిడ్ ఫ్లై బాధితుల్లో ఫిజిక్స్ గ్రాడ్యుయేట్ అయిన తేజస్ ఆంటో కన్నంపూజ కూడా ఉన్నాడు. అయితే ఇతర విద్యార్థులలాగా దోమ కరిచినప్పుడు బాధపడి తర్వాత ఆ విషయాన్ని వదిలేయలేదు. యాసిడ్ ఫ్లై దాడులను అరికట్టడానికి మార్గాలను అన్వేషించాడు. ఈ దోమల సంచారంపై అధ్యయనం చేశాడు. ఈ క్రమంలో యాసిడ్ ఫ్లై దోమలు హాస్టల్‌లో కొన్ని రూమ్స్‌లో మాత్రమే అధికంగా ఉన్నట్లు గుర్తించాడు. అందుకు కారణాలను అన్వేషించగా.. అల్ట్రా వయలెట్ కిరణాలకు ఈ దోమ ఆకర్షింపబడుతోందని తేలింది. కాంపాక్ట్ ఫ్లోరోసెంట్ ల్యాంప్స్ (సీఎఫ్ఎల్) ట్యూబ్ లైట్లకు ఇవి బాగా ఆకర్షింపబడుతున్నాయని గుర్తించాడు. రేడియేషను అధికంగా విడుదల చేసే ఎల్ఈడీ లైట్లు ఉన్న గదుల్లోకి ఈ దోమలు అంతగా రావటంలేదని గమనించాడు. దీంతో స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన డా.షమన్న ఆధ్వర్యంలో దీనిపై మరింత లోతుగా అధ్యయనం నిర్వహించి.. వర్సిటీకి నివేదిక సమర్పించాడు. తేజస్ పరిశోధన పెద్ద సమస్యను తీర్చిందని డాక్టర్ షమన్న సాక్షికి తెలిపారు. ఎక్కడైనా ఎల్ఈడీ లైట్లు ఏర్పాటుచేయటం ద్వారా యాసిడ్ ఫ్లై సమస్యను పరిష్కరించవచ్చని చెప్పారు. వర్సిటీ హాస్టల్‌లో యాసిడ్ ఫ్లై సమస్య గతంలో 38 శాతం ఉండగా.. లైట్ల మార్పుతో 8 శాతానికి తగ్గిందని చెప్పారు.



డాక్టర్ షమన్న

బాధకు పరిష్కారం వెతికాను



కొంతకాలంగా హాస్టల్ రూమ్స్‌లో యాసిడ్ ఫ్లై బాధను అనుభవించాం. పరిష్కారం కోసం అన్వేషించడంలో తప్పులేదుగా అనుకున్నా. మొత్తానికి సమస్యకు మూలం గుర్తించడంతో పరిష్కారం కూడా దొరికింది.

– తేజస్, హైదరాబాద్ వర్సిటీ విద్యార్థి

ముక్కోటి.. పులకించిన భక్తకోటి

- ఉత్తర ద్వారంలో భద్రాద్రి రామయ్య దర్శనం
- భక్తులతో పోటెత్తిన భద్రాచలం



భద్రాచలంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

భద్రాచలం: వైకుంఠ ఏకాదశి సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో నిర్వహించిన ఉత్తర ద్వార దర్శనం.. భక్తులను పులకింపజేసింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తజనం ఉత్తర ద్వారంలో వైకుంఠ రాముడిని దర్శించుకుని పునీతులయ్యారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, ధూపదీపాలకు తోడు జేగంటలు మార్మోగుతుండగా భద్రగిరి రాముడు ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చారు. ఉదయం 5 గంటలకు ఉత్తర ద్వారాలు తెరుచుకోగా.. గరుడ వాహనంపై శ్రీ సీతారామచంద్రస్వామి వారిని భక్తులు కనులారా వీక్షించి తరించారు. వైకుంఠ ద్వార దర్శనానికి ముందు రుగ్వేద, యజుర్వేద, సామవేద, అథర్వణ వేదాలను పఠించిన పండితులు ద్వారదర్శన ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. దర్శనం పూర్తయ్యాక స్వామివార్లకు 108 వత్తులతో హారతి ఇచ్చారు. అనంతరం తిరువీధిసేవకు వెళ్లారు. మరోవైపు భక్తులు ఉత్తరద్వారం నుంచి ఆలయంలోకి ప్రవేశించి.. గర్భగుడిలో స్వామి వారి మూలవరులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు జితేష్ వి.పాటిల్, ప్రతీక్‌జైన్ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్ పరీక్ష కేంద్రాలు వెల్లడి

- వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన ఎన్‌టీఏ... రిజిస్ట్రేషన్ నంబర్‌తో లాగిన్ అయ్యి తెలుసుకోవచ్చు
- 22 నుంచి 30వ తేదీ వరకు మెయిన్ మొదటి సెషన్ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 22 నుంచి జరిగే జేఈఈ మెయిన్ మొదటి విడత పరీక్షలకు సంబంధించిన పరీక్ష కేంద్రాల వివరాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శుక్రవారం వెల్లడించింది. విద్యార్థులకు ఏ షిఫ్ట్, ఏ కేంద్రంలో, ఎన్ని గంటలకు పరీక్ష ఉంటుందనే వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచింది. జేఈఈకి ఈ తరహా ముందస్తు సమాచారం ఇవ్వడం ఇదే మొదటిసారి. నోటిఫికేషన్ సమయంలో జేఈఈ పరీక్ష తేదీలను మాత్రమే ప్రకటించింది. తాజాగా పరీక్ష కేంద్రం వివరాలు తెలియజేయడంతో విద్యార్థులు ముందుగానే అవసరమైన ఏర్పాట్లు చేసుకునే వీలు కలిగింది. పరీక్ష కేంద్రం సమాచారం తెలుసుకునేందుకు జేఈఈ మెయిన్–2025 వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలని శుక్రవారం ఒక ప్రకటనలో సూచించింది. జేఈఈ మెయిన్ తొలి విడతకు సంబంధించి పేపర్–1 పరీక్షలు 22 నుంచి 29 వరకు జరుగుతాయి. బీటెక్‌లో ప్రవేశాలకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. 30వ తేదీన పేపర్–2ఏ (బీఆర్క్), పేపర్–2బీ (బీ ప్లానింగ్, బీఆర్క్ మరియు బీ ప్లానింగ్) పరీక్షలు ఉంటాయి. గత రెండేళ్ల మాదిరిగానే ఈసారి ప్రశ్నపత్రాల్లో రెండు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్ బీలో ఈసారి 5 ప్రశ్నలు ఇస్తారని ఎన్‌టీఏ తెలిపింది. గత మూడేళ్ల మాదిరి ఈసారి చాయిస్ ఉండదు. రెండు సెక్షన్లలో కూడా మైనస్ మార్కులు ఉంటాయి. సరైన సమాధానానికి 4 మార్కులు, తప్పుడు సమాధానానికి మైనస్ వన్ మార్కు ఉంటుంది. స్కోర్ కోసం తొలుత గణితం, ఆ తర్వాత భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం విభాగంలో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు.

నిలిచిపోయిన ఆరోగ్యశ్రీ సేవలు

- రూ.100 కోట్ల బకాయి చెల్లింపులకు ఒప్పుకోని 'తెన్హా'... మొత్తం చెల్లింపులపై స్పష్టమైన హామీకి డిమాండ్
- నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సేవలు నిలిపివేసినట్లు ప్రకటన... 368 ఆసుపత్రులకు దాదాపు రూ.1,200 కోట్ల బకాయిలు
- సేవల నిలిపివేతకు కారణాలు వివరిస్తూ ఆసుపత్రుల ముందు బోర్డులు



వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి ముందు ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసినట్లు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ బ్యానర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు శుక్రవారం నుంచి నిలిచిపోయాయి. ప్రభుత్వం చెల్లించాల్సిన దాదాపు రూ.1,200 కోట్ల బకాయిలు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ తమ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసినట్లు తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (తెన్హా) ప్రకటించింది. ఆరోగ్యశ్రీ సేవలను ఎందుకు నిలిపివేయాల్సి వచ్చిందో రోగులకు వివరిస్తూ బోర్డులను కూడా తమ ఆసుపత్రుల ముందు ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఆసుపత్రుల్లోని ఆరోగ్యశ్రీ సిబ్బంది కూడా రోగులకు ఇదే విషయాన్ని చెబుతున్నారు. దీంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పేదలు, ఉద్యోగులు, జర్నలిస్టుల కుటుంబాలకు వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది.

బకాయిల చెల్లింపుపై స్పష్టమైన హామీ ఇవ్వాలి: తెన్హా

నెట్‌వర్క్ పరిధిలోని 368 ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీతో పాటు ఈహెచ్‌ఎస్ (ఉద్యోగులు), జేహెచ్‌ఎస్ (జర్నలిస్టులు) పథకాల కింద ప్రతి నెలా సుమారు రూ.100 కోట్ల విలువైన చికిత్సలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ సేవలకు సంబంధించి ఇప్పటివరకు రూ.1,030 కోట్లు విడుదల చేసింది. ఇందులో రూ.730 కోట్లు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిగిల్చిన బకాయిలు. ఈ లెక్కన ఈ సంవత్సరానికి సంబంధించి రూ.300 కోట్లు మాత్రమే ప్రభుత్వం చెల్లించినట్లు తెన్హా చెబుతోంది. ఇంకా రూ.1,100 కోట్ల నుంచి రూ.1,200 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉందని సంఘం నేతలు తెలిపారు. బకాయిలు చెల్లించకుంటే ఈ నెల 10 నుంచి సేవలు నిలిపివేస్తామని తెన్హా ప్రకటించటంతో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో శివశంకర్ ఆ సంఘం నాయకులతో గురువారం చర్చలు జరిపారు. రూ.100 కోట్లను టోకెన్ కింద వెంటనే విడుదల చేస్తామని, వచ్చే నెలలో మరో రూ.150 కోట్లు విడుదల చేస్తామని తెలిపారు. దీంతో తెన్హా వెనక్కు తగ్గినట్లు వార్తలు వచ్చాయి.

కొత్తగా ఇచ్చిందేంటి?

బకాయిల్లో కేవలం రూ.100 కోట్లువిడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని తెన్హా తప్పు పట్టింది. ఆరోగ్యశ్రీ కింద ప్రతి నెలా రూ.100 కోట్ల విలువైన చికిత్సలు అందిస్తుంటే.. సంవత్సరం నుంచి రావాల్సిన రూ.1,200 కోట్లకుగాను రూ.100 కోట్లు ఇస్తామనటం సరికాదని పేర్కొంది. ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ పథకాలకు సంబంధించి 18 నెలల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. ఈ మేరకు ఆరోగ్యశ్రీ సీఈవో శివశంకర్‌కు శుక్రవారం లేఖ రాస్తూ.. తమ బకాయిల పరిష్కారానికి కచ్చితమైన మార్గం చూపేంత వరకు ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది.

ప్రత్యేక 'షో'లూ వద్దు

▶ మొదటి పేజీ తరువాయి

వసూలు చేయాలనుకోవడం సరికాదని హితవు పలికింది. గేమ్‌ఛేంజర్ సినిమాకు సంబంధించి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని చెబుతూ తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. దిల్‌రాజు నిర్మాతగా శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ నటించిన గేమ్‌ఛేంజర్ సినిమా ప్రత్యేక షోలకు, టికెట్ ధరల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. అర్ధరాత్రి 1 గంట బెనిఫిట్ షోకు మాత్రం ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. జనవరి 10న వేకువజామున 4 గంటల నుంచి 6 షోలకు అనుమతించింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కూరగాయల వ్యాపారి గొర్ల భరత్‌రాజ్‌తోపాటు సతీశ్‌కమాల్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడం, టికెట్ ధరల పెంపు సినిమాటోగ్రఫీ నిబంధనలకు విరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. 2021లో జారీ చేసిన జీఓ ప్రకారమే టికెట్ల ధరలు ఉండాలని, కానీ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జారీ చేసిన మెమో ఆధారంగా అధిక ధరలు వసూలు చేస్తున్నట్టు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గేమ్‌ఛేంజర్ సినిమా టికెట్ ధరల పెంపు ఉత్తర్వులను నిలుపుదల చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. పెంచిన టికెట్ ధరలు పూర్తికాలం కొనసాగవని, ఈ నెల 19వ తేదీ వరకే ఉంటాయని హోం శాఖ జీపీ కోర్టుకు చెప్పారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జోక్యం చేసుకొని.. అర్ధరాత్రి వేళ షోలకు అనుమతిస్తే ఇంటికి వెళ్లే సరికి ఎంత సమయం అవుతుందని జీపీని ప్రశ్నించారు. అభివృద్ధి అంటే అర్ధరాత్రి తర్వాత బయట తిరగడం కాదని, సమయానికి నిద్రపోవడం కూడా ముఖ్యమే కదా అని మరోసారి చెప్పారు. ప్రేక్షకుల భద్రతనూ దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. తదుపరి విచారణను వాయిదా వేసింది.

పోస్టుమెట్రిక్ ఉపకార దరఖాస్తుకు సూచనలు

ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ కోర్సులు చదువుతున్న ఎస్సీ విద్యార్థులు ఈపాస్‌లో ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఎస్సీ అభివృద్ధి శాఖ పలు సూచనలు చేసింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఈమేరకు సూచనలు చేస్తున్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ తెలిపింది. 2024–25 విద్యా సంవత్సరం నుంచి కొత్త నిబంధనలు వర్తిస్తాయని, నిర్దేశించిన సూచనలకు అనుగుణంగా విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు సూచనలత ప్రతిని ఈపాస్ వెబ్‌సైట్‌లో ఉంచింది. దరఖాస్తు చేసుకునే విద్యార్థి ఎస్ఎస్‌సీ మెమో వివరాలు ఆధార్‌తో సరిపోలాల్సి ఉంటుందని పేర్కొంది. అలాగే దరఖాస్తు చేసుకునే విద్యార్థి మీసేవ కేంద్రంలో బయోమెట్రిక్ అథెంటికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. కాలేజీ ప్రిన్సిపాళ్లు, హెచ్ఓడీలు డిజిటల్ కీని సిద్ధం చేసుకోవాలని సూచించింది. విద్యార్థి దరఖాస్తును కళాశాల యాజమాన్యం ఆన్‌లైన్‌లో పరిశీలన చేసి, సంక్షేమాధికారులకు ఫార్వర్డ్ చేయాలి. విద్యార్థులు ఆధార్ కార్డును బ్యాంకు ఖాతాతో సీడింగ్ చేయించాలి. ఇందులో సందేహాలుంటే కాలేజీలో లేదా సంక్షేమాధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

సినిమా టికెట్లపై సీఎం మాటమార్చారు

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- ప్రత్యేక సౌకర్యాలు ఇచ్చేది లేదని అసెంబ్లీలో ప్రకటించి.. మాట తప్పారు
- సీఎం, సినిమాటోగ్రఫీ మంత్రిపై హక్కుల తీర్మానం పెడతాం



సాక్షి, హైదరాబాద్: సినిమాలకు ప్రత్యేక సౌకర్యాలు ఇచ్చేది లేదంటూ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు వారాలు తిరగకముందే మాట మార్చారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అలాగే ఈ విషయంలో సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పిన మాటలు కూడా కొద్ది రోజుల్లోనే నీటి మూటలయ్యాయని మండిపడ్డారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డిపై సభా హక్కుల ఉల్లంఘన కింద ప్రివిలేజ్‌మోషన్ పెడతామని ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. మాట తప్పం, మడమ తిప్పం అంటూ బీరాలు పలికిన సీఎం.. తిరిగి సినిమా టికెట్ రేట్ల పెంపునకు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. ఎవరికి లాభం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. బెనిఫిట్ షోలు, టికెట్ల రేట్ల పెంపునకు కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో అనుమతి ఇవ్వడం వల్లే తొక్కిసలాట ఘటన చోటు చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటనలో ఓ మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు నేటికీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన పాపం రేవంత్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటన మరచిపోకముందే టికెట్ రేట్ల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతులపై ప్రభుత్వం యూటర్న్ తీసుకోవడం వెనుక మర్మం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

సంక్రాంతి కానుకగా భూభారతి అమలు చేయాలి

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రైతులకు సంక్రాంతి కానుకగా భూభారతి చట్టాన్ని అమల్లోకి తేవాలని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ధరణి చట్టం ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల శాశ్వత పరిష్కారానికి.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లును ఆమోదించినందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థలేక పోవడంతో గ్రామాల్లో పాలన కనుమరుగైందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ హయాంలో మళ్లీ ఈ వ్యవస్థలను పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. భూరికార్డుల్లో కొత్తగా తెచ్చిన కాలమ్స్ ఉండాలంటే.. కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు జారీచేయాలని కోరారు.

ఎవరి ఆదేశాలతో ఎఫ్ఈఓకు డబ్బులిచ్చారు?

- హెచ్ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్ రెడ్డిని ప్రశ్నించిన ఏసీబీ
- శుక్రవారం ఏసీబీ విచారణకు హాజరైన అధికారి... ఆరు గంటల పాటు ప్రశ్నించిన ఏసీబీ అధికారులు
- బ్యాంకు లావాదేవీలపైనే ప్రధానంగా ప్రశ్నలు
- ఉన్నతాధికారులు చెప్పింది చేశానని బీఎల్ఎన్ రెడ్డి వివరణ



ఏసీబీ విచారణకు హాజరవుతున్న బీఎల్ఎన్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'ఫార్ములా–ఈ కారు రేసు నిర్వహణ సంస్థ ఎఫ్ఈఓ (ఫార్ములా– ఈ ఆపరేషన్స్ లిమిటెడ్)కు హెచ్ఎండీఏ నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఎందుకు బదిలీ చేయాల్సి వచ్చింది? నిధులు బదిలీ చేయాలని మిమ్మల్ని ఎవరు ఆదేశించారు? రేసు నిర్వహణ నిర్ణయాలను ఎవరెవరిని సంప్రదించి తీసుకునేవారు?'అని హెచ్ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్ రెడ్డిని ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. తాను ఉన్నతాధికారుల ఆదేశాలనే పాటించానని, వారు ఏది చెబితే అదే చేశానని ఆయన సమాధానమిచ్చినట్టు తెలిసింది. ఫార్ములా–ఈ కారు రేసు కేసులో ఏ–3గా ఉన్న బీఎల్ఎన్ రెడ్డి శుక్రవారం ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఉదయం 9.50 గంటలకు బంజారాహిల్స్‌లోని ఏసీబీ కేంద్ర కార్యాలయానికి ఆయన చేరుకున్నారు. ఏసీబీ అధికారులు ముందుగా సూచించిన మేరకు బ్యాంకు లావాదేవీలకు సంబంధించి పత్రాలు, ఇతర డాక్యుమెంట్లను తీసుకువచ్చారు. ఏసీబీ సీఐయూ (సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్) డీఎస్పీ మాజిద్ అలీఖాన్ బృందం బీఎల్ఎన్ రెడ్డిని విచారించింది. సాయంత్రం 5 గంటల వరకు దాదాపు ఆరు గంటల పాటు ప్రశ్నించారు. ఈ కేసులో ఏ–1 మాజీ మంత్రి కేటీఆర్, ఏ–2 ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ విచారణ సందర్భంగా సేకరించిన వివరాలు, దర్యాప్తులో సేకరించిన ఆధారాల మేరకు బీఎల్ఎన్ రెడ్డిని ప్రశ్నించినట్టు తెలిసింది. ప్రధానంగా బ్రిటన్‌కు చెందిన ఎఫ్ఈఓ కంపెనీకి హిమాయత్‌నగర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లోని హెచ్ఎండీఏ అకౌంట్స్ నుంచి నగదు ఎందుకు పంపారన్న అంశంపైనే ప్రశ్నించినట్టు సమాచారం. ఫార్ములా ఈ రేస్ సీజన్ 9 కోసం మున్సిపల్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రెండు విడతలుగా రూ.45.71 కోట్లు బదిలీ చేసినట్లు బీఎల్ఎన్ రెడ్డి చెప్పినట్టు తెలిసింది. నిధుల బదిలీ కోసం ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలకు సంబంధించి తన వద్ద ఉన్న అన్ని పత్రాలను ఏసీబీ అధికారులకు ఆయన అందించినట్టు సమాచారం. అవసరం మేరకు మళ్లీ విచారణకు రావాల్సి ఉంటుందని బీఎల్ఎన్ రెడ్డికి ఏసీబీ అధికారులు సూచించినట్టు తెలిసింది.

సాక్షి
శనివారం, 11 జనవరి 2025

బాధ్యత లేని బాల్యచాపల్యం

బాల్యావస్థ చిత్రమైనది. ఆ దశలో కంటిముందు కనబడేవన్నీ తన సొంతం అనుకునే మనస్తత్వం ఉంటుంది. మరో పదిరోజుల్లో అమెరికా అధ్యక్ష పీఠం ఎక్కబోతున్న డోనాల్డ్ ట్రంప్ ఈ మాదిరి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్టు కనబడుతోంది. అధికారంలోకి రాకముందే ఆయన వరసబెట్టి పొరుగు దేశాలకు తాఖీదులు పంపుతున్నారు. 'మీరంతా నా దారికి రండి' అన్నదే వాటి సారాంశం. అమెరికాలో 51వ రాష్ట్రంగా స్థిరపడటానికి కెనడా సిద్ధంగా ఉండాలట. డెన్మార్క్‌లో భాగంగా ఉన్న గ్రీన్‌ల్యాండ్ ప్రాంతాన్ని ఆ దేశం వదిలేసుకోవాలట. అలాగే పనామా అధీనంలోని పనామా కాల్వపై అమెరికాకు పూర్తి హక్కున్నదట. తన అభీష్టం నెరవేరటానికి ఆ దేశాలపై టారిఫ్ మోత మోగిస్తారట. ఫలితం రాకపోతే దురాక్రమణకు సిద్ధపడతారట. సోవియెట్ యూనియన్ దురాక్రమణకు పాల్పడే అవకాశం ఉన్నదని బెదరగొట్టి 1949లో నాటో కూటమిని ఏర్పాటుచేసింది అమెరికాయే. దాని స్థానంలో వచ్చిన రష్యావల్ల కూడా ముప్పు ముంచుకురావచ్చని ఒప్పించి నాటోను కొనసాగిస్తున్నదీ అమెరికాయే. తీరా ట్రంప్ ప్రకటనల తీరు చూశాక నిజమైన ముప్పు అమెరికానుంచే ఉండొచ్చన్న భయాందోళనలు యూరప్ దేశాల్లో కలుగుతున్నాయి. ఏడెనిమిదేళ్లుగా అమెరికా 'నియమాల ఆధారిత' ప్రపంచం గురించి మాట్లాడుతోంది. చైనా ప్రాబల్యాన్ని అడ్డగించటమే లక్ష్యంగా అమెరికా వాడుకలోకి తెచ్చిన ఇండో–పసిఫిక్ వ్యూహానికి ప్రాతిపదిక 'నియమాల ఆధారిత' ప్రపంచమే. ట్రంప్ ప్రకటనలకూ, ఈ వ్యూహానికీ పూర్తిగా చుక్కెదురు. అమలులో ఉన్న నియమాలను ధిక్కరించి, అంతర్జాతీయ న్యాయానికి భిన్నంగా ప్రవర్తించి ఏ దేశాన్నయినా ఆక్రమించుకోవాలనుకునే మనస్తత్వం దేనికి దారితీస్తుంది?

అందుకే యూరప్ దేశాలన్నీ ట్రంప్ ప్రకటనపై విరుచుకు పడుతున్నాయి. సభ్యదేశాల్లో ఎవరిపై దాడి జరిగినా మిగిలిన దేశాలన్నీ అండగా నిలవాలన్నది నాటో నియమం. దానికి అనుగుణంగానే జర్మనీ, ఫ్రాన్స్ మొదలు అన్ని దేశాలూ ట్రంప్ తీరును ఖండిస్తున్నాయి. ఉక్రెయిన్ దురాక్రమణకు పాల్పడిన రష్యాను ఖండిస్తూ, తైవాన్‌ను సొంతం చేసుకోవాలనుకునే చైనాను హెచ్చరిస్తూ వస్తున్న అమెరికా ట్రంప్ ఏలుబడి మొదలయ్యాక తానే దురాక్రమణదారుగా మారుతుందా అన్నది చెప్పలేం. పూర్వాశ్రమంలో రిపబ్లికన్ పార్టీకే చెందిన నిక్సన్ అమెరికా అధ్యక్షుడిగా ఇలాంటి బెదిరింపులకే పాల్పడేవారు. తానొక ప్రమాదకారినన్న భావన కలిగిస్తే చాలు... ప్రపంచమంతా పాదాక్రాంతమవుతుందన్న భ్రమ ఆయనకు ఉండేది. దాన్ని 'మ్యాడ్‌మ్యాన్ థియరీ'గా పిలిచేవారు. చివరకు ఆయన హయాంలోనే ఎంతో అప్రదిష్టపాలై ఉత్తర వియత్నాం నుంచి అమెరికా సైనికులు వైదొలగాల్సి వచ్చింది. ట్రంప్ మాటలు 'మ్యాడ్‌మ్యాన్ థియరీ'వంటివేనా... నిజంగా ప్రమాదకరమైనవా అనే విచికిత్సలో పడ్డాయి యూరప్ దేశాలు. దౌత్యరంగంలో ఎవరైనా సరే... మరో దేశాధినేత వ్యక్తిగతంగా కలిసినప్పుడు తమకేం చెప్పారన్నది కాక, వారి బహిరంగ ప్రకటనలనూ, వారి ఆచరణనూ పరిగణనలోకి తీసుకుంటారు. తొలి ఏలుబడిలో సైతం ట్రంప్ ఇలాంటి హెచ్చరికలు చాలా చేసేవారు. ఉత్తర కొరియాపై నిప్పుల వాన కురిపించబోతున్నట్టు ప్రకటనలు చేయటం, చివరకు ఆ దేశానికి అతిథిగా వెళ్లి ఒప్పందం కుదుర్చుకురావటం అందరూ చూశారు. చైనా పైనా అదే తరహాలో చిందులు తొక్కేవారు. కానీ ఎప్పుడూ దాని జోలికిపోలేదు. అయితే ఇరాన్ విషయంలో అలా కాదు. ఆ దేశ అగ్రనేతల్లో ఒకరైన కాసిం సొలేమనిని హత్య చేయించారు. వేరే దేశాల నేతలపై దాడులకు పాల్పడటం, దాన్ని అధికారికంగా ప్రకటించటం అసాధారణం. కనుకనే ట్రంప్ రెండో ఏలుబడిపై అందరిలోనూ ఆందోళన నెలకొన్నది.

విస్తరణవాద చాపల్యం అమెరికాకు మొదటినుంచీ ఉన్నదే. కానీ అదంతా మృదువైన భాష వెనక నడిచేది. వేరే దేశాల్లో పాలకుల్ని మార్చకుండానే తన పెత్తనాన్ని సుస్థిరం చేసుకునేది. నేరుగా బెదిరింపులకు దిగటం ట్రంప్ ప్రవేశపెట్టిన కొత్త ధోరణి. ఏటా కెనడా రక్షణకు రెండువేల కోట్ల డాలర్లు వెచ్చిస్తున్నామని, అందువల్ల ఒరిగేదేమీ లేదన్నది ఆయన అభిప్రాయం. 51వ రాష్ట్రంగా కలుపుకొంటే అదంతా ఆదా అవుతుందని ట్రంప్ అంటున్నారు. కెనడా వాదన భిన్నంగా ఉంది. అమెరికా–కెనడా సంబంధాల వల్ల ఇరు దేశాలూ బాగుపడుతున్నాయని ఆ దేశం చెబుతోంది. తమనుంచి అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన ఇంధనం మార్కెట్ ధరకన్నా తక్కువకు అమెరికా పొందుతున్నదని, వేలకోట్ల డాలర్ల విలువైన అమెరికా సరుకులు కెనడాలో అమ్ముడవుతున్నాయని, అమెరికా చేసే యుద్ధాలకు కోట్ల డాలర్ల ధనం వెచ్చిస్తున్నామని కెనడా విపక్ష నేత పియే పొలియేరా గుర్తుచేశారు. దండిగా ఖనిజ వనరులున్న గ్రీన్‌ల్యాండ్‌పై ట్రంప్ కన్నుపడింది. పద్దెనిమిదేళ్ల ట్రంప్ కుమారుడు ఆ ప్రాంతానికెళ్లి అది తమ సొంత జాగీరన్న అర్థం వచ్చేలా ప్రకటించాడు. నిజానికి గ్రీన్‌ల్యాండ్ డెన్మార్క్ అధీనంలో కూడా లేదు. 57,000 మంది నివసించే ఆ ప్రాంతానికి స్వయం ప్రతిపత్తి ఉంది. కేవలం సైనిక, ఆర్థిక వ్యవహారాలు మాత్రమే డెన్మార్క్ చూస్తుంది. పనామా కాల్వపై హక్కు వదులుకోవటానికి పనామా దేశం కూడా సిద్ధంగా లేదు. ట్రంప్ ఒక తేనెతుట్టె కదిల్చి తమాషా చూడదల్చుకున్నారా... నిజంగానే దురాక్రమణకు సిద్ధపడతారా అన్నది ముందుముందు తేలుతుంది. దురాక్రమణకు సిద్ధపడితే ఇప్పుడు పుతిన్‌కు ఉక్రెయిన్‌లో ఎదురవుతున్న పరాభవమే అమెరికాకు తప్పకపోవచ్చు. అంతకన్నా కీలకమైనదేమంటే... అమెరికా విశ్వసనీయతతో పాటు మిత్రులనూ కోల్పోతుంది. ఏకాకిగా మారుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, తిథి: శు.ద్వాదశి ఉ.7.49 వరకు, తదుపరి త్రయోదశి తె.6.11 వరకు (తెల్లవారితే ఆదివారం), నక్షత్రం: రోహిణి ప.12.28 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం: సా.5.51 నుండి 7.23 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.36 నుండి 8.07 వరకు, అమృతఘడియలు: ఉ.9.25 నుండి 10.56 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.39
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

ప్రయివేటీకరణకే బాబు!

విశ్లేషణ



బొల్లిముంత సాంబశివరావు



ప్రైవేటీకరణ విధానాలు, ప్రభుత్వ సంస్థల విక్రయాలు అమలు జరపటంలో చంద్రబాబు నాయుడుకు ఉన్న నైపుణ్యం దేశంలోని ఏ ముఖ్యమంత్రికీ లేదు. చంద్రబాబు చెప్పే మాటలకు రెండు అర్థాలు ఉంటాయి. ఆయన నోటి నుండి ఫలానా పని చేస్తానని వచ్చిందంటే, ఆచరణలో చేయనని చెప్పటమే. గత ఎన్నికల ప్రణాళికలో రైతు భరోసా ముందస్తు పెట్టుబడిని 13,500 నుంచి 20 వేలకు పెంచుతాననీ, కరెంట్ చార్జీలు పెంచననీ చెప్పారు. రైతు భరోసా డబ్బులు ఇంతవరకూ ఇవ్వలేదు. కరెంట్ చార్జీలు విపరీతంగా పెంచారు. అమ్మకు వందనం కింద ప్రతి పిల్ల, పిల్లవాడికి 15 వేలు ఇస్తాననీ, నిరుద్యోగ భృతి నెలకు 3 వేలు ఇస్తాననీ, వాలంటీర్లను కొనసాగించి వారి గౌరవ వేతనం 10 వేలకు పెంచి ఇస్తాననీ చెప్పారు. వాటిల్లో ఏదీ అమలు చేయక పోగా, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్నారు.

ఏపీ ఆయిల్ ఫెడ్ ప్రైవేటీకరణ: ఏపీ ఆయిల్ ఫెడ్ 1980లో ఏపీ కో–ఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్ కింద ఏర్పాటయ్యింది. దీనికి అనుబంధంగా పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలో 1992లో ప్రత్యేకంగా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేశారు. ఈ యూనిట్ 2019–23 మధ్య రికార్డు స్థాయిలో లక్షా 25 వేల టన్నుల పామాయిల్‌ను ప్రాసెస్ చేసే స్థాయికి ఎదిగింది. ప్రస్తుతం ఎఫ్ఎఫ్‌జీ (తాజా గెలలు) ప్రాసెసింగ్ ద్వారా టన్నుకు 3,500 రూపాయల లాభం ఆర్జిస్తోంది. నేడు 168 కోట్ల లాభాల్లో ఉంది. దీని ద్వారా 2.50 లక్షల మంది ఆయిల్ పామ్ రైతులు ప్రయోజనం పొందుతున్నారు. ఆయిల్ ఫెడ్ ఆధునీకరణకు నిధులు లేవనే సాకుతో చంద్రబాబు ప్రభుత్వం టీడీపీకి చెందిన బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ప్లాంట్ ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయాల్సిన పని లేదు. జాతీయ పామాయిల్ మిషన్ ద్వారా నిధులు సాధించుకోవచ్చు. ఆ ప్రయత్నం చేయకుండా పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ పద్ధతిలో ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకు చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. కాకినాడ, ఏలూరు జిల్లాల్లో ఆయిల్ పామ్ రైతులు మండల, గ్రామ స్థాయి సమావేశాలు జరిపి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానాలు చేశారు.

స్టేట్ సెంట్రల్ లేబొరేటరీ ప్రైవేటీకరణ: పులివెందులలో ఉన్న ఏపీ స్టేట్ సెంట్రల్ లేబొరేటరీ నిర్వహణ భారంగా ఉందన్న పేరుతో ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు చంద్రబాబు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అత్యాధునిక పరికరాలతో కూడిన ఈ ల్యాబ్ పాలు, పాల ఉత్పత్తులలో విషపూరిత రసాయనాలను, ఆహార పదార్థాలు, మంచి నీరు, మాంసం, గుడ్లు, రొయ్యలు, ఎరువులు, మందుల్లో కల్తీని గుర్తిస్తుంది. ఇది ఏర్పాటు కాకముందు వీటి శాంపిల్స్‌ను కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ ల్యాబులకు పంపేవారు. ఒక్కో శాంపిల్‌కు 2,500 నుంచి 30 వేల వరకు ఖర్చయ్యేది. ఆ సొమ్మంతా ఈ ల్యాబ్ వల్ల ఆదా అయ్యింది. ఈ ల్యాబ్‌ను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడం వెనుక చంద్రబాబు ప్రయోజనాలు ఇమిడి ఉండగా, 2.5 లక్షల మంది రైతుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుంది.

పోర్టుల ప్రైవేటీకరణ: ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడంలో నిష్ణాతుడైన చంద్రబాబు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని మూడు ప్రధాన పోర్టులను ప్రైవేట్ పరం చేసేందుకు వేగంగా చర్యలు చేపట్టారు. పనులు జరుగుతూ 50 శాతం పైగా పూర్తయిన రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు టెండర్లు పిలవటం చర్చనీయాంశంగా మారింది.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ: తెలంగాణలో నాలుగు మెడికల్ కాలేజీలకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతించింది. ఆంధ్రప్రదేశ్‌కు అనుమతి ఇస్తామంటే ఏపీ ప్రభుత్వం వద్దంటోంది. పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుమతిస్తూ 50 మెడికల్ సీట్లు నేషనల్ మెడికల్ కౌన్సిల్ కేటాయించింది. కళాశాల నిర్వహణ తమ వల్ల కాదంటూ అనుమతి వెనక్కి తీసుకోవాలని చంద్రబాబు ప్రభుత్వం మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాయటం జరిగింది. ఒక్క మెడికల్ కాలేజీ నిర్వహణే చేతగాని కూటమి ప్రభుత్వం, రాష్ట్ర పాలనను ఎలా చేయగలుగుతుంది? పేద కుటుంబాల పిల్లలు రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వల్ల వైద్య విద్యకు దూరమయ్యారు.

ప్రభుత్వమే వైద్య విద్యను అందించటం చంద్రబాబుకు ఇష్టం ఉండదు. అందుకే గుజరాత్ తరహాలో పీపీపీ మోడల్‌లో ప్రైవేట్ వ్యక్తులకు వైద్య కళాశాలను కట్టబెడుతున్నారు. పాడేరు, మార్కాపురం, ఆదోని, మదనపల్లె, పులివెందుల కాలేజీలను 2024లో ప్రారంభించాల్సి ఉంది. ఈ కాలేజీల తనిఖీలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ వస్తుందని తెలిసినా, అందుకు ప్రభుత్వం వసతులు సమకూర్చలేదు. వసతులు సమకూర్చి ఉంటే, ప్రతి కళాశాలకు 150 సీట్ల చొప్పున అనుమతులు వచ్చేవి. తాను అధికారంలోకి వస్తే మొత్తం సీట్లు ఫ్రీగా ఇస్తానని చెప్పిన చంద్రబాబు సీట్లు కాదు, ఏకంగా మెడికల్ కాలేజీలనే అమ్మివేస్తున్నాడు.

ప్రైవేట్ చేతుల్లోకి ఆరోగ్యశ్రీ: ఆరోగ్యశ్రీ పథకాన్ని 2007లో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశ పెట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీగా మార్చి 25 లక్షల వరకు వైద్యం అందేలా మార్పులు చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే దాన్ని ఎన్‌టీఆర్ వైద్య సేవగా మార్చారు. పేదలకు మెరుగైన వైద్యం అందిస్తానని చెప్పారు. కానీ ఈ సేవల కింద డాక్టర్లకు 3 వేల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించక పోవటంతో వైద్య సేవలు ఆపివేస్తున్నట్లు డాక్టర్ల సంఘం ప్రకటించింది.

◆ సిద్ధంగా ఉన్న ఓ మెడికల్ కాలేజీ నిర్వహణే చేతగాని కూటమి ప్రభుత్వం, రాష్ట్ర పాలనను ఎలా చేయగలుగుతుంది? చంద్రబాబు ప్రభుత్వ వైఖరి వల్ల పేద కుటుంబాల పిల్లలు వైద్య విద్యకు దూరమయ్యారు.

◆ ఆరోగ్యశ్రీ పథకం కింద 25 లక్షల వరకు పేదలు వైద్యం ఉచితంగా పొందే అవకాశం ఉంటే, ఏపీ ప్రభుత్వం మాత్రం ఇన్సూరెన్స్ కంపెనీలకు 2.5 లక్షల వరకే బీమా ప్రీమియం చెల్లిస్తుంది. నేడు ప్రమాదకరమైన జబ్బులకు ఆపరేషన్ చేయాలంటే 10 లక్షలకు పైగానే ఖర్చవుతోంది. దీనివల్ల పేదలకు వైద్యం సమస్యగా మారుతుంది.

ఈ పరిణామాల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఎన్‌టీఆర్ వైద్య సేవలను బీమా కంపెనీలకు అప్పగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఇన్సూరెన్స్ కంపెనీలకు ముందుగానే ప్రీమియం డబ్బులు చెల్లిస్తుంది. ఆరోగ్యశ్రీ పథకం కింద 25 లక్షల వరకు పేదలు వైద్యం ఉచితంగా పొందే అవకాశం ఉంటే, ఇన్సూరెన్స్ కంపెనీలకు 2.5 లక్షల వరకే బీమా ప్రీమియం చెల్లిస్తుంది. నేడు ప్రమాదకరమైన జబ్బులకు ఆపరేషన్ చేయాలంటే 10 లక్షలకు పైగానే ఖర్చవుతోంది. దీనివల్ల పేదలకు వైద్యం సమస్యగా మారుతుంది.

చంద్రబాబు మొదటి నుంచీ ప్రభుత్వ రంగానికి వ్యతిరేకంగా, ప్రైవేట్ రంగానికి అనుకూలంగా ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆయన పాలనలో ప్రైవేటీకరణ వేగంగా సాగింది. అది రెండు దశల్లో ఉంది. 1999–2002 వరకు మొదటి దశ. ఈ దశలో 19 సంస్థలను ప్రైవేటీకరణకు లక్ష్యంగా పెట్టుకుని వాటిలో 18 సంస్థలను ప్రైవేటు పరం చేశారు. 2002 –2004 మార్చి వరకు సాగిన రెండవ దశలో 68 సంస్థలను టార్గెట్‌గా పెట్టుకుని, వాటిల్లో 30 సంస్థలను ప్రైవేట్ పరం చేయటం జరిగింది. మూసి వేసిన సంస్థలు 22 కాగా, పెట్టుబడులు ఉపసంహరించినవి 9. ప్రైవేట్ పరమైన వాటిల్లో ఉమ్మడి రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ, ఏపీ జౌళి అభివృద్ధి సంస్థ, ఆల్విన్ వాచెస్ లిమిటెడ్, నెల్లూరు కో ఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్, ఏపీ ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్, ఏపీ ఎలక్ట్రానిక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కరీంనగర్ కో– ఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్లు, షుగర్ మిల్లులు, పేపర్ మిల్లులు ఉన్నాయి.

చంద్రబాబు మోసపూరిత మాటలను, ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలి.

వ్యాసకర్త రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ၊ 98859 83526



సోషల్ మీడియా

మారిన చర్చ



ఇప్పటిదాకా మనం వర్క్–లైఫ్ బ్యాలన్స్ గురించి మాట్లాడేవాళ్లం. 'ఎల్ అండ్ టి' చైర్మన్ దాన్ని వర్క్–వైఫ్ బ్యాలన్స్‌గా మార్చేశారు.

– రమేశ్ శ్రీవత్స్, వ్యంగ్య వ్యాఖ్యాత

భిన్న మార్గాలు



ఒక్కోసారి, నా రోగులకు నేను అనుసరించాలనుకునే చికిత్సా పద్ధతి నేను నమ్మే, గౌరవించే ఇతర వైద్యుల రెకమెండేషన్లకు భిన్నంగా ఉంటుంది. ఇది నన్ను అనిశ్చితిలోకి, సందిగ్ధంలోకి నెడుతుంది.

– ఎస్.పి. కాలాంత్రి, మహారాష్ట్రలోని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డైరెక్టర్

కొత్త టిప్స్



'వికసిత్ భారత్'లో కెరీర్ కోసం కొన్ని టిప్స్: 1. మీరు ప్రధానిని ఇంటర్వ్యూ చేయాలనుకుంటే స్టార్టప్ సీఈవో కావాలి. 2. ఆర్థికవేత్త కావాలనుకుంటే న్యాయవాది కావాలి. 3. మీరు రాజకీయ నాయకుడు కావాలనుకుంటే నటుడు కావాలి. 4. మోడల్ కావాలనుకుంటే ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్ కావాలి. 5. మీరు కష్టపడి విజయం సాధించాలంటే, మీ కోసం కష్టపడేవాళ్లను వెతుక్కోవాలి!

– మాధవన్ నారాయణన్, రచయిత

పూర్తి ప్రయోజనం

మంచి తిండి మీద, మంచి దుస్తుల మీద, ప్రపంచాన్ని చూడటం మీద వెచ్చించిన ఏ రూపాయీ వృథా కాదు.

– ప్రియాంకా సింగ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

మీదేం పోయింది?



'రైజింగ్ ఇండియా'లో సీఈవోలు అందరూ 70 గంటలు, 90 గంటలు పనిచేయాలని మాట్లాడటం కాకతాళీయం కాదు. చెమటలు కక్కేట్టు పనిచేయడాన్ని పెట్టుబడిదారీ విధానం ఇష్టపడుతుంది. అది ఉన్నదంతా ఇప్పుడు గ్లోబల్ సౌత్‌లోనే! నిర్దిష్ట పని వేళల కోసం కార్మికులు చాలా పోరాటాలు చేశారన్నది మరిచి పోకూడదు. దాన్ని తేలిగ్గా తీసుకోవద్దు.

– ప్రియంవదా గోపాల్, 'కేంబ్రిడ్జ్' ప్రొఫెసర్

సరస్వతీ వరం



తన గానం ద్వారా పి. జయచంద్రన్ సర్ మన హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతారు. నా మొట్టమొదటి పాట ద్వారా ఆయన్ని కలిసే అదృష్టం దక్కింది ('అమృత'లోని 'ఏ దేవి వరము నీవో' తమిళ వెర్షన్). ఆయన దయాగుణాన్ని ఎప్పటికీ మరిచి పోను. ఆయన కుటుంబానికి సానుభూతి.

– చిన్మయీ శ్రీపాద, గాయని

శైవపు శాఖే!




బుద్ధ గయ నుంచి ప్రణామం. నిన్న మహా బోధి ఆలయాన్ని దర్శించాను. శైవంలోని ఆధ్యాత్మిక పూర్వపు శాఖే బౌద్ధం అనేదాన్ని ఇక్కడంత స్పష్టంగా మరెక్కడా చూడం. ఉదాహరణకు భూటాన్ సాధువులు శివుడి డమరుకం లాంటి వాద్యాన్ని ఉపయోగిస్తున్నారు. శాక్యముని తనకంటే ముందున్న అందరి మునుల అడుగుజాడల్లో నడిచాడు.

– కున్రాడ్ ఎల్స్ట్, బెల్జియం రచయిత

ఇన్ బాక్స్

అక్షర సమర శంఖం

సంపద కంటే సమాజ శ్రేయస్సే ముఖ్యమని అక్షరాలతో దోపిడీనీ, అవినీతినీ నిలదీసిన కవి అలిశెట్టి ప్రభాకర్. కరీంనగర్ జిల్లాలోని జగిత్యాలలో 1956 జనవరి 12న జన్మించారు. తండ్రి పరిశ్రమల శాఖలో పనిచేస్తూ ఆకస్మికంగా మృత్యువాత పడ్డాడు. ఆయన మరణంతో 11 ఏళ్ల వయసులో ప్రభాకర్ కుటుంబ పోషణ బాధ్యతలు స్వీకరించాడు. ఆదర్శాలకు అనుగుణంగా పేదరాలయిన 'భాగ్యం'ను పెళ్లి చేసుకొన్నారు. చిత్రకారుడిగా, ఫోటోగ్రాఫర్‌గా వృత్తి జీవితాన్ని కొనసాగిస్తూనే, కవిగా ఎదిగారు. 1982లో హైదరాబాదులో స్థిరపడ్డారు. 'సిటీ లైఫ్' పేరుతో హైదరాబాద్ నగరంపై మినీ కవిత్వం రాశారు.



అలిశెట్టి ప్రభాకర్

సరళమైన పదాలు, రక్తం ఉడికించే మాటలతో మర ఫిరంగుల్లాంటి కవితలు రాశారు. ప్రభాకర్ గుండె లోతుల్లో ఉన్న బడబాగ్ని 1978లో జగిత్యాల జైత్రయాత్రతో ఉప్పెనలా బయటకొచ్చింది. అక్షరాలతోనే సమర శంఖం పూరిస్తున్న ప్రభాకర్‌పై ప్రభుత్వాలు, పోలీసులు, భూస్వాములు కక్ష కట్టారు. ఫలితంగా నిర్బంధం నీడలా వెంటాడింది. అందుకే జగిత్యాల నుంచి కరీంనగర్‌కు చేరారు. 1979లో 'మంటల జెండాలు' సంకలనాన్ని వెలువరించారు. అందులో వచ్చిన 'దోపిడీ చిహ్నం', 'దశ', 'పింజర' లాంటి ఎన్నో కవితలకు ఇండియన్ ఇంక్‌తో అద్భుతమైన చిత్రాలు గీశాడు. 1981లో 'చురకలు' కవితా సంకలనం పీడితుల పక్షాన సంధించాడు.

'తను శవమై/ ఒకరికి వశమై/ తనువు పుండై/ ఒకడికి పండై/ ఎప్పుడూ ఎడారై/ ఎందరికో ఒయాసిస్సై' అంటూ సెక్స్ వర్కర్ల దుర్భర జీవితాన్ని ప్రపంచానికి చాటాడు ప్రభాకర్. 'మరణం నా చివరి చరణం కాద'ని ప్రకటించిన ప్రభాకర్... కబళించే మృత్యువును ముందే గుర్తించాడు. చివరి రోజుల్లో పేదరికంతో పోరాటం చేసిన ఆయన... అనారోగ్యానికి చికిత్స చేయించుకోవడానికి కూడా డబ్బులు లేక 1993 జనవరి 12న హైదరాబాద్‌లో చనిపోయారు. ఆయన పుట్టిన రోజు, చనిపోయిన రోజు ఒకటే అయింది. ప్రభాకర్ అక్షర స్ఫూర్తిని నేటి యువత అలవరుచుకోవాల్సిన అవసరం ఉంది.

– సంపత్ గడ్డం ၊ కామారెడ్డి
(రేపు అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి)

వీరికి మంచి రోజులు వచ్చేనా?

అభిప్రాయం



డా॥ బి. కేశవులు

ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన వారెందరో ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి పడరాని పాట్లు పడుతున్నారు. వీరిలో ఎక్కువమంది గ్రామీణ ప్రాంతాలకు చెందినవారే. ఇందులోనూ నిరక్షరాస్యులూ, అంతగా చదువుకోని నైపుణ్యాలు లేనివారే (అన్‌స్కిల్డ్ లేబర్) అధికంగా ఉన్నారు. వీరంతా ప్రధానంగా ఏజెంట్ల మోసాల కారణంగానే ఇక్కట్ల పాలవుతున్నారు. మంచి ఉద్యోగం అని ఆశలు కల్పిస్తున్న ఏజెంట్లు తీరా అక్కడికెళ్లాక పురుషులకైతే తోటమాలి, పశువుల కాపరి వంటి పనులు అంటగడుతున్నారు. స్త్రీలను పనిమనుషులుగా చేరుస్తున్నారు. వీరితో చాలీచాలని జీతాలకు వెట్టి చాకిరీ చేయిస్తున్నారు. గల్ఫ్ వెళ్లేందుకు చేసిన అప్పులు కూడా తీరకముందే నితాఖత్ వంటి ఆంక్షలతో అక్కడి ప్రభుత్వాలు బలవంతంగా స్వస్థలాలకు పంపుతున్నాయి. ఏళ్లుగా ఈ మోసాలు, అకృత్యాలు సాగుతూనే ఉన్నాయి. ఉన్న ఊళ్లో ఉపాధి కల్పిస్తే ఇటువంటి వలసలు గణనీయంగా తగ్గుతాయి.

మిగతా ప్రాంతాలతో పోల్చి చూస్తే... ఉత్తర తెలంగాణ జిల్లాలు, ఉభయగోదావరి – కడప జిల్లాల ప్రాంతాల నుంచి ఎక్కువమంది (లక్షలాది మంది) గల్ఫ్ బాధితులు ఉన్నారు. ఆ యా దేశాల్లో ఉద్యోగాలు లేకపోయినప్పటికీ మంచి ఉద్యోగంలో చేర్పిస్తామంటూ ఏజెంట్లు విజిట్ వీసాలపై ఉపాధి కావలన్న వారిని పంపుతున్నారు. దీంతో అక్కడికి వెళ్లిన తర్వాతే ఉద్యోగం వెతుక్కోవాల్సి వస్తోంది. ఉద్యోగం దొరక్క అప్పుల పాలైన వారూ ఉన్నారు. కొద్ది రోజులు ఉద్యోగం చేసినప్పటికీ విజిట్ వీసా కాలం పూర్తికావడంతో జైలు పాలైనవారూ ఉన్నారు. అనేక మంది నేటికీ



చనిపోయిన 140 రోజులకు స్వదేశం చేరుకున్న జగిత్యాల జిల్లా వాసి మృతదేహం (ఫైల్)

అక్కడి జైళ్లలో మగ్గుతున్నారు. తిండిలేక, అప్పులు తీర్చే మార్గం లేక ఒత్తిడిలో అనేక మంది అనారోగ్యం పాలవుతున్నారు. వీరిలో కొందరు అక్కడే మృతి చెందుతున్నారు. చివరికి శవాలు రావడానికి సైతం కొన్ని నెలలపాటు కుటుంబ సభ్యులు ఎదురు చూడవలసి వస్తోందంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఉన్నచోట ఉపాధి లేకపోవడమే ఈ వలసలకు ప్రధాన కారణం. ప్రపంచీకరణ నేపథ్యంలో మెరుగైన జీవనం కోసం జనం తోవలు వెదుక్కుటున్నారు. పిల్లల చదువు, మెరుగైన వైద్యం, కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డలు అందించడానికి ప్రభుత్వాలు తగిన ఏర్పాట్లు చెయ్యాలి. ఈ అవసరాలను తీర్చే గత ప్రభుత్వాల పథకాలను ప్రస్తుత ప్రభుత్వాలు రద్దుచేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? రైతులకు కనీస మద్దతు ధర లభించడం లేదు. వస్త్ర పరిశ్రమలో ఉపాధి సన్నగిల్లుతోంది. బీడీ కార్మికులకూ సరైన ఆదాయం లేదు. అందుకే వలస బాట పడుతున్నారు.

పరిస్థితి దిగజారక ముందే స్వస్థలాల్లో ఉపాధి అవకాశాలను పెంచాలి. మార్కెట్‌లో దళారీ వ్యవస్థను అరికట్టి పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. ఇప్పటికే గల్ఫ్ దేశాలకు వెళ్లి ఆర్థికంగా చితికిపోయిన వారికి రుణ సౌకర్యం కల్పించి స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించాలి. చైనా తరహా కుటీర పరిశ్రమలు నెలకొల్పాలి. అయినా ఎవరైనా ఇతర దేశాలకు వలస వెళ్లాల్సి వస్తే ప్రభుత్వమే తగిన విధంగా ఏర్పాట్లు చేయాలి. ఫిలిప్పీన్స్ దేశం మాదిరి ఏజెంట్ల వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలి. గల్ఫ్ బాధితుల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను, గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి.

వ్యాసకర్త నార్త్ – తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఫౌండర్ చైర్మన్
మొబైల్: 85010 61659

సత్కర్మలే రక్ష!

మనం చేసే మంచి పనులు మనకు ఉత్తమ గతులను ఇస్తాయనేది భారతీయ తత్త్వం. ఈ కథ అందుకు ఒక ఉదాహరణ: ఒక వ్యక్తికి ముగ్గురు మిత్రులున్నారు. అతనికి ఒకసారి ఒక వివాదంలో న్యాయ విచారణ కోసం తనవైపు సాక్ష్యం చెప్పడానికి సాక్షి కావలసి వచ్చింది. మొదట ఒక మిత్రుని దగ్గరకు వెళ్లి సాక్ష్యం చెప్పటానికి న్యాయస్థానానికి రావాలని కోరాడు. దానికి ఆ మిత్రుడు ఇష్టపడలేదు. 'నీ కోసం వస్తే నా మీదకు ఏం వస్తుందో. నాకు భయం. నేను రాలేను, క్షమించు' అన్నాడు.



ఆ వ్యక్తి ఇంకొక మిత్రుని వద్దకు వెళ్లాడు. 'నేను నీతో న్యాయస్థానం దాకా వస్తాను కాని సాక్ష్యం చెప్పే బోనులో నిల్చోలేను, క్షమించు' అన్నాడు. ఇద్దరు మిత్రుల మాటలకు ఎంతో బాధ పడ్డాడా వ్యక్తి. మూడవ మిత్రుని దగ్గరకు వెళ్లగా అతడు 'నువ్వు ఏమీ బాధ పడవద్దు. నేను నీతో న్యాయస్థానానికి వస్తాను. నీకు అనుకూలంగా మాట్లాడతాను. నీ కోసం నేనెంత సహాయం చేయగలనో అంతా చేస్తాను, భయపడకు. నేను నీకు చివరి వరకూ తోడు ఉంటాను' అన్నాడు. ఆ వ్యక్తికి చాలా ధైర్యంగా, సంతోషంగా అనిపించింది. తన నిజమైన మిత్రుడు ఇతడే అనుకున్నాడు.

ఈ కథలో ప్రధాన వ్యక్తి మానవుడే. ముగ్గురు మిత్రులలో మొదటి మిత్రుడు మనం అమితంగా ప్రేమించే ధన, కనక, వస్తు వాహనాలు. అవి మనం ఈ లోకం నుంచి వెళ్ళేటప్పుడు మన వెంట రావు. రెండవ మిత్రుడు మన కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, ఆత్మీయులు. వీరు మనం చనిపోయాక శ్మశానం వరకూ వస్తారు.

మూడవ మిత్రుడు మనం జీవించి ఉండగా చేసిన మంచి పనులు! ఇవి మరణానంతరం కూడా మనం లోకానికి గుర్తుండిపోయేట్లు చేస్తాయి. అవే మన వెంట వచ్చేవి. మనకు ఉత్తమ గతుల నిచ్చేవి. ఈ మూడవ మిత్రుని మనం కాపాడుకోవాలి. అంటే ఎప్పుడూ సత్కర్మలు, నలుగురికీ ఉపయోగపడే పనులు చేస్తూ ఉండాలన్నమాట!

– డా॥ చెంగల్వ రామలక్ష్మి



ముక్కంటి ఆలయంలో ముక్కోటి వేడుక

వేములవాడ: హరిహర క్షేత్రంగా వెలుగొందుతున్న వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు శుక్రవారం వేకువ జామున అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ అధికారులు ఉత్తరద్వారం వద్ద స్వామి వారిని దర్శించుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కోటిలింగాల వద్ద ప్రత్యేక ప్రాకారాన్ని ఏర్పాటు చేశారు.

పండగ ముందు పెను విషాదం

▶ మొదటి పేజీ తరువాయి

ఐదుగురు మృతిచెందారు. 15 మంది గాయపడ్డారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఐలాపురం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. ఒడిశాకు చెందిన 32 మంది వలస కూలీలు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గుప్త ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్‌కు గురువారం సాయంత్రం 4 గంటలకు బయలు దేరారు. ఐలాపురం గ్రామ శివారులో ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వూరు నుంచి సంగారెడ్డికి వెళ్తున్న ఇసుక లారీ టైరు పంక్చర్ కావడంతో పక్కకు నిలిపారు. ఆ లారీని ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ గరడ సునీల్ (40), ఒడిశాకు చెందిన కూలీలు రూపు హరిజన్ (51), సుల హరిజన్ (46), సునమని హరిజన్ (61) అక్కడికక్కడే మృతిచెందగా, ప్రత్యూష్ ప్రభాత్ హరిజన్ (17) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. గాయపడ్డవారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పరిశీలించారు. బస్సు ఢీకొట్టిన వేగానికి మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా ఛిద్రమైపోయాయి.


సూర్యాపేట జిల్లా ఐలాపురం వద్ద లారీని ఢీకొట్టి ధ్వంసమైన ట్రావెల్స్ బస్సు

జన్మదినం రోజే మృత్యు ఒడిలోకి..

పెద్దపల్లి మండలం రంగాపూర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన అనవేన అభిలాష్ (19), కాల్వ శ్రీరాంపూర్ మండలం మంగపేటకు చెందిన చుంచు రాజ్‌కుమార్ (20) మరణించారు. వీరిద్దరూ అక్కాచెల్లెళ్ల కొడుకులు. చుంచు రాజ్‌కుమార్ జన్మదినం కావడంతో అప్పన్నపేటలోని అభిలాష్‌తో కలిసి బైక్‌పై గుండారంలోని స్నేహితుల వద్దకు వెళ్లారు. అక్కడ వేడుక చేసుకొని తిరిగి వస్తుండగా రంగాపూర్ శివారులో ట్రాన్స్‌కోకు చెందిన బొలెరో వాహనాన్ని బైక్‌తో బలంగా ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో అభిలాష్ అక్కడికక్కడే మరణించగా, రాజ్‌కుమార్‌ను కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. జగిత్యాల - ధర్మపురి జాతీయ రహదారిపై తక్కళ్లపల్లి శివారులో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన బూతగడ్డ అరవింద్ (21), బత్తుల సాయి (22), మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన దయ్యాల వంశీ (22) దుర్మరణం చెందారు. వంశీ 15 రోజుల క్రితమే దుబాయ్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు.

మనుమడి బారసాలకు వెళ్లి వస్తూ..

మనుమడి బారసాల వేడుకలు జరుపుకొని తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు మరణించగా, ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. జనగామ - సూర్యాపేట రహదారిపై కొడకండ్ల మండలం మైదంచెరువు తండ వద్ద గురువారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. నాగారం మండలం ఈటూరుకు చెందిన పేరాల వెంకన్న,లక్ష్మి దంపతుల కుమారుడైన యుగంధర్‌కు కుమారుడు జన్మించగా గురువారం దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలో బారసాల వేడుక జరిగింది. ఈ వేడుకకు వెంకన్న కుటుంబసభ్యులు, బంధువులంతా తుపాన్ వాహనంలో వెళ్లారు. వేడుకల అనంతరం అదే వాహనంలో రాత్రి ఈటూరుకు తిరిగి వస్తుండగా మైదంచెరువు తండా శివారులో జాతీయ రహదారిపై నిలిపి ఉన్న డీసీఎం వాహనాన్ని తుపాన్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో పేరాల వెంకన్న (45) అతని తమ్ముడి భార్య పేరాల జ్యోతి (35) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడ్డ పేరాల ఊషయ్య, పేరాల లక్ష్మి, వంగూరి నర్సమ్మ, పేరాల లావణ్య, ఉప్పలమ్మ, ముత్యాలును జనగామ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పేరాల లక్ష్మి, పేరాల ఊషయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

స్నేహితులను కబళించిన లారీ

మెదక్ జిల్లా నర్సాపూర్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మరణించారు. శివ్వంపేట మండలం అల్లీపూర్‌కు చెందిన పిట్ల నాగరాజు (25), కమ్మరి దుర్గాప్రసాద్(25) స్నేహితులు. నాగరాజు తాను పనిచేసే కొంపల్లిలోని ఓ పౌల్ట్రీ కార్యాలయానికి దుర్గాప్రసాద్‌తో కలసి బైక్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా నర్సాపూర్ ఎస్‌బీఐ సమీపంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నాగరాజు తుదిశ్వాస విడిచాడు. ఈ రెండు కుటుంబాలకు వీరు ఒక్కొక్కరే సంతానం కావటం గమనార్హం

భార్య కళ్లెదుటే భర్త మృతి

స్కూటీని లారీ ఢీకొట్టడంతో భార్య కళ్లెదుటే భర్త మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట కలెక్టరేట్ వద్ద రాజీవ్ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన ఎర్రవెళ్లి బాలకిష్టయ్య (59)కు బెజ్జంకి మండలం గుగ్గిళ్లకు చెందిన ఓ వ్యక్తితో వ్యవసాయ బావి విషయంలో భూ వివాదం ఉంది. వివాదం పరిష్కారం కోసం 20 రోజులుగా కలెక్టరేట్ చుట్టూ దంపతులిద్దరూ తిరుగుతున్నారు. శుక్రవారం అదే పని మీద వీరు స్కూటీపై కలెక్టరేట్‌కు వెళ్తుండగా, కలెక్టరేట్ ఎదుట వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టి.. స్కూటీని కొంత దూరం ఈడ్చుకెళ్లింది. తీవ్ర గాయాలై బాలకిష్టయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న రేణుకకు స్వల్ప గాయాలయ్యాయి. రేణుక ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతి వేగానికి ఇద్దరు బలి

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి 11 గంటకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించగా, 15 మంది గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి అరుణాచలం వెళ్తున్న బైభారత్ ట్రావెల్స్ బస్సు జడ్చర్ల కొత్త బస్టాండ్ సమీపంలో ఓ లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సులోని ప్రయాణికుడు నూర్ (45), క్లీనర్ (40)అక్కడికక్కడే మరణించారు. గాయపడ్డవారిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో శ్రీకాంత్, షణ్ముకం, సింధు, రాధాకృష్ణ పరిస్థితి కాస్త విషమంగా ఉంది.

అమ్మకానికి మదర్ డెయిరీ ఆస్తులు!

● చిట్యాల, మిర్యాలగూడ పరిధిలోని భూములు అమ్మాలని నిర్ణయం

సాక్షి, యాదాద్రి: నష్టాల ఊబినుంచి బయట పడేందుకు మదర్‌డెయిరీ ఆస్తుల అమ్మకాలకు సిద్ధమైంది. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న 29 ఎకరాలు, మిర్యాలగూడ పరిధిలోని 15 ఎకరాలు విక్రయించగా వచ్చిన డబ్బుతో రుణాలు, ఇతర బకాయిలు చెల్లించాలని పాలకవర్గం నిర్ణయించింది. ఈ మేరకు పాల సొసైటీ చైర్మన్ల అనుమతి తీసుకోవడానికి ఫిబ్రవరి 7వ తేదీన పాలకవర్గ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయనుంది. అయితే ఆస్తులు అమ్మి నష్టాలు పూడ్చుకోవాలని పాలకవర్గం పెద్దలు తీసుకున్న నిర్ణయంపై పాడి రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు పంపిన ఎజెండా ప్రకారం నార్ముల్ (నల్లగొండ -రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ లిమిటెడ్) రూ.60 కోట్ల మేర ఆర్థికభారంతో నడుస్తోంది. దీంతో సంస్థ నిర్వహణ కష్టతరంగా మారింది.

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే

కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ జిల్లాల పట్టభద్రుల అభ్యర్థిగా సి.అంజిరెడ్డి

ఈ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మల్క కొమురయ్య

నల్లగొండ-వరంగల్- ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పులి సరోత్తమ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: త్వరలో ఎన్నికలు జరగబోయే మూడు ఎమ్మెల్సీ స్థానాలకు బీజేపీ తన అభ్య ర్థులను ప్రకటించింది. కరీంనగర్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - మెదక్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సి.అంజిరెడ్డి, ఈ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మల్క కొమురయ్య, నల్లగొండ-వరంగల్-ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పులి సరోత్తమ్‌రెడ్డి బరిలో దిగనున్నారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డా ఆదేశాల మేరకు మూడు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్టు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.



- **సి.అంజిరెడ్డి:** ఉమ్మడి మెదక్ జిల్లాలోని రామచంద్రాపురానికి (ప్రస్తుతం సంగారెడ్డి) చెందిన సి.అంజిరెడ్డి డిగ్రీ పూర్తి చేశారు. పారిశ్రామికవేత్తగా వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టారు. విద్యార్థి దశ నుంచే జాతీయ భావాలకు దగ్గరయ్యారు. రెండు దశాబ్దాలుగా ఆయన ఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా పలు గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పేద విద్యార్థులు ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకునేలా ట్రస్ట్ ద్వారా సహకారం అందిస్తున్నారు. అంజిరెడ్డి భార్య గోదావరి అంజిరెడ్డి బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు.



- **మల్క కొమురయ్య:** కరీంనగర్ జిల్లా పెద్దపల్లికి చెందిన కొమురయ్య ఉస్మానియా వర్సిటీ నుంచి బీఈ డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం ఆయన పలు విద్యాసంస్థలను నెలకొల్పారు. పాఠశాల స్థాయిలో విద్యాభివృద్ధికి కృషి చేశారు. పెద్దపల్లి, నిర్మల్, హైదరాబాద్‌లలో పలు విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన పల్లవి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్స్ చైర్మన్‌గా ఉన్నారు.



- **పులి సరోత్తమ్‌రెడ్డి:** వరంగల్‌కు చెందిన సరోత్తమ్‌రెడ్డి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగారు. 21 ఏళ్లపాటు స్కూల్ అసిస్టెంట్‌గా, పదేళ్లు హెడ్‌మాస్టర్‌గానూ సేవలందించారు. 2012 నుంచి 2019 దాకా పీఆర్‌టీయూకు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. టీచర్స్ జేఏసీలో భాగంగా తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఉపాధ్యాయుడిగా, యూనియన్ నాయకుడిగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

మే 15 నుంచి 26 వరకు సరస్వతీ పుష్కరాలు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వర ఆలయ పరిధి గోదావరిలో జరిగే సరస్వతీ నది పుష్కరాలను మే 15 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ తెలిపారు. పుష్కరాల ఏర్పాట్లు, నిర్వహణపై శుక్రవారం కాళేశ్వర ఆలయంలో అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ఫిబ్రవరి 7 నుంచి 9 వరకు మూడ్రోజుల పాటు శృంగేరి పీఠం వేదపండితులతో కుంభాభిషేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గోదావరిలోని ప్రధాన ఘాట్ వద్ద సరస్వతీ మాత విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పుష్కరాలను విజయవంతం చేయాలని కోరారు. కాగా, పుష్కరాల పనుల కోసం ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసినట్లు దేవస్థానం ఈఓ ఏ.మారుతి శుక్రవారం తెలిపారు.

కలకలం రేపిన మావోయిస్టుల లేఖ

● జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని హెచ్చరిస్తూ ఉన్న లేఖ హల్‌చల్

జడ్చర్ల: భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ లచ్చన్న దళం పేరుతో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని హెచ్చరిస్తూ మావోయిస్టులు ఒక గోడపై అతికించినట్లుగా ఉన్న ఒక లేఖ ఫొటో కలకలం రేపింది. ఈ లేఖపై ఈ నెల 7వ తేదీ ఉన్నా.. శుక్రవారం వెలుగులోకి వచ్చింది. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విపక్షంలో ఉన్న సమయంలో పాదయాత్ర సందర్భంగా అక్రమ భూముల రిజిస్ట్రేషన్లను అడ్డుకున్నారని, ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత పట్టాదారులను బెదిరించి భూములను గుంజుకుంటున్నారని పేర్కొన్నారు. గ్రామంలోని లక్ష్మీనారాయణ గుడిలో విగ్రహాల చోరీ వెనుక ఉన్న వారు తమకు తెలుసని, కంపెనీలను బెదిరించి డబ్బులు వసూలు చేసి పంచుకుంటున్న ఎమ్మెల్యే అనుచరులుగా ఉన్న చిత్తనూరి కొమటి రవికుమార్, రాములుగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, ఉప్పరి యాదయ్య, గొల్ల లక్ష్మీనారాయణ, కటిపాగ సాయి, దుష్యంత్‌రెడ్డిలను హెచ్చరిస్తూ ప్రజాకోర్టులో శిక్ష తప్పదని కార్యదర్శి లచ్చన్న దళం పేరుతో లేఖలో పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సాక్షితో మాట్లాడుతూ.. తమ గ్రామం రంగారెడ్డిగూడెంలోనే ఎవరో ఒకరు ఈ పని చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా అయిన తరువాత ఎక్కడా ఎకరం భూమి కొనుగోలు చేయలేదని, తానే 15 ఎకరాలు అమ్ముకున్నానని స్పష్టం చేశారు. కాగా లేఖపై విచారిస్తున్నామని సీఐ నాగార్జునగౌడ్ తెలిపారు.



మన్‌హాటన్ జడ్జి ఎదుట తన లాయర్‌తో కలిసి వర్చువల్‌గా విచారణలో పాల్గొన్న ట్రంప్

ట్రంప్ దోషే కానీ... శిక్షేమీ విధించట్లేదు

హష్ మనీ కేసులో కోర్టు తీర్పు

- అధ్యక్షుడు కానుండటమే కారణం
- దోషిగా పీఠమెక్కుతున్న తొలి నేత

న్యూయార్క్: హష్ మనీ కేసులో అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు శిక్ష నుంచి బేషరతుగా మినహాయింపు ఇస్తున్నట్టు (అన్‌కండిషనల్ డిశ్చార్జ్) న్యూయార్క్ కోర్టు ప్రకటించింది. మన్‌హాటన్ జడ్జి జువాన్ ఎం.మర్చన్ శుక్రవారం ఈ మేరకు తీర్పు వెలువరించారు. ట్రంప్ దోషేనని ఆయన పునరుద్ఘాటించారు. అయినా ముందే ప్రకటించిన మేరకు ట్రంప్‌కు శిక్ష గానీ, జరిమానా గానీ విధంచడం లేదని స్పష్టం చేశారు. ''అధ్యక్షునిగా ట్రంప్‌కు సంక్రమించబోయే అపరిమితమైన అధికారాలు, న్యాయపరమైన రక్షణలు శిక్ష నుంచి మినహాయింపు కల్పిస్తాయే తప్ప కోర్టు తీర్పును అడ్డుకోజాలవు. అధ్యక్షునిగా ఆయన పాలన పగ్గాలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఒకవైపు. చట్టానికి ఎవరూ అతీతులు కారాదన్న ప్రజల ఆకాంక్షలు మరోవైపు. ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేస్తూ ఇలా తీర్పు ఇవ్వాల్సి వచ్చింది'' అని వివరించారు. దాంతో, ఇది తనకో దారుణమైన అనుభవమంటూ ట్రంప్ వాపోయారు. తన ఫ్లోరిడా నివాసం నుంచే లాయర్‌తో కలిసి ఆయన వర్చువల్‌గా విచారణలో పాల్గొన్నారు. తాను నిర్దోషినని పదేపదే వాదించారు. ''ఈ కేసు నాపై రాజకీయ వేధింపుల్లో భాగం. ఇదంతా నా ప్రతిష్ఠను దెబ్బ తీసే ప్రయత్నం. ఇటీవలి అధ్యక్ష ఎన్నికల్లో తిరుగులేని మెజారిటీ సాధించా'' అని చెప్పుకొచ్చారు. ఆయన లాయర్ సైతం అదే వాదన విన్పించారు. కానీ న్యాయమూర్తి వాటిని ఆలకించలేదు. దాంతో అమెరికా చరిత్రలో దోషిగా తేలి మరీ అధ్యక్ష పీఠం ఎక్కబోతున్న తొలి నేతగా ట్రంప్ నిలిచారు. తీర్పుపై ప్రాసిక్యూటర్లు కూడా అభ్యంతరం తెలపలేదు. అయితే శిక్ష నుంచి తప్పించుకునేందుకు న్యాయవ్యవస్థపైనే ట్రంప్ పదేపదే దారుణ రీతిలో దాడికి దిగారంటూ ఆక్షేపించారు. ఇలాంటి కేసులో సాధారణంగా కనీసం నాలుగేళ్ల జైలు శిక్ష పడుతుంది. హష్ మనీ కేసు కారణంగా అమెరికా చరిత్రలో క్రిమినల్ అభియోగాలు ఎదుర్కొన్న తొలి మాజీ అధ్యక్షునిగా కూడా ట్రంప్ నిలవడం తెలిసిందే.

ఏమిటీ కేసు?

శృంగార చిత్రాల తార స్టార్మీ డేనియల్స్‌తో తన లైంగిక సంబంధాలపై నోరు విప్పకుండా 2016 అధ్యక్ష ఎన్నికల వేళ ప్రచార విరాళాల నుంచి ఆమెకు అక్రమంగా 1.3 లక్షలు డాలర్లు చెల్లించారని ట్రంప్‌పై ఆరోపణలొచ్చాయి. దీనికి సంబంధించి ఆయనపై ఏకంగా 34 రకాల అభియోగాలు నమోదయ్యాయి. వాటన్నింట్లోనూ ట్రంప్ దోషేనని ఆరు వారాల విచారణ అనంతరం 12 మంది జడ్జిల ధర్మాసనం గత మేలో తేల్చింది. నవంబర్లోనే శిక్ష ఖరారు చేయాల్సి ఉండగా ట్రంప్ రెండోసారి అధ్యక్షునిగా గెలిచారు. ఈ నేపథ్యంలో క్రిమినల్ విచారణ నుంచి తనకు రక్షణ ఉంటుందని ఆయన వాదించారు. కానీ అలాంటిదేమీ ఉండబోదని న్యాయమూర్తి ఇటీవలే తేల్చారు. అయితే, ''జనవరి 10న శిక్ష విధిస్తా. కాకపోతే బేషరతుగా వదిలేస్తూ నిర్ణయం తీసుకుంటా'' అని చెప్పారు. ఆ తీర్పును అడ్డుకునేందుకు ట్రంప్ చివరిదాకా విఫలయత్నం చేశారు. గురువారం రాత్రి హుటాహుటిన సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. తీర్పు ప్రక్రియను ఆలస్యం చేసేలా జడ్జిని ఆదేశించలేమంటూ న్యాయమూర్తులు 5-4 మెజారిటీతో తీర్పు వెలువరించారు. ఆయనపై దాఖలైన నాలుగు క్రిమినల్ కేసుల్లో ఇదొకటి. అమెరికా అధ్యక్షునిగా జనవరి 20న ట్రంప్ రెండోసారి ప్రమాణస్వీకారం చేయనుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో మిగతా మూడు కేసులు విచారణకు వచ్చే అవకాశం లేదు.

నేను దేవుణ్ని కాను...

సామాన్యుడినే.. కనుక నేనూ తప్పులు చేశా

వాటి వెనక ఎప్పుడూ చెడు ఉద్దేశం లేదు

- తొలి పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మోదీ
- పలు అంశాలపై మనసు విప్పిన ప్రధాని
- ప్రజాసేవ కోసమే రాజకీయాలని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ''తప్పులు చేయడం మానవ సహజం. తెలిసీ తెలియక అందరూ తప్పులు చేస్తారు'' అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ''నేను దేవుడిని కాదు. సామాన్య మానవుడినే. కాబట్టి నేను కూడా తప్పులు చేశా'' అని అంగీకరించారు. అయితే తాను చేసిన తప్పుల్లో చెడు ఉద్దేశం ఏనాడూ లేదని స్పష్టం చేశారు. మనుషులు చేసే తప్పుల వెనుక ప్రమాదకరమైన ఉద్దేశాలు ఉంటాయని అనుకోవడం లేదన్నారు. 'జెరోదా' సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్‌కు మోదీ ఆదివారం తొలి పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూ ఇచ్చారు. రెండు గంటల సుదీర్ఘ ఇంటర్వ్యూలో పలు అంశాలపై విస్తారంగా ముచ్చటించారు. తన రాజకీయ ప్రస్థానంతో సహా పలు అంశాలపై మనసు విప్పారు. తన జీవితంలోని అనేక దృక్కోణాలను ప్రస్తావించారు. తప్పులు చేస్తానని తాను తొలిసారి సీఎం అయినప్పుడే ప్రజలకు చెప్పానని గుర్తు చేసుకున్నారు. ఆ తప్పుల్లో చెడు ఉద్దేశం మాత్రం ఉండదని వివరించానన్నారు. పాడ్‌కాస్ట్‌లో మోదీ ఏం చెప్పారంటే...

గోద్రాలో భావోద్వేగాలు అదుపు చేసుకున్నా

''గుజరాత్ సీఎం అయిన తొలినాళ్లలో ఓ సభలో మాట్లాడుతూ మూడు విషయాలు ప్రజలతో పంచుకున్నా. ''నా కృషిలో ఏ లోపమూ లేకుండా జాగ్రత్త పడతా. నాకోసం ఏదీ చేసుకోను. మనిషిని కాబట్టి తప్పులు చేస్తా, కానీ వాటిలో చెడుద్దేశం ఉండబోదు'' అని వివరించా. ఆ మూడూ నాకు జీవన మంత్రాలు! 2002 ఫిబ్రవరి 27న గోద్రా రైలు దహనం గురించి తెలియగానే అక్కడికి వెళ్లాలని నిర్ణయించుకున్నా. చూస్తే హెలికాప్టర్ అందుబాటులో లేదు. చివరకు బహుశా ఓఎన్‌జీసీకి చెందిన సింగిల్ ఇంజన్ హెలికాప్టర్ సమకూర్చినా, అది వీఐపీలకు ఉద్దేశించింది కాదంటూ భద్రతా సిబ్బంది అభ్యంతరపెట్టారు. 'నేను వీఐపీని కాను, మామూలు పౌరుడినే'నని బదులిచ్చి అందులోనే గోద్రా చేరుకున్నా. అందుకోసం ఎంతో వాదించాల్సి వచ్చింది. చివరికి, ఏం జరిగినా నాదే బాధ్యత అని రాసివ్వడానికి కూడా సిద్ధపడ్డా. అంతే తప్ప రిస్క్ చేయడానికి వెనకాడలేదు. తీరా వెళ్లాక గోద్రాలో హృదయ విదారక దృశ్యాలు కనిపించాయి. నేనూ మనిషినే. నాకూ భావోద్వేగాలుంటాయి. కానీ సీఎంను గనుక వాటికి దూరంగా ఉండాలని నాకు తెలుసు. అందుకే భావోద్వేగాలను అదుపు చేసుకున్నా. అందుకోసం మానసికంగా చేయగలిగిందంతా చేశా. ఆ ఫలితాల రోజు నాలో ఆదుర్దా కలగలేదని చెప్పలేను. కానీ దాన్ని అధిగమించాలని గట్టిగా అనుకున్నా. అందుకే మధ్యాహ్నం దాకా ఫలితాల గురించి నాకు చెప్పొద్దని సిబ్బందికి సూచించా. ఆ రోజు టీవీ కూడా చూడలేదు. మధ్యాహ్నానికల్లా నా ఇంటి ముందు ఆనందోత్సాహాలు మిన్నంటాయి. చూస్తే మాకు మూడింట రెండొంతుల మెజారిటీ దక్కింది.

మిత్రులు నన్ను సీఎంగానే చూసేవారు

నా చిన్నప్పుడు అప్పుడప్పుడు మా కుటుంబ సభ్యుల బట్టలు ఉతికేందుకు ఇష్టపడేవాడిని. అలాగైతే చెరువు దగ్గరికి వెళ్లనిస్తారు కదా! సీఎం అయ్యాక కూడా చిన్నప్పటి మిత్రులను అధికారిక నివాసానికి ఆహ్వానిస్తూ ఉండేవాడిని. కానీ వారు నన్ను సీఎంగానే చూసేవారు. దాంతో నన్ను 'నీవు' అని పిలిచేవారే కరువయ్యారు.

రాజకీయాల్లో సొంత లాభం కూడదు

వ్యాపారానికి, రాజకీయాలకు చాలా వ్యత్యాసం ఉంది. వ్యాపారంలో వ్యక్తిగత, ఆర్థిక అభివృద్ధే ముఖ్యం. రాజకీయాల్లో మాత్రం సమాజ సంక్షేమానికే ప్రాధాన్యమివ్వాలి. అందుకు ఎన్నో త్యాగాలు చేయాల్సి ఉంటుంది. సొంత లాభం మానుకోవాలి. వ్యాపారంలో ఎలా పైకి ఎదగాలన్నదే కీలకం. రాజకీయాల్లో త్యాగాలెలా చేయాలన్నది కీలకం. వ్యాపారంలో కంపెనీని నంబర్‌వన్‌గా ఎలా మార్చాలో ఆలోచించాలి. రాజకీయాల్లో మాత్రం దేశమే తొలి ప్రాధాన్యం కావాలి. దేశాన్ని నంబర్ వన్‌గా మార్చే ఆలోచన చేయాలి. రాజకీయాలంటే కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కాదు. అది ప్రజాసేవకు సంబంధించిన అంశం. వ్యక్తిగత ఆశల కంటే ప్రజాసేవే పరమావధి కావాలి. అంతేతప్ప రాజకీయాలంటే 'లేనా, పానా, బనానా (దండుకోవడం)' కాదు. అలాంటివారు దీర్ఘకాలం కొనసాగలేరు.

కంఫర్ట్ జోన్‌లో ఉండలేను

నేనెప్పుడూ కంఫర్ట్ జోన్‌లో జీవించలేదు. అలా ఉండిపోయేవారు విజయాలు సాధించలేరు. కంఫర్ట్ జోన్ బయట ఉన్నా గనుక ఏం చేయాలో నాకు తెలిసింది. సురక్షిత స్థానంలో ఉండిపోవడానికి నేను సరిపోనేమో! రిస్క్ తీసుకొనే మనస్తత్వమే మనల్ని ముందుకు నడుపుతుంది. అయితే రిస్క్ తీసుకొనే సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వాడుకోలేదు. చిన్న చిన్న విషయాలే నాకు సంతృప్తినిచ్చాయి. పాత ఆలోచనలు వదిలేయడానికి నేనెప్పుడూ సిద్ధమే.

నాది సాధారణ నేపథ్యం

నేను అతి సాధారణమైన నేపథ్యం నుంచి వచ్చా. నేను ప్రాథమిక పాఠశాల టీచర్‌నయినా నా తల్లి ఆనందంతో అందరికీ స్వీట్లు పంచేదేమో! అలాంటి నేపథ్యం నాది. చిన్నప్పుడు స్కూల్‌లో సాధారణ విద్యార్థినే. కేవలం పాసయ్యేందుకు చదివేవాడిని. ఇతర కార్యకలాపాల్లో ఉత్సాహంగా పాల్గొనేవాడిని. సైనిక్ స్కూల్‌లో చేరేందుకు దరఖాస్తు చేయడానికి నా తండ్రి అంగీకరించలేదు. డబ్బు లేకపోవడమే అందుకు కారణం. అయినా నేనెప్పుడూ అసంతృప్తి చెందలేదు. జీవితంలో నేను ఎదుర్కొన్న కష్టాలు, ఇబ్బందులే నాకు యూనివర్సిటీ. అవే నాకెన్నో పాఠాలు నేర్పాయి. పుట్టుక, చావు గురించి నేనేనాడూ ఆలోచించలేదు. సీఎం అయినప్పుడు నేనెలా అయ్యానని ఆశ్చర్యపోయా''.



నిఖిల్ కామత్‌తో మాట్లాడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

జిన్‌పింగ్‌తో ప్రత్యేక బంధం

చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో తన తొలి సంభాషణను మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ''2014లో నేను ప్రధాని అయ్యాక ఎందరో దేశాధినేతలు అభినందనలు తెలియజేశారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా మాట్లాడారు. ఇండియాలో పర్యటించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. 'తప్పకుండా రండి, మీకు స్వాగతం' అని చెప్పాను. ''గుజరాత్‌లో మీ సొంతూరు వాద్‌నగర్‌ను సందర్శించాలని ఉంది. ఎందుకంటే మనిద్దరి మధ్య ప్రత్యేక బంధం ఉంది. అలనాటి ప్రఖ్యాత చైనా తత్వవేత్త, పర్యాటకుడు హుయాన్‌త్సాంగ్ వాద్‌నగర్‌లో చాలా కాలం నివసించారు. చైనాకు తిరిగొచ్చాక నా స్వగ్రామంలో నివసించారు' అని జిన్‌పింగ్ చెప్పుకొచ్చారు'' అంటూ మోదీ గుర్తు చేసుకున్నారు.

గాంధీ ఎన్నడూ టోపీ ధరించకున్నా..

''మహాత్మా గాంధీ తన జీవితంలో ఎన్నడూ టోపీ ధరించలేదు. కానీ గాంధీ టోపీని ప్రపంచమంతా నేటికీ గుర్తుంచుకుందంటే ఆయన నాయకత్వ పటిమే కారణం. గాంధీ గొప్ప వక్త కాకపోయినా ప్రజలతో మమేకమయ్యే విషయంలో ఆయనకు ఆయనే సాటి! తన వ్యక్తిత్వం, పనితీరుతో దేశమంతటినీ ఒక్కటి చేసి చూపాడు! రాజకీయాల్లో ప్రవేశించడం సులువే. కానీ రాణించడమే కష్టం. అందుకు తిరుగులేని అంకితభావం, ప్రజలతో మమేకమవడం, వారి మంచి చెడుల్లో అండగా నిలవడం, చక్కని భావ వ్యక్తీకరణ వంటి లక్షణాలు చాలా అవసరం. అందుకే వ్యక్తిగత ఆకాంక్షలు లేని, నిస్వార్థంగా దేశ సేవ చేయాలన్న భావన నరనరానా నింపుకున్న కనీసం లక్షమంది యువకులు కావాలిప్పుడు''.

'మెలోడీ' మీమ్స్‌పై..

ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో తన పేరును కలిపి మెలోడీ అంటూ సాగిన మీమ్స్ వెల్లువను ప్రస్తావించగా మోదీ సరదాగా స్పందించారు. ''అలాంటివి నడుస్తూనే ఉంటాయి (వోతో చల్తా హీ రహేగా)'' అన్నారు. అలాంటి వాటిపై సమయం వృథా చేసుకోనన్నారు. ''నేను భోజనప్రియుణ్ని కాదు. పర్యటనలప్పుడు అందుబాటులో ఉన్నది తింటా. రెస్టారెంట్‌కు తీసుకెళ్లి మెనూ చేతికిస్తే ఏం కావాలో ఆర్డర్ కూడా ఇవ్వలేను. అలాంటప్పుడు దివంగత అరుణ్ జైట్లీ నన్ను ఆదుకునేవారు'' అని చెప్పుకొచ్చారు.

10 వేల ఇళ్లు బుగ్గి

- లాస్ ఏంజెలెస్ కార్చిచ్చులో పదికి చేరిన మృతుల సంఖ్య
- రూ.12.92 లక్షల కోట్ల మేర ఆస్తి నష్టం



తాజాగా విస్తరించిన కార్చిచ్చు తీవ్రతకు లాస్ ఏంజెలెస్ శివార్లలోని పసిఫిక్ పాలిసేడ్‌లో కాలి బూడిదైన నివాస సముదాయాలు

లాస్ ఏంజెలెస్: కార్చిచ్చుల ధాటికి అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నగరం అగ్ని కీలలకు ఆహుతవుతోంది. ఏకంగా 10 వేల ఇళ్లు బూడిద కుప్పలుగా మారిపోయాయి. మృతుల సంఖ్య శుక్రవారం నాటికి పదికి చేరుకుంది. ఈ సంఖ్య మరింత పెరిగే ప్రమాదం కనిపిస్తోంది. కేవలం పసిఫిక్ పాలిసేడ్స్ ప్రాంతంలోనే 5 వేల నివాసాలు ధ్వంసమయ్యాయి. లాస్ ఏంజెలెస్ చరిత్రలో ఈ స్థాయిలో కార్చిచ్చులు రగలడం ఇదే మొదటిసారి. కోస్తా తీర ప్రాంతంలో 70 చదరపు కిలోమీటర్ల మేర భూభాగం మంటల్లో చిక్కుకుంది. వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలంటూ స్థానిక కాలమానం ప్రకారం గురువారం నాటికి 1.80 లక్షల మందికి ఆదేశాలు అందాయి. కలాబాసాస్, శాంటా మోనికా, వెస్ట్ హిల్స్ తదితర ప్రాంతాలకు మంటలు వ్యాపిస్తున్నాయి. హాలీవుడ్ నటులు మార్క్ హమిల్, మాండీ మూర్, పారిస్ హిల్టన్ తదితరులు ఇప్పటికే లాస్ ఏంజెలెస్ విడిచి వెళ్లిపోయారు. లాస్ ఏంజెలెస్ కౌంటీలో మొత్తం 117 చదరపు కిలోమీటర్ల మేర భూభాగంలో మంటలు వ్యాపించాయి. ఇది శాన్ ఫ్రాన్సిస్కో నగర విస్తీర్ణంతో సమానం. ఇక్కడ ఎవరైనా అణుబాంబు ప్రయోగించారా? అనే అనుమానం కలుగుతోందని కౌంటీ సీఈఓ రాబర్ట్ లూనా చెప్పారు. కార్చిచ్చును అదుపు చేయడానికి 7,500 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది, అధికారులు శ్రమిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి తగినన్ని నిధులు, వనరులు సమకూర్చాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్చిచ్చు కారణంగా 150 బిలియన్ డాలర్ల(రూ.12.92 లక్షల కోట్లు) మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఓ ప్రైవేట్ సంస్థ అంచనా వేసింది. ప్రభుత్వ అధికారిక గణాంకాలు ఇంకా బహిర్గతం కాలేదు.

రగిలిన మరో కార్చిచ్చు

లాస్ ఏంజెలెస్ సమీపంలో తాజాగా మరో కార్చిచ్చు మొదలైంది. వెంచురా కైంటీ సమీపంలోని శాన్ ఫెర్నాండో వ్యాలీలో మంటలు ప్రారంభమయ్యాయని స్థానిక అధికారులు చెప్పారు. కార్చిచ్చు ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇక్కడ బలమైన ఈదురు గాలులు వీస్తుండడంతో మంటలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని, అరికట్టడం కష్టంగా మారిందని అంటున్నారు. ఇదిలా ఉండగా, కార్చిచ్చు బాధితులను ఆదుకోవడానికి చాలామంది ముందుకొస్తున్నారు. 'ఫండ్ ఆఫ్ సపోర్ట్'కు మిలియన్ డాలర్లు ఇవ్వనున్నట్లు హాలీవుడ్ నటి జేమీ లీ కర్టిస్ చెప్పారు.

దక్షిణాదిన వణికిస్తున్న మంచు తుపాను

లాస్ ఏంజెలెస్‌లో కార్చిచ్చు ఇళ్లను దహనం చేస్తుండగా, అమెరికా దక్షిణాది రాష్ట్రాలైన టెక్సాస్, ఒక్లహోమాలో మంచు తుపాను వణికిస్తోంది. రోడ్లపై మంచు పేరుకుపోతుండడంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోతున్నాయి. సాధారణ జనజీవనం స్తంభిస్తోంది. స్థానిక గవర్నర్లు అత్యవసర పరిస్థితి ప్రకటించారు. పాఠశాలలు మూసివేశారు. చల్లటి గాలులు బెంబేలెత్తిస్తున్నాయి. అర్కన్సాస్, టెక్సాస్, జార్జియా, టెన్నెస్సీ, దక్షిణ కరోలినా వంటి రాష్ట్రాల్లోనూ అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లూసియానా, మిసిసిపీ, అలబామా రాష్ట్రాల్లో మంచు తుపానుకు తోడు వర్షాలు కురుస్తున్నాయి. అమెరికాలో గురువారం 4,500కుపైగా విమానాలు ఆలస్యంగా నడిచాయి. మరో 2 వేల విమానాలు రద్దయ్యాయి.

వారు జేఈఈ-అడ్వాన్స్‌డ్‌కు రిజిస్టర్ చేసుకోవచ్చు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఐఐటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు వీలు కల్పించే జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ)-అడ్వాన్స్‌డ్ పరీక్షను అభ్యర్థులు కేవలం రెండుసార్లు రాసుకొనేలా జాయింట్ అడ్మిషన్ బోర్డు(జేఏబీ) తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకొనేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. జేఈఈ-అడ్వాన్స్‌డ్ ప్రయత్నాల సంఖ్యను మూడు నుంచి హఠాత్తుగా రెండుకు తగ్గించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిహ్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. 2024 నవంబర్ 5 నుంచి 18వ తేదీ వరకు తమ కోర్సుల నుంచి డ్రాప్ అయిన అభ్యర్థులు జేఈఈ-అడ్వాన్స్‌డ్-2025 పరీక్ష రాసేందుకు రిజిస్టర్ చేసుకోవచ్చని స్పష్టంచేసింది. ఈ మేరకు ధర్మాసనం ఉత్తర్వు జారీ చేసింది. ప్రయత్నాల సంఖ్యను మూడు నుంచి రెండుకు తగ్గించడం వల్ల తాము నష్టపోతామని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సంభాల్ మసీదు బావి వివాదం.. యథాతథ స్థితిని కొనసాగించండి

న్యూఢిల్లీ: సంభాల్‌లోని మొఘలుల నాటి జామా మసీదు సమీపంలోని వివాదాస్పద బావిపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని శుక్రవారం సుప్రీంకోర్టు భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ)తోపాటు ఉత్తరప్రదేశ్ అధికారులను ఆదేశించింది. ఇందుకు సంబంధించి జామా మసీదు నిర్వహణ కమిటీ వేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం కేంద్రం, ఏఎస్ఐలతోపాటు సంభాల్ జిల్లా మేజిస్ట్రేట్‌కు, హరి శంకర్ జైన్ తరఫున ఉన్న హిందూ కక్షిదారులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 21వ తేదీన ఉంటుందని, రెండు వారాల్లోగా అక్కడి పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. బావికి సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్ట రాదని స్పష్టం చేసింది. మసీదు కమిటీ వేసిన పిటిషన్‌పై అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చే వరకు మసీదులో చేపట్టిన సర్వే నివేదికను సీల్డ్ కవర్‌లోనే ఉంచాలంది.

పరువు నష్టం కేసులో రాహుల్‌కు బెయిల్



పుణే: హిందుత్వ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లుగా ఆరోపణలెదుర్కొంటున్న కేసులో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి పుణే కోర్టు బెయిలిచ్చింది. కేసు విచారణలో భాగంగా శుక్రవారం రాహుల్ వర్చువల్‌గా హాజరు కావడంతో ఎంపీ/ ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు రూ.25 వేల పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేసింది. కాంగ్రెస్ సీనియర్ నేత మోహన్ జోషి ఈ మేరకు కోర్టుకు ష్యూరిటీ ఇచ్చారు. ఫిబ్రవరి 18వ తేదీన తదుపరి విచారణ ఉంటుందని, ఈ కేసులో ప్రత్యక్షంగా రాహుల్ హాజరయ్యే అవసరం లేకుండా కోర్టు మినహాయింపు ఇచ్చిందని లాయర్ మిలింద్ చెప్పారు.

గుజరాత్‌లో మూడు హెచ్‌ఎంపీవీ కేసులు



హిమ్మత్‌నగర్: గుజరాత్‌లో హెచ్‌ఎంపీవీ కేసు మరొకటి వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో హెచ్‌ఎంపీవీ కేసుల సంఖ్య మూడుకు చేరింది. సబర్‌కాంత జిల్లాకు చెందిన 8 ఏళ్ల బాలుడికి హెచ్‌ఎంపీవీ పాజిటివ్‌గా నిర్ధారణైందని శుక్రవారం అధికారులు తెలిపారు. ప్రాంతిజ్ తాలూకాలో కార్మికుడి కుటుంబానికి చెందిన బాలుడికి పరీక్ష చేయించారని, అతడి నుంచి మరోసారి బ్లడ్ శాంపిల్స్ సేకరించి ప్రభుత్వ ల్యాబ్‌కు పంపించామన్నారు. హిమ్మత్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అతడు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడని, పరిస్థితి నిలకడగా ఉందని కలెక్టర్ రతన్‌కన్వర్ చెప్పారు. గుజరాత్‌లో మొదటి కేసు ఈ నెల 6న, రెండో కేసు రెండు రోజుల క్రితం వెలుగులోకి వచ్చాయి.

కెనడా ప్రధాని రేసులో మరో భారత సంతతి నేత

ఎక్స్ వేదికగా ప్రకటించిన నేపియాన్ ఎంపీ ఆర్య



ఒట్టావా: భారత సంతతికి చెందిన మరో నేత కెనడా ప్రధాని రేసులో నిలిచారు. నేపియాన్ పార్లమెంటు సభ్యుడు చంద్ర ఆర్య గురువారం ఈ మేరకు ప్రకటించారు. దేశ పునర్నిర్మాణం కోసం సమర్థమైన ప్రభుత్వానికి నాయకత్వం వహించేందుకు సిద్ధమని వీడియో ప్రకటనలో ఉద్ఘాటించారు. ''భావి తరాల శ్రేయస్సు కోసం ప్రధాని పదవికి పోటీ పడుతున్నాను. నేనెప్పుడూ కెనేడియన్ల శ్రేయస్సు కోసమే కష్టపడ్డా. మన పిల్లల భవిష్యత్ కోసం సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవాలి. లిబరల్ పార్టీ నేతగా ఎన్నికైతే ఆ దిశగా నా నైపుణ్యాలను వినియోగిస్తా'' అని ప్రకటించారు. ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారు. ''శ్రామిక, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సుస్థిర సమాజ నిర్మాణం కోసం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయమిది. అందుకు నావద్ద అనేక పరిష్కారాలున్నాయి. సాహసోపేత రాజకీయ నిర్ణయాలు ఐచ్ఛికం కాదు, అవసరం. ఆ బాధ్యతను స్వీకరించి ప్రధానిగా కెనడాను నడిపించేందుకు ముందుకొస్తున్నా'' అని చెప్పారు. ఈ ప్రయాణంలో అందరూ తనతో కలిసి రావాలని కోరారు. కెనడా ప్రధానిగా జస్టిన్ ట్రూడో వైదొలిగిన నేపథ్యంలో ఆయన వారసుడెవరన్నది ఆసక్తికరంగా మారడం తెలిసిందే. భారత సంతతి ఎంపీలు అనితా ఆనంద్, జార్జ్ చాహల్‌తో పాటు క్రిస్టినా ఫ్రీలాండ్, మార్క్ కార్నీ, డొమినిక్ లీ బ్లాంక్, మెలనీ జోలీ, ఫ్రాంకోయిస్ ఫిలిప్పీ, క్రిస్టీ క్లార్క్ తదితర లిబరల్ పార్టీ నేతల పేర్లు వినిపిస్తున్నాయి.

కర్ణాటక టు కెనడా

కర్ణాటకలోని సిరా తాలూకాలోని ద్వార్లు గ్రామం చంద్ర ఆర్య స్వస్థలం. ధార్వాడ్‌లో ఎంబీఏ చేశారు. 20 ఏళ్ల క్రితం కెనడా వెళ్లి ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్‌గా కెరీర్ ప్రారంభించారు. చిన్న పరిశ్రమలకు నిధులు సమకూర్చే ఆర్థిక సంస్థలో పని చేశారు. తయారీ సంస్థను నిర్వహిస్తూనే పలు దేశాల్లో పారిశ్రామికీకరణను ప్రోత్సహించారు. పారిశ్రామికవేత్తగా ఎదిగారు. హైటెక్ డిఫెన్స్ టెక్నాలజీ కంపెనీలో ఆరేళ్లు పనిచేశారు. 2015లో రాజకీయాల్లోకి వచ్చారు. 2015, 2019ల్లో కెనడా హౌస్ ఆఫ్ కామన్స్ ఎన్నికల్లో వరుసగా గెలిచారు. 2022లో సభలో కన్నడలో ప్రసంగించారు.

మార్చి 9న కొత్త ప్రధాని

కెనడా కొత్త ప్రధానిని, తమ నాయకుడిని మార్చి 9న ప్రకటిస్తామని అధికార లిబరల్ పార్టీ గురువారం వెల్లడించింది. ఇందుకోసం దేశవ్యాప్త ప్రక్రియ చేపట్టినట్టు తెలిపింది.

అలహాబాద్ హైకోర్టు నిర్ణయంతో అన్యాయం జరగదు

మథురలోని ఆలయం- మసీదు వివాదంపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: శ్రీ కృష్ణ జన్మభూమి- షాహి ఈద్గా మసీదు వివాదానికి సంబంధించి హిందూ పిటిషనర్లు వేసిన 15 పిటిషన్లపై ఒకేసారి విచారణ చేపట్టాలన్న అలహాబాద్ హైకోర్టు నిర్ణయం సహేతుకంగానే ఉందని, ఇరువర్గాల వారికీ న్యాయం జరుగుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మసీదు కమిటీ వేసిన పిటిషన్‌పై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. 1991నాటి ప్రార్థనాస్థలాల చట్టానికి సంబంధించిన కేసుల విచారణలో ఉన్నామని, ఈ దశలో ఈ అంశంలో జోక్యం చేసుకోలేమని తెలిపింది. అవసరమనిపిస్తే తర్వాత దీనిపై విచారణ చేపడతామని పేర్కొంది. అయితే, హైకోర్టులో దాఖలైన పిటిషన్లన్నీ ఒకే అంశానికి సంబంధించినవి కాకున్నా అన్నిటినీ కలిపి విచారించనుండటంతో తమకు అన్యాయం జరుగుతుందని మసీదు తరఫు లాయర్ వాదించారు. ఎలాంటి సంక్లిష్ట పరిస్థితులు తలెత్తేందుకు అవకాశం లేదని స్పష్టం చేసిన ధర్మాసనం.. ఏప్రిల్ మొదటి వారంలో ఈ పిటిషన్‌పై విచారణ చేపడతామని తెలిపింది. మసీదులు, దర్గాలు తదితర ప్రార్థనాస్థలాలకు సంబంధించిన పిటిషన్లపై ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వొద్దని అన్ని కోర్టులకు సుప్రీంకోర్టు డిసెంబర్ 12న ఆదేశాలివ్వడం తెలిసిందే. అదేవిధంగా, మందిరం-మసీదు వివాదంపై హిందూ పక్షం వేసిన 15 అప్పీళ్లపై ఒకే దఫాలో విచారణ చేపడతామని గతేడాది జనవరి 11వ తేదీన అలహాబాద్ హైకోర్టు ప్రకటించింది.

నూతన ఆవిష్కరణల కేంద్రం తెలంగాణ

గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: నూతన ఆవిష్కరణల ప్రపంచ కేంద్రంగా, అంకుర సంస్థల చిరునామాగా తెలంగాణ దూసుకుపోతోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్రంలో 6,000 అంకుర సంస్థలు ఏర్పాటయ్యాయని, చిన్న, మధ్య తరహా సాఫ్ట్‌వేర్ సంస్థలు 1,500 దాకా ఉన్నాయని తెలిపారు. శుక్రవారం నెదర్లాండ్స్‌కు చెందిన ఆరిక్ట్ సంస్థ రాయదుర్గంలో ఏర్పాటు చేసిన గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించిన సందర్భంగా మంత్రి ప్రసంగించారు. ఆరిక్ట్ నూతన కేంద్రంతో 300 మందికి కొత్తగా ఉద్యోగాలు లభిస్తాయని ఆయన అన్నారు. గడచిన రెండు దశాబ్దాల కాలంలో ఐటీ రంగం సాధించిన విప్లవాత్మక వృద్ధి వల్ల రాష్ట్ర జీడీపీ, తలసరి ఆదాయం జాతీయ సరాసరిని మించిపోయిందని పేర్కొన్నారు. ప్రఖ్యాత సంస్థలు గ్లోబల్ సామర్థ్య కేంద్రాలు (జీసీసీ) నెలకొల్పేందుకు ముందుకు వస్తున్నాయని, దీంతో యువతకు ఉపాధి అవకాశాలు బాగా మెరుగవుతున్నాయని మంత్రి వివరించారు. 'పరిశ్రమలకు నైపుణ్యమున్న మానవ వనరులు అవసరం. ప్రభుత్వం ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో నైపుణ్యమున్న మానవ వనరులకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ నిలవబోతుంది. హైదరాబాద్ అంటే టాలెంట్ సిటీ. టెక్ సిటీ. ఇన్నోవేషన్ సిటీ. స్టార్టప్స్‌కు కేరాఫ్ అడ్రస్. అన్ని రకాల పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, మానవ వనరులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి'అని శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆరిక్ట్ సీఈవో రూపేశ్‌కుమార్, రాష్ట్ర ఐటీ శాఖ సలహాదారు సాయికృష్ణ, తెలంగాణ ఐటీ వ్యూహకర్త శ్రీకాంత్ లంక పాల్గొన్నారు.

ప్రేమజంట ఆత్మహత్య

- పెళ్లికి పెద్దలు ఒప్పుకోవడం లేదనే...
- సంగారెడ్డి జిల్లా సింగూరు హరిత రిసార్ట్‌లో ఘటన


ఉదయ్ కుమార్


రోహిత

మునిపల్లి(అందోల్)/నారాయణఖేడ్: పెళ్లికి పెద్దలు అంగీకరించడం లేదంటూ ఓ ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన శుక్రవారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం సింగూరు ప్రాజెక్టు హరిత రిసార్ట్‌లో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం..నిజాంపేటకు చెందిన కరిపే ఉదయ్‌కుమార్ (21), మంగలి రోహిత(19) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమకు ఇరు కుటుంబాలకు చెందినవారు అంగీకరించలేదు.ఈ క్రమంలో గురువారం ఉదయ్, రోహితలు సింగూరు ప్రాజెక్టు సమీపంలోని హరిత రిసార్ట్‌లో ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. ఒకే ఫ్యాన్‌కు ఇద్దరూ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. అయితే ఈ ప్రేమజంట ఆత్మహత్య విషయం రిసార్ట్ నిర్వాహకులకు శుక్రవారం తెలిసింది. దీంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడ రాసి ఉంచిన సూసైడ్‌నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమ ప్రేమకు తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు అందులో పేర్కొన్నట్లు తెలిసింది. ఉదయ్‌కుమార్‌ది మిర్చి వ్యాపారం కాగా, రోహిత నారాయణఖేడ్‌లోని మోడల్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (బీజెడ్సీ) ఫైనలియర్ చదువుతోంది. గురువారం ఆమె క్లాసులకు హాజరు కాలేదు. శుక్రవారం ఉదయం రోహిత తండ్రి దుర్గేష్ కళాశాలకు ఫోన్ చేసి కూతురు ఆచూకీ గురించి ఆరా తీసినట్టు తెలిసింది. ఇంతలోనే ఈ విషాదం చోటుచేసుకుంది. కాగా ఉదయ్‌కుమార్ తండ్రి బాల్‌కిషన్ కొంతకాలం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. హరిత రిసార్ట్ మేనేజర్ సాంబశివరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ రాజేశ్‌నాయక్ తెలిపారు.

సంక్రాంతి రద్దీ నేపథ్యంలో 366 ప్రత్యేక రైలు ట్రిప్పులు

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి రద్దీ నేపథ్యంలో 366 ప్రత్యేక రైలు ట్రిప్పులను తిప్పుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. నర్సాపూర్, విశాఖ, శ్రీకాకుళం, కాకినాడ, తిరుపతి, మచిలీపట్నం, విజయవాడ, నెల్లూరు, రాజమండ్రి, వరంగల్, చెన్నై, బెంగళూరు, మదురై, షాలి మార్, సంబల్‌పూర్, బెర్హంపూర్, జైపూర్, గోర ఖ్‌పూర్, కటక్, మదురై, ఆర్సికెరి తదితర ప్రాంతాలకు ఎక్కువగా ఈ రైళ్లు తిరగను న్నాయి. చర్లప ల్లి కొత్త టెర్మినల్ నుంచి సంక్రాంతి సీజన్‌లో 59 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు అధికారులు తెలిపారు.




చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జాతీయ రహదారిపై బారులుతీరిన వాహనాలు

పండుగ ప్రయాణం షురూ..

చౌటుప్పల్/చౌటుప్పల్‌రూరల్: సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు తరలివెళ్లే ప్రయాణికుల వాహనాలతో శుక్రవారం హైదరాబాద్ –విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై రద్దీ ఏర్పడింది. చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులుదీరాయి. టోల్‌ప్లాజా నిర్వాహకులు విజయవాడ వైపు 10 విండోలను ఓపెన్ చేసి వాహనాలను పంపిస్తున్నారు. టోల్‌ప్లాజాకు 500 మీటర్ల దూరంలో వాహనాలను నిలపకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.



కేపీహెచ్‌బీ దగ్గర బస్సుల కోసం వేచిచూస్తున్న జనం



పండుగ ప్రయాణం
సురక్షితం చేద్దాం

జాతీయ రహదారులపై ముందు జాగ్రత్త చర్యలు

- హైదరాబాద్– విజయవాడ, హైదరాబాద్ – బెంగళూర్ హైవేలపై పెరిగిపోయిన రద్దీ
- గ్రామాలు, పట్టణాలున్న చోట, డివైడర్ లేని చోట మరింత అప్రమత్తత
- బ్లాక్ స్పాట్స్ దగ్గర సైన్ బోర్డులు ఏర్పాటు చేయడానికి అధికారుల చర్యలు
- రాత్రివేళ జాగ్రత్తగా లేకపోతే ప్రమాదం జరిగే అవకాశం

కోదాడ/ సూర్యాపేట టౌన్/ చౌటుప్పల్ రూరల్/పాలమూరు:

జాతీయ రహదారులపై వాహనాలు వేగంగా దూసుకెళ్తుంటాయి. సాధారణ రోజుల్లోనే తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. అలాంటిది సంక్రాంతి పండుగ కోసం లక్షలాది మంది హైదరాబాద్ నుంచి సొంతూర్లకు వెళుతుంటే.. వాహనాల రద్దీ ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ క్రమంలో అప్రమత్తంగా లేకున్నా, ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలోనే హైదరాబాద్ నుంచి ఇటు విజయవాడ వెళ్లే హైవేపై, అటు బెంగళూరు రూట్‌లో జాతీయ రహదారుల సంస్థ అధికారులు, పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్న (బ్లైండ్ స్పాట్) ప్రాంతాల్లో సూచికల బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ప్రతి 20 కిలోమీటర్లకు ఒక అంబులెన్సును, ప్రమాదాలు జరిగితే వాహనాలను పక్కకు జరిపేందుకు క్రేన్లను, సరిపడా సిబ్బందిని అందుబాటులో పెట్టారు. వాహనదారులు కూడా ఆయా మార్గాల్లో పరిస్థితిని తెలుసుకుని, జాగ్రత్తగా ప్రయాణిస్తే... పండుగ ప్రయాణం సురక్షితం అవుతుంది. ఈ క్రమంలో అవగాహన కోసం 'సాక్షి'క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. దీనిపై ప్రత్యేక కథనం..



ప్రమాదకరంగా ఉన్న ధర్మోజిగూడెం క్రాస్‌రోడ్డు



సూర్యాపేట పట్టణంలోని జనగామ క్రాస్ రోడ్డులో కొనసాగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులు





తెలంగాణ- ఏపీ సరిహద్దులో పాలేరు వంతెన వద్ద ట్రాఫిక్ మళ్లింపు

విజయవాడ రూట్‌లో..

హైదరాబాద్ – విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని దండు మల్కాపురం నుంచి తెలంగాణ-ఏపీ సరిహద్దుగా ఉన్న రామాపురం క్రాస్‌రోడ్డు వరకు 181 కిలోమీటర్ల పరిధిలో అనేక చోట్ల బ్లాక్ స్పాట్స్ ఉన్నాయి. పలుచోట్ల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. దీనితో జాగ్రత్తగా ప్రయాణించాల్సి ఉంటుంది.

- దండు మల్కాపురం, ఖైతాపురం, ధర్మాజీగూడెం, పంతంగి, పిట్టంపల్లి, గోపలాయిపల్లి, ఏపీ లింగోటం, కట్టంగూర్, పద్మానగర్‌జంక్షన్, ఇనుపాముల, కొర్లపహాడ్, టేకుమట్ల, చీకటిగూడెం, సూర్యాపేట పట్టణ శివారులోని జనగామ క్రాస్‌రోడ్డు, మునగాల, ముకుందాపురం, ఆకుపాముల బైపాస్, కొమరబండ వై జంక్షన్, రామాపురం క్రాస్‌రోడ్డు, నవాబ్‌పేట ప్రాంతాలను ప్రధాన బ్లాక్‌స్పాట్‌లుగా అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు.
- సూర్యాపేట సమీపంలో ఫ్లైఓవర్ నిర్మిస్తున్నందున సర్వీస్‌రోడ్డులో ట్రాఫిక్ డైవర్షన్ చేస్తున్నారు.
- జమ్మిగడ్డ, నేలమర్రి క్రాస్‌రోడ్, ముకుందాపురం, ఆకుపాముల, కొమరబండ వై జంక్షన్, కట్టకమ్ముగూడెం క్రాస్‌రోడ్డు, దుర్గాపురం క్రాస్‌రోడ్ వద్ద బ్లాక్‌స్పాట్‌ల విస్తరణ, అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.
- తెలంగాణ– ఏపీ సరిహద్దులో ఉన్న పాలేరు నదిపై ఉన్న రెండు వంతెనలలో ఒక వంతెన అప్రోచ్‌రోడ్డు ఇటీవలి వరదలకు కొట్టుకుపోయింది. దీని మరమ్మతు పనులు జరుగుతున్నాయి.



రద్దీ ఎక్కువగా ఉండే రాజాపూర్ జంక్షన్



దివిటిపల్లి దగ్గర బ్రిడ్జి పనులు జరుగుతున్న క్రమంలో వన్‌వే వైపు వాహనాలను దారి మళ్లిస్తున్న దృశ్యం



జానంపేట వద్ద ప్రమాదకరమైన మలుపు



నిత్యం రద్దీగా ఉండే ఎర్రవల్లి సర్కిల్



మానవపాడు స్టేజీ వద్ద ప్రమాదకరంగా రోడ్డు క్రాసింగ్

బెంగళూరు రూట్‌లో..

హైదరాబాద్ నుంచి రాయలసీమ జిల్లాలకు వెళ్లేవారు హైదరాబాద్–బెంగళూర్ 44వ నంబర్ జాతీయ రహదారిపై ప్రయాణిస్తారు. దీనిని నాలుగు లేన్లుగా విస్తరించినా వాహనాల రద్దీ బాగా పెరగడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనితో ఆరు లేన్లుగా విస్తరిస్తున్నారు. దీనికి సంబంధించి పలుచోట్ల పనులు జరుగుతున్నాయి. ఈ మార్గంలో 21 బ్లాక్ స్పాట్లు ఉన్నట్టు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో సైన్ బోర్డులు, వేగ నియంత్రణ చర్యలు చేపట్టారు.

- మహబూబ్‌నగర్ మండలంలోని దివిటిపల్లి దగ్గర రైల్వే డబుల్ ట్రాక్ పనులు జరుగుతుండటం, కొత్త బ్రిడ్జి నిర్మిస్తుండటంతో జాతీయ రహదారిపై ఒకేవైపు రాకపోకలు సాగుతున్నాయి. పాత బ్రిడ్జి మధ్యనే బారికేడ్లు పెట్టి... రాకపోకలను కొనసాగిస్తున్నారు. ఇక బాలానగర్ చౌరస్తాలో బ్రిడ్జి నిర్మిస్తుండటంతో.. సర్వీస్ రోడ్ మార్గంలోకి దారి మళ్లిస్తున్నారు. వాహనాల వేగం కట్టడి కోసం రాజాపూర్ చౌరస్తా, పెద్దాయిపల్లి దగ్గర స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రిస్తాం

పండుగ ట్రాఫిక్ నేపథ్యంలో వాహనదారులు జాగ్రత్తగా ఉండాలి. అధిక వేగం వద్దు. రోడ్డు పక్కన వాహనాలు నిలపవద్దు. విస్తరణ, మరమ్మతు పనులు జరుగుతున్న చోట్ల.. డైవర్షన్లు ఏర్పాటు చేసి గమనిక బోర్డులు పెట్టాం. వాటిని పాటించాలి. జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాల రైతులు, ప్రజలు పొలాలకు, పనులకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. పోలీసు సిబ్బందితో రోడ్లపై 24 గంటలూ గస్తీ నిర్వహిస్తున్నాం.

– సన్‌ప్రీత్‌సింగ్, సూర్యాపేట జిల్లా ఎస్పీ

పొగమంచుతో పొంచి ఉన్న ప్రమాదం



చలికాలం కావడంతో ఉదయం 9 గంటల వరకు పొగ మంచు ఉంటుంది. తెల్లవారుజామునే ప్రయాణించే వారికి ఇబ్బంది మరింత ఎక్కువ. రహదారి సరిగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. వీలైనంత వరకు ఉదయం 8–9 గంటల తర్వాత బయలుదేరి సాయంత్రానికల్లా గమ్యాన్ని చేరుకునేలా ప్లాన్ చేసుకోవాలి. ఫాగ్ లైట్లు ఏర్పాటు చేసుకుంటే కొంత మేర ఇబ్బంది తప్పుతుంది.

ఎట్టి పరిస్థితుల్లో రోడ్డు మీద వాహనాలు నిలపొద్దు

పండుగ వేళ వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. టాయిలెట్ కోసమో, కాసేపు సేదతీరడానికో, ఇంటి నుంచి తెచ్చుకున్న ఆహారం తినడానికో చాలా మంది మధ్యలో ఆగుతుంటారు. ఈ క్రమంలో రోడ్డు పక్కనే, కొన్నిసార్లు కాస్త రోడ్డుపై ఉండేలా వాహనాలను ఆపుతుంటారు. ఇది అత్యంత ప్రమాదకరం. జాతీయ రహదారిపై బస్ బే, లారీ బే ఉంటాయి. అక్కడ వాహనాలను నిలపాలి. లేదా రోడ్డుకు కాస్త లోపలగా ఉన్న చోటు చూసుకుని ఆపడం మంచిది.

ఫాస్టాగ్ 'సరిచూసుకోండి

పండుగల వేళ టోల్ ప్లాజాల వద్ద రద్దీ తీవ్రంగా ఉంటుంది. అందువల్ల తమ వాహనాలకు ఉన్న ఫాస్టాగ్ వేలిడిటీ, బ్యాలెన్స్ సరిచూసుకోవాలి. లేకుంటే ఇబ్బందిగా మారుతుంది. ముందుగానే వీలైనంత బ్యాలెన్స్ వేసుకోవడం, వేలిడిటీ అయిపోతే.. మళ్లీ యాక్టివ్ చేయించుకోవడం మంచిది.

అత్యవసరమైతే టోల్ ఫ్రీ '1033'నంబర్‌కు ఫోన్ చేయండి

జాతీయ రహదారిపై అత్యవసర పరిస్థితుల్లో (వైద్యం, ప్రమాద) సాయం కోసం వాహనదారులు 1033 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు. ఇది టోల్‌ఫ్రీ, 24 గంటలు అందుబాటులో ఉంటుంది. 100 నంబర్‌కు డయల్ చేసి సమాచారం ఇచ్చినా కూడా పోలీసుల నుంచి సాయం అందుతుంది.

20 కిలోమీటర్లకో అంబులెన్స్

సంక్రాంతి పండుగ రద్దీని నియంత్రించేందుకు టోల్‌ప్లాజాల నిర్వాహకులు పోలీస్, రెవెన్యూశాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. జాతీయ రహదారుల పరిధిలో ప్రతి 30 కిలోమీటర్లకు ఒక క్రేన్, ప్రతి 20 కిలోమీటర్లకు ఒక అంబులెన్స్‌ను ముందు జాగ్రత్తగా సిద్ధంగా ఉంచారు. టోల్‌ప్లాజాల వద్ద అదనపు సిబ్బందిని మోహరించారు. ఒక్కోచోట 10–20 మంది పోలీసులను కూడా సిద్ధంగా ఉంచారు.

మూడంచెల స్పీడ్‌బ్రేకర్లు



జంక్షన్ల వద్ద ప్రమాదాల నివారణ కోసం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు మూడంచెల స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. జంక్షన్ రావటానికి మూడు వందల మీటర్ల దూరంలో కొంత ఎత్తులో మొదటి.. రెండు వందల మీటర్ల దూరంలో మరింత ఎక్కువ ఎత్తుతో రెండోది.. జంక్షన్‌కు ముందు రెండు అంగుళాల ఎత్తులో మూడో దఫా స్పీడ్ బ్రేకర్లు సిద్ధం చేశారు. దీంతో జంక్షన్ల వద్ద వాహనాల వేగం తగ్గి ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

ఎస్సారెస్పీ చివరి భూములకు నీళ్లివ్వండి

అధికారులకు సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) పరిధిలోని చివరి భూములకు రబీ పంటకు అవసరమైన స్థాయిలో నీళ్లు అందించాలని రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జలసౌధలో ఎస్సారెస్పీ నీటి సరఫరాపై సమీక్ష నిర్వహించిన ఆయన ఈ ప్రాజెక్టు పరిధిలోని మొత్తం 9.68 లక్షల ఎకరాలకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీరందించాలని, డిసెంబర్ 25న విడుదల చేసిన నీటిని ఏప్రిల్ 8 వరకు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ఈఎన్సీలు అనిల్‌కుమార్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, హరేరాం, చీఫ్ ఇంజనీర్లు కె. శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

నీటిపారుదల శాఖలో పనిచేసే ఇంజనీర్లు విధి నిర్వహణలో అలసత్వం చూపకూడదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్‌కు ఉన్న ఘన చరిత్రను, వారసత్వాన్ని నేటి తరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ రూపొందించిన 2025 డైరీని శుక్రవారం జలసౌధలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్యాల సాధనలో ఇంజనీర్లు ముందుండాలన్నారు. నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చేయూతనందిస్తానని ఉత్తమ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీలు అనిల్‌కుమార్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపోలు రవీందర్, ప్రధాన కార్యదర్శి చక్రధర్, గౌరవాధ్యక్షుడు ధర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 168 కోట్లతో 'చేనేత అభయహస్తం'

- నేతన్న పొదుపు, భద్రత, భరోసా పథకాలు దీని పరిధిలోకి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం.. మంత్రి తుమ్మల వెల్లడి



సాక్షి, హైదరాబాద్: చేనేత, మరమగ్గాల కార్మిక సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి ఉద్దేశించిన చేనేత అభయ హస్తం పథకానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారు. ఈ పథకానికి రూ. 168 కోట్లు విడుదల చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. తెలంగాణ నేతన్న పొదుపు (పొదుపు నిధి), తెలంగాణ నేతన్న భద్రత (నేతన్న బీమా), తెలంగాణ నేతన్నకు భరోసా పథకాలను చేనేత అభయహస్తం పథకం పరిధిలోకి తెచ్చి అమలు చేస్తామని చెప్పారు. నేతన్న పొదుపు కోసం బడ్జెట్లో రూ. 115 కోట్లు, నేతన్న భద్రత కోసం రూ. 9 కోట్లు, నేతన్న భరోసా పథకానికి రూ. 44 కోట్ల మేర కేటాయింపులు ఉన్నట్లు తుమ్మల వివరించారు.

38 వేల మంది చేనేత కార్మికులకు లబ్ధి..

తెలంగాణ నేతన్న పొదుపు (పొదుపు నిధి) ద్వారా కార్మికులు తమ వాటా 8 శాతం పొదుపు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం 16 శాతం జమ చేస్తుందన్నారు. దీనిద్వా రా దాదాపు 38 వేల మంది చేనేత కార్మికులు లబ్ధి పొందే అవకాశం ఉందని ఆయన చెప్పారు. అలాగే 15 వేల మంది పవర్‌లూమ్ కార్మికులు 8 శాతం పొదుపు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం మరో 8 శాతం వాటా జమ చేస్తుందని.. తెలంగాణ నేతన్న భద్రత (నేత న్న బీమా) ద్వారా చేనేత, పవర్‌లూమ్ కార్మికులు, అనుబంధ కార్మికులందరికీ జీవిత బీమా అందుతుందని వివరించారు. ఈ పథకంలో నమోదైన కార్మికులు ఒకవేళ మరణిస్తే నామినీకి రూ. 5 లక్షల బీమా అందుతుందన్నారు. తెలంగాణ నేతన్నకు భరోసా కింద కార్మికులు తయారు చేసిన వస్త్ర ఉత్పత్తులను ప్రోత్సహించి వేతన మద్దతు అందించేలా, పని ఆధారంగా ప్రతి చేనేత కార్మికుడికి ఏటా రూ. 18 వేలు, అనుబంధ కార్మికుడికి రూ. 6 వేల వరకు మంజూరు చేయనున్నట్లు చెప్పారు.

గత ప్రభుత్వ బకాయిలు సైతం విడుదల..

ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే చేనేత రంగానికి రూ. 874 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. అందులో గత ప్రభుత్వం బకాయి పెట్టినవే రూ. 465 కోట్లు ఉన్నాయన్నారు. చేనేత కార్మికుల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో రూ. 50 కోట్ల కార్పస్ ఫండ్‌తో నూలు డిపో ఏర్పాటు చేశామని.. నేతన్నకు చేయూత కింద చేనేత కార్మికులకు రూ. 290.09 కోట్లు విడుదల చేశామన్నారు.

రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలు పెట్టాలి

బీసీ మేధావుల సమాలోచన సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య. చిత్రంలో వకుళాభరణం, జాజుల, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు.....

ఖైరతాబాద్ (హైదరాబాద్): బీసీ రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహి స్తామంటే చూస్తూ ఊరుకోమని బీసీ సంఘాల నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తమిళనాడు తరహాలోనే తెలంగాణలో కూడా బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతే గ్రామ పంచాయితీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని అఖిలపక్ష నేతలు, బీసీ మేధావులు, బీసీ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం విశ్వేశ్వ రయ్య భవన్‌లో అఖిల భారత బీసీ ఫెడరేషన్, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణలో సమగ్ర కులగణన, జనాభా దామాష ప్రకారం బీసీ రిజర్వేషన్ల పెంపుపై బీసీ మేధావుల సమాలోచన సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివా స్‌గౌడ్ ఆధ్వ ర్యంలో జరిగిన ఈ సమావేశంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వంగాల ఈశ్వరయ్య, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరు శ్రీనివాస్, బీసీ మేధావుల ఫోరం కన్వీనర్ ప్రొఫె సర్ మురళీ మనోహర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ప్రభాకర్, బీఎస్ రాములు తదితరులు పాల్గొన్నా రు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ల పెంపు సాధ్యమే అని పేర్కొన్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నో పోరా టల ఫలితంగా మొదలైన కులగణన సంపూర్ణం కాలేదని, రాష్ట్రంలో సంపూర్ణ కులగణన జరగాలంటే మరో వారం రోజులు ప్రత్యేకంగా గణనను నిర్వహించాలని డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై రూట్ మ్యాప్‌ను ప్రకటించాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఇంకా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బూర నర్స య్య గౌడ్, తాడూరు శ్రీనివాస్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం చేసి కేంద్రానికి పంపిస్తే బీజేపీ రాష్ట్ర శాఖ తరపున కూడా బీసీ రిజ ర్వేషన్లు పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవి స్తామన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై జస్టిస్ ఈశ్వరయ్య రూపొందించిన ముసాయిదా చట్టాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలని, జాతీయ జనగణనలో బీసీ కులగణనను చేర్చాలని సమావేశంలో తీర్మానించారు.


సాక్షి హైదరాబాద్

శనివారం । 11 । జనవరి । 2025



ఎఫ్‌టీఎల్ వివాదానికి శాశ్వత పరిష్కారం

దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ విషయంలో వివాదాలు లేకుండా పరిష్కారం చూపిస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. -10లో



చారిత్రక వీక్షణం'

సాంస్కృతిక, వారసత్వ చరిత్ర కలిగిన నగరానికి ఘడి చౌక్‌గానూ పేరుంది. అప్పటి సంస్కృతిని సూచించేలా ఐకానిక్ ల్యాండ్ మార్కులు దర్శనమిస్తాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
28.0/17.0

నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పూట పొగమంచు అలుముకుంటుంది. గరిష్ఠంగా 28, కనిష్ఠంగా 17 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



చార్మినార్ సమీపంలోని బాలాజీ మందిరం వద్ద శ్రీనివాసుడి వేషధారణలో ఓ భక్తుడి తన్మయత్వం



సికింద్రాబాద్ నామాలగుండు సమీపంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

వైకుంఠ వైభవం!

ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. భక్తిభావం ఉప్పొంగింది. నగరంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. వైష్ణవాలయాలకు భక్తులు భారీగా పోటెత్తారు. ప్రధానంగా జియాగూడ రంగనాథ స్వామి ఆలయం, హిమాయత్ నగర్ టీటీడీ శ్రీ వేంకటేశ్వర ఆలయం, చార్మినార్ చౌక్ మైదాన్ ఖాన్‌లోని బాలాజీ మందిరం తదితర దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు.



హిమాయత్ నగర్‌లోని టీటీడీ దేవాలయం వద్ద బారులు తీరిన భక్తులు

నెక్నాంపూర్‌లో లేక్‌వ్యూ విల్లాలు నేలమట్టం



మణికొండ: చెరువు బఫర్‌జోన్, ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)లో నిర్మించిన నాలుగు విల్లాలను హైడ్రా నేలమట్టం చేసింది. మున్సిపాలిటీ, ఇరిగేషన్ శాఖలు నోటీసులు ఇచ్చినా, గతంలోనే పలుమార్లు కూల్చినా తిరిగి నిర్మాణం చేపట్టడంతో హైడ్రా చర్యలు తీసుకుంది. మణికొండ మున్సిపాలిటీ నెక్నాంపూర్ సర్వే నంబర్ 53, 54లలో గతంలో గ్రామ పంచాయతీ అనుమతులతో లేక్‌వ్యూ విల్లాలు నిర్మించారు. వీటిలో కొన్నింటి నిర్మాణాలు పూర్తి కావడంతో జనాలు నివసిస్తున్నారు. మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. గతంలోనే బఫర్, ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని మున్సిపాలిటీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పలు విల్లాలను కూల్చివేశారు. వాటి స్థలంలోనే ఆరు విల్లాలను తిరిగి నిర్మాణం చేస్తున్నారు. దాంతో పలు మార్లు ఇరిగేషన్, మున్సిపాలిటీ వారు నోటీసులు జారీ చేశారు. అయినా పట్టించుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. రెండు వారాల క్రితం నెక్నాంపూర్ చెరువును పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరాలను తెప్పించుకుని వాటిని కూల్చివేయాలని ఆదేశించారు. రంగనాథ్ ఆదేశాలతో నెక్నాంపూర్ పెద్ద చెరువు బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్‌లలో నిర్మించిన విల్లాలను శుక్రవారం ఉదయం నుంచే హైడ్రా అధికారులు కూల్చివేతలు మొదలు పెట్టారు. మరో రెండు విల్లాల్లో నివాసితులు ఉండటం, వాటిపై కోర్టు ఉత్తర్వులు ఉండటంతో వదిలేశారు. కూల్చివేతల ప్రక్రియలో డిప్యూటీ తహసీల్దార్ ప్రియాంక, మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులు సకాలంలో ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలి

సాక్షి, సిటీబ్యూరో: సంక్రాంతి సందర్భంగా నెలకొన్న రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులు సకాలంలో ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశీయ ప్రయాణికులు తమ ప్రయాణ సమయానికి కనీసం 2 గంటలు, అంతర్జాతీయ ప్రయాణికులు 3 గంటల ముందే ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలని సూచించారు. ప్రయాణానికి అవసరమైన డాక్యుమెంట్‌లను జాగ్రత్తపర్చుకోవాలని, తనిఖీల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా డీజీ యాత్రం సేవలను వినియోగించుకోవాలని కోరారు. సంక్రాంతి దృష్ట్యా మరింత రద్దీ పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే చెరువుల పరిరక్షణ

హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

మణికొండ: చెరువుల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. శుక్రవారం నార్సింగి మున్సిపాలిటీలోని కోకాపేట కొత్త చెరువును ఫ్రీడం వంట నూనెల సంస్థ (జీఈఎఫ్ ఇండియా) దత్తత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న 3,268 చెరువుల్లో 700 చెరువుల అభివృద్ధికి నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. మరో 300 చెరువులకు త్వరలోనే ఇస్తామన్నారు. నగర శివారులోని 26 చెరువులను పలు సంస్థలకు దత్తత ఇచ్చి వారి సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కోకాపేట కొత్త చెరువు వద్ద వాకింగ్ ట్రాక్, పచ్చదనం, పిల్లలు ఆడుకునే వస్తువులు, కూర్చుని సేద తీరేందుకు పార్కులను ఫ్రీడం ఆయిల్ సంస్థ అభివృద్ధి చేస్తోందని ఆయన తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ చిన్నచెరువును దత్తత తీసుకుని అభివృద్ధి చేసిన ధృవాన్ష్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పనులు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో జెమినీ ఎడిబుల్స్, ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ (ఫ్రీడం ఆయిల్) సంస్థ వైస్ ప్రెసిడెంట్ అక్షయ్ చౌదరి, హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ కోట శ్రీవత్స, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి, టీఎస్ఐజీ డైరెక్టర్ అర్చన సురేష్, జీఈఎఫ్ డైరెక్టర్ జి.ప్రతాప్, ధృవాన్ష్ ఆర్గనైజేషన్ ప్రతినిధి మధులికా చౌదరి, కౌన్సిలర్‌లు దుర్గేష్ యాదవ్, శివారెడ్డిలు పాల్గొన్నారు.



కోకాపేట కొత్త చెరువు అభివృద్ధి నమూనాను ఆవిష్కరించిన హెచ్‌ఎండీఏ కమిషనర్ తదితరులు

ఝులక్ జర్నీ!

ప్రత్యేక రైళ్లతో ప్రయాణికులకు చుక్కలే

- వివిధ మార్గాల్లో గంటల తరబడి ఆలస్యం
- పట్టాలపైనే రైళ్లు.. పడిగాపుల్లో ప్రయాణికులు
- సంక్రాంతికి అరకొరగా ప్రత్యేక రైళ్లు
- ప్రైవేట్ బస్సుల్లో దారి దోపిడీ
- ఆర్టీసీ 50 శాతం అదనపు వసూళ్లు



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో..

సాక్షి, సిటీబ్యూరో: సంక్రాంతి రద్దీ మొదలైంది. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో నగర వాసులు సొంత ఊళ్లకు తరలివెళ్తున్నారు. నగరం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే అన్ని రెగ్యులర్ రైళ్లలో రిజర్వేషన్‌లు పూర్తిగా నిలిచిపోయి రిగ్రేట్ దశకు చేరాయి. కొత్తగా అందుబాటులోకి వచ్చిన చర్లపల్లి టెర్మినల్ నుంచి కాకినాడ, తిరుపతి, విశాఖ, విజయవాడ తదితర ప్రాంతాలకు కొన్ని ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. లక్షలాది మంది నగరవాసులు సొంత ఊళ్లకు తరలి వెళ్తుండగా.. అరకొరగా ఏర్పాటు చేసిన ప్రత్యేక రైళ్లు ఏ మాత్రం ప్రయాణికుల డిమాండ్‌లను భర్తీ చేయడం లేదు. మరోవైపు అన్ని ప్రత్యేక రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తూ ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు అతికష్టంగా బెర్తులు సంపాదించి రైలెక్కినా గంటల తరబడి పట్టాలపైనే పడిగాపులు కాయాల్సి వస్తోంది. సికింద్రాబాద్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరితే మరుసటి రోజు మధ్యాహ్నం 12 దాటినా విశాఖకు చేరుకోలేకపోయామని కూకట్‌పల్లికి చెందిన కృష్ణారావు విస్మయం వ్యక్తం చేశారు. మరోవైపు నాంపల్లి, కాచిగూడ స్టేషన్‌ల నుంచి శబరిమలకు నడిచే రైళ్లు కూడా అయ్యప్ప భక్తులకు నరకం చూపుతున్నాయి. రెండు రోజులు గడిచినా హైదరాబాద్ నుంచి శబరిమలకు, తిరిగి అక్కడి నుంచి ఇక్కడికి చేరుకోలేకపోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చార్జీలు కూడా 'ప్రత్యేకమే'..

- నగరం నుంచి ప్రతి రోజు సుమారు వందకు పైగా రెగ్యులర్ రైళ్లు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తాయి. సుమారు 2.5 లక్షల మంది ప్రయాణం చేస్తారు. ప్రస్తుతం రోజుకు మరో 50 వేల మంది అదనంగా బయలుదేరే అవకాశం ఉంది. ఈ డిమాండ్ మేరకు అదనపు రైళ్లు లేవు. కొన్ని రైళ్లలో బెర్తులు, అదనపు బోగీలు ఏర్పాటు చేశారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు మాత్రం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. కానీ ఈ రైళ్లలో చార్జీలు కూడా ఎక్కువే. సాధారణ చార్జీలపై 25 శాతం వరకు అదనపు చార్జీలు విధిస్తారు. అయినప్పటికీ మరో గత్యంతరం లేక ప్రత్యేక రైళ్లను ఆశ్రయించే ప్రయాణికులకు రైళ్లలో పడిగాపులు తప్పడం లేదు.
- ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పట్టాలపై రైళ్ల ఒత్తిడి పెరిగిందని, దీంతో సకాలంలో సిగ్నల్స్ లభించకపోవడం వల్ల జాప్యం చోటుచేసుకుంటోందని అధికారులు చెబుతున్నారు. కానీ ఈ ఆలస్యం ప్రయాణికుల పండగ సంతోషాన్ని ఆవిరి చేస్తోంది. కనిష్ఠంగా 3 నుంచి గరిష్ఠంగా 12 గంటల వరకు కొన్ని రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. గతంలో ఇలాంటి ఫిర్యాదులు పెద్ద ఎత్తున వెల్లువెత్తినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. సంక్రాంతి సందర్భంగా బయలుదేరిన ప్రయాణికులు భోగి పండగ రోజు కూడా సొంత ఊళ్లకు చేరుకోలేకపోయారు. ప్రస్తుతం మరోసారి అదే పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు.

ప్రైవేట్ బస్సుల దోపిడీ..

సంక్రాంతి రద్దీని సొమ్ము చేసుకొనేందుకు ప్రైవేట్ ట్రావెల్స్ అడ్డగోలుగా దారి దోపిడీకి పాల్పడుతున్నాయి. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి విశాఖకు లగ్జరీ రూ.1800 వరకు ఉంటుంది. ఇప్పుడు ఆ చార్జీ రూ.3000 వరకు చేరింది. అలాగే ఏసీ బస్సుల్లో రూ.2500 నుంచి ఏకంగా రూ.5000 వరకు పెరిగినట్లు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటిల్లిపాదీ కలిసి వెళితే చార్జీల కోసమే రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోందని ఏఎస్‌రావు నగర్‌కు చెందిన మల్లికార్జున్‌రావు చెప్పారు. అలాగే.. హైదరాబాద్ నుంచి కాకినాడ, విజయవాడ, తిరుపతి తదితర ప్రాంతాలకు సైతం ప్రైవేట్ బస్సుల దోపిడీ విమాన చార్జీలను తలపిస్తోంది.

ఆర్టీసీ సైతం అదే బాటలో..

ఆర్టీసీ సైతం ప్రత్యేక బస్సుల పేరిట 50 శాతం అదనపు దోపిడీకి దిగింది. ఏపీతో పాటు, తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో కూడా 25 శాతం నుంచి 50 శాతం వరకు అదనపు వసూళ్లకు పాల్పడుతోంది. చివరకు దివ్యాంగుల పాస్‌లను అనుమతించకుండా ఇష్టారాజ్యంగా చార్జీలు విధిస్తున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకొని సుమారు 6 వేలకు పైగా అదనపు బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. రెండు రోజులుగా ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఎల్‌బీనగర్, ఉప్పల్, హయత్‌నగర్, ఎంజీబీఎస్, జేబీఎస్ తదితర ప్రాంగణాలు ప్రయాణికులతో సందడిగా మారాయి.



కిక్కిరిసిన ఎంజీబీఎస్



భారీగా ప్రయాణికుల రద్దీ

గీజర్ సలసల.. మీటర్ గిరగిర!

చలిలోనూ హీటెక్కుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- ఉదయం 7.30 గంటల సమయంలో పీక్ డిమాండ్
- ప్రతిరోజూ గరిష్ఠంగా 60 ఎంయూల నమోదు

గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ ఇలా..

తేదీ	మెగావాట్లు	మిలియన్ యూనిట్లు
03	3,243	60.24
04	3,077	58.14
05	2,678	54.26
06	3,146	58.80
07	3,271	60.07
08	3,242	60.01
09	3,250	59.06



సాక్షి, సిటీబ్యూరో: ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలులకు మంచు తోడవుతోంది. చలికి సిటిజన్లు గజగజ వణికిపోతుంటే.. వీధి చివర్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రం హీటెక్కుతున్నాయి. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు, ఉద్యోగులకు కార్యాలయాలకు తయారయ్యే సమయం ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్యలో పీక్ డిమాండ్ నమోదవుతోంది. స్నానానికి వేడి నీళ్ల కోసం ప్రతి ఇంట్లో గీజర్ వినియోగం తప్పని సరిగా మారింది. గీజర్‌తో బకెట్‌లోని నీళ్లు సలసలా కాగుతుంటే.. విద్యుత్ మీటర్ గిరగిరా తిరుగుతోంది. సామర్థ్యానికి మించి విద్యుత్ డిమాండ్ నమోదవుతుండటంతో ఒత్తిడికి తట్టుకోలేక కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. రెండు రోజుల క్రితం మలక్‌పేటలోని ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇదే కారణంతో కాలిపోవడం గమనార్హం. సాధారణంగా ఏప్రిల్, మే నెలలో నమోదు కావాల్సిన రోజు సగటు గరిష్ఠ (60 మిలియన్ యూనిట్లు)డిమాండ్ సంక్రాంతికి ముందే నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే వచ్చే వేసవిలో సబ్‌స్టేషన్లు, ఫీడర్లపై మరింత ఒత్తిడి పెరిగే అవకాశం లేకపోలేదు. రోజు సగటు డిమాండ్ వంద మిలియన్ యూనిట్లకు చేరుకునే అవకాశం లేకపోలేదని డిస్కం అంచనా వేస్తోంది. ఆ మేరకు లైన్ల పునరుద్ధరణ పనులు చేపడుతోంది.

మేయర్.. ఫిబ్రవరి ఫియర్?

డిప్యూటీ మేయర్‌కు సైతం..

- బల్దియా పాలకమండలికి నాలుగేళ్లు
- పూర్తి కానున్న నేపథ్యంలో..
- వచ్చే నెల 10వ తేదీ తర్వాత అవిశ్వాసానికి అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: బీఆర్ఎస్ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి మేయర్‌గా ఎంపికైన గద్వాల్ విజయలక్ష్మిని.. అలాగే డిప్యూటీ మేయరైన శ్రీలతా శోభన్‌రెడ్డిని పదవుల నుంచి తప్పించేందుకు ఆ పార్టీ వ్యూహం పన్నుతోందా? అంటే కాదనలేని పరిస్థితి నెలకొంది. బల్దియాలో ప్రస్తుతం ఇది చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నుంచి పోటీ చేసి గెలిచిన విజయలక్ష్మి, శ్రీలతలకు అప్పటి ప్రభుత్వ ఆశీస్సులతో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు దక్కాయి. అప్పట్లో ఎంఐఎం బీఆర్ఎస్‌కు అండగా నిలిచింది. ఏడాది క్రితం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వీరిద్దరూ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. తమ పార్టీ వల్ల అధికారం దక్కించుకున్న వారు పార్టీపై విశ్వాసం చూపలేదనే తలంపుతో బీఆర్ఎస్ నాయకత్వం ఉంది. తమ పార్టీ వల్లే పదవులు పొందిన వారు, పార్టీ మారినా రాజీనామా చేయకుండా ఇంకా పదవుల్లో కొనసాగుతుండటాన్ని బీఆర్ఎస్ కార్పొరేటర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. మరోవైపు.. కాంగ్రెస్ కార్పొరేటర్లు సైతం కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న తమకు దక్కని యోగం.. వారికి దక్కడంపై అంతర్గతంగా జీర్ణించుకోలేక పోతున్నారు. పార్టీలోకి వారి రాకతో తమ ప్రాధాన్యం తగ్గిపోయిందనే తలంపులో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎంతో కాలంగా వారిని ఆ పదవుల నుంచి తప్పించాలనే యోచనలో పలువురు కార్పొరేటర్లున్నారు. జీహెచ్ఎంసీ యాక్ట్ మేరకు పదవీ బాధ్యతలు చేపట్టాక నాలుగేళ్ల వరకు వారిపై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం లేదు. జీహెచ్ఎంసీ పాలకమండలి ఎన్నికలు 2020 డిసెంబర్‌లో జరిగినప్పటికీ, మేయర్, డిప్యూటీ మేయర్‌లు 2021 ఫిబ్రవరి 11వ తేదీన బాధ్యతలు చేపట్టారు. వచ్చే ఫిబ్రవరి 10వ తేదీతో వారి నాలుగేళ్ల కాలం పూర్తవుతున్నందున, అది ముగియగానే అవిశ్వాసం పెట్టేందుకు కార్పొరేటర్లు యోచిస్తున్నట్లు తెలుస్తోంది.



అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే..

నిబంధనల మేరకు అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే మొత్తం కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుల్లో (స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు) సగం మంది నిర్ణీత ప్రొఫార్మాలో తీర్మానం చేసి సంతకాలు పెట్టి జిల్లా కలెక్టర్‌కు అందజేయాలి. జీహెచ్ఎంసీలో ప్రస్తుతం 146 మంది కార్పొరేటర్లు, 50 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు వెరసి.. మొత్తం 196 మంది ఉన్నారు. వీరిలో సగం అంటే 98 మంది సభ్యుల సంతకాలు అవసరం. బీఆర్ఎస్‌కు ప్రస్తుతం 42 మంది కార్పొరేటర్లు, 29 మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు వెరసి.. 71 మంది సభ్యుల బలం ఉంది. అవిశ్వాసం పెట్టాలంటే మరో 27 మంది సభ్యులు అవసరం. గతంలోవలే ఎంఐఎం పొత్తు ఉంటే సాధ్యమయ్యేదే కానీ ప్రస్తుతం అది కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండటం తెలిసిందే. ఎంఐఎం లేదా బీజేపీతో కలిస్తేనే అవిశ్వాసం పెట్టేందుకు వీలవుతుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎలాంటి వ్యూహం ఆచరించనుందన్నది ఆసక్తికరంగా మారింది. రాజకీయాల్లో ఎప్పుడేం జరుగుతుందో చెప్పలేమని, ఏ పార్టీ ఎవరికి మద్దతు ఇస్తుందో, ఎప్పుడు ఉపసంహరించుకుంటుందో చెప్పలేమంటున్నారు రాజకీయ పరిశీలకులు. ఏం జరిగేందుకైనా ఆస్కారం ఉందంటున్నారు. అందుకు రాజకీయాల్లో గతంలో జరిగిన కొన్ని సంఘటనల్ని వారు ఉదహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేయర్ కుర్చీకి గండం పొంచి ఉందని అంటున్నారు. డిప్యూటీ మేయర్‌కు సైతం అదే వర్తిస్తుందంటున్నారు.

పార్టీలు మారారు ఇలా..

- ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తొలుత రెండు సీట్లు మాత్రమే గెలిచినప్పటికీ, లింగోజిగూడ బీజేపీ కార్పొరేటర్ ఆకుల రమేశ్‌గౌడ్ మృతితో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిచి ముగ్గురయ్యారు. తర్వాత పరిణామాలతో బీజేపీ నుంచి ముగ్గురు, బీఆర్ఎస్ నుంచి 18 మంది చేరడంతో ఆ పార్టీ బలం 24కు పెరిగింది.
- ఎంఐఎం 44 స్థానాల్లో గెలవగా ఒకరు మరణించారు. ఇద్దరు రాజీనామాలు చేయడంతో ప్రస్తుతం 41 మంది ఉన్నారు.
- బీజేపీ 48 స్థానాల్లో గెలవగా ఆదిలోనే ఒకరు మరణించడంతో జరిగిన ఉప ఎన్నికలో ఓటమితో 47 మంది అయ్యారు. అనంతరం గుడిమల్కాపూర్ కార్పొరేటర్ మృతి చెందడం, కొందరు పార్టీలు మారడంతో ప్రస్తుత బలం 39గా ఉంది.
- బీఆర్ఎస్ వారు 56 సీట్లలో గెలిచారు. బీజేపీ నుంచి నలుగురు పార్టీలో చేరడంతో బలం 60కి పెరిగినప్పటికీ.. అనంతరం 18 మంది కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో ప్రస్తుతం 42 మంది ఉన్నారు.

జీహెచ్ఎంసీలో ప్రస్తుతం పార్టీల బలాబలాలు..

పార్టీ	కార్పొరేటర్లు	ఎక్స్ అఫీషియోలు
కాంగ్రెస్	24	5
బీఆర్ఎస్	42	29
బీజేపీ	39	6
ఎంఐఎం	41	10
మొత్తం	146	50

- పాలకమండలి మొత్తం కార్పొరేటర్లు 150 మంది కాగా, ఇద్దరు ఎమ్మెల్యేలుగా ఎన్నికవడంతో కార్పొరేటర్లుగా రాజీనామా చేశారు. మరో ఇద్దరు మరణించారు. దీంతో నాలుగు స్థానాలు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం 146 మంది సభ్యులున్నారు.

గోషామహల్‌లో మరోసారి కూలిన నాలా పైకప్పు

అబిడ్స్: గోషామహల్‌లో నాలా పైకప్పు మరోసారి కూలిపోయింది. మూడు నెలల క్రితం నాలా పైకప్పు కుప్పకూలడంతో ప్రస్తుతం పునర్ నిర్మాణ పనులు కొనసాగుతుండగా.. మళ్లీ కూలిపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నాలాపై స్లాబ్ వేసేందుకు రెడీ మిక్స్‌తో వచ్చిన లారీ అందులో పడిపోయింది. అఫ్జల్‌సాగర్.. గోషామహల్ చాక్నావాడీల మీదుగా ఎంజీబీఎస్ మూసీ వరకు నాలా కొనసాగుతోంది. రెండేళ్ల క్రితం దీని సమీపంలోనే గోషామహల్ నాలా పైకప్పు కుప్పకూలింది. దీంతో సెంట్రింగ్ పనులు పూర్తి చేసి స్లాబ్ వేసేందుకు చర్యలు చేపట్టారు. శుక్రవారం స్లాబ్ కోసం రెడీ మిక్స్ వాహనాన్ని రెండో వెంట్ నాలాపై నిలపడంతో భారం ఎక్కువై నాలా పైకప్పు కుప్పకూలింది. దీంతో రెడీ మిక్స్ వాహనం అందులో పడిపోయింది. విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ-14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.విద్యాధర్, ఏఎంఓహెచ్ వెంకటరమణ, ఏఈ మహేందర్, గోషామహల్ కార్పొరేటర్ లాల్ సింగ్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



నాలాలో పడిపోయిన రెడీ మిక్స్ వాహనం

వైభవంగా వేంకటేశ్వరుని పల్లకీ సేవ





చార్మినార్: చార్మినార్ చౌక్ మైదాన్ ఖాన్‌లోని బాలాజీ మందిరంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి పల్లకి సేవ, సామూహిక ఊరేగింపు భక్తి శ్రద్ధలతో కొనసాగింది. దేవాలయం నుంచి ప్రారంభమైన స్వామి వారి పల్లకి సేవ ఊరేగింపు చార్మినార్ కట్టడం, చార్‌కమాన్, గుల్జార్‌హౌజ్ తదితర ప్రాంతాల మీదుగా కొనసాగి తిరిగి దేవాలయానికి చేరుకుంది. దారి పొడవునా భక్తులు ఊరేగింపుకు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ 1961 నుంచి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శంగారం రమణాచార్యులు, అలంకార బ్రహ్మ ఆత్రేయాచార్యుల ఆధ్వర్యంలో ఈసారి వైకుంఠ ఏకాదశి మహోత్సవాలను 14వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ వైద్య శిబిరం

అంబర్‌పేట: విదేశీ వైద్యులతో ఉచిత మెగా ప్లాస్టిక్ సర్జరీ వైద్య శిబిరాన్ని ఈనెల 20 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాంకీ ఫౌండేషన్, పరవాస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రీన్‌ల్యాండ్ సంయుక్త ఆధ్వర్యంలో చేపడుతున్నామని ప్రతినిధులు మువ్వా రాంమిరెడ్డి, సందీప్‌హరి, విద్యాభూషణ్‌ను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత ప్లాస్టిక్ వైద్య శిబిరంలో గ్రహణం, మొర్రి, కాలిన శరీర గాయాలు, అతుక్కుపోయిన కాలు, చేతి వేళ్లు, పుట్టుకతో వచ్చిన రోమాలు, అంగుళికము వంటి వాటికి వైద్య పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని మల్లేపల్లి సీతారామ్‌బాగ్‌లోని లయన్స్‌క్లబ్ ఆస్పత్రి నిర్వహిస్తామని తెలిపారు. ఈ వైద్య శిబిరానికి అమెరికాకు చెందిన వైద్యులు భావాని ప్రసాద్, సుదర్శన్‌రెడ్డి తమ సిబ్బందితో వైద్య సేవలు అందిస్తారన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 16వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు 9908630301, 9848241640ల్లో సంప్రదించాలన్నారు.

ఎఫ్‌టీఎల్ వివాదానికి శాశ్వత పరిష్కారం

- నాలుగు నెలల్లో చర్యలు పూర్తి
- దుర్గంచెరువు పరిధి నివాసితులకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హామీ



దుర్గంచెరువు పరిధి నివాసితులతో మాట్లాడుతున్న రంగనాథ్

గచ్చిబౌలి: దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ విషయంలో వివాదాలకు ఆస్కారం లేకుండా నాలుగు నెలల్లో శాశ్వత పరిష్కారం చూపుతామని లేక్ ప్రొటెక్షన్ చైర్మన్, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి హెచ్ఎండీఏ ఇచ్చిన ప్రిలిమినరీ నోటిఫికేషన్‌పై పరిసర ప్రాంతాల నివాసితుల అభ్యంతరాలను హైకోర్టు ఆదేశాల మేరకు రంగనాథ్ శుక్రవారం హైడ్రా కార్యాలయంలో వారి వాదనలను రికార్డు చేశారు. ఈ సందర్భంగా 6 కాలనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని వారి వద్ద ఉన్న సమాచారాన్ని కమిషనర్‌కు అందించారు. తమ అభ్యంతరాలను వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో సంబంధిత ప్రభుత్వ శాఖలతోపాటు ఐఐటీ, బిట్స్‌పిలానీ, జేఎన్‌టీయూ వంటి విద్యాసంస్థల ఇంజనీర్లను కూడా దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో భాగస్వామ్యం చేస్తామన్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, సర్వే ఆఫ్ ఇండియా, సర్వే ఆఫ్ తెలంగాణ, రెవిన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ఇలా అన్ని శాఖలను ఇందులో భాగస్వామ్యం చేసి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. అందరి వాదనలు విని, శాస్త్రీయ పద్ధతులు పాటించి ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ధారిస్తామన్నారు. లేక్ మేమోయిస్, గ్రామ రికార్డులు, సర్వే నెంబర్ల ఆధారంగా ఎవరూ ప్రశ్నించడానికి వీలులేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వి.గోపాలకృష్ణ, ఊర్మిలాదేవి, ప్రియతమరెడ్డి, నళిని, జేవీ చౌదరి, రవీందర్‌రెడ్డి, భాషా మొహియుద్దీన్‌తో పాటు వంద మంది పాల్గొన్నారు.

వాదనలు వినిపించిన నివాసితులు

దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లకు సంబంధించి 25 ఏళ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపాలని నివాసితులు అభ్యర్థించారు. 25 ఏళ్ల కాలంలో లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఏనాడూ తమ వాదనలు ఇలా బహిరంగంగా వినలేదన్నారు. తమను హైడ్రా ప్రధాన కార్యాలయానికి పిలిపించి ఎఫ్‌టీఎల్ అంశంలో అభ్యంతరాలను విని పరిష్కార మార్గాలు కనుక్కొంటామని హామీ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. సామాజిక మాధ్యమాలు, కొన్ని మీడియా సంస్థలు తమను కబ్జాదారులుగా చూపెడుతున్నారని, ఇక్కడ ఖాళీగా ఉన్న స్థలాల్లో ఇళ్లు కట్టుకోలేకపోతున్నారని వారు గుర్తు చేశారు.

ఫార్ములా ఈ-రేస్ హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచింది

- ఓ యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలు
- కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారిన వైనం



బంజారాహిల్స్: ఫార్ములా ఈ-రేస్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచిందని, గతంలో చంద్రబాబునాయుడు గచ్చిబౌలిలో ఫార్ములా-1 రేస్‌ను తీసుకురావడానికి ప్రయత్నించినా అది సాధ్యపడలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. అసెంబ్లీలో తన వ్యాఖ్యలపై స్పందిస్తూ ఆవేశంలో నోరు జారినందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను వ్యక్తిగతంగా కలిసి క్షమాపణ చెప్పినట్లు తెలిపారు. దానం వ్యాఖ్యలు..పూర్తి ఇంటర్వ్యూ అంశాలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. ఈ వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. రెండు రోజుల క్రితం బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లోని తన నివాసంలో ఆయన యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఫార్ములా ఈ-రేస్‌లో ఎటువంటి అవినీతి జరగలేదని కేటీఆర్ సవాల్ విసురుతున్నారు, మీరు ఏమంటారు అని యాంకర్ ప్రశ్నించగా ఒక బ్రాండ్ ఇమేజ్‌ను ఫార్ములా ఈ-రేస్ పెంచిందని చెప్పడంలో ఎలాంటి అనుమానం లేదన్నారు. అంతర్జాతీయంగా హైదరాబాద్ ఖ్యాతి పెరిగిందన్నారు. హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచడానికి, అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించడానికి ఇది ఎంతగానో దోహదపడిందన్నారు. హైడ్రా విషయంలో తాను స్పందించిన మాట వాస్తవమేనని, ఇప్పటికీ దానికి కట్టుబడి ఉన్నానన్నారు. హైడ్రా విషయంలో ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చిందన్నారు. నందగిరిహిల్స్ గురుబ్రహ్మనగర్‌లో గోడ కడుతుంటే చూడడానికి వెళ్లడం జరిగిందని, అక్కడ ఉన్న ప్రజలు ఆవేశంతో కూల్చారని, అప్పుడు రంగనాథ్ తనపై ఎలాంటి కేసు పెట్టలేదని, ఇక్కడ ఉన్న వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ పెట్టారన్నారు.

ఈ డీసీపీ పనితీరు బాగాలేదని ధ్వజమెత్తారు. ఆయన వైఖరి వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందన్నారు. ఇక మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతారన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బయటకు వచ్చి ప్రజలను కలిసేవారని, అలా ఉండాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బోళా శంకరుడని, ఆయన గొప్ప నాయకుడన్నారు. ఆయన చుట్టూ ఉన్న కోటరీ వల్ల చెడ్డ పేరు వచ్చిందన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రైవేట్ ట్రావెల్స్‌కు రవాణా కమిషనర్ వార్నింగ్

సాక్షి, సిటీబ్యూరో: నిబంధనలకు విరుద్ధంగా నడిచే ప్రైవేట్ బస్సులపైన కఠిన చర్యలు తీసుకోనున్నట్లు రవాణా కమిషనర్ సురేంద్రమోహన్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అదనపు చార్జీలు వసూలు చేసినా, పర్మిట్ నిబంధనలు ఉల్లంఘించినా, సరుకు రవాణా చేసినా కేసులు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాంటి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ప్రైవేటు బస్సులపై 150 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రైవేటు బస్సు డ్రైవర్లు అనుభవం కలిగి ఉండాలని, ప్రయాణికుల జాబితాను నమోదు చేయాలని అన్నారు. ప్రతి బస్సులో ప్రయాణికుల వివరాలు అటెండర్ వద్ద తప్పనిసరిగా ఉండాలని సూచించారు. నిబంధనలు పాటించని కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులను జప్తు చేయనున్నట్లు హెచ్చరించారు.

మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల జాబితాను శుక్రవారం వెల్లడించింది. సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా పి.కవిత, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా శంభుల ఉషశ్రీ, రంగారెడ్డిజిల్లా అధ్యక్షురాలిగా పి.శ్రీజ్యోతి, మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలిగా రాజనాల లక్ష్మీలను ఎంపిక చేసినట్లు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం.సునీత ప్రకటించారు.

అకారణంగా వదిలేశాడు...న్యాయం చేయండి

భర్త ఇంటి ముందు భార్య మౌన దీక్ష



మౌన దీక్ష చేపట్టిన రమ్య

సుభాష్‌నగర్: కట్నం తీసుకొని పెళ్లి చేసుకున్నాడు..ఆపై బిడ్డను కన్నాడు..సన్నిహితంగా ఉంటూనే విడాకుల నోటీసు ఇచ్చాడు. ఇదేంటని అమ్మాయి తల్లిదండ్రులు, పెద్దమనుషుల సమక్షంలో ప్రశ్నిస్తే నిష్కారణంగా నాకు వద్దు అంటున్నాడు. దీంతో ఆ అమ్మాయి తనకు న్యాయం చేయాలని కోరుతూ భర్త ఇంటి ముందు మౌనదీక్షకు దిగింది. సూరారం పరిధిలోని లక్ష్మీనగర్‌లో చోటుచేసుకున్న ఈ సంఘటనపై పోలీసులు తెల్పిన వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన విశ్వనాథ్, అనంతలక్ష్మి దంపతుల కుమార్తె శ్రీరమ్యకు సూరారం లక్ష్మీ నగర్ ప్రాంతానికి చెందిన మైనం భాస్కరరావు, విజయలక్ష్మిల కుమారుడు శ్రీ తేజతో 2023లో వివాహం జరిగింది. మొదట్లో 3 నెలల పాటు కాపురం సజావుగా సాగింది. ఈ క్రమంలో గర్భందాల్చిన రమ్యను అబార్షన్ చేయించుకోవాలని శ్రీతేజ ఒత్తిడి తెచ్చాడు. దీంతో ఆమె అంగీకరించక పోవడంతో భార్యపైకి కోపం పెంచుకున్నాడు. ప్రసవం కోసం పుట్టింటికి వెళ్ళిన భార్యతో ప్రేమగా ఉంటూనే పథకం ప్రకారం విడాకులకు దరఖాస్తు చేశాడు. ప్రసవం తర్వాత పుట్టిన బాబును చూడడానికి రాలేదు సరికదా..విడాకుల నోటీసు చేతిలో పెట్టాడు. దీంతో రమ్య 9 నెలల కొడుకును, తల్లిదండ్రులను తీసుకుని రెండురోజుల క్రితం భర్త ఇంటికి వచ్చింది. వీరిని శ్రీతేజతోపాటు కుటుంబ సభ్యులు ఇంట్లోకి రానివ్వకుండా.. తాళం వేసి వెళ్లిపోయారు. దీంతో రమ్య తన గోడును కాలనీ వాసులకు చెప్పి ఇంటి ముందు మౌన పోరాటానికి దిగింది. శ్రీతేజపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని రమ్య తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాంటినెంటల్‌లో అరుదైన చికిత్స

ఓరల్ కేన్సర్ బాధితునికి ట్రాన్స్ ఓరల్ రోబోటిక్ సర్జరీ




ఓరల్ రోబోటిక్ సర్జరీ చేసిన వైద్య బృందం

రాయదుర్గం: ఓరల్ కేన్సర్‌తో బాధపడుతున్న అసదుల్లా(62)కు ఎస్ఎస్ఐ మంత్ర రోబో సహాయంతో విజయవంతంగా చికిత్స చేశారు నగరంలోని కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యులు. ప్రస్తుతం ఆ బాధితుడు కోలుకోవడంతో తాజాగా శుక్రవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. సాధారణంగా ఇలాంటి చికిత్సల్లో నాలుకను పూర్తిగా తొలగించాల్సి ఉంటుంది. కానీ ఆస్పత్రి వైద్యులు రోబో సహాయంతో నాలుకను తొలగించకుండా కేవలం కేన్సర్ సోకిన భాగాన్ని విజయవంతంగా తొలగించారు. ఈ తరహా చికిత్స చేయడం దక్షిణ భారత దేశంలోనే తొలిదని ఆస్పత్రి హెడ్ అండ్ నెక్ కేన్సర్ విభాగం వైద్య నిపుణుడు డాక్టర్ క్రాంతికుమార్ తెలిపారు. ఇప్పటి వరకు ఆస్పత్రిలోని గ్యాస్ట్రో ఎంటరాలజీ, యూరాలజీ, గైనకాలజీ, సర్జికల్ ఆంకాలజీ విభాగాల్లో 150పైగా రోబోటిక్ సర్జరీలు విజయవంతంగా చేసినట్లు ఆస్పత్రి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి ప్రకటించారు. రోబోటిక్ సర్జరీ వైద్య నిపుణులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

కాటేసిన కరెంటు

- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి
- స్తంభంపై పనిచేస్తుండగా విద్యుదాఘాతం



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య సరిత, కుటుంబ సభ్యులు



ప్రశాంత్ (ఫైల్)

జవహర్‌నగర్: 'సంక్రాంతికి వస్తా..నీవు ఆరోగ్యంగా ఉండు. నాకు చిన్న పని ఉంది చూసుకుని రేపు ఇంటికి బయలుదేరి వస్తా. పండగ అయ్యాక మనమిద్దరం కలిసి బియ్యం తీసుకుని హైదరాబాద్‌కు వెళ్దాం..' అని గర్భవతి అయిన భార్యతో ఫోన్‌లో మాట్లాడి వెళ్లిన కొన్ని గంటలకే ఆ ఇంటి యజమాని తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. కరెంటు అధికారుల నిర్లక్ష్యం కారణంగా మృతిచెందాడు. జవహర్‌నగర్ సీఐ సైదయ్య, బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం గోవింద్రాల బంజారా తండాకు చెందిన బానోతు ప్రశాంత్ (26), సరిత దంపతులు. వీరు సంతోష్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ప్రశాంత్ బాలాజీనగర్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ప్రశాంత్ శుక్రవారం సంతోష్‌నగర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతులకు తోటి కార్మికులతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో ఏఈ సాంబశివరావు, లైన్‌మెన్ నాగరాజుతో పాటు కాంట్రాక్టర్ రాజేశ్‌లు ఎల్‌సీ తీసుకున్నామని, మీరు పని పూర్తి చేయాలని చెప్పడంతో ప్రశాంత్ ఉదయం 10.20 నిమిషాల సమయంలో విద్యుత్ స్తంభం ఎక్కి వైర్ కట్‌చేస్తుండగా 11కేవీ తీగలు తగిలాయి. ప్రశాంత్ స్తంభంపైన పనిచేస్తుండగానే అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యుత్ సరఫరాను ఆన్ చేశారు. దీంతో విద్యుదాఘాతానికి గురై ప్రశాంత్ మృతిచెందాడు. తోటి కార్మికులు, ఉన్నతాధికారులు పోలీసులకు సమాచారం అందించి సమీప ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భార్యతో ఉదయం ఫోన్‌లో మాట్లాడిన కొద్దిసేపటికే..మృత్యువాత పడిన విషయం తెలిసి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. ప్రశాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం, అధికారులు అన్ని విధాలా ఆదుకోవాలని ఖమ్మం జిల్లా కామేపల్లి మండల మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్ నాయక్ డిమాండ్ చేశారు. స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్మికుని కుటుంబానికి అన్నివిధాల ఆదుకుంటామని విద్యుత్ అధికారులు హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి తక్షణ సహాయంగా రూ.10 లక్షలు ఇస్తున్నట్లు అధికారులు, కాంట్రాక్టర్ ప్రకటించారు.

నగరంలో నేడు

- బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జరుగుతున్న ఉద్యాన్ ఉత్సవ్ కార్యక్రమాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతాయి.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం స్ట్రోక్స్ ఆఫ్ నేచర్ -2 పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళా మేళా ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఓటుకు నోటు కేసు విచారణ ఫిబ్రవరి 14కు వాయిదా

సిటీ కోర్టులు: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసు విచారణ శుక్రవారం నాంపల్లిలోని మొదటి మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో జరిగింది. ఈ విచారణకు సెబాస్టియన్ హాజరుకాగా, సీఎం రేవంత్ రెడ్డి, వేం కృష్ణ కీర్తన్, ఉదయ్‌సింహ, జెరూసలేం మత్తయ్య, సండ్ర వెంకట వీరయ్య గైర్హాజరయ్యారు. ఈ కేసులోని నిందితులకు ఎగ్జామినేషన్ చేయాల్సి ఉండగా ఎక్కువ మంది రాకపోవడంతో..విచారణను న్యాయమూర్తి ఫిబ్రవరి 14కు వాయిదా వేశారు.

బాధితులకు పోలీసులు భరోసా కల్పించాలి

పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్



మాట్లాడుతున్న తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్

బండ్లగూడ: సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులకు అండగా ఉంటామనే భరోసా కల్పిస్తేనే ప్రజలకు పోలీసులపై సానుకూల దృక్పథం ఏర్పడుతుందని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ అన్నారు. 320 మంది శిక్షణార్థులు మూడు నెలల ప్రీ ప్రమోషనల్ శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా అకాడమీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ పోలీసులు నిరంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే ప్రజలకు సంతృప్తిగా సేవ చేయగలుగుతారన్నారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ అందరికి వీలైనంత త్వరగా అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందేలా ప్రయత్నం చేస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏఎస్ఐ ఎస్.ఇంద్రారెడ్డి, హెచ్‌సి పి.కృష్ణయ్యలకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు.

ఆర్థిక క్రమశిక్షణపైనే సంస్థల మనుగడ



సాక్షి, సిటీబ్యూరో: ఆర్థిక క్రమ శిక్షణపైనే సంస్థల మనుగడ ఆధారపడి ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. లేదంటే ఆయా సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్పారు. విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(వీఏఓఏటీ) నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ శుక్రవారం మింట్ కంపౌండ్‌లోని ఆ సంఘం కార్యాలయంలో ఘనంగా జరిగింది. వీఏఓఏటీ అధ్యక్షుడు ఎస్.అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెన్‌కో ఫైనాన్స్ డైరెక్టర్ అనురాధ, డిస్కం ఫైనాన్స్ డైరెక్టర్ సుధా మాధురి, ఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, వీఏఓఏటీ ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య పాల్గొని అసోసియేషన్ డైరీ సహా క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆర్థిక క్రమశిక్షణతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు.

రోగులకు రగ్గులు పంపిణీ

లక్డీకాపూల్: నిమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగులకు రగ్గులు పంపిణీ చేశారు. చలి నుంచి ఉపశమనం కల్పించాలన్న ఉద్దేశంతో నిమ్స్ కిడ్నీ రోగుల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివకుమార్, అల్తాఫ్, కె.ఎస్.రావు, ప్రభాకర్, పాషమియా సూచన మేరకు హెల్పినీడి ట్రస్ట్ సభ్యులు మనోహర్‌బాబు, రాఘవులు, రఘునాథరావులు రగ్గులు సమకూర్చారు. దీంతో శుక్రవారం డయాలిసిస్ రోగులకు నెఫ్రాలజీ విభాగం వైద్యనిపుణులు గంగాధర్, భూషణ్ రాజ్, స్వర్ణలత, పీఆర్‌ఓ సత్యగౌడ్‌లు రగ్గులను అందజేశారు. చలి తీవ్రత పెరుగుతున్న సమయంలో అవసరానికి రగ్గులను అందచేసిన దాతలకు రోగులు, వారి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

రహమత్‌నగర్: అర్హులైన ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడం జరుగుతుందని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై తన కార్యాలయంలో సంబంధిత సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేను నిర్దిష్ట సమయంలోపు పూర్తి చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఆన్‌లైన్ జాబితాలో పేర్లు ఉన్న ప్రతి లబ్ధిదారుని నివాసానికి వెళ్లి వివరాలు సేకరించాలని సూచించారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న చాలా మందికి సర్వే జాబితాలో పేర్లు లేవని, ఇదే విషయాన్ని తాము అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని గుర్తు చేశారు. సర్వే పూర్తిగా పారదర్శకంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. సర్కిల్ 19 డీఎంసీ జకీయా సుల్తానా, వార్డు అధికారి విశ్వపతి, సూపర్ వైజర్లతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆడీ కారు బీభత్సం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్ 1/10 చౌరస్తాలో ఐస్‌క్రీం షాపు ఎదుట అదుపు తప్పి వేగంతో వచ్చిన ఆడీ కారు డివైడర్‌తో పాటు కరెంటు స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ మేరకు పోలీసులు మహమ్మద్ అబ్దుల్ షఫీ, చేతన్, అక్షు, సతీష్ కుమార్, జశ్వంత్‌లపై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఘటనలో పలువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

బీఆర్‌ఎస్ పాలనలో ఎన్నో అవినీతి, అక్రమాలు

ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం

బంజారాహిల్స్: బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మాజీ మంత్రి కేటీఆర్ ఎన్నో అవినీతి, అక్రమాలు చేశాడని అందులో భాగమే ఫార్ములా ఈ-రేస్ అని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం అన్నారు. బంజారాహిల్స్‌లోని హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని కుటుంబ సమేతంగా లూటీ చేశారని మండిపడ్డారు. ఎన్నికల కోడ్ ఉండగా కేబినెట్ ఆమోదం లేకుండా ఫార్ములా ఈ-రేస్ నిర్వహించి రూ.55 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. అక్రమాలకు నిలయంగా గత ప్రభుత్వం పాలన సాగించిందన్నారు. ఇప్పటికే రాష్ట్ర విచారణ సంస్థలతో విచారణ జరుగుతుండగా తాజాగా ఈడీ సైతం రంగంలోకి దిగినందున కేటీఆర్ తీహార్ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రజలకు తెలిపేందుకు ఈ నెల 29న తెలంగాణ ఉద్యమకారుల సభను ఇందిరాపార్కు వద్ద నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు

పంజగుట్ట: గత నెలలో జరిగిన యువకుడి హత్య కేసును పంజగుట్ట పోలీసులు ఛేదించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు, కొత్తపేటకు చెందిన కరణం రమేష్ (32) పాత నేరస్తుడు కాగా, హైదరాబాద్‌కు వచ్చి అమీర్‌పేటలో ఓ రియల్‌ఎస్టేట్ ఆఫీస్‌లో ఆఫీస్‌బాయ్‌గా పని చేశాడు. ఈ క్రమంలో అదే ఆఫీస్ గ్రౌండ్ ఫ్లోర్‌లో కిరాణాషాపు నిర్వహించే మృతుడు విష్ణు రూపాణితో (45)తో పరిచయం ఏర్పడింది. రమేష్ క్యాసినో గేమ్‌లో చాలా డబ్బులు పోగొట్టుకుని తన కారును విష్ణు రూపాని వద్ద తనఖా పెట్టి రూ. 20వేలు అప్పుగా తీసుకున్నాడు. ఈ క్రమంలో గత నెల 29వ తేదీన విష్ణుకు ఫోన్ చేసి తన గదికి రావాలని ఇద్దరం కలిసి మద్యం తాగుదామని చెప్పడంతో విష్ణు అక్కడకు వెళ్లాడు. ఇద్దరు అక్కడ మద్యం సేవించారు. మద్యం మత్తులో తన కారు తనకు ఇవ్వాలని రమేష్ అడగగా అందుకు విష్ణు ఒప్పుకోలేదు. దీంతో ఆగ్రహానికి గురైన రమేష్ విష్ణు గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం విష్ణు ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్‌లు, అతని యాక్టివా వాహనం తీసుకుని పారిపోయాడు. 1వ తేదీన విష్ణు గదిలో నుంచి దుర్గంధం రావడంతో స్థానికులు ఎస్సార్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడకు చేరుకున్న పోలీసులు పరిశీలించగా మృతుడు విష్ణుగా గుర్తించి కేసును దర్యాప్తు చేయడం ప్రారంభించారు. ఈనేపథ్యంలో నిందితుడు రమేష్ శుక్రవారం మధ్యాహ్నం మృతుడు విష్ణు ఇంటి వద్ద ఉన్న తన కారును తీసుకెళ్లేందుకు మెట్రోస్టేషన్ వద్దకు రాగానే సమాచారం అందుకున్న పోలీసులు రమేష్‌ను అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




శ్రీనగర్‌కాలనీలో స్వామివారిని దర్శించుకుంటున్న దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీకాంత్



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి ఆలయంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు



బంజారాహిల్స్ రోడ్ నెం14లో స్వామివారు

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకా..!

▲ వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు ▲ శ్రీవారి ఆలయాలకు భారీగా పోటెత్తిన భక్తులు ▲ తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజలు

బంజారాహిల్స్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని ఉత్తర ద్వార దర్శనం ద్వారా దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే శ్రీవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం ఖైరతాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి ఆలయల్లో వేలాది మంది భక్తులు బారులు తీరారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 1/12 చౌరస్తాలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనగర్ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీకాంత్, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. వేంకటేశ్వరస్వామిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే సకల శుభాలు కలుగుతుందనే విశ్వాసంతో జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీవారి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని నేత్రపర్వంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.




బంజారాహిల్స్ రోడ్ నెం. 12 లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు




పంజగుట్ట దుర్గానగర్‌కాలనీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో...

ముగిసిన ఇన్‌స్పైర్ ఇంటర్న్‌షిప్ సైన్స్ శిబిరం



ఇన్‌స్పైర్ ఇంటర్న్‌షిప్ సైన్స్ శిబిరానికి హాజరైన వక్తలు

బంజారాహిల్స్: ఇక్ఫాయ్, ప్రభుత్వరంగ సంస్థ అయిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో ఇక్ఫాయ్ టెక్ హైదరాబాద్ ప్రాంగణంలో ఐదురోజులపాటు జరిగిన ఇన్‌స్పైర్ ఇంటర్న్‌షిప్ సైన్స్ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ శిబిరంలో ఇంటరాక్టివ్ ఉపన్యాసాలు, ప్రయోగాత్మక ప్రాజెక్టులు వంటి ఎన్నో అంశాలతో పాటు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన మెంటర్ల నేతృత్వంలో గ్రూపు చర్చలు, ఇతర కార్యక్రమాలను నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ప్రొఫెసర్ జయానంద, ఇండో ఫ్రెంచ్ సెంటర్ ఫర్ గ్రాడ్యుయేటర్ రీసెర్చ్ ఫౌండర్ ప్రొఫెసర్ షకీల్ అహ్మద్, ఐఐటీ మద్రాస్‌కు చెందిన పూర్వ అధ్యాపకుడు సుబ్రమణ్యం, ప్రముఖ గణిత శాస్త్రజ్ఞులు వరదాచారియర్ కన్నన్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్లు అనుపమ్ సమంత, బిందు, బంబా, దేవులపల్లి రామాచారి, షర్మిష్ఠ, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ ఉదయ్ బి.దేశాయ్ పాల్గొని వివిధ శాస్త్ర, సాంకేతిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐదు రోజుల కార్యక్రమంలో 12 మంది మెంటర్లు ప్రసంగించారు. చివరి రోజు ముగింపు కార్యక్రమానికి హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి పాల్గొని భారత ప్రభుత్వ 'వికసిత్ భారత్' కార్యాచరణలో యువ విద్యార్థుల పాత్ర-విశిష్టత' గురించి తెలియజేశారు. భారతదేశ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు సరైన వృత్తిని, ఉపాధి, ఉద్యోగ రంగాలను ఎంచుకుని స్థిరపడి దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని ఉద్బోధించారు. జంట నగరాలకు చెందిన 15 కళాశాలల నుంచి దాదాపుగా 250 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులు ఏర్పాటు చేసిన వివిధ క్విజ్, వ్యాసరచన వంటి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని బహుమతులను గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉప కులపతి ప్రొఫెసర్ ఎల్‌ఎస్ గణేష్, రిజిస్ట్రార్ విజయలక్ష్మి, ఇక్ఫాయ్ టెక్ డైరెక్టర్ కేఎల్ నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాలలు ఎస్సీ వర్గీకరణను అంగీకరించాలి

పంజగుట్ట: మాలలు ముందు న్యాయపరమైన ఎస్సీ వర్గీకరణను అంగీకరించాలని, తరువాత సమాజంలో దళితులపై జరుగుతున్న అన్యాయాలపై ఉమ్మడిగా పోరాడి ఒక మానవీయ సమాజాన్ని రూపొందిద్దామని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, రైతు కూలీ సంఘం, ఏఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ, పీవోడబ్ల్యూ సంయుక్త ఆధ్వర్యంలో వర్గీకరణకు సై అందాం, మాల మాదిగల మొక్కటవుదాం అంటూ అరుణోదయ పాట సీడీ ఆవిష్కరణ, రిజర్వేషన్లు- వర్గీకరణ-ప్రజాస్వామిక హక్కు పుస్తకావిష్కరణ కార్యక్రమం, తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో వెయ్యి గొంతులు లక్ష డప్పులు ధర్మ పోరాటానికి మద్దతు పేరుతో రౌండ్‌టేబుల్ సమావేశం వేర్వేరుగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య ప్రొఫెసర్ హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్, ఎమ్‌ఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ, విమలక్క, మాజీ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్‌రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన తరువాత దీన్ని ఎవ్వరూ ఆపలేరని, వర్గీకరణ తరువాత మాల, మాదిగ సోదరులు ఉమ్మడిగా చెయ్యాల్సిన పోరాటాలు అనేకం ఉన్నాయన్నారు. ఆ దిశగా ఆలోచనలు చేయాలని సూచించారు.

చింతల రామచంద్రారెడ్డిని కలిసిన బీజేపీ నేతలు



బంజారాహిల్స్: బీజేపీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడిగా ముద్దంగుల శ్రీనివాస్‌కు రెండోసారి అవకాశం కల్పించిన సందర్భంగా డివిజన్ నేతలు శుక్రవారం ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా సీతల అనిల్‌కుమార్‌కు అవకాశం కల్పించినందుకు డివిజన్‌లో ఉన్న సీనియర్ నాయకులు ఆయనను కలిసి ధన్యవాదాలు తెలిపారు. తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు గడ్డం వెంకట్‌స్వామి, గందె అరుణ్‌కుమార్, ఉపేంద్ర, దండుగుల శేఖర్, బోయ రామాంజనేయులు, గురుబ్రహ్మగౌడ్, శశిశేఖర్, డొంగరి రాజకల, పురుషోత్తం, రాంబాబు, మంజలి నరసింహ, గుంటి ఆనంద్ సాగర్, ఆంజి రాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లేష్‌కు సేవారత్న పురస్కారం



శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డకు చెందిన దళిత రత్న అవార్డు గ్రహీత గంట మల్లేష్‌కు సేవారత్న పురస్కారం లభించింది. సేవా కార్యక్రమాలతో పాటు శాంతి సంఘం ద్వారా ప్రజల్లో మార్పును తీసుకువస్తున్న గంట మల్లేష్‌కు తెలుగు భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణా కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో త్యాగరాజగాన సభలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సేవారత్న పురష్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అతిథులు వడ్లకొండ వెంకట్రావు, శృతిలయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని, ఆదర్శ ఫౌండేషన్ కుసుమ భోగరాజు, రెడ్డిమల్ల పార్వతి, డాక్టర్ ప్రతిభ, ప్రమీల, స్వర కిరీటి సుభాష్, కళాకిరిటీ రాజన్, స్వరరత్న అరుణ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు




ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు జరుపుకునే సంక్రాంతి పండుగ విశేషం, పండుగను ఎలా జరుపుకుంటారు అనే విషయాన్ని విద్యార్థులు వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు ఇతర కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అదే విధంగా విద్యార్థులు రంగురంగుల గాలి పటాలు ఎగురవేస్తూ ఎంతో ఉత్సాహంతో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. గొప్ప తత్వవేత్త, ఆధ్యాత్మిక చింతన కలిగిన స్వామి వివేకానంద జన్మదినోత్సవం సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని కూడా ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ ఇలాంటి వేడుకల ప్రాధాన్యతల గురించి, సంస్కృతీ సంప్రదాయాల విలువల గురించి తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని తెలియజేస్తూ విద్యార్థుల ప్రదర్శలు కొనసాగాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు మురళీముకుంద్, ప్రిన్సిపాల్ కాంచనవల్లి తదితరులు వీక్షించి అభినందించారు.

జాగ్రత్తలతో హెచ్ఎంపీవీ దూరం



వెంగళరావునగర్: హెచ్ఎంపీవీ గురించి భయపడాల్సిన పనిలేదని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే దరిచేరదని అమీర్‌పేటలోని ఆస్టర్‌ప్రైమ్ హాస్పిటల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ కె.రత్నబాబు తెలియజేశారు. యూసుఫ్‌గూడలోని ఫస్ట్ బెటాలియన్‌లో శుక్రవారం హెచ్ఎంపీవీ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్నబాబు మాట్లాడుతూ గొంతులో ఇబ్బంది, కొద్దిగా జ్వరం, జలుబు, దగ్గు ఏర్పడతాయని, శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుందని పేర్కొన్నారు. కొందరికి బ్రాంకైటిస్, న్యూమోనియా లాంటివి కూడా ఉంటాయన్నారు. రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్న వారికి, చిన్న పిల్లలకు సమస్య ఎక్కువ కావచ్చని అన్నారు. కాగా ఇలాంటి లక్షణాలు రెండు మూడు రోజుల కంటే ఎక్కువ ఉన్నట్లయితే వైద్యుని సంప్రదించాలని సూచించారు. ఆస్తమా, ఓపీడీ, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడే వారికి తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. తరచూ చేతులు శుభ్రంగా కడుగుకోవాలని, శానిటైజర్, సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. కమాండెంట్ మురళీకృష్ణ మాట్లాడుతూ నిరంతరం వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి జనరల్ ఫిజిషియన్ డాక్టర్ కల్యాణి, ఫస్ట్ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నరేంద్రసింగ్, బెటాలియన్ సర్జన్ డాక్టర్ మహమూద్, దాదాపు 300 మంది సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఏడాదికొకసారి హెల్త్ చెకప్ చేసుకోవాలి



సాక్షి, సిటీబ్యూరో: 30 ఏళ్లు పైబడిన వ్యక్తులు ప్రతీ ఏడాది హెల్త్ చెకప్‌లో భాగంగా రెటీనా చెకప్‌లను చేయించుకోవాలని జీవీకే హెల్త్ హబ్ నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ బోల్లం శ్రుతి తెలిపారు. రెటీనా దెబ్బతినడం డయాబెటిస్ ప్రారంభ సమస్యగా గుర్తించాలని, డయాబెటిస్ లేదా హైపర్ టెన్షన్ వల్ల కలిగే దృష్టి నష్టం తిరిగి పొందలేరని ఆమె పేర్కొన్నారు. నగరంలోని జీవీకే హెల్త్ హబ్ ఆధ్వర్యంలో శుక్రవారం డయాబెటిక్ రెటినోపతిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రారంభ దశలో కంటి సమస్యలను గర్తించగలిగితే అవి తీవ్రతరం కాకుండా చికిత్స అందించవచ్చని అన్నారు. నిద్రవేళకు ఒక గంట ముందు స్క్రీన్ చూడటం తగ్గించడం, విటమిన్ ఏ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం మంచి ఫలితాలను ఇస్తాయని అన్నారు.

వడ్డె ఓబన్న జయంతి వేడుకలను విజయవంతం చేయండి

రహమత్‌నగర్: స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న జయంతిని పురస్కరించుకుని రవీంద్రభారతిలో శనివారం జరుగనున్న వేడుకలను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర వడ్డెర ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు వేముల యాదయ్య కోరారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో ఆయన శుక్రవారం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండోసారి వడ్డె ఓబన్న జయంతి ఉత్సవాలకు అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. వడ్డె కులస్తుల ఐక్యతకు చిహ్నంగా ఎస్పీఆర్‌హిల్స్ ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం స్థానికంగా ఉన్న వడ్డె ఓబన్న విగ్రహానికి నివాళులు అర్పించి క్వారీ మైదానంలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి వాహనాలపై ర్యాలీగా జయంతి సభకు తరలివెళ్లడం జరుగుతుందని తెలిపారు.

వాహన అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన ఇద్దరిపై కేసు

బంజారాహిల్స్: యజమాని ప్రమేయం లేకుండా కారును వేరే వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేసిన ఇద్దరిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... నాగేశ్వరరావు తన ఇన్నోవా క్రిస్టా కారు కనిపించడం లేదని జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. కారును అమరేందర్ ఇవ్వగా, అతను మరో వ్యక్తికి ఇచ్చినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు దర్యాప్తులో భాగంగా కారు తీసుకున్న ఇమ్రాన్ అహ్మద్‌ఖాన్, అతని స్నేహితుడు మహ్మద్ యూసుఫ్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా వారు కారును వేరే వ్యక్తికి అమ్మేసినట్లు ఒప్పుకున్నారు. ప్రమాదానికి గురై స్క్రాప్‌గా ఉన్న కారు నెంబర్ ప్లేట్, చాయిస్ ప్లేట్‌లను కట్ చేసి నాగేశ్వరరావుకు చెందిన ఇన్నోవా కారుకు అమర్చినట్లు తెలిపారు. అలాగే స్క్రాప్ వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, క్లియరెన్స్ సర్టిఫికెట్‌లతో ఆర్టీఏ ఆఫీసర్లను తప్పుదోవ పట్టించి మరో వ్యక్తికి నాగేశ్వరరావు కారును రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చినట్లు అంగీకరించారు. దీంతో పోలీసులు కారును స్వాధీనం చేసుకుని ఇమ్రాన్, యూసుఫ్‌లను అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

వెంగళరావునగర్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో నివాసం ఉండే యువతికి మూడు నెలల కిందట ఫేస్‌బుక్‌లో ఎం.నాగవరప్రసాద్‌తో పరిచయం అయింది. అది కాస్త ప్రేమకు దారితీసింది. అతను స్థానిక మెరీడియన్ స్కూల్‌లో బాస్కెట్‌బాల్ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. యువతి ఏపీ పోలీసు ఉద్యోగం కోసం అక్కడే ఉంటూ ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలో ఆమెను గత నెల 5వ తేదీన హైదరాబాద్ రప్పించి జూబ్లీహిల్స్‌లోని తన ఇంటికి తీసుకెళ్లాడు. మూడు రోజులపాటు పెళ్లి చేసుకుంటానని నమ్మించి అనేకమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అయితే ఇటీవల ఆమె తనను పెళ్లి చేసుకోవాలని నాగ వరప్రసాద్‌ను కోరగా అతడు ముఖం చాటేస్తూ వస్తున్నాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సిటీ ప్లస్
12
హైదరాబాద్‌, శనివారం, 11, జనవరి, 2025





కుర్రో.. కుర్రు.. సోది చెబుతామమ్మా సోది చెబుతాం అంటూ.. ఓ చిన్నారి.. నారాయణ.. నారాయణ అంటూ మరో పిల్లోడు.. పంచెకట్టుతో బుడ్డోళ్లు.. సంప్రదాయ దుస్తుల్లో చిట్టితల్లులు.. గంగిరెద్దుల విన్యాసాలు. పాడి పంటల విశిష్టతలు.. వెరసి జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్‌ స్కూల్లో సంక్రాంతి సంబరాలు శుక్రవారం అంబరాన్ని తాకాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలను పూర్తిగా గ్రామీణ వాతావరణాన్ని తీసుకొచ్చి సంక్రాంతి పండుగ వైభవం ప్రతిబింబించేలా జరుపుకున్నారు. పల్లెల్లో నిర్వహించే సంతలు, కులవృత్తుల విశిష్టతలు తెలియజేస్తూ.. ఏర్పాటు చేసిన స్టాల్స్‌ ఆకట్టుకున్నాయి. చిన్నారులకు పాఠశాల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌ అరుణశ్రీ భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. అనంతరం డూడూ బసవన్నల విన్యాసాలను చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా తిలకించారు. - బంజారాహిల్స్‌



సంక్రాంతి.. సమ్మోహనం..

గొప్ప సాంస్కృతిక, వారసత్వ చరిత్ర కలిగిన హైదరాబాద్‌కు ఘడి చౌక్‌గానూ పేరుంది. చార్మినార్‌, గోల్కొండ వంటి వారసత్వ కట్టడాలకు నిలయమైన ఓల్డ్‌ సిటీ నుంచి సైబర్‌ టవర్స్‌, హైటెక్‌ సిటీ వంటి ఆధునిక నగరం మీదుగా.. నెట్‌ జీరో సిటీగా అభివృద్ధి చెందనున్న ఫ్యూచర్‌ సిటీకి విస్తరిస్తోంది. సిటీ ఏదైనా సరే అప్పటి సంస్కృతి, అభివృద్ధిని సూచించే విధంగా ఐకానిక్‌ ల్యాండ్‌ మార్క్‌లను నిర్మించడం ఆనవాయితీగా వస్తోంది. నాడు ఓల్డ్‌ సిటీలో క్లాక్‌ టవర్లు వారసత్వ గుర్తింపుగా నిలిస్తే.. నేడు ఐటీ పార్క్‌లు హైటెక్‌ సిటీ ల్యాండ్‌ మార్క్‌గా మారిపోయాయి. ఇక, రానున్న ఫోర్త్‌ సిటీ భవిష్యత్తు తరాలకు ప్రతీకగా నిలిచిపోయేలా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. - సాక్షి, సిటీబ్యూరో

చారిత్రక వీక్షణం..

వారసత్వ కట్టడాలు..ఘడి చౌక్‌లు!


- నగరంలో పలు ఐకానిక్‌ ల్యాండ్‌ మార్క్‌లు
- క్లాక్‌ టవర్ల నగరంగా హైదరాబాద్‌
- చారిత్రక, వారసత్వ చిహ్నాలుగా ఏర్పాటు
- నిరుపయోగ స్థితిలో పలు గడియారాలు
- పునరుద్ధరణ చేపట్టాలని నగరవాసుల విజ్ఞప్తి

ప్రసిద్ధ వారసత్వ కట్టడాలు, ప్రదేశాలతో నిండిన భాగ్యనగరంలో.. నిర్లక్ష్యానికి గురవుతున్న చారిత్రక కట్టడాల్లో క్లాక్‌ టవర్లు కూడా ఉన్నాయి. నిజాం కాలంలో ఈ ఐకానిక్‌ నిర్మాణాలు వారసత్వ చిహ్నాలగా విరాజిల్లాయి. నాటి చరిత్రకు ఇవే కీలకమైన మైలురాళ్లు. సమయ పాలనతో పాటు నగరంలోని రద్దీ వీధుల్లో దిక్సూచిగా నిలిచేవి. విస్తరణలో క్రమేణా వీటి ప్రాముఖ్యత తగ్గింది. కానీ, రాతితో చెక్కిన చారిత్రక గుర్తులు నేటికీ పూర్వ వైభవం కోసం వేచిచూస్తున్నాయి.



మోజమ్‌ జాహీ మార్కెట్‌..

మీర్‌ ఉస్మాన్‌ అలీ ఖాన్‌ హయాంలో 1935లో మోజమ్‌ జాహీ మార్కెట్‌లో క్లాక్‌ టవర్‌ నిర్మించారు. మార్కెట్‌లో అత్యంత ఎత్తయిన నిర్మాణం ఇదే. రెండు అంతస్తులు, అష్టభుజి ఆకారంలో ఉంటుంది. మార్కెట్‌లోని అన్ని దిక్కుల నుంచి వీక్షించడానికి వీలుగా దీనిని ఏర్పాటు చేశారు. విక్రేతలు, దుకాణదారులు సమయానికి బస చేసేవారు.



సికింద్రాబాద్‌..

నగరంలో అత్యంత పురాతన, ముఖ్యమైన టవర్లలో ఒకటి సికింద్రాబాద్‌ క్లాక్‌ టవర్‌. 1860లో దీని నిర్మాణం ప్రారంభం కాగా.. 37 ఏళ్ల సుదీర్ఘకాలం తర్వాత 1897లో ప్రారంభించారు. ఇది 120 అడుగుల ఎత్తులో.. దట్టమైన ఉద్యానవనం మధ్యలో ఉంటుంది. సైనిక సిబ్బంది, స్థానికులకు ఈ టవర్‌ ఒక సమావేశ ప్రదేశంగా గుర్తింపు పొందింది.

శాలిబండ..

ఈ గడియార స్థంభాన్ని రాజా రాయ్‌ రాయన్‌ ఘడియాల్‌ అని కూడా పిలుస్తారు. మూడో నిజాం సికిందర్‌ జా ఆస్థానంలో దఫ్తార్దార్‌ (రెవెన్యూ అధికారి) శాలిబండ ప్యాలెస్‌లో 1904లో ఈ క్లాక్‌ టవర్‌ను నిర్మించారు. యూరోపియన్‌ శైలిలో హిందు–అరబిక్‌, రోమన్‌, హిందీ, తెలుగు అంకెలు దీనిలో ఉంటాయి. టవర్‌ ప్రవేశ ద్వారం వద్ద గణేష్‌ ప్రతిమ ఉంటుంది. కాలక్రమేణా ప్యాలెస్‌ ధ్వంసమైనా.. క్లాక్‌ టవర్‌ అలాగే ఉంది.

ఒక్కో మతం.. ఒక్కో తీరు..

క్లాక్‌ టవర్లు దేనికవే ప్రత్యేకమైనవి.. చరిత్ర కలిగినవి. ఇవి గంటలను మాత్రమే కాకుండా భక్తి శ్రద్ధలు, రోజువారీ జీవిన విధానాన్నీ సూచిస్తాయి. వివిధ మతాల సంప్రదాయాలకు చిహ్నంగా నిలుస్తున్నాయి. క్రైస్తవ సంప్రదాయంలో చర్చిల పైన ఉన్న బెల్‌ టవర్లు ప్రార్థన గంటలను సూచిస్తాయి. ఇస్లామిక్‌ సంస్కృతిలో ప్రార్థనలకు పిలుపుగా సూచిస్తారు. మసీదు మినార్ల నుంచి మోగుతూ ఆ సమాజాన్ని ఏకంచేసే కాల గమనాన్ని సూచిస్తుంది. హిందూ ఆచారంలో గంటలు, శంఖాల శబ్దం ప్రజలను ప్రార్థనలకు మేల్కొలుపుతాయి.



జేమ్స్‌ స్ట్రీట్‌..

సికింద్రాబాద్‌ ఎంజీ రోడ్‌లో జేమ్స్‌ స్ట్రీట్‌ పోలీసు స్టేషన్‌లో క్లాక్‌ టవర్‌ ఉంది. 1900 ప్రారంభంలో బ్రిటిష్‌ వారు నిర్మించిన చారిత్రాత్మక టవర్‌. ఇది ఒకప్పుడు రాంగోపాల్‌పేట్‌ పోలీసు స్టేషన్‌కు నిలయంగా పనిచేసింది. దీని నిర్మాణానికి నిధులను అందించిన సేథ్‌ రాంగోపాల్‌ గౌరవార్థం ఆయన పేరే పెట్టారు. ఈ గడియారం వలస నిర్మాణ వారసత్వాన్ని సూచిస్తుంది.



సుల్తాన్‌ బజార్‌..

నగరంలోని పురాతన క్లాక్‌ టవర్లలో ఇదొకటి. 1865లో బ్రిటిష్‌ పాలనలో చాదర్‌ఘాట్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఆధునిక డిజైన్‌తో దినిని నిర్మించారు. అయితే ఇతర క్లాక్‌ టవర్స్‌ లాగా దీనికి అలంకరణ ఉండదు. చతురస్రాకారంలో ఆ సమయంలో ముస్లిం రాజైన అసఫ్‌ జాహీ నిర్మించిన భవనాల తరహాలోనే దీనిని తీర్చిదిద్దారు.

చౌమహల్లా ప్యాలెస్‌..

చౌమహల్లా ప్యాలెస్‌ పశ్చిమ దిక్కున ప్రధాన ద్వారం వద్ద ఉన్న టవరే ఖిలాఫత్‌ గడియారం. 1750లో నిర్మించిన టవర్‌ మూడు అంతస్తుల ఎత్తులో ఉంటుంది. మొఘల్‌ శైలికి చెందిన ఝరోకాలతో, హారాలజిస్ట్‌ నిపుణుల కుటుంబం ప్రతి వారం యాంత్రిక గడియారాన్ని మారుస్తూ ఉంటుంది. ఖిలాఫత్‌ గడియారం చారిత్రక మైలురాయిగా మాత్రమే కాదు.. నగర సాంస్కృతిక, ఆధ్యాత్మిక చిహ్నంగా గుర్తింపు పొందింది.





మహబూబ్‌ చౌక్‌..

1892లో సర్‌ అస్మాన్‌ జా ఈ టవర్‌ను నిర్మించారు. చార్మినార్‌కు పశ్చిమాన మహబూబ్‌ చౌక్‌లో చిన్న తోటలో టర్కిష్‌ శైలిలో దీన్ని నిర్మించారు. స్థానిక ప్రజలకు సమయాన్ని సూచించేందుకు ఉద్దేశించిన ఈ క్లాక్‌ 72 అడుగుల ఎత్తులో ఉంటుంది.



చార్మినార్‌..

చార్మినార్‌పై ఉన్న నాలుగు గడియారాలు 1889లో ఆరో నిజాం మీర్‌ మహబూబ్‌ అలీఖాన్‌ హయాంలో ఏర్పాటయ్యాయి. లండన్‌ నుంచి తీసుకొచ్చిన నాలుగు గడియారాలనూ చార్మినార్‌కు నాలుగు వైపులా ఆర్చ్‌ మధ్యలో అమర్చారు. ఈ గడియారం ముళ్లల గుండా గాలి ప్రసరించినా ఖచ్చితమైన సమయాన్ని సూచిస్తాయి. నాలుగిటిలో గుల్జార్‌ హౌజ్‌కు ఎదురుగా ఉన్న గడియారం ఒక్కటే ప్రతి గంటకూ ఒకసారి మోగుతుంది. అయితే నాలుగు గడియారాలకూ ప్రతి 48 గంటలకు ఒకసారి కీ ఇవ్వాల్సి ఉంటుంది.

మోండా మార్కెట్‌..


సికింద్రాబాద్‌లో సందడిగా ఉండే మోండా మార్కెట్‌లోని టవర్‌ పెద్దగా ప్రచారానికి నోచుకోలేదు. 1920–40 ప్రాంతంలో రైస్‌, ఆయిల్‌ మిల్లు వ్యాపారంలో ఉన్న సంపన్న డూండూ కుటుంబం దీనిని నిర్మించింది. విలాసవంతమైన ఆర్ట్‌ డెకో శైలిలో దీని నిర్మాణం వాణిజ్య కేంద్రాల వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది.



ఆర్ట్‌గ్యాలరీలో స్ట్రోక్స్‌ ఆఫ్‌ నేచర్‌-2







మాదాపూర్‌ : కళాకారులు వేసిన చిత్రాలు, స్కల్ప్చర్స్‌ అద్భుతంగా ఉన్నాయని అలేఖ్య హోమ్స్‌ ఎండీ శ్రీనాథ్‌ కుర్రా తెలిపారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌ గ్యాలరీలో స్ట్రోక్స్‌ ఆఫ్‌ నేచర్‌-2 పేరిట చిత్ర ప్రదర్శనను శుక్రవారం ఎర్పాటు చేశారు. కళాకారులు ఆకుల రఘు, అక్కిరాజు రమణ వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. సహజ సిద్ధమైన ప్రకృతి చిత్రాలు వేయడం ఆనందాన్ని కలిగించిందన్నారు. ప్రదర్శనలో దాదాపు 70 చిత్రాలను ప్రదర్శించినట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శన ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకూ అందుబాటులో ఉంటుందన్నారు. జేఎన్‌ఏఎఫ్‌యూ వీసీ టి.గంగాధర్‌, కళాకారులు పాల్గొన్నారు.

భోగి మంట.. బొమ్మల కొలువు..

సాక్షి, సిటీబ్యూరో: సంక్రాంతి సంబరాలను బాచుపల్లిలోని గోకరాజు లైలావతి ఇంజినీరింగ్‌ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం విద్యార్థులను అధ్యాపకులు భోగిపళ్లతో ఆశీర్వదించారు. గొబ్బెమ్మలు, భోగి మంటలు, బొమ్మల కొలువులు, ముగ్గుల పోటీలు, సన్నాయి మేళాలు, డోలు వాయిద్యాలు, సాంప్రదాయ వస్త్రధారణ, సాంస్కృతిక నాట్య విన్యాసాలు, తెలుగు సంప్రదాయ వంటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కళాశాల రిజిస్ట్రార్‌ డాక్టర్‌ కేవీఎస్‌ఎన్‌ రాజు, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సాయి హనుమాన్‌, డైరెక్టర్‌ డాక్టర్‌ జంధ్యాల నారాయణ మూర్తి పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.



ఎయిర్‌పోర్టులో పుష్పక విమానం







పూల పరిమళానికి, సోయగానికి ఎయిర్‌పోర్టు వేదికగా మారింది. రంగు రంగుల పూలతో చేసిన అలంకరణ అందరినీ ఆకట్టుకుంటోంది. జీఎంఆర్‌ సంస్థ తొలిసారి శంషాబాద్‌ విమానాశ్రయంలో పుష్పోత్సవ్‌-25 నిర్వహిస్తున్నారు. ప్రయాణికుల టెర్మినల్‌, ఎయిరోప్లాజా సమీపంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్‌ ఫణీకర్‌ శుక్రవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే పుష్పోత్సవ్‌లో ఉద్యాన వన ప్రియులతో పాటు.. అందులో నైపుణ్యం కలిగిన వారికి మంచి వేదిక అన్నారు. వివిధ రకాల పూలతో అందమైన ఆకృతులను తీర్చిదిద్దిన వారికి బహుమతులు సైతం ప్రదానం చేయనున్నారు. - శంషాబాద్‌

సాక్షి రియల్టీ
శనివారం
11-01-2025

లక్ష ఇళ్లు @సేల్!



- హైదరాబాద్‌లో 1,01,091 ఇళ్ల ఇన్వెంటరీ
- వీటి విక్రయానికి పట్టే కాలం కనిష్టంగా 19 నెలలు
- ముంబై తర్వాత అత్యధికంగా మన దగ్గరే..
- టాప్–7 మెట్రోలలో 5.64 లక్షల యూనిట్లు

సాక్షి, సిటీబ్యూరో: డిమాండ్‌కు మించి సరఫరా జరుగుతుండటంతో హైదరాబాద్‌లో అమ్ముడుపోకుండా ఉన్న ఇళ్లు(ఇన్వెంటరీ) పెరిగిపోతున్నాయి. దేశంలోని ఏడు ప్రధాన మెట్రో నగరాలతో పోలిస్తే ముంబై తర్వాత హైదరాబాద్‌లోనే అత్యధిక ఇన్వెంటరీ ఉంది. ఇక, బెంగళూరు, చెన్నై వంటి మెట్రో నగరాలతో పోలిస్తే మన దగ్గరే ఎక్కువ. గతేడాది నాటికి గ్రేటర్‌లో 1,01,091 ఇళ్ల ఇన్వెంటరీ (వీటిలో నిర్మాణంలో ఉన్నవి, పూర్తయినవి కలిపి) ఉంది. వీటి విక్రయానికి కనిష్టంగా 19 నెలల కాలం పడుతుంది. గత రెండేళ్లలో నగరంలో గృహాల సరఫరా పెరగడమే ఇన్వెంటరీ పెరుగుదలకు ప్రధాన కారణం.

- దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ఏడాది తొలి తొమ్మిది నెలల కాలంలో మొత్తం 5,64,416 యూనిట్ల ఇన్వెంటరీ మిగిలి ఉందని, వీటి విక్రయానికి కనిష్టంగా 14 నెలల కాలం పడుతుందని అనరాక్ గ్రూప్ నివేదిక వెల్లడించింది.

నగరాల వారీగా ఇన్వెంటరీ	
ఎన్‌సీఆర్	85,460
ఎంఎంఆర్	1,86,677
బెంగళూరు	46,316
పుణె	88,176
హైదరాబాద్	1,01,091
చెన్నై	28,758
కోల్‌కతా	25,938

యంగ్ హోమ్స్





స్థిరాస్తి రంగంలో పెట్టుబడులకు యువత ఆసక్తి

- ఉద్యోగం వచ్చిందంటే మొదట కొనేది ఇల్లే..
- ఆ తర్వాతే పెళ్లి, ఫ్యూచర్, ఫారిన్ ట్రిప్స్ ప్లానింగ్
- రుణాల లభ్యత, బహుళ ఆదాయ వనరులే కారణం

చదువు పూర్తయ్యిందా.. మంచి ఉద్యోగం, తర్వాత పెళ్లి, పిల్లలు, రిటైర్‌మెంట్ నాటికి ఓ సొంతిల్లు.. మన నాన్నల ఆలోచనలివే కదూ! కానీ, ప్రస్తుత తరం ఆలోచనలు, అభిరుచులూ మారాయి. చదువు కొనసాగుతుండగానే ఉద్యోగావకాశాలు నడిచొస్తున్నాయి. దీంతో యువత ముందుగా స్థిరమైన నివాసానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆ తర్వాతే పెళ్లి, విదేశీ ప్రయాణాలు, ఫ్యూచర్ ఇతరత్రా వాటి కోసం ప్లానింగ్ చేస్తున్నారు. విరివిగా రుణాల లభ్యత, బహుళ ఆదాయ మార్గాలు, మంచి ప్యాకేజీతో స్థిరమైన ఉద్యోగ అవకాశాలు ఉండటంతో స్థిరాస్తి రంగంలో పెట్టుబడులకు యువత ఆసక్తి చూపిస్తోంది. 2018లో గృహ కొనుగోలు దారుల్లో మిలీనియల్స్ (25–35 ఏళ్ల వయస్సు గలవారు) వాటా 28 శాతంగా ఉండగా.. గతేడాదికి 37 శాతానికి పెరిగింది. 2030 నాటికి 60 శాతానికి చేరుతుందని జేఎల్ఎల్ ఇండియా అంచనా వేసింది.

– సాక్షి, సిటీబ్యూరో

ఇటీవల కాలంలో దేశీయ స్థిరాస్తి రంగంలో సరికొత్త మార్పులు వచ్చాయి. గతంలో రిటైర్డ్, సీనియర్ సిటీజన్స్, సంపన్న వర్గాల గృహ కొనుగోళ్లు, పెట్టుబడులు ఉండేవి. కానీ, కొన్నేళ్లుగా మిలీనియల్స్, జెన్–జెడ్ కస్టమర్ల వాటా పెరిగింది. జీవితం ప్రారంభ దశలోనే దీర్ఘకాలిక పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారు. తొలి కారు, డిజైనర్ హ్యాండ్ బ్యాగ్‌లాగే ప్రాపర్టీకి నేటి యువత ప్రాధాన్యత ఇస్తోంది.

అందుబాటులో టెక్నాలజీ..


మ్యాజిక్‌బ్రిక్స్.కామ్, హౌసింగ్.కామ్, 99 ఎకర్స్ వంటి రియల్ ఎస్టేట్ యాప్స్ యువ కొనుగోలుదారుల ప్రాపర్టీ శోధనను మరింత సులువు చేశాయి. గతంలో ప్రాపర్టీ కొనుగోలు చేయాలంటే భౌతికంగా వెళ్లి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించడం, పరిసర ప్రాంతాల వాకబు వంటివి పెద్ద ప్రయాస ఉండేది. కానీ, నేటి యువతరానికి అంత టైం లేదు. దుస్తులు, ఫుడ్ ఆర్డర్ చేసినంత సులువుగా ప్రాపర్టీ కొనుగోళ్లు జరిగిపోవాలని కోరుకుంటున్నారు. వీరి అభిరుచికి తగ్గట్టు ప్రాపర్టీ సమీక్ష, రేటింగ్ యాప్స్, త్రీడీ వ్యూ, వర్చువల్ టూర్ వంటి సాంకేతికత పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాయి.

గృహ రుణాలకు పోటీ..

యువ గృహ కొనుగోలుదారులకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు సైతం పోటీపడి హోమ్‌లోన్స్ అందిస్తున్నాయి. రుణాల మంజూరులో వేగం, తక్కువ వడ్డీ రేట్లను అందిస్తున్నాయి. క్రౌడ్ ఫండింగ్, ప్రాపర్టీ షేరింగ్ వంటి పాక్షిక యాజమాన్య ప్లాట్‌ఫామ్‌లు పరిమిత మూలధనంతో స్థిరాస్తి రంగంలో పెట్టుబడులకు అవకాశాలు కల్పిస్తున్నాయి. దీంతో భారీ ముందస్తు చెల్లింపులు అవసరం లేకుండానే నేటి యువ కస్టమర్లు లక్ష కంటే తక్కువ ప్రారంభ పెట్టుబడితో యువ ఇన్వెస్టర్లు ఖరీదైన, విలాసవంతమైన ప్రాపర్టీలను కొనుగోలు చేస్తున్నారు.

ఐటీ హబ్‌లలో యువ పెట్టుబడులు..

బెంగళూరు, హైదరాబాద్ వంటి ఐటీ హబ్‌లలో యువ ఐటీ ఉద్యోగులు రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో గణనీయమైన ప్రభావం చూపుతున్నారు. రూ.80 లక్షల నుంచి రూ.కోటి మధ్య ధర కలిగిన 2 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లలో వీరి ప్రాధాన్యత అధికంగా ఉంది. కరోనాతో అలవాటైన వర్క్ ఫ్రం హోమ్‌తో యువ ఉద్యోగులకు నిత్యం ఆఫీస్‌కు వెళ్లాలనే టెన్షన్ లేదు. దీంతో ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో ఇళ్లు ఉండాలనుకోవడం లేదు. మెరుగైన రవాణా సౌకర్యాలు ఉంటే సిటీకి కాస్త దూరమైనా సరే ప్రాపర్టీ కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పైగా ప్రధాన ప్రాంతంలో కొనుగోలు చేసే ధరతోనే శివార్లలో పెద్ద సైజు ఇళ్లు, వసతులను పొందవచ్చనేది వారి అభిప్రాయం. అయితే గ్రీనరీతో పాటు విద్యుత్, నీటి వినియోగాన్ని ఆదా చేసే ప్రాజెక్ట్‌లు, సౌర ఫలకాలు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వంటి పర్యావరణ అనుకూల ఫీచర్లు ఉండే ఇళ్లను కోరుకుంటున్నారు.



పెరిగిన పట్టణ గృహ యజమానులు..

కరోనాతో అలవాటైన వర్క్ ఫ్రం హోమ్ విధానంతో యువ ఉద్యోగులు ఆఫీసులో కూర్చొని పనిచేసే అవసరం లేదు. వారు ఇప్పుడు తమ పనికి కాకుండా జీవనశైలికి ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో వారికి నచ్చిన ప్రాంతంలో నివసించే స్వేచ్ఛ కోరుకుంటున్నారు. వేగవంతమైన పట్టణీకరణ, సాంకేతిక ఆవిష్కరణలు, వినియోగదారుల అభిరుచులతో గృహ కొనుగోలుదారుల్లో మార్పులు వచ్చాయి. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలు కీలకమైన వృద్ధి కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. 2020లో పట్టణ గృహ యజమానుల రేటు 65 శాతంగా ఉండగా.. 2025 నాటికి 72 శాతానికి పెరుగుతుందని జేఎల్ఎల్ అంచనా వేసింది. సరసమైన గృహ రుణాలు, నివాస సముదాయంలో యువ కొనుగోలుదారుల ప్రాధాన్యతే ఈ వృద్ధికి ప్రధాన కారణాలు.

హైదరాబాద్ స్థిరాస్తి రంగాన్ని నెక్ట్స్ లెవల్‌కు తీసుకెళ్లింది మెట్రో, ఔటర్ ప్రాజెక్ట్‌లే.. మెట్రో రైలుతో ప్రధాన నగరంలో, ఓఆర్ఆర్‌తో శివారు ప్రాంతాలతో కనెక్టివిటీ పెరిగింది. దీంతో నగరంలో రియల్ బూమ్ ఏర్పడింది. తాజాగా ప్రభుత్వం రెండో దశలో ఔటర్ రింగ్ రోడ్డు వరకూ మెట్రో విస్తరించాలని నిర్ణయించింది. దీంతో మెట్రో మార్గంలో చుట్టూ 10 కి.మీ. వరకూ స్థిరాస్తి అవకాశాలు మెరుగవుతాయి. ఇదే సమయంలో మెట్రో, ఎంఎంటీఎస్ రైళ్లను అనుసంధానిస్తే నగరం నలువైపులా ప్రయాణం సులువవుతుంది. బడ్జెట్ గృహాల లభ్యత పెరిగి, ఐటీ ఉద్యోగ వర్గాల సొంతింటి కల సాకారమవుతుందని జనప్రియ అప్‌స్కేల్ ఎండీ క్రాంతి కిరణ్‌రెడ్డి అన్నారు. – సాక్షి, సిటీబ్యూరో

మెట్రో 2.0

నలువైపులా రియల్ పరుగులు!



- మెట్రో నుంచి 10 కి.మీ. వరకూ రియల్టీ అవకాశాలు
- అందుబాటు గృహాలతో సొంతింటి కల సాకారం
- సిటీ వ్యూ బాగుండాలంటే భూగర్భ మెట్రో మేలు
- 'సాక్షి రియల్టీ'తో జనప్రియ అప్‌స్కేల్ ఎండీ క్రాంతి కిరణ్‌రెడ్డి



ప్రజల దైనందిన జీవితంలో ప్రజారవాణా అత్యంత కీలకం. దీంతో ప్రభుత్వం మెట్రోని పొడిగించాలని నిర్ణయించింది. వచ్చే 5–10 ఏళ్లలో దశలవారీగా మెట్రో 2.0 అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ రియల్టీ మరింత దూరం విస్తరిస్తోంది. సాధారణంగా ప్రజలు మెరుగైన రవాణా సదుపాయాలు ఉన్న ప్రాంతాల్లోనే ఉండేందుకు ఇష్టపడతారు. ఐటీ కేంద్రాల చుట్టుపక్కల ఇళ్ల ధరలు రూ.కోటి దాటిపోయాయి. ఐటీ ఉద్యోగ వర్గాలకు అందనంత ఎత్తుకు ఎగబాకాయి. మెట్రోతో శివార్లకు రవాణా సౌకర్యం రావడంతో ఐటీ కారిడార్‌లో పనిచేసే ఉద్యోగులు ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటూ రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో వీరంతా తమ బడ్జెట్‌లో నివాసాలు దొరికే తూర్పు హైదరాబాద్‌లో కొనుగోలు చేశారు.

విదేశాల్లో ప్రైవేట్‌కే స్టేషన్ల బాధ్యత..

సింగపూర్, న్యూయార్క్ వంటి దేశాల్లో మాదిరిగా నగరంలోనూ భూగర్భ మెట్రో ఉంటే మేలు. విదేశాలలో భూగర్భ మెట్రో స్టేషన్ నిర్మాణ వ్యయాన్ని స్థానికంగా హోటల్స్, మాల్స్ వంటి వాణిజ్య సముదాయాలకే అప్పగిస్తారు. స్టేషన్ నుంచి వచ్చిపోయే ప్రయాణికులకు ఆయా వాణిజ్య సముదాయాలకు యాక్సెస్ ఉంటుంది. దీంతో యజమానులకు బిజినెస్ అవుతుంది. ప్రతిఫలంగా స్టేషన్ నిర్మాణ వ్యయాన్ని వాణిజ్య యజమానులే భరిస్తారు. దీంతో అటు ప్రభుత్వం, ఇటు యజమానికి ఇద్దరికీ లాభమే. చిత్తడి, వదులుగా ఉండే నేలలో భూగర్భ మెట్రో కష్టమవుతుంది. కానీ, మనది రాతి భూభాగం. భూగర్భ మెట్రో లైన్ కోసం సొరంగం తవ్వడం కష్టమవుతుందేమో.. కానీ ఒకసారి తవ్వాక నియంత్రణ సులువు. రోడ్డు మార్గం ఎలా ఉంటుందో మెట్రో లైన్ కూడా అలాగే వేయాల్సి ఉంటుంది. పైగా వంకర్లు ఉండే మార్గంలో ఎక్కువ బోగీలతో మెట్రోను నడపడం కుదరదు. కానీ, భూగర్భ మెట్రోను ఏ నుంచి బీ పాయింట్‌కు సరళ రేఖ మాదిరిగా వేయవచ్చు. దీంతో మెట్రో రైలు వేగం పెరగడంతో పాటు ఎక్కువ బోగీలతో మెట్రో నడపొచ్చు.

భవిష్యత్తు ఈ ప్రాంతాలదే..

ఇప్పటి వరకు ఐటీ, ఫార్మా రంగాల బహుళ జాతి సంస్థలే నగరానికి ప్రాధాన్యం ఇచ్చాయి. కానీ, కొన్నేళ్లుగా తయారీ రంగంలో కూడా మల్టీనేషనల్ కంపెనీలు విస్తరిస్తున్నాయి. ఫాక్స్‌కాన్, టాటా ఎయిరోస్పేస్ వంటి సంస్థలు ఆదిభట్ల, శంషాబాద్ ప్రాంతాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఐటీ అంతా వెస్ట్‌లోనే ఉంది కాబట్టి ఈ ప్రాంతాలకు ఎప్పటికీ డిమాండ్ ఉంటుంది. కానీ, ఇప్పటికే ఆయా ప్రాంతాలలో నివాస, వాణిజ్య భవనాలతో కిక్కిరిసిపోవడంతో ఈ అభివృద్ధి చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరిస్తుంది. కొంగరకలాన్, ఆదిభట్ల, శంషాబాద్, కొల్లూరు, శామీర్‌పేట వంటి ప్రాంతాల్లో మార్కెట్ ఊపందుకుంటుంది.

హైదరాబాద్ వర్సెస్ బెంగళూరు..

ఐటీలోనే కాదు రియల్ ఎస్టేట్‌లోనూ హైదరాబాద్, బెంగళూరు పోటీ పడుతున్నాయి. రెండు నగరాలకు ఉన్న తేడా.. రోడ్ల వెడల్పు. బెంగళూరులో ఎయిర్‌పోర్టు రోడ్డు తప్ప అన్నీ దాదాపు 60 ఫీట్ల రోడ్లే.. కానీ, మన దగ్గర 100, 140 ఫీట్ల రోడ్లు కూడా ఉన్నాయి. నగరంలో అంత పెద్ద రోడ్లు ఎలా వచ్చాయి? రోడ్డు వెడల్పుగా ఉంటే అపరిమిత ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్(ఎఫ్ఎస్ఐ) ఉంటుందని యజమానులు రోడ్ల కోసం భూములు ఇచ్చారు. దీంతో భారీ టౌన్‌షిప్‌లు, స్కై స్క్రాపర్లు వస్తున్నాయి. తాజాగా హైరైజ్ ప్రాజెక్ట్‌లతో ట్రాఫిక్ పెరుగుతోందని ఎఫ్ఎస్ఐపై ఆంక్షలు పెట్టాలనే ప్రతిపాదనకు బదులుగా రోడ్లను ఇంకా వెడల్పు చేయడం ఉత్తమం. హైదరాబాద్ రియల్టీకి వరమైన జీవో–86 వల్లే దేశ, విదేశీ పెట్టుబడులు వచ్చాయి. అలాంటి సమర్థవంతమైన జీవోపై ఆంక్షలు పెట్టాలనుకోవడం సరైన నిర్ణయం కాదు.





హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఆల్ టైం హై స్థాయికి చేరుకుంది. గతేడాది నగరంలో రికార్డు స్థాయిలో గృహ విక్రయాలు, ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మందగమనం, వడ్డీ రేట్ల పెంపు, హైడ్రా దూకుడు ఇవేవీ భాగ్యనగరంలో స్థిరాస్తి రంగాన్ని కదిలించలేకపోయాయి. కొత్త ప్రభుత్వ విధానాలతో కొద్ది కాలం అస్థిరత ఏర్పడినా.. మార్కెట్ తిరిగి శరవేగంగా పుంజుకుంది. దీంతో హైదరాబాద్ రియల్టీలో పూర్వ వైభవం సంతరించుకుంది. నగరంలో గతేడాది 32,974 యూనిట్లు విక్రయించగా.. 1.56 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ లావాదేవీలు జరిగాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా తాజా నివేదిక వెల్లడించింది.

– సాక్షి, సిటీబ్యూరో

గృహ, ఆఫీస్ స్పేస్ లావాదేవీల్లో..

ఆల్ టైమ్ హై

గతేడాది 36,974 యూనిట్ల విక్రయంతో రికార్డు

- 1.56 కోట్ల చదరపు అడుగుల ఆఫీస్ స్థలం లావాదేవీలు
- కంపెనీలు, కస్టమర్ల చాయిస్ పశ్చిమ హైదరాబాదే..

ఆర్థికవృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాలు, కొనుగోలుదారుల అభిరుచిలో మార్పుల కారణంగా హైదరాబాద్‌లో గృహ విక్రయాలు పెరిగాయి. గతేడాది నగరంలో 12 శాతం వృద్ధి రేటుతో 36,974 ఫ్లాట్లు అమ్ముడుపోయాయి. ప్రస్తుతం సిటీలో అపార్ట్‌మెంట్ల సగటు ధర చ.అ.కు రూ.5,974. ఏడాదిలో అపార్ట్‌మెంట్ల ధరలు 8 శాతం మేర పెరిగాయి. గతేడాది సిటీలో 44,013 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. అంతకు క్రితం ఏడాదితో పోలిస్తే 6 శాతం తగ్గాయి. హైడ్రా దూకుడు వ్యవహారంతో కొత్త గృహాల ప్రారంభానికి డెవలపర్లు ఆచితూచి వ్యవహరించడంతో లాంచింగ్స్‌లో క్షీణత నమోదయ్యింది.

పశ్చిమ హైదరాబాదే..

హైటెక్ సిటీ, కోకాపేట, రాయదుర్గం, కూకట్‌పల్లి, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి పశ్చిమ హైదరాబాదే కస్టమర్ల చాయిస్‌గా ఉంది. ఎల్బీనగర్, కొంపల్లి ప్రాంతాల్లో ధరల పెరుగుదల అధికంగా ఉంది. ఆయా ప్రాంతాల్లో వరుసగా 11, 10 శాతం మేర రేట్లు పెరిగాయి. ఆ తర్వాత బంజారాహిల్స్‌లో 8 శాతం, కోకాపేటలో 8 శాతం, మణికొండలో 6, నాచారం, సైనిక్‌పురిలో 5 శాతం మేర ధరలు పెరిగాయి. ప్రస్తుతం నగరంలో అత్యధికంగా చ.అ. ధరలు బంజారాహిల్స్‌లో రూ.14,400–16,020 మధ్య ఉండగా.. జూబ్లీహిల్స్‌లో 13,400–14,034, కోకాపేటలో 10,045–12,500, మణికొండలో రూ.8,500–9,220 మధ్య ధరలు ఉన్నాయి.

ఆఫీస్ అ'ధర'హో..

2024లో హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ లావాదేవీలు సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. గతేడాది కొత్తగా 1.03 కోట్ల చ.అ.ఆఫీస్ స్పేస్ పూర్తి కాగా.. 1.56 కోట్ల చ.అ. స్పేస్ లావాదేవీలు జరిగాయి. కార్యాలయాల స్థలం లీజు, కొనుగోళ్లలో గ్లోబల్ కెపబులిటీ సెంటర్స్(జీసీసీ) ఆధిపత్యాన్ని కొనసాగించాయి. గతేడాది జరిగిన ఆఫీసు స్పేస్ లావాదేవీల్లో జీసీసీ వాటా 49 శాతంగా ఉంది. 51 లక్షల చ.అ.ఆఫీస్ స్పేస్‌ను బహుళ జాతి కంపెనీలు జీసీసీ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. దేశీయ వ్యాపార సంస్థలు 24 లక్షల చ.అ.లు, ఫ్లెక్సిబుల్ ఆఫీసు స్పేస్ 18 లక్షల చ.అ.లు, 12 లక్షల చ. అడుగుల స్థలంలో థర్డ్ పార్టీ ఐటీ సంస్థల లావాదేవీలు ఉన్నాయి. నగరంలో ఆఫీస్ స్పేస్ ధర చ.అ.కు సగటున రూ.70గా ఉంది. ఏడాది కాలంలో ధరలు 7 శాతం మేర పెరిగాయి.

దేశవ్యాప్తంగా ఇలా..

గతేడాది దేశంలోని 8 ప్రధాన నగరాల్లో 3,72,936 యూనిట్లు లాచింగ్ కాగా.. 3,50,612 ఇళ్లు అమ్ముడుపోయాయి. అంతకు క్రితం ఏడాదితో పోలిస్తే లాంచింగ్స్‌లో 6 శాతం, విక్రయాల్లో 7 శాతం వృద్ధి నమోదైంది. దేశంలో ఇంకా 4,95,839 యూనిట్ల ఇన్వెంటరీ ఉంది. వీటి విక్రయానికి 5.8 నెలల సమయం పడుతుంది. ఇక, గతేడాది 7.19 కోట్ల చ.అ. ఆఫీస్ స్పేస్ లావాదేవీలు జరగ్గా.. 5.03 కోట్ల చ.అ. స్థలం కొత్తగా మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం 8 నగరాల్లో మొత్తం 97.3 కోట్ల చ.అ.ఆఫీస్ స్పేస్ స్టాక్ ఉంది.

2024లో నగరాల వారీగా స్థిరాస్తి గణాంకాలివీ..

నగరం	విక్రయాలు	లాంచింగ్స్
ముంబై	96,187	96,470
ఎన్‌సీఆర్	57,654	60,699
బెంగళూరు	55,362	56,014
పుణే	52,346	59,548
హైదరాబాద్	36,974	44,013
అహ్మదాబాద్	18,462	22,043
కోల్‌కత్తా	17,389	16,718
చెన్నై	16,238	17,431




వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయం శోభాయమానంగా మారింది. వివిధ రకాల పూలతో శ్రీవారి ఆలయాన్ని టీటీడీ సుందరంగా అలంకరించింది. స్వర్ణరథోత్సవంలో భక్తులు భారీగా పాల్గొన్నారు.

దేశంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీ

సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

- కాలుష్య రహిత నెట్ జీరో సిటీగా ఏర్పాటు చేస్తాం
- వరదలు లేని నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతాం
- రీజినల్ రింగ్‌రోడ్డు–ఓఆర్ఆర్‌ను రేడియల్ రోడ్లతో అనుసంధానిస్తాం
- రీజినల్ రింగ్ రైల్వే, భారీస్థాయిలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం
- మచిలీపట్నం ఓడరేవుకు ప్రత్యేక రోడ్లు, రైల్వే లైన్ నిర్మిస్తామని వెల్లడి
- 'కలిసి రండి.. అద్భుతాలు సృష్టిద్దాం' అంటూ పారిశ్రామికవేత్తలకు పిలుపు



సదస్సులో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పాటై పదేళ్లు గడుస్తున్న నేపథ్యంలో రాష్ట్రాన్ని 'రైజింగ్ తెలంగాణ'గా తీర్చిదిద్దాలనేది తమ కల అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ కలను సాకారం చేసేందుకు పారిశ్రామికవేత్తలు తెలంగాణకు పెట్టుబడులతో రావాలని, కలిసి అద్భుతాలు సృష్టిద్దామని పిలుపునిచ్చారు. తెలంగాణలో ప్రపంచంలోనే అత్యున్నత వ్యాపార అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ హైటెక్ సిటీలోని 'సీఐఐ గ్రీన్ బిజినెస్ సెంటర్'లో జరిగిన భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) జాతీయ కౌన్సిల్ సమావేశంలో రేవంత్ ప్రసంగించారు. అనంతరం సీఐఐ ప్రతినిధులతో జరిగిన చర్చాగోష్టిలోనూ మాట్లాడారు. తెలంగాణలో మౌలిక వసతుల కల్పన, ఆర్థికాభివృద్ధి, సుస్థిర పర్యావరణం లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలను చేపడుతోందని సీఎం వివరించారు. ''హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ పేరిట నిర్మించే ఫోర్త్ సిటీ ప్రపంచంలో అగ్రశ్రేణి నగరాలు న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్‌లతో పోటీ పడుతుంది. ఫ్యూచర్ సిటీని కాలుష్య రహిత నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దేశంలో ఎక్కువ ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడవుతున్న రాష్ట్రం తెలంగాణ. ఎలక్ట్రిక్ వాహన వినియోగాన్ని పెంచేందుకు రిజిస్ట్రేషన్, రోడ్ ట్యాక్స్‌ను తొలగించాం. ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనే, వరదలు లేని నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు మూసీ నదిని 55 కిలోమీటర్ల మేర పునరుజ్జీవన చేస్తాం. 2050 నాటికి నగరానికి అవసరమయ్యే తాగునీటి అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రారంభించాం'' అని సీఎం రేవంత్ తెలిపారు.

విస్తృతమైన రేడియల్ రోడ్లతో..

360 కిలోమీటర్ల నిడివితో నిర్మించే రీజినల్ రింగు రోడ్డు చుట్టూ రీజినల్ రింగ్ రైల్వే నిర్మిస్తామని సీఎం రేవంత్ తెలిపారు. రీజినల్ రింగ్‌రోడ్డును హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డుతో అనుసంధానిస్తూ విస్తృతంగా రేడియల్ రోడ్లను నిర్మిస్తామని.. వీటి వెంట ఫార్మా, లైఫ్‌సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఈవీ, సోలార్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ''చైనా తరహాలో క్లస్టర్లు ఏర్పాటు చేసి చైనా బయట పెట్టుబడులు పెట్టే వారిని ఆకర్షిస్తాం. తెలంగాణకు సముద్ర తీర ప్రాంతం లేనందున డ్రైపోర్టు ఏర్పాటు చేస్తాం. దానిని మచిలీపట్నం ఓడరేవుతో అనుసంధానిస్తూ రోడ్లు, రైలు మార్గాలు నిర్మిస్తాం. గ్రామీణ తెలంగాణలో సేంద్రియ వ్యవసాయం, శీతల గిడ్డంగులు, గిడ్డంగులు తదితర రంగాలను ప్రోత్సహిస్తాం. 67లక్షల మంది మహిళా స్వయం సహాయక సంఘాల్లోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం. ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా క్యాంటీన్లు, మహిళా సంఘాలతో వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు చేయనున్నాం. మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయాలకు హైటెక్ సిటీలో మూడున్నర ఎకరాల్లో స్టాళ్లు ఏర్పాటు చేశాం. నైపుణ్య శిక్షణ కోసం రూ.2,400 కోట్లతో ఐటీఐలను ఐటీసీలుగా ఆధునీకరణ చేస్తున్నాం. స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ హబ్ ఏర్పాటు చేస్తున్నాం..'' అని సీఎం రేవంత్ తెలిపారు. ఈ సమావేశంలో సీఐఐఈ అధ్యక్షుడు సంజీవ్ పూరి, డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్తే చనిపోయిన వారు తిరిగి వస్తారా?

- పవన్ డిమాండ్‌ను ఉద్దేశించి టీటీడీ చైర్మన్ వ్యాఖ్యలు
- తర్వాత కొద్దిసేపటికే తన మాటలు పవన్‌ను ఉద్దేశించి కావని వివరణ



తిరుమల: క్షమాపణ చెబితే చనిపోయిన వారు బతికి వస్తారా అంటూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. శుక్రవారం తిరుమల అన్నమయ్య భవన్‌లో టీటీడీ పాలకమండలి అత్యవసరం సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం టీటీడీ చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ.. ఎవరో చెప్తే దానికి స్పందించి క్షమాపణ చెప్పాలా అని పరోక్షంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని అన్నారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు, చికిత్స పొందుతున్న వారికి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. మృతుల పిల్లలకు కూడా టీటీడీ విద్యా సంస్థల్లో ఉచిత విద్య అందించాలని బోర్డు నిర్ణయించిందని చెప్పారు. టీటీడీ బోర్డు సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, సుచిత్ర ఎల్లా చెరో రూ.10 లక్షలు, ఎమ్మెస్ రాజు రూ. 3 లక్షలు మృతుల కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు. 'క్షమాపణ చెప్తే చనిపోయిన వారు బతికి వస్తారా' అంటూ వ్యాఖ్యలు చేసిన నిమిషాల్లోనే టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట మార్చారు. ఆయన కార్యాలయంలో మరోసారి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి.. తన వ్యాఖ్యలను ఉప ముఖ్యమంత్రి పవన్‌కు ఆపాదించడం భావ్యం కాదన్నారు. పవన్‌ను ఉద్దేశించి తాను మాట్లాడలేదని చెప్పారు.

భక్తులు పోతేనేం.. మనోళ్లు భద్రమే!

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి చంద్రబాబు అండ

వారిద్దరిపై మంత్రుల ఫిర్యాదును పట్టించుకోని ఏపీ సీఎం

- తిరుపతి ఈస్ట్ డీఎస్పీ, టీటీడీ విజిలెన్స్ డీఎస్పీలపై చర్యలు శూన్యం
- త్వరలో టీటీడీ ఈవో శ్యామలరావు బదిలీకి రంగం సిద్ధం
- తమ రాజకీయ ప్రత్యర్థులపై అక్రమ కేసులకు సహకరించని సీవీఎస్వో శ్రీధర్‌పై ప్రభుత్వం బదిలీ వేటు
- ముందే అనుకున్న వ్యూహం ప్రకారం పవన్ కల్యాణ్ గప్‌చుప్
- బీఆర్ నాయుడు ద్వారా డిప్యూటీ సీఎంకు బాబు బ్రేకులు
- తమ వైఫల్యాన్ని దాచిపెడుతూ తిరుపతిలో ఆరుగురు భక్తుల మృతికి కారకులను కాపాడుతున్న ప్రభుత్వ పెద్దలు



సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి ప్రభుత్వం ఘోర వైఫల్యంతోనే తిరుపతిలో ఎన్నడూలేని విధంగా తొక్కిసలాట సంభవించి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారని సర్వత్రా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. సీఎం చంద్రబాబే ప్రధాన ముద్దాయి అని యావత్ భక్త కోటి మండిపడుతుండటంతో సర్కారు వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు ప్రభుత్వ పెద్దలు పక్కా పన్నాగంతో రంగంలోకి దిగారు. ఈ దుర్ఘటన తమను కలచివేసిందని మొసలి కన్నీళ్లు కారుస్తూ తిరుపతి లో హై డ్రామాకు తెర తీశారు. సీఎం చంద్రబాబు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు... చిందులు తొక్కినట్టు వీడియో కెమెరాల ఎదుట కపట నాటకాన్ని రక్తి కట్టించారు. కానీ చంద్రబాబు కుయుక్తులు బెడిసి కొట్టాయి. ఇవి కచ్చితంగా సర్కారీ హత్యలేనని యావత్ ప్రజానీకం తేల్చి చెప్పింది. దీంతో కొందరు అధికారులపై చర్యలు తీసుకుని విషయాన్ని పక్కదారి పట్టించేందుకు యత్నించారు. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా అదే సమయం లో గతంలో తాము చెప్పినట్లుగా రాజకీయ ప్రత్యర్థులపై అక్రమ కేసులు నమోదు చేయని టీటీడీ అధికారులపై చర్యలకు ఉపక్రమించడం చంద్రబాబు కుట్రలకు నిదర్శనం. వైఫల్యానికి కారకులైన తన అస్మదీయ అధికారులపై మాత్రం ఎలాంటి చర్యలూ తీసుకోకుండా వారిని కాపాడుతుండటం గమనార్హం. ఈ పరిణామాలన్నీ ఒక్కటే స్పష్టం చేస్తున్నాయి.. తిరుపతి దుర్ఘటన పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమేనని నిగ్గు తేలుస్తున్నాయి. మరోవైపు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బాధిత కుటుంబాలకు క్షమాపణ చెప్పి ఈ డ్రామాలో తన వంతు పాత్రను రక్తి కట్టించారు. పనిలో పనిగా టీటీడీ చైర్మన్, ఈవో, అదనపు ఈవో కూడా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అందుకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ససేమిరా అనడం గమనార్హం. 'క్షమాపణలు చెబితే చనిపోయిన వారు తిరిగొస్తారా..? అయినా ఎవరో (పవన్ కల్యాణ్) క్షమాపణలు చెప్పమంటే మేం చెబుతామా..? మేం స్పందించాల్సిన అవసరం లేదు..' అని వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకే ఆయన ఇలా స్పందించినట్లు తెలుస్తోంది. అయితే ఆ తర్వాత ఆయన మాట మార్చినా పవన్ కల్యాణ్ సూచనను మొదట తిరస్కరించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక సీఎం చంద్రబాబు సమక్షంలోనే టీటీడీ చైర్మన్, ఈవో పరస్పర ఆరోపణలతో అసలు విషయాన్ని బయట పెట్టారు. తిరుమల ఆలయ వ్యవహారాల్లో టీటీడీ, ప్రభుత్వంలో అన్ని స్థాయిల్లో ఏమాత్రం సమన్వయం లేదని తేల్చి చెప్పారు. ఈ నిర్వాకాలు, వైఫల్యాల కారణంగానే తొక్కిసలాట చోటు చేసుకుని అమాయక భక్తులు మృత్యువాత పడినట్లు చంద్రబాబు సమీక్ష సాక్షిగా నిర్ధారణ అయింది.

చైర్మన్, అదనపు ఈవో సేఫ్

తిరుపతిలో భక్తుల దుర్మరణం దుర్ఘటనకు బాధ్యులైన అస్మదీయ అధికారులను టీడీపీ కూటమి ప్రభుత్వం నిస్సిగ్గుగా వెనకేసుకొచ్చింది. చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన వారిపై చర్యలు తీసుకోవడం లేదని సోషల్ మీడియాలో నెటిజన్లు ఏకి పారేస్తున్నారు. టీటీడీ చరిత్రలో కనీవిని ఎరుగని విషాదానికి బాధ్యత వహించి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు రాజీనామా చేయాలి. ఆయన సమ్మతించకపోయినా ప్రభుత్వమే ఆయనతో రాజీనామా చేయించాలి. కానీ ఆయన్ను చంద్రబాబు మాట పల్లెత్తు మాట అనలేదు. ఎన్నికల్లో టీడీపీకి బాకాగా పని చేసిన టీవీ 5 చానల్‌కు బీఆర్ నాయుడు అధినేత కావడం దీనికి ప్రధాన కారణం. ఇక శ్రీవారి ఆలయం దర్శనాలు, సౌకర్యాల కల్పనకు ప్రధాన బాధ్యత వహించాల్సింది తిరుమల అదనపు ఈవో వెంకయ్య చౌదరే! తిరుపతిలో ఏర్పాటు చేసిన కౌంటర్లు కూడా తిరుమల శ్రీవారి ఆలయ దర్శనం టికెట్ల కోసమే. అయినా సరే వెంకయ్య చౌదరిని ప్రభుత్వం సస్పెండ్ కాదు కదా కనీసం బదిలీ కూడా చేయలేదు.

అస్మదీయ అధికారులకు రక్షణ

వైకుంఠ ఏకాదశి క్యూలైన్లను ప్రత్యక్షంగా పర్యవేక్షించాల్సిన బాధ్యత టీటీడీ విజిలెన్స్ డీఎస్పీ ఎస్టీ రామ్‌కుమార్‌దే. అయినా సరే ఆయనపై ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. టీటీడీ విజిలెన్స్ విభాగంలో ఆయన ప్రధాన రింగ్ మాస్టర్‌గా వ్యవహరిస్తున్నారు. తొక్కిసలాట సంభవించిన ప్రాంతాలు తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తాయి. ఆ ప్రాంత డీఎస్పీ వెంకటనారాయణపై ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

ఇదే అదనుగా సహకరించని అధికారులపై వేటు...

తిరుపతిలో తొక్కిసలాట ఘటనకు సంబంధించి బాధ్యులైన అనుకూల అధికారులను కాపాడుతున్న సీఎం చంద్రబాబు మరోవైపు నిబంధనల ప్రకారం నడుచుకుంటూ తమకు సహకరించని అధికారులకు పొగబెడుతున్నారు. ఇదే అదనుగా గతంలో అక్రమ కేసుల నమోదుకు తమకు సహకరించని వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగారు. టీటీడీ విజిలెన్స్ ప్రధాన అధికారి (సీవీఎస్ఓ) శ్రీధర్‌ను ప్రభుత్వం బదిలీ చేయడం గమనార్హం. వైఎస్సార్‌సీపీ హయాంలో టీటీడీ చైర్మన్లుగా వ్యవహరించిన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డిపై అక్రమ కేసులు నమోదు చేయాలంటూ శ్రీధర్‌పై కూటమి ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి తెస్తోంది. అయితే ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేకుండా కేసుల నమోదుకు ఆయన తిరస్కరించడంతో తిరుపతి దుర్ఘటనను అడ్డం పెట్టుకుని ప్రభుత్వం శ్రీధర్‌ను బదిలీ చేసింది. మరోవైపు తిరుమల శ్రీవారి ఆలయ దర్శనాలతో ఏమాత్రం సంబంధంలేని తిరుపతి జేఈవో గౌతమిని ప్రభుత్వం బదిలీ చేసింది. అదే రీతిలో డీఎస్పీ రమణకుమార్, క్యూలైన్ల నిర్వహణతో సంబంధం లేని టీటీడీ గోశాల డైరెక్టర్ హర్‌నాథ్‌రెడ్డిని సస్పెండ్ చేసింది.

బీఆర్ నాయుడు, వెంకయ్య చౌదరిపై మంత్రుల ఫిర్యాదు.. వారించిన బాబు

మంత్రులు అనగాని సత్య ప్రసాద్, ఆనం రాం నారాయణరెడ్డి గురువారం సీఎం చంద్రబాబు తిరుపతిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలోనే టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తీరుపై ఫిర్యాదు చేశారు. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లతో పాటు అసలు తిరుమల ఆలయ నిర్వహణే సక్రమంగా లేదని ప్రస్తావించారు. అయితే వారిని వారించిన సీఎం చంద్రబాబు ఆ విషయాలు తరువాత మాట్లాడదామంటూ దాటవేశారు. బీఆర్ నాయుడు, వెంకయ్య చౌదరి ఎన్ని తప్పులు చేసినా పట్టించుకోబోనని సంకేతాలిచ్చారు. దీంతో చంద్రబాబు మనోగతాన్ని గ్రహించిన మంత్రులు మిన్నకుండిపోయారు.

ఈవో బదిలీకి రంగం సిద్ధం..

టీటీడీ ఈవో శ్యామలరావును బదిలీ చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. అయితే వెంటనే బదిలీ చేస్తే ఆయనతోపాటు తిరుమల అదనపు ఈవో వెంకయ్య చౌదరిని కూడా బదిలీ చేయాల్సి ఉంటుంది. అందుకే కొద్ది రోజుల తరువాత శ్యామలరావుని బదిలీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

వైఎస్ అభిషేక్‌రెడ్డి మృతి



వైఎస్ అభిషేక్‌రెడ్డి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి (36) శుక్రవారం మృతి చెందారు. ఇతను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దనాన్న వైఎస్ ప్రకాశ్‌రెడ్డి మనవడు (వైఎస్ మదన్ మోహన్‌రెడ్డి కుమారుడు). కొద్ది రోజులుగా డెంగీ జ్వరంతో బాధ పడుతూ హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం సాయంత్రం పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సౌమ్యుడు, వివాద రహితుడు, ఉన్నత విద్యావంతుడిగా అభిషేక్ రెడ్డికి మంచి గుర్తింపు ఉంది. పులివెందులలోని వైఎస్ కుటుంబ సభ్యుల సమాధుల తోటలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొననున్నారు. వైఎస్ అభిషేక్‌రెడ్డికి భార్య డాక్టర్ సౌఖ్య, పిల్లలు వైఎస్ అక్షర, వైఎస్ ఆకర్ష ఉన్నారు.

కళలతోనే సామాజిక చైతన్యం

- తెలంగాణ సాంస్కృతిక పునర్నిర్మాణంలో కళాకారులే కీలకం
- 'విధ్వంస జీవన విధానం–సాంస్కృతిక చైతన్యం' సదస్సులో మంత్రి జూపల్లి



సదస్సులో పాల్గొన్న మంత్రి జూపల్లి, కోదండరాం, మొగిలయ్య, మామిడి హరికృష్ణ, అలేఖ్య పుంజాల, ఎక్కా యాదగిరి రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంస్కృతిక పునర్నిర్మాణంలో కవులు, రచయితలు, కళాకారులు భాగస్వాములు కావాలని సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. సామాజిక చైతన్యం, సాంస్కృతిక విలువల పరిరక్షణలో కళాకారులు క్రియాశీల బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ సాంస్కృతికశాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ, తెలంగాణ సాంస్కృతిక సారథి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలో 'విధ్వంస జీవన విధానం–సాంస్కృతిక చైతన్యం' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి జూపల్లి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల జీవన విధానం గతి తప్పడం వల్లనే సమాజంలో అనేక రుగ్మతలు, పెడధోరణులు, దారుణాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. యువతలో చైతన్యం కలిగించేందుకు కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు పూనుకోవాలని కోరారు. కళాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు.


మతం పేరుతో విద్వేషం వద్దు: కోదండరామ్

రాజ్యాంగ విలువలు మనం నిర్మించబోయే సంస్కృతికి ప్రాతిపదిక కావాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మతం పేరుతో మనిషిని ద్వేషించే వాతావరణం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. సాంస్కృతిక సారథి అధ్యక్షురాలు వెన్నెల గద్దర్ మాట్లాడుతూ ప్రభుత్వం సమాజహిత కార్యక్రమాల్లో కవులు, కళాకారులను భాగస్వాములను చేయడం అభినందనీయమన్నారు. సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజల మాట్లాడుతూ.. ప్రజలను జాగృతం చేసే పెద్ద బాధ్యత కవులు, కళాకారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, ప్రముఖ శిల్పి డాక్టర్ ఎక్కా యాదగిరిరావు, ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్‌తేజ, జయరాజ్, మొగిలయ్య తదితరులు పాల్గొన్నారు.

టీజీఎస్పీడీసీఎల్‌లో త్వరలో 1,000 పోస్టుల భర్తీ

600 జేఎల్ఎం, 300 సబ్ ఇంజనీర్, 100 ఏఈల పోస్టుల భర్తీ

ఈఆర్సీకి తెలిపిన టీజీఎస్పీడీసీఎల్



సాక్షి, హైదరాబాద్: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) త్వరలో 1,000 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఎస్సీ వర్గీకరణ చిక్కులు తొలగిపోయాక ఈ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. 600 జూనియర్ లైన్‌మన్ (జేఎల్ఎం), 300 సబ్ ఇంజనీర్, 100 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగాల భర్తీ ఉంటుందని ఎస్పీడీసీఎల్ పేర్కొంది. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)కి శుక్రవారం పంపిణీ వ్యాపారం (డిస్ట్రిబ్యూషన్ బిజినెస్), వీలింగ్ టారిఫ్‌కి సంబంధించిన వార్షిక ఆదాయ అవసరాల (ఏఆర్ఆర్) పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ పిటిషన్‌లోనే కొత్త నియామకాల ప్రస్తావన చేర్చింది.

వివాదాస్పద భూమికి చీకట్లో రిజిస్ట్రేషన్లు

వైరా సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో ఈ నెల 2న ఘటన

- 89 డాక్యుమెంట్లలో 64 రిజిస్ట్రేషన్లపై వివాదం
- విచారణకు ఆదేశించిన మంత్రి పొంగులేటి



ఆ వివాదాస్పద భూమి ఇదే..

వైరా/కొణిజర్ల: ఖమ్మం జిల్లా వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకేరోజు 89 రిజిస్ట్రేషన్లు చేయటం, అందులో 64 డాక్యుమెంట్లు వివాదాస్పద భూమికి సంబంధించినవి ఉండటం తీవ్ర వివాదాస్పదమవుతోంది. కొణిజర్ల మండలం లింగగూడెం, అమ్మపాలెం, కొణిజర్ల పంచాయతీ పరిధిలోని 180 ఎకరాల్లో 2013లో గ్రీన్‌ల్యాండ్ డెవలపర్స్ పేరిట వెంచర్ ఏర్పాటైంది. 2015లో అందులోని 40 ఎకరాల్లో విల్లాల నిర్మాణం కోసం ఇండోఖతార్ సంస్థకు అప్పగించారు. 2018లో గిరి అనే వ్యక్తికి ఆ భూమిని అప్పగించి 48 నెలల్లో 108 విల్లాలు పూర్తి చేసి ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే, ఆయన 50 విల్లాలు నిర్మించి మిగతా వారికి తెలియకుండా అమ్ముకున్నట్లు గ్రీన్‌ల్యాండ్ వెంచర్స్ బాధ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాదం కొనసాగుతుండగానే డిసెంబర్ 28న వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గ్రీన్‌ల్యాండ్ వెంచర్స్ భూములకు సంబంధించి 64 డాక్యుమెంట్లతోపాటు మరో 25 కలిపి మొత్తం 89 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఈ ప్రక్రియ రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. ఈ రిజిస్ట్రేషన్లపై గిరి ఈ నెల 2న వైరా సబ్ రిజిస్ట్రార్‌కు లీగల్ నోటీసు పంపినట్లు సమాచారం. ఈ రిజిస్ట్రేషన్లు వివాదాస్పదం కావటంతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పూర్తి స్థాయి విచారణకు ఆదేశించారు. మరోవైపు అన్ని అనుమతులను సరిచూసిన తర్వాతే గ్రీన్‌ల్యాండ్ డెవలపర్స్ భూములకు రిజిస్ట్రేషన్ చేశామని వైరా సబ్ రిజిస్ట్రార్ రామచంద్రయ్య తెలిపారు.

దేశంలో నియంతృత్వ పాలన

హెచ్‌సీయూ విశ్రాంత ప్రొఫెసర్ హరగోపాల్



రాయదుర్గం: దేశ రాజకీయాల్లో హిట్లర్‌ను మించిన నియంతృత్వ పాలన సాగుతోందని హెచ్‌సీయూ విశ్రాంత ప్రొఫెసర్ హరగోపాల్ ఆరోపించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో 'లోక్‌సభ ఎన్నికలు–2024– ఫలితాల తీరుతెన్నులు' అనే అంశంపై జాతీయ సెమినార్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ దేశంలో యథేచ్ఛగా హక్కుల ఉల్లంఘన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు తీర్పు ఇచ్చింది చక్కని పాలన కోసమని.. కానీ అందుకు విరుద్ధంగా జరుగుతోందన్నారు. 2024 ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిందా?..లేక ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిందా?..అనే సందిగ్ధం ఉన్నప్పటికీ.. నరేంద్రమోదీ ప్రధానిగా మూడోసారి కొనసాగుతున్నారని సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీ డైరెక్టర్ సందీప్‌శాస్త్రి పేర్కొన్నారు. సెమినార్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ వెంకటేశ్ మాట్లాడుతూ ఎన్నికలు, రాజకీయాలన్నీ సామాన్య వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడంలో వైఫల్యం వల్లే.. ఆధిపత్య కులాలు, సంపన్నవర్గాలు ఎన్నికల రాజకీయాల ఫలితం అనుభవిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలు రాష్ట్రాలకు చెందిన యూనివర్సిటీల ప్రొఫెసర్లు అశుతోష్‌కుమార్, జ్యోతిమిశ్రా, సంజయ్‌లోధా, యతీంద్ర సిసోడియా, రామజయం, కార్తీక్ విఘ్నేష్ అజయ్ గుడవర్తి, హరతి వాగీషన్, జ్యోతిర్మయి శర్మ తదితరులు పాల్గొన్నారు.

బార్ కౌన్సిల్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారు?

ఈనెల 31లోగా షెడ్యూల్ సమర్పించాలని బీసీఐకి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల షెడ్యూల్‌ను రూపొందించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)ను హైకోర్టు ఆదేశించింది. జనవరి 31వ తేదీలోగా తమ ముందు ఆ వివరాలు ఉంచాలని స్పష్టం చేసింది. తెలంగాణ బార్ కౌన్సిల్ ప్రస్తుత సభ్యుల పదవీకాలం ముగిసినందున వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సిందిగా బీసీఐని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో న్యాయవాది కొక్కుల అశోక్ పిటిషన్ దాఖలు చేశారు. పదవీ కాలపరిమితి ముగిసినా సభ్యులు కొనసాగడం న్యాయవాదుల చట్టం–1961లోని సెక్షన్ 8, సెక్షన్ 54ల ఉల్లంఘనే అవుతుందని, బార్ కౌన్సిల్‌లోని ప్రస్తుత సభ్యుల పదవీకాలం ఐదేళ్లు పూర్తయిందని, ఆ తర్వాత ఆరు నెలల పొడిగింపు కాలం కూడా ముగిసిందని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. బీసీఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. న్యాయవాదుల ప్రాక్టీస్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతోందని, ఐదేళ్లు ముగిసిన తర్వాత సభ్యుల పదవీ కాల పరిమితిని పొడిగించే అధికారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఉందన్నారు. ఈ సందర్భంగా ఐదేళ్లకు మించి పదవీకాలం పొడిగించిన బార్ కౌన్సిల్‌లు ఏవైనా ఉన్నాయా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. పిటిషనర్ తరఫున మాజీ అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్‌ల కాల పరిమితిని పొడిగించేందుకు బీసీఐకి సుప్రీంకోర్టు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని చెప్పారు. ఐదేళ్ల పదవీ కాలం ముగిసి ఆరు నెలలు అయ్యిందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి..ప్రతివాదుల వివరణ నిమిత్తం విచారణను ఈ నెల 31కి వాయిదా వేశారు.

స్ఫూర్తి

సరిహద్దుల్లో సాహసమే వెన్నెముకగా...





మహాలక్ష్మి

'ఓ పక్షీ! నీ పాట ఇక్కడ పాడబోకు ఎగిరిపో... నీ వనాలెక్కడున్నాయో వెతుక్కుంటూ' అనేది కవి వాక్యం. బీటెక్ చదువుతున్న మహాలక్ష్మి టెక్ దారిలో వెళ్లకుండా... బీఎస్ఎఫ్ (సరిహద్దు భద్రతా దళం)కు ఎంపికైంది. తెనాలి అయితానగర్ అమ్మాయి మహాలక్ష్మి ఇండో-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో సగర్వంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తోంది..

ఎన్‌సీసీలో చేరిన రోజుల్లో ఎంతోమంది సాహసికులైన సైనికుల గురించి తెలుసుకునే అవకాశం మహాలక్ష్మికి వచ్చింది. ఆ సమయంలోనే 'నేను సైతం సైన్యంలోకి' అనే లక్ష్యానికి బీజం మహాలక్ష్మి మదిలో పడింది.

మహాలక్ష్మి తల్లి వెంకాయమ్మ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సు, తండ్రి రాజుది పెయింటింగ్ వృత్తి. చాలీచాలని సంపాదనైనా ఆ దంపతులు బిడ్డలిద్దరినీ చదివించారు. మహాలక్ష్మి చదువుతో పాటు ఆటపాటల్లోనూ ప్రతిభ చూపేది. ఎన్‌సీసీ మాస్టారు బెల్లంకొండ వెంకట్ ప్రోత్సాహంతో ఎన్‌సీసీలో చేరింది. రెండు జాతీయ శిబిరాలకు హాజరయ్యే అవకాశం వచ్చింది. కాలేజి గ్రౌండులో వ్యాయామం చేసేందుకు వస్తుండే బాలయ్య అన్నయ్య రన్నింగ్, హైజంప్‌లో అథ్లెటిక్స్‌లో సాధన చేయించాడు.

జోనల్ అథ్లెటిక్ మీట్‌లో రన్నింగ్‌లో ఫస్ట్ వచ్చింది.

చదువే లోకం అనుకునే అమ్మాయికి ఎన్‌సీసీ, ఆటలు పరిచయం కావడంతో కొత్త ప్రపంచంలోకి వెళ్లినట్లు అనిపించింది.

తనలోని శక్తిసామర్థ్యాలకు పదును పెట్టుకునే అవకాశం వచ్చింది.

టెన్త్ తర్వాత సెయింట్ మేరీస్ ఇంజినీరింగ్ కాలేజీలో పాలిటెక్నిక్‌లో చేరిన మహాలక్ష్మి, తర్వాత అదే కాలేజీలో బీటెక్ సెకండియర్‌లో చేరింది. ప్రస్తుతం ఫైనలియర్‌లో ఉండాల్సింది. ఈలోగా 2022లో సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) పరీక్షలు రాసి ఉత్తీర్ణురాలైంది. 2023లో బీఎస్‌ఎఫ్‌కు ఎంపికైంది. పశ్చిమబెంగాల్ బైకాంతపూర్‌లోని బీఎస్‌ఎఫ్ క్యాంపులో 11 నెలల శిక్షణ పూర్తి చేసుకుంది. గత అక్టోబరు 28న పశ్చిమబెంగాల్‌లోని బీఎస్‌ఎఫ్ 93 బెటాలియన్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అదే రాష్ట్రంలో ఇండో-బంగ్లాదేశ్ బోర్డర్‌లోని జపర్సల వద్ద మహాలక్ష్మి సైనికురాలిగా ఉద్యోగ విధులు నిర్వహిస్తోంది.

ప్రస్తుతం క్రిస్మస్ సెలవులకని సొంతూరు తెనాలికి వచ్చింది.

శిక్షణ రోజుల గురించి ప్రస్తావించినప్పుడు ఇలా చెప్పింది....

'బైకాంతపూర్‌లోని క్యాంపులో శిక్షణ చాలా కఠినంగా ఉండేది. చిన్నప్పటి నుంచి ఆడిన ఆటలు, చేసిన వ్యాయామాల వల్ల కష్టం అనిపించేది కాదు. తెల్లవారుజాము నాలుగు గంటల్నుంచే రన్నింగ్, ఇతర వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది. తర్వాత తరగతులు ఉంటాయి. ఏకే 47తో సహా రకరకాల వెపన్‌లు విడగొట్టటం, నిర్ణీత వ్యవధిలో అమర్చటం, బుల్లెట్లను లోడు చేయడం, ఫైరింగ్... మొదలైనవి ఎన్నో సాధన చేయించేవారు. సాయంత్రం 5 గంటల నుంచి సరిహద్దులో డ్యూటీ చేయాలి. కష్టమే అయినా ఇష్టంగా చేయగలిగాను'

'సైన్యంలో పనిచేస్తున్నావట కదా... మంచి విషయం అమ్మా' అని అభినందించే వారే కాదు...

'సరిహద్దుల్లో ఉద్యోగమా! అంత కష్టమెందుకమ్మా. ఇక్కడే ఏదో ఉద్యోగం చూసుకోవచ్చు కదా!' అని సలహా ఇచ్చేవారు ఉన్నారు.

సైన్యంలో జెండర్ బారియర్స్ తొలగిపోతున్న కాలం ఇది.

పురుషులతో సమానంగా అమ్మాయిలు సత్తా చాటుతున్న కాలం ఇది.

ఇలాంటి కాలంలో....

నిరాశపరిచే మాటలు వారి హృదయాలను చేరవు.

దేశభక్తి ఉన్న హృదయాలకు భయాలతో పనేమిటి!

– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి



కమాండర్ స్థాయికి చేరుకోవాలని...

ఎన్‌సీసీలో ఉన్నప్పుడు ఎంతో మంది గొప్ప సైనికుల గురించి, వారి త్యాగాల గురించి తెలుసుకునే అవకాశం వచ్చింది. ఆ వీరులు, త్యాగధనుల గురించి వింటున్న క్రమంలో 'ఏదో ఒకరోజు నేను కూడా సైన్యంలో పనిచేస్తాను' అనుకునేదాన్ని.

అయితే అదెంత కష్టమో నాకు తెలియంది కాదు.

ప్రోత్సహించేవారి కంటే నిరుత్సాహపరిచేవారే ఎక్కువగా ఉంటారు.


కష్టాన్ని ఇష్టపడేవారే విజేతలు అవుతారు.

శిక్షణ కాలంలో బైకాంతపూర్ క్యాంప్‌లో 'ఇంత కష్టమా' అనిపించలేదు. 'ఇన్ని విషయాలు తెలుసుకున్నాను కదా' అనుకున్నాను. దేశభక్తి గురించి అధికారులు చెప్పిన మాటలు నాలో స్ఫూర్తిని కలిగించాయి. ఆ స్ఫూర్తితోనే దేశ సరిహద్దుల రక్షణకు అంకితమయ్యాను. బాగా కష్టపడి బీఎస్ఎఫ్‌లో కమాండర్ స్థాయికి చేరుకోవాలనేది నా కల.

– వై.మహాలక్ష్మి

బ్యూటిప్స్

మాయిశ్చరైజర్‌గా బాదం నూనె..



- చలికాలం చర్మం పొడిబారడం సహజంగా జరుగుతుంటుంది కాబట్టి నూనె శాతం ఎక్కువ ఉన్న మాయిశ్చరైజర్లు వాడాలి.
- బాదం నూనె, అలోవెరా జెల్ సమపాళ్లలో తీసుకొని అందులో కొద్దిగా వెనిలా ఎసెన్స్ కలపాలి. ఈ మిశ్రమాన్ని చలికాలం మాయిశ్చరైజర్‌గా ఉపయోగించవచ్చు.
- స్నానానికి ముందు టీ స్పూన్ బాదం నూనె, అర టీ స్పూన్ తేనె కలిపి ముఖానికి, చేతులకు రాసి, మసాజ్ చేయాలి. పొడిబారే చర్మం మృదువుగా తయారవుతుంది.
- టీ స్పూన్ బాదాం నూనెలో అర టీ స్పూన్ పంచదార కలిపి ముఖానికి రాసి మృదువుగా మర్దన చేయాలి. తర్వాత పెసరపిండిలో కొద్దిగా నీళ్లు కలిపి పేస్ట్ చేసి ముఖానికి ప్యాక్ వేసుకోవాలి. ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. వారానికి రెండు సార్లు ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల చర్మం పొడిబారదు.

ముగ్గు ముచ్చట



హసిత ఉన్నవ
విద్యానగర్, హైదరాబాద్



16 చుక్కలు, 6 వరుసలు, 6 వచ్చే వరకు, చుక్క వదిలి చుక్క



ఎస్. అదితి
6వ తరగతి, ఆల్ సెయింట్స్ స్కూల్, హైదరాబాద్


డిజైన్ ముగ్గు



చంద్రలేఖ
జాడుపల్లి, శ్రీకాకుళం

9 చుక్కలు, నందు చుక్క, 1 వచ్చే వరకు





● చెవి, ముక్కు, గొంతు సంరక్షణ

హెల్త్

కాలుష్యం కాటేస్తది!



ఇటీవల వాతావరణ కాలుష్యం విపరీతంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ముక్కు ఆరోగ్య సంరక్షణ చాలా కీలకంగా మారుతోంది. అంతేకాదు... ఈమధ్యకాలంలో శబ్దకాలుష్యం కూడా అనూహ్యంగా పెరిగిపోతోంది. వాహనాల పెరుగుదల వల్ల శబ్ద, వాయు కాలుష్యాలు... ఈ రెండూ ఏకకాలంలో పెరిగి రెండు జ్ఞానేంద్రియాలపై దుష్ప్రభావం చూపుతున్నాయి. ఇక ఈ ముక్కు, చెవులు రెండూ గొంతుతో అనుసంధానమై ఉంటాయి. ఈ నేపథ్యంలో చెవులు, ముక్కు, గొంతు ఆరోగ్య పరిరక్షణ ఎంతో కీలకం. అందుకే వాటి సంరక్షణ కోసం తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలను తెలుసుకోవడం తప్పనిసరి.

ముక్కు చెవులనూ, అలాగే తలను మిగతా దేహంతో అనుసంధానం చేసే కీలక అవయవ భాగమే మెడ. వీటన్నింటి ఆరోగ్యాలను జాగ్రత్తగా కాపాడుకోవాలి. అందుకు పాటించాల్సిన కొన్ని సూచనలివి...

చెవుల సంరక్షణ కోసం...

● పెద్ద పెద్ద చప్పుళ్ల నుంచీ, శబ్దకాలుష్యం నుంచి చెవులను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఇయర్ ఫోన్స్‌తో మొబైల్ వాడేటప్పుడు, కంప్యూటర్‌ను ఉపయోగిస్తూ హెడ్‌ఫోన్స్ పెట్టుకున్న సమయంలో పెద్దగా వాల్యూమ్ పెట్టుకోకుండా చెవికి తగినంత వాల్యూమ్‌తో జాగ్రత్తగా చెవులను కాపాడుకోవాలి. ● పెద్ద పెద్ద శబ్దాలు వచ్చే చోట్లలో / పనిప్రదేశాలలో ఇయర్ ప్లగ్స్ వాడుకోవాలి ● చెవుల్లో హోరు శబ్దాలు గానీ, ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరి గుయ్‌మనే శబ్దాలుగాని వినిపిస్తుంటే అది టినైటస్ అనే సమస్య కావచ్చని భావిస్తూ సర్టిఫైడ్ ఆడియాలజిస్ట్ దగ్గర వినికిడి పరీక్షలు చేయించుకోవాలి. ● చెవులు వినబడుతుంటేనే చిన్నారులు మాటలు నేర్చుకునేది. అందుకే చిన్నారి పుట్టగానే ఆ పిల్లలకు వెంటనే వినికిడి పరీక్షలు చేయించాలి. ఇలా పరీక్షించి చికిత్స చేయిస్తే... అటు వినికిడి సమస్యనూ, ఇటు మాటలు రాకపోవడాన్నీ ఏకకాలంలో అరికట్టవచ్చు. కాక్లియర్ ఇంప్లాంట్స్ వంటి చికిత్సలతో మాటలూ, వినికిడీ వచ్చేలా చేయవచ్చు

గొంతు ఆరోగ్యం (థ్రోట్ హైజీన్) కోసం

● స్మోకింగ్, మద్యం అలవాటు మానుకుంటే కేవలం గొంతు ఆరోగ్యం మాత్రమే కాదు... మొత్తం దేహం ఆరోగ్యమంతా బాగుంటుంది. ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలూ, జబ్బులూ, రుగ్మతలూ నివారితమవుతాయి ● గొంతు ఆరోగ్యం కోసం గొంతును శుభ్రంగా ఉంచుకోవడం మేలు చేస్తుంది. ఇందుకు గోరువెచ్చని నీటిలో కాస్తంత ఉప్పు వేసుకుని పుక్కిలించడం ఓ మంచి ఇంటి చిట్కా. దీని వల్ల గొంతుకు వచ్చే అనేక ఇన్ఫెక్షన్లూ, ఇన్‌ఫ్లమేషన్లూ, సోర్ థ్రోట్ వంటి సమస్యలు దూరం కావడమే కాకుండా అనేక రకాల గొంతు ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కలుగుతుంది. ఇది చాలా సులువైన, నమ్మకమైన, ప్రభావపూర్వకమైన చిట్కా ● ఇక నీళ్లు ఎక్కువగా తాగుతుండటమనేది ఇటు గొంతుతో పాటు పూర్తి శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతూ అనేక సమస్యలనుంచి రక్షణ కల్పించే అంశం.

ముక్కు ఆరోగ్యం కోసం...

● ముక్కు ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం మనందరి మొదటి ప్రాధాన్యత. అన్ని అవయవాలనుంచి తేమను లాగేసినట్టే... ముక్కు నుంచి కూడా తేమను లాగేస్తుంది ఈ సీజన్. అందుకే ముక్కు తాలూకు తేమ బాగానే నిర్వహితమయ్యేలా చూసుకోవాలి ● ఈ సీజన్‌లో బాగా నీళ్లు తాగుతూ ఉంటే అది ముక్కులోని మ్యూకస్ మెంబ్రేన్‌ను పొడిబారకుండా తేమగా ఉండేలా చూడటంతో పాటు... మిగతా దేహమంతా బాగా హైడ్రేటెడ్‌గా ఉండేలా చూసుకునేందుకు ఉపయోగపడుతుంది ● ముక్కులు బిగదీసుకుపోయే తత్త్వం ఉన్నవారు (ఇది ఈ సీజన్‌లో మరీ ఎక్కువ) సెలైన్ నేసల్ స్ప్రేలు వాడటం వల్ల ముక్కు ఆరోగ్యం బాగుంటుంది ● ఇక చీదే సమయంలో బలంగా చీదడం సరికాదు. ఒక్కోసారి దీంతో ముక్కులోని అతి సన్నటి రక్తనాళాలు (క్యాపిల్లరీస్) చెదిరి రక్తస్రావం కూడా అయ్యే అవకాశం ఉంటుంది.



డాక్టర్ ఈ.సీ. వినయకుమార్, సీనియర్ ఈఎన్‌టీ సర్జన్

సైనస్ ఇన్ఫెక్షన్లూ, సమస్యల నుంచి కాపాడుకోవడానికి...

● ఒక్కోసారి చేతుల్లో ఉండే హానికరమైన సూక్ష్మజీవులు ఏదైనా తింటున్న సమయంలో గొంతులోకి వెళ్లి అక్కణ్నుంచి ముక్కు, నోరు, గొంతు ద్వారా (ఒక్కోసారి కళ్ల నుంచి కూడా) లోనికి ప్రవేశించి ముక్కు, నోరు, గొంతు, కళ్ల ఇన్ఫెక్షన్లతో పాటు సైనసైటిస్ వంటి సమస్యలకూ కారణమవుతాయి. కానీ చేతులు శుభ్రంగా కడుక్కుంటూ మంచి హ్యాండ్ హైజీన్‌ను పాటించడం మేలు. అందుకే కేవలం చేతులు శుభ్రంగా కడుక్కోవడం (హ్యాండ్ వాష్)తో ఎన్నో సమస్యలను నివారించవచ్చునని గుర్తుంచుకోవాలి ● కొన్ని అలర్జీ సమస్యలను, మనకు సరిపడని అలర్జెన్స్ వల్ల ముక్కు, గొంతు, కళ్ల అలర్జీలూ, సైనస్ సమస్యలతో పాటు ఊపిరితిత్తులకు సంబంధించిన మరికొన్ని రుగ్మతలూ రావచ్చు. అందుకే మనకు సరిపడని వాటికి దూరంగా ఉండాలి ●వేడినీటితో ఆవిరిపట్టడం అనే ఓ చిట్కాతో ముక్కు, గొంతు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

ఈ జాగ్రత్తలతో పాటు మంచి సమతులాహారం, విటమిన్-సి సమృద్ధిగా ఉండే నిమ్మజాతి పండ్లైన నారింజ, బత్తాయి వంటివి వాడటం, జింక్ మోతాదులు ఎక్కువగా ఉండే నట్స్, గింజ ధాన్యాలు, పప్పుధాన్యాలు తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్లు నివారితమవుతాయి. ఈ జాగ్రత్తలతో పాటు మసాలాలు ఎక్కువగా తీసుకోకపోవడం వల్ల గొంతులో ఇరిటేషన్లు, యాసిడ్ గొంతులోకి వచ్చి గొంతు మండటం అనే సమస్యలు నివారితమవుతాయి. ఇక వీటితో పాటు ఈ చలి సీజన్‌లో మరింత చల్లటి గాలికీ, నీటికి దూరంగా ఉండటం, కాలుష్యానికి ఎక్స్‌పోజ్ కాకుండా జాగ్రత్తవహించడం వంటి జాగ్రత్తలు మేలు చేస్తాయనే అంశాన్ని గ్రహించాలి.

పీడకలవరం

పీడకలలు ప్రతి ఒక్కరికీ తమ జీవితంలోని ఏదో ఒక సమయంలో రావడం మామూలే. తీవ్రమైన మానసిక ఒత్తిడికీ, ఆవేదనకు గురైన / గురవుతున్న వారితో పాటు ఆర్థిక, సామాజిక కారణాలతో బాధ పడుతూ ఉండేవారికి ఇలా పీడకలలు వచ్చే అవకాశం ఎక్కువ. ఇక మరికొందరిలో సుదీర్ఘ విమాన ప్రయాణం తర్వాత జెట్‌లాగ్ టైమ్‌లో లేదా ఆ తర్వాత కూడా పీడకలలు రావచ్చు. ఇవి అదే పనిగా వస్తుంటే అందుకు కారణాలేమిటి. వాటికి చికిత్స ఏమిటన్న విషయాలను తెలుసుకుందాం.



అందరి జీవితాల్లో ఏదో ఒక సమయంలో పీడకలలు రావడం అన్నది సాధారణమే అయినా... కొందరిలో రోజూ అలాంటి కలలే వస్తూ ఉండటం వల్లా... అలాగే వాటి దుష్ప్రభావం వారి దైనందిన జీవితంపై పడటంతో సామాజికంగా, వృత్తిపరంగా, ఆర్థికంగా దెబ్బతినడం జరగవచ్చు. దాంతో తమకు సంబంధించిన ఇతరత్రా పనులేవీ చేసుకోలేని విధంగా తీవ్రమైన మానసిక ఆందోళనకూ, తీవ్రమైన ఒత్తిడికీ, ఆందోళనకూ గురయ్యే అవకాశాలు ఎక్కువ. మాటిమాటికీ పీడకలలు వచ్చే కండిషన్‌ను 'నైట్‌మేర్ డిజార్డర్'గా చెబుతారు. గతంలో ఈ మానసిక సమస్యను 'డ్రీమ్ యాంగ్జైటీ డిజార్డర్' అనే వారు. అయితే ఇప్పుడు ఈ సమస్యను 'నైట్‌మేర్ డిజార్డర్' లేదా 'రిపీటెడ్ నైటమేర్స్' అంటున్నారు.

సాధారణంగా 'నైట్‌మేర్ డిజార్డర్' సమస్యకు మందుల అవసరం పెద్దగా ఉండకపోవచ్చు. అయితే ఇలాంటి బాధితులకు ధైర్య వచనాలు చెప్పి సాంత్వన కలిగించడం అవసరం. అలాగే వాళ్లకు యాంగ్జైటీ, ఒత్తిడి కలిగించే అంశాల విషయంలో కౌన్సెలింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి చర్యలతో ఈ సమస్యను చాలావరకు పరిష్కరించవచ్చు.

అయితే కొంతమందిలో పదే పదే ఇలాంటి కలలు రావడానికి మరో అంతర్గత కారణం ఏదో ఉండి ఉంటుంది. అలాంటి అండర్‌లైయింగ్ మెడికల్ సమస్యలకు తగిన మందులు ఇవ్వడం ద్వారా కూడా ఇలాంటి కలలు రాకుండా చూడవచ్చు. మానసిక వైద్యనిపుణుల పర్యవేక్షణలో స్ట్రెస్ రెడ్యూసింగ్ టెక్నిక్‌లతో బాధితుల్లో ఒత్తిడి తగ్గించడం వల్ల కూడా ఇవి తగ్గిపోవచ్చు. అయితే భయంకరమైన యుద్ధం, కుటుంబంపై దాడి, కుటుంబ పెద్ద మరణం... ఇలాంటి ఏవైనా కారణాలతో కుటుంబమంతా అల్లకల్లోలం కావడం వంటి అత్యంత తీవ్రమైన వేదన కలిగించే దుర్ఘటన తర్వాత కలిగే... 'పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్'కు లోనైనవారిలో 'ఇమేజరీ రిహార్సల్ థెరపీ' అనే చికిత్సను అందిస్తారు. ఇందులో బాధితుల్లో వచ్చే పీడకల చివర్లో అంతా సుఖాంతమైనట్లుగా బాధితుల మనసులో నాటుకుపోయేలా చేస్తారు. ఫలితంగా పీడకలలు క్రమంగా తగ్గిపోయే అవకాశం ఉంటుంది.

జీన్స్ తొడుక్కుని స్క్వాటింగ్ వద్దు



జీన్స్ వేసుకొని కింద కూర్చోవడం, అందునా జీన్స్ ప్యాంట్లు తొడిగి బాసిపట్లు వేయడం (సక్లముక్లం వేసి కూర్చోవడం) ఆరోగ్యానికి అంత మేలు కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు. జీన్స్ ప్యాంట్ తొడుక్కొని ఇలా కూర్చోవడం వల్ల కండరాలు, నరాలు దెబ్బతింటాయనీ, ఇది మరీ విషమిస్తే ఒక్కోసారి జీన్స్ ప్యాంట్లతో బాసిపట్లు వేసుకుని కూర్చునేవారు పైకి లేవగానే నడవలేని పరిస్థితి వచ్చేందుకూ అవకాశముందని హెచ్చరిస్తున్నారు. ఇక వ్యాయామం చేసే సమయంలోనూ జీన్స్ అస్సలు తొడుక్కోవద్దనీ, వాటిని తొడిగి 'స్క్వాటింగ్' ఎక్సర్‌సైజ్ చేయడం అస్సలు మంచిది కాదని చెబుతున్నారు. ఈ అంశాలన్నింటినీ 'జర్నల్ ఆఫ్ న్యూరాలజీ, న్యూరోసర్జరీ, సైకియాట్రీ' అనే మెడికల్ జర్నల్‌లోనూ ప్రచురితమయ్యాయి. అవే కాకుండా బాగా బిగుతుగా ఉండే జీన్స్ వల్ల పురుషుల్లో స్పెర్మ్ కౌంట్ తగ్గే అవకాశముందని కూడా మరికొన్ని అధ్యయనాలు పేర్కొంటున్నాయి.

● మీకు తెలుసా

ఎండు పండ్లు ఎంత ఆరోగ్యం?

ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి తగినన్ని ప్రొటీన్స్, ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్, మినరల్స్ అవసరం. వీటన్నింటిని పొందడానికి డ్రై ఫ్రూట్స్ ఒక మంచి ఆప్షన్. అందుకే డ్రై ఫ్రూట్స్ ఆరోగ్యానికి మంచిదని డాక్టర్లతోపాటు చాలామంది తెలిసిన వాళ్లు కూడా చెబుతారు. అయితే అవి ఆరోగ్యానికి మంచిది కదా అని.. ఇష్టమొచ్చినట్టు తింటే



ఆరోగ్యానికి మేలు బదులు ముప్పు వాటిల్లుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

అతి సర్వత్రా వర్జయేత్ అన్నారు పెద్దలు. అంటే ఎందులోనూ అతి పనికి రాదన్నమాట. ఈ సూత్రం డ్రై ఫ్రూట్స్‌కి కూడా వర్తిస్తుంది.

డ్రై ఫ్రూట్స్‌లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే.. షుగర్స్, క్యాలరీ లు కూడా ఉంటాయి. కాబట్టి వీటిని 20 గ్రాముల కంటే ఎక్కువ తినకూడదు. అలాగే నేరుగా తినడం కూడా మంచిది కాదు.



స్విచాఫ్ ది ఫోన్!

ఓపెన్ ది మైండ్!

ప్రస్తుత కాలంలో ఫోన్‌తోనే ప్రతి ఒక్కరికీ పని. స్మార్ట్ ఫోనే ఫ్రెండ్. ఫోనే పార్ట్‌నర్. సెల్లే సర్వస్వం. అయితే ఓ రోజు ఫోన్ లేకుండా గడిపితే ఎలా ఉంటుంది. వారంలో ఓ రోజు పనికి సెలవు తీసుకున్నట్లే ఫోన్‌కి స్విచ్ ఆఫ్ చేసి పక్కన పడేస్తే..? వారాంతంలో ఓ రోజు పనికి దూరంగా ఉన్నట్లే ఫోన్‌కు దూరంగా ఉంటే ఎలా ఉంటుంది.. అనే ఆలోచన ఊహించడానికే ఏదోలా ఉంది కదా... అదేం కాదు.. ఫోన్ లేకపోతే ఏం జరుగుతుందో చూద్దాం.

చేతిలో ఫోన్ లేకపోతే మెదడు ఓపెన్ అవుతుంది. సొంతంగా ఆలోచించడం ఆరంభం అవుతుంది. ఒకదానితో మరొక విషయాన్ని బేరీజు వేసుకోవడం మొదలుపెట్టే ఖాళీని మెదడుకు ఇచ్చి చూద్దాం.

సెలవు రోజు ఇంటికి అవసరమైన వస్తువులు తెచ్చుకోవడం లేదా ఆర్డర్ చేసుకోవడం వంటి పనులు పూర్తి చేసుకున్న తర్వాత ఇక ఆ రోజుకు ఫోన్ ముట్టుకోవద్దు. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఇంట్లో పెట్టి కాలనీలో రోడ్లన్నీ చుట్టి వస్తే... మనం నివసించే ప్రదేశం ఎలా ఉందో తెలుస్తుంది. కొత్తగా కడుతున్న ఓ భవనం కనిపిస్తుంది. ఇంతకు ముందు ఈ ప్రదేశంలో ఏముండేది? ఓ ప్రశ్న మదిలో మెదలుతుంది. కానీ సమాధానమే తట్టదు. గడచిన పదేళ్లుగా ఇదే కాలనీలో ఉన్నప్పటికీ వారంలో పది-పదిహేను సార్లు ఇదే దారిలో ప్రయాణించినప్పటికీ మనం ఈ ప్రదేశానికి చిరపరిచితులం కాలేకపోయామా అనే సందేహం కూడా అనిపిస్తుంది. నిజానికి ఈ ప్రదేశానికి మనం చిరపరిచితులయ్యాం, కానీ మనకే ఈ ప్రదేశం చిరపరిచితంగా మారలేకపోయింది. ఒక్కరోజైనా చేతిలో ఉన్న ఫోన్‌ని జేబులో పెట్టుకుని ఈ దారిలో



నడిచి ఉంటే కదా! ఏ విషయమైనా మెదడు గ్రహింపుకు వచ్చేది. అనుక్షణం కళ్లు, చెవులు, మెదడు ఫోన్‌తో ఎంగేజ్ అయి ఉంటాయి. అలవాటు పడిన దారిలో దేహం యాంత్రికంగా సాగిపోతూ ఉంటుంది. పనులు ముగించుకుని ఇంటికి వచ్చి కూర్చున్న తర్వాత కూడా టీవీ స్క్రీన్ మీద దృష్టి కేంద్రీకరిస్తాం. ప్రపంచంలోని విషయాలన్నింటినీ మెదడులోకి గుప్పించడంలోనే రోజు పూర్తవుతుంటే... ఇక మెదడు సొంతంగా ఆలోచించేదెప్పుడు? ఆ మాత్రం వెసులుబాటు దొరికినప్పుడే మెదడు తన సృజనాత్మకతను బయటపెడుతుంది.

ఒక గంటతో మొదలు పెట్టండి!

వారంలో ఓ రోజు ఫోన్, టీవీ, కంప్యూటర్, ట్యాబ్, ల్యాప్‌టాప్ అన్నింటికీ సెలవు ప్రకటించి తీరాలి. మెదడుకు రెక్కలు విచ్చుకుని విహరించే అవకాశం కల్పించాలి. ఒకేసారి రోజంతా అన్ని స్క్రీన్‌లకూ ఆఫ్ అంటే కొంత కష్టం కావచ్చు. టీవీ, కంప్యూటర్ లైతే మన చేతిలోనే ఉంటాయి. ఫోన్ కాల్స్ మన చేతిలో ఉండవు. ఇంట్లో ఒక ఫోన్ స్విచాఫ్‌లో ఉంటే 'ఫోన్ ఆఫ్‌లో ఉందేమిటి' అంటూ మరొకరి ఫోన్‌కు కాల్స్ వస్తుంటాయి. కాబట్టి మొదట్లో ఒక గంటతో మొదలు పెట్టండి. రెగ్యులర్‌గా ఫోన్ చేసే స్నేహితులు, బంధువులకు 'ఇది స్విచాఫ్ అవర్' అని మెసేజ్ పెట్టేసి ఫోన్ బంద్ చేయాలి. గంటతో మొదలు పెట్టి క్రమంగా 'స్విచాఫ్ డే'గా మార్చాలి. 'స్విచాఫ్ డే' కుటుంబ సభ్యులు ఒకరితో ఒకరు మనసు విప్పి మాట్లాడుకునే రోజవుతుంది. కుటుంబ బంధాలు ఆనందాల హరివిల్లుగా మారుతాయి.

యోగా

భుజబలానికి కీలకం

నేలపైన మ్యాట్ వేసుకొని, శరీరాన్నంతా స్ట్రెచ్ చేస్తూ చేయాలని అందరూ యోగా చేయడానికి సిద్ధ పడరు. అందుకు వయసు, అనారోగ్యం, చిన్న చిన్న గాయాలు వంటివి కారణం అవుతుంటాయి. ఇలాంటప్పుడు కుర్చీ లేదా సోఫాలో కూర్చొని కూడా యోగ సాధన చేయవచ్చు.

ఈగిల్ ఆర్మ్స్ భంగిమ అంటే ఇది గరుడాసనను పోలిన విధంగా ఉంటుంది. ఇందులో కూర్చొనే విధానంలోనే తేడా ఉంటుంది. శరీర కదలికలకు, శ్వాస పని తీరులో మెరుగుకు ఇలా సాధన చేయవచ్చు.



ఇలా ప్రయత్నించవచ్చు..

● కుర్చీలో నిటారుగా కూర్చొని, పాదాలను నేలమీద ఆనించాలి. దీర్ఘశ్వాస తీసుకుని, వదులుతూ చేతులను విశాలంగా గరుడ పక్షి రెక్కల్లా చాచాలి. భుజాలను నిటారుగా ఉంచాలి.



● ఐదు శ్వాసలు తీసుకొని, వదిలిన తర్వాత రెండు చేతులను పైకి ఎత్తాలి. చేతులను సాధ్యమైనంత పైకి సాగదీస్తున్నట్టు ఉంచాలి. ఆ తర్వాత రెండు చేతులను హృదయస్థానానికి తీసుకురావాలి. కుడి చేతిని ఎడమ చెయ్యి కింద నుంచి తీసుకుంటూ వ్యతిరేక దశలో రెండు చేతులను పట్టుకోవాలి. ఈ సమయంలో భుజాలు కూడా కొద్దిగా ముందుగా వంగుతాయి. ఈ భంగిమను రోజూ సాధన చేస్తుంటే ముంజేతుల దగ్గర నుంచి ఒకదాన్నొకటి చుట్టినట్టుగా వస్తుంది. ఐదు దీర్ఘ శ్వాసలు తీసుకొని, వదలాలి. తిరిగి మెల్లగా యథాస్థితికి రావాలి.

● ఇదే విధంగా ఎడమ నుంచి కుడి చేతివైపుకు కూడా చేయాలి. ఒక్కో భంగిమలో ఐదు దీర్ఘ శ్వాసలు తీసుకొని, వదులుతూ సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుంది.

● కుర్చీ/సోఫాలో కూర్చున్నప్పుడు కాళ్లను కూడా నేల మీద నుంచి వీలైనంత పైకి లేపి, పది సెకన్లు ఉంచి, తిరిగి యథాస్థానంలోకి తీసుకురావచ్చు. ఈ విధంగా చేయడం వల్ల పాదాల వరకు రక్త ప్రసరణ మెరుగవుతుంది.

పాలు... రాగులు ఏవి బెటర్

శరీరానికి కాల్షియం అనేక రోజువారీ పనులు చేసేందుకు ఉపకరిస్తుంది. అందువల్ల మన డైట్‌లో కాల్షియంని చేర్చుకోవడం ముఖ్యం. జున్ను, బొప్పాయి, మల్బరీ, లిచీ, కివి, బచ్చలికూర, బ్రకోలీలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. వీటిని రెగ్యులర్‌గా తినడం వల్ల చాలా సమస్యల్ని దూరం చేసుకోవచ్చు. ఆరోగ్యంగా కూడా ఉంటారు.

పాలు, రాగుల్లో కాల్షియం ఎక్కువగా ఎందులో ఉంటుందంటే...

పాలు, రాగులు రెండూ ఒకదానికి మించి లాభాలని అందిస్తాయి. ఉదాహరణకి..100 మి.లీ పాలు తాగితే 110 మిల్లీ గ్రాముల కాల్షియం లభిస్తుంది. అదే 100 గ్రాముల రాగులని తీసుకుంటే, దాదాపు 350 మిల్లీ గ్రాముల కాల్షియం లభిస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థని ఆరోగ్యంగా ఉంచితే, ఐరన్ ఎక్కువగా ఉండడం వల్ల రక్తహీనత ఉన్నవారికి రాగులు మంచిది. రాగుల్లో ఉండే పొటాషియం వంటి ఇతర పోషకాలు మొత్తం శరీర ఆరోగ్యానికి సాయపడతాయి. పాలలో పోషకాలతోపాటు ఉండే ఎలక్ట్రోలైట్స్ బాడీని హైడ్రేట్ చేస్తాయి. రాగులు షుగర్ ఉన్నవారికి చాలా మంచిది. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉండి గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఇది బ్లడ్ షుగర్ లెవల్స్‌ని నియంత్రిస్తుంది కాబట్టి, మీ అవసరాలని బట్టి ఏది మంచిదో నిర్ణయించుకోవడం ఉత్తమం.



తొక్కలతో మొక్కలకు పోషణ

చాలా మంది వేరుశెనగ పప్పుల్ని తిని.. వాటి తొక్కల్ని పారేస్తుంటారు. అయితే, మనం వేస్ట్ అనుకున్న ఈ తొక్కలతో చాలా ప్రయోజనాలు ఉన్నాయి. వేరుశెనగ తొక్కల్లో నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు ఉన్నాయి. ఇవి మొక్కల ఆరోగ్యాన్ని పెంపొదించడంలో సాయపడతాయి. అంతే కాకుండా వీటిలో ఫైబర్, ప్రోటీన్ కూడా ఉన్నాయి. ఇవి మొక్కలకు తగిన పోషణ ఇస్తాయి. వేరుశెనగ తొక్కల్ని ఉపయోగించి కంపోస్ట్ ఎరువు తయారు చేయవచ్చు. ఇందుకోసం వేరుశెనగ తొక్కల్ని బాగా ఎండబెట్టాలి. ఆ తర్వాత వీటిని బాగా మెత్తగా పొడిలా చేసుకోండి. ఈ పొడిని ఇప్పుడు డైరెక్ట్‌గా కుండీలోని మట్టిలో కలపవచ్చు. వేరుశెనగ తొక్కల పొడిని వాడే ముందు మట్టి బాగా కలియబెట్టాలని మరచిపోకూడదు. ఇలా చేయడం వల్ల మొక్కలకు తగిన పోషణ అంది బాగా పచ్చగా, ఏపుగా పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.



మరకలు ఇలా మాయం..

ఉన్ని దుస్తుల మీద మరకలు ఏర్పడితే.. వాటిని డైరెక్ట్‌గా వాషింగ్ మెషిన్‌లో ఉపయోగించకూడదు. వాషింగ్ మెషిన్‌లో వేయడానికి ముందు.. సాఫ్ట్ స్టెయిన్ రిమూవర్‌తో మరకల్ని తొలగించాలి. తేలికపాటి లిక్విడ్ డిటర్జెంట్, నిమ్మరసం వంటి వాటిని అప్లై చేసి.. స్టెయిన్ రిమూవర్‌తో మరకల్ని తొలగించడం బెస్ట్ ఆప్షన్. ఆ తర్వాత మరకలు తొలగిన తర్వాత వాష్ మెషిన్‌లో వేసి బట్టలు ఉతక వచ్చు.



మీకు తెలుసా?

చాలా మంది కూల్ డ్రింక్స్ తాగుతుంటారు. అందులోనూ సోడా ఉండే వాటిని ఎక్కువ మంది ఇష్టంగా తీసుకుంటారు. వేసవికాలం, చలికాలం అనే సంబంధం లేకుండా వీటి వాడకం ఎక్కువగా ఉంటుంది. వీటి వల్ల కలిగే ప్రయోజనాల కన్నా... ఆరోగ్య సమస్యలే ఎక్కువ. కూల్ డ్రింకులు, సోడాలు, చక్కెర పానీయాలు తాగడం వల్ల మధుమేహం,ఊబకాయం, కొవ్వు పెరిగి కాలేయం, మెటబాలిక్ సిండ్రోమ్ ప్రమాదాన్ని పెంచుతుంది. కొందరు సోడాకు బదులు డైట్ సోడా తాగితే ఆరోగ్యంపై అంతగా ప్రభావం ఉండదని అనుకుంటూ ఉంటారు. కానీ, మెటబాలిక్ సిండ్రోమ్, అలాగే స్ట్రోక్ ప్రమాదాలను పెంచుతుందని పలు అధ్యయనాల్లో తేలింది. మరి కొన్ని పరిశోధనల ప్రకారం, డైట్ సోడా వినియోగం కూడా ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదాన్ని పెంచుతుంది.



డాల్బీ విజన్‌లో సినిమా చూడటం భిన్నమైన అనుభవం

– రాజమౌళి



''ఆర్‌ఆర్‌ఆర్' సినిమాని డాల్బీ విజన్‌లో గ్రేడ్ చేయాలనుకున్నప్పుడు జర్మనీ వరకు ప్రయాణించాల్సి వచ్చింది. మన దేశంలో డాల్బీ విజన్‌లో నా సినిమాను ఎక్స్‌పీరియన్స్ చేయలేకపోవడం కొంచెం నిరుత్సాహపరిచింది. ఇప్పుడు అన్నపూర్ణ స్టూడియోస్‌లో డాల్బీ విజన్ గ్రేడింగ్ సౌకర్యాన్ని చూసి థ్రిల్ అయ్యాను'' అని దర్శకుడు ఎస్‌ఎస్ రాజమౌళి చెప్పారు. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ హైదరాబాద్‌లో సినిమా-హోమ్ కోసం భారతదేశంలో మొట్టమొదటి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్ ప్రొడక్షన్ ఫెసిలిటీ స్టూడియోను నెలకొల్పింది. అన్నపూర్ణ స్టూడియోస్ వైస్ చైర్మన్, హీరో నాగార్జున అక్కినేని సమక్షంలో ఈ స్టూడియోను రాజమౌళి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ– ''డాల్బీ విజన్‌లో సినిమా చూడటం భిన్నమైన అనుభవం. స్పష్టత, ప్రతి ఫ్రేమ్‌లోని సూక్ష్మ నైపుణ్యాలను పెంచే విధానం కథను పూర్తిగా కొత్త స్థాయికి తీసుకువెళుతుంది. నా తర్వాతి సినిమా విడుదలయ్యే సమయానికి భారతదేశం అంతటా మళ్లీ డాల్బీ సినిమా ఉంటుంది. ప్రేక్షకులు దాన్ని అనుభూతి చెందడం థ్రిల్లింగ్‌గా ఉంటుంది'' అన్నారు. ''అన్నపూర్ణ స్టూడియోస్ 50వ సంవత్సరాన్ని జరుపుకుంటున్న సందర్భంగా వర్చ్యువల్ ప్రొడక్షన్‌లో అగ్రగామిగా ఉండడం, దేశంలో తొలి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్ ప్రొడక్షన్ ఫెసిలిటీ ఫర్ సినిమా-హోమ్‌ను ఏర్పాటు చేయడం గర్వంగా ఉంది. భారతీయ సినిమాలను మ్యాప్‌లో ఉంచడమే మా ప్రయత్నం'' అన్నారు నాగార్జున. అన్నపూర్ణ స్టూడియోస్ ఈడీ సుప్రియ యార్లగడ్డ తదితరులు పాల్గొన్నారు.

ఊహలకు మించి ఉంటుంది

– బాలకృష్ణ



● ఊర్వశి రౌతేలా, శ్రద్ధా శ్రీనాథ్, బాలకృష్ణ, ప్రగ్యా జైస్వాల్

''సంక్రాంతి పండగకి విడుదలైన నా సినిమాలన్నీ ఘన విజయం సాధించాయి. ఈ సంక్రాంతి కానుకగా రిలీజవుతున్న 'డాకు మహారాజ్' కూడా ఘన విజయం సాధిస్తుంది. ఈ చిత్రం గురించి ప్రేక్షకులు ఏం ఊహించుకుంటున్నారో అంతకు మించి ఈ సినిమా ఉంటుంది'' అని బాలకృష్ణ చెప్పారు. బాబీ కొల్లి దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా నటించిన చిత్రం 'డాకు మహారాజ్'. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా, బాబీ డియోల్, ఊర్వశి రౌతేలా కీలక పాత్రలు చేశారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ మూవీ రేపు (ఆదివారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో బాలకృష్ణ మాట్లాడుతూ– ''తిరుపతి తొక్కిసలాట ఘటన నన్ను ఎంతో కలిచివేసింది. 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి'.. ఇలా వరుస ఘన విజయాల తర్వాత వస్తున్న 'డాకు మహారాజ్'తో మరో ఘన విజయాన్ని అందుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. బాబీ కొల్లి మాట్లాడుతూ–''నా టీమ్‌తో కలిసి ఎంతో శ్రద్ధగా 'డాకు మహారాజ్' కథని సిద్ధం చేశాను. బాలకృష్ణగారితో ఒకసారి పని చేస్తే మళ్లీ పని చేయాలనిపిస్తుంటుంది'' అని చెప్పారు. సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ– ''ఐదేళ్ల క్రితం వైకుంఠ ఏకాదశి రోజున 'అల వైకుంఠపురములో' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ చేసి, జనవరి 12న ఆదివారం సినిమా విడుదల చేశాం. ఇప్పుడు 'డాకు మహారాజ్'కి కూడా అదే జరిగింది. 'అల వైకుంఠపురములో'లాగే ఈ సినిమా కూడా విజయం సాధిస్తుంది'' అని పేర్కొన్నారు. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ–''కొన్ని సినిమాలకు ప్రాణం పెట్టి సంగీతం చేయాలనిపిస్తుంది. అలాంటి సినిమా 'డాకు మహారాజ్'' అన్నారు. ఈ వేడుకలో వైజాగ్ ఎంపీ భరత్, బాలకృష్ణ కుమార్తె తేజస్విని, కెమెరామేన్ విజయ్ కన్నన్, రచయిత మోహన్ కృష్ణ తదితరులు పాల్గొని, 'డాకు మహారాజ్' చిత్రం ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు.



"సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలోని 'బ్లాక్ బస్టర్ పొంగల్...' అనే పాట వెంకటేశ్‌గారికి చాలా నచ్చింది. దీంతో ఆయనే స్వయంగా ఆ పాట పాడతానని చెప్పడంతో నేను షాక్ అయ్యాను. కానీ ఆయన 20 నిమిషాల్లో ఆ పాట పాడటంతో సంగీత దర్శకుడు భీమ్స్ కూడా షాక్ అయ్యాడు" అని డైరెక్టర్ అనిల్ రావిపూడి చెప్పారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి విలేకరులతో పంచుకున్న విశేషాలు...

సంక్రాంతికే రావాలనుకున్నాం

– అనిల్ రావిపూడి

● వెంకటేశ్‌గారితో నేను తీసిన 'ఎఫ్ 2' (2019) సంక్రాంతికి వచ్చి, విజయం సాధించింది. 'ఎఫ్ 3' కూడా సంక్రాంతికి రావాల్సింది కానీ మిస్ అయ్యింది. మా కాంబోలో మూడో సారి చేసే సినిమాని ఎలాగైనా పండగకి తీసుకొస్తే బావుంటుందని సినిమా ఆరంభం అప్పుడే సంక్రాంతికి రావాలనుకున్నాం. కథ అనుకున్నప్పుడే 'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్‌కి ఫిక్స్ అయ్యాం. 'సంక్రాంతికి వస్తున్నాం' కథ ఒక రెస్క్యూ ఆపరేషన్‌కి సంబంధించినది. సెకండ్ హాఫ్‌లో నాలుగు రోజుల ప్రయాణం సంక్రాంతికి ముందు ల్యాండ్ అవుతుంది. ఒక భార్య, మాజీ ప్రేయసి మధ్య నలిగే ఓ భర్త పాత్ర వెంకటేశ్‌గారిది. ప్రతి ఫ్యామిలీ రిలేట్ చేసుకునే సినిమా ఇది. ట్రైలర్ అందరికీ బాగా నచ్చింది. థియేటర్స్‌కి వచ్చాక సినిమా అద్భుతంగా నచ్చితే మూవీ బ్లాక్ బస్టరే. ● కోవిడ్ తర్వాత సినిమా సినారియో మారిపోయింది. మంచి కథ రాసి, గొప్పగా తీస్తే సరిపోదు. థియేటర్స్‌కి జనాలు రాకపోతే సినిమాకి రీచ్ ఉండదు. ఇప్పుడు ఆడియన్స్ బాగా సెలెక్టివ్ అయిపోయారు. మన సినిమా వారి అటెన్షన్‌ని గ్రాబ్ చేస్తేనే ఓపెనింగ్స్ తెచ్చుకోగలమని నా అభిప్రాయం. ఈసారి ప్రమోషన్‌పై ఎక్కువ ఫోకస్ పెట్టాం. వెంకటేశ్‌గారి లాంటి పెద్ద స్టార్ హీరో సరదాగా అల్లరి చేయడం, రీల్స్ చేయడం ప్రమోషన్స్‌కి చాలా హెల్ప్ అయ్యింది. నేను హీరోలకి ఫ్యాన్‌గానే ఉంటాను. రిలేషన్‌ని పాజిటివ్‌గా ఉంచుతాను కాబట్టి వాళ్ల నుంచి కూడా అంతే ప్రేమ వస్తుంది. ● 'దిల్' రాజుగారితో 'పటాస్' సినిమాతో నా ప్రయాణం ఆరంభమైంది. రాజు గారు, శిరీష్ గారు అంటే నా కుటుంబం లెక్క. మాది పదేళ్ల ప్రయాణం. ఇక ఉమెన్ సెంట్రిక్‌గా ఒక స్పోర్ట్స్ స్టోరీ చేయాలని ఎప్పటి నుంచో ఉంది. కొన్నాళ్ల తర్వాత ఆ నేపథ్యంలో మూవీ చేస్తాను. 'ఎఫ్ 4' సినిమా కచ్చితంగా ఉంటుంది. అయితే దానికి ఇంకా సమయం ఉంది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకి కూడా ఫ్రాంచైజీలు చేసుకునే అవకాశం ఉంది.

థ్రిల్లర్ రెడీ



● రవి వర్మ, శ్రీవిద్య, పూజా రామచంద్రన్

ధన్యా బాలకృష్ణ, రవి వర్మ, పూజా రామచంద్రన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీ 'హత్య'. శ్రీవిద్య బసవ దర్శకత్వంలో ఎస్. ప్రశాంత్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో రవి వర్మ మాట్లాడుతూ– ''శ్రీవిద్య కొత్త టైప్ ఆఫ్ మేకింగ్‌కి తెర తీసింది. ఈ చిత్రంలో నేను చాలెంజింగ్ రోల్ చేశాను. ఈ మూవీ ఆడియన్స్‌కు ఓ సరికొత్త అనుభూతిని ఇస్తుంది'' అన్నారు. ''చాలా కాలం తర్వాత 'హత్య' వంటి ఓ డిఫరెంట్ మూవీతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను'' అన్నారు పూజా రామచంద్రన్. ''నా తొలి చిత్రం 'మధ' తరహాలోనే నా రెండో చిత్రం 'హత్య' కూడా థ్రిల్లర్ మూవీ. ప్రేక్షకులు ఈ మూవీని ఆదరించాలి'' అని కోరారు శ్రీవిద్య. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ నరేశ్ కుమారన్ .పి మాట్లాడారు.

ఒక పథకం ప్రకారం....

సాయిరామ్ శంకర్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఒక పథకం ప్రకారం'. వినోద్ కుమార్ విజయన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో శ్రుతీ సోధి, ఆషిమా నర్వాల్ హీరోయిన్లుగా నటించారు. సముద్ర ఖని కీలక పాత్ర చేశారు. వినోద్ కుమార్ విజయన్, గార్లపాటి రమేశ్ నిర్మించారు. ఫిబ్రవరి 7న ఈ చిత్రం విడుదల కానుంది. శుక్రవారం ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. వినోద్ కుమార్ విజయన్ మాట్లాడుతూ– ''ఇదొక విభిన్నమైన కథ. అడ్వొకేట్ పాత్రలో సాయిరామ్ శంకర్, పోలీసు పాత్రలో సముద్ర ఖని నటన పోటాపోటీగా ఉంటుంది. ఊహించని మలుపులతో సాగే క్రైమ్, మిస్టరీ కథనాలతో మా సినిమా ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపడేస్తుంది'' అని పేర్కొన్నారు.



● సాయిరామ్ శంకర్

ఓటీటీ ఇది చూడొచ్చు

నాటి రామాయణం నేటి పాత్రలతో.....

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం సింగమ్ ఎగైన్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



మన ఇతిహాసాలలో గొప్ప విలువలతో కూడుకున్న కథ రామాయణం. నాటి రామాయణాన్ని నేటి నేటివిటీతో ప్రస్తుత ప్రముఖ నటీనటులతో మళ్లీ మన ముందుకు తీసుకు వచ్చే ప్రయత్నం చేశారు బాలీవుడ్ దర్శకుడు రోహిత్ శెట్టి. ఇదే ప్రయత్నాన్ని గతంలో చాలా మందే చేసినా యాక్షన్ నేపథ్యంలో వచ్చిన 'సింగమ్' సిరీస్ చిత్రానికి ఈ తరహా ప్రయోగం చేయడం మొదటిసారి. అందులోనూ బాలీవుడ్‌లో భారీ తారాగణంతో ఇలాంటి అంశంతో కూడిన కథ తీయడమనేది నిజంగా సాహసమనే చెప్పాలి. ముందుగా 'సింగమ్' సిరీస్ గురించి చెప్పుకుందాం. ఈ సిరీస్‌లో వచ్చిన మూడో చిత్రం 'సింగమ్ ఎగైన్'. సిరీస్‌లో ఈ భాగం ప్రేక్షకుల ముందు రావడానికి దాదాపు పదేళ్లు పట్టింది. 2011లో 'సింగమ్' మొదటి చిత్రం రాగా 2014లో రెండో భాగంగా 'సింగమ్ రిటర్న్స్' విడుదలైంది. ఆ తరువాత మూడో భాగం 2024లో 'సింగమ్ ఎగైన్'గా వచ్చింది. అన్ని సిరీస్‌లలో కథానాయకుడిగా ప్రముఖ స్టార్ అజయ్ దేవగన్ నటించారు. ఇకపోతే ప్రస్తుత 'సింగమ్ అగైన్' చిత్రంలో అజయ్ దేవగన్‌తో పాటు కరీనా కపూర్, దీపికా పదుకోన్, అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, అర్జున్ కపూర్ తదితర ప్రముఖ నటులు నటించారు. రామాయణ కథనే ఇతివృత్తంగా అల్లుకున్న కథ ఇది. రామాయణంలోని పాత్రలను రిలేట్ చేస్తూ ఒక్కో పాత్రను పరిచయం చేస్తూ స్క్రీన్‌ప్లే కొనసాగుతుంది. ప్రత్యేకంగా చెప్పాలంటే సినిమాలో రామాయణ కథను టీవీ షో రూపంలో చూపిస్తూ కథను నడిపిస్తారు. అప్పటి రామాయణ కథ చరిత్రతో మనకు పరిచయం. అందుకే అది రమణీయ కావ్యం. కానీ ఇప్పటి 'సింగమ్ ఎగైన్' రణరంగమే ప్రధాన సూత్రంగా నడిచిన కథ. ఆఖరుగా ఒక్క మాట... రామాయణ కథను నేటి తరానికి మళ్లీ చెప్పడమనేది మంచిదే కానీ, ఎన్నో భావావేశాలున్న రామాయణ మూల కథలోంచి ఒక్క శౌర్య, వీర రసం మాత్రం తీసుకుని సినిమా రూపొందించడం ఏమాత్రం సమంజసమో సినిమా తీసిన దర్శక-నిర్మాతలు, చూస్తున్న మన లాంటి ప్రేక్షకులు ఆలోచించాల్సిందే. ప్రైమ్ వీడియో ఓటీటీ వేదికగా ఈ సినిమా స్ట్రీమ్ అవుతోంది. మీరు కూడా చూసి ఆలోచించడం మొదలు పెట్టండి.

– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	241	77,379
నిఫ్టీ ▽	95	23,431

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	19,149	▽ 331
డోజోన్స్	41,956	▽ 679
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,248	▽ 71
డాక్స్	20,215	▽ 102
షాంఘై	3,169	▽ 43
నికాయ్	39,190	▽ 415

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారట్)	78,018	△ 400
బంగారం (22 క్యారట్)	77,706	△ 399
వెండి (కిలో)	90,268	△ 468

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	84.48	86.50
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.80	108.66
€	యూరో	ఒకటి	87.27	89.87
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	53.68	55.01
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.22	54.40
S$	సింగపూర్ డాలర్	భారతీయ	60.50	65.19
SAR	సౌదీ రియాల్	భారతీయ	22.03	23.58
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయ	22.52	24.30
¥	చైనా యువాన్	భారతీయ	10.84	12.67

ఇండస్ నుంచి వొడాఫోన్ ఔట్

న్యూఢిల్లీ: టెలికం మౌలిక సదుపాయాల దేశీ కంపెనీ ఇండస్ టవర్స్ నుంచి మొబైల్ దిగ్గజం వొడాఫోన్ గ్రూప్ వైదొలగింది. బుక్‌బిల్డింగ్ ద్వారా ఇండస్‌లోగల 3 శాతం వాటాను విక్రయించినట్లు తాజాగా వెల్లడించింది. తద్వారా బ్రిటిష్ టెలికం కంపెనీ రూ. 2,800 కోట్లు అందుకుంది. వీటిలో రూ. 800 కోట్లు రుణ చెల్లింపులకు వినియోగించనుంది. మొత్తం 7.92 కోట్ల షేర్లను అమ్మివేసినట్లు వొడాఫోన్ గ్రూప్ వెల్లడించింది. పరోక్ష అనుబంధ సంస్థలు ఒమెగా టెలికం హోల్డింగ్స్, ఉషా మార్టిన్ టెలిమాటిక్స్ ద్వారా కలిగి ఉన్న 3 శాతం వాటాను బుక్‌బిల్డింగ్‌లో ఆఫర్ చేసినట్లు తెలియజేసింది. నిధులలో మిగిలిన 1,910 కోట్లను దేశీ మొబైల్ కంపెనీ వొడాఫోన్ ఐడియాలో 170 కోట్ల షేర్ల కొనుగోలుకి వెచ్చించనున్నట్లు పేర్కొంది. తద్వారా వొడాఫోన్ ఐడియాలో వాటాను 22.56% నుంచి 24.39 శాతానికి పెంచుకోనుంది.



- 3 శాతం వాటా విక్రయం
- డీల్ విలువ రూ. 2,800 కోట్లు

10 నిమిషాల్లో ఇంటికి ల్యాప్‌టాప్

బ్లింకిట్ సరికొత్త సేవలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జొమాటోకు చెందిన క్విక్ కామర్స్ కంపెనీ బ్లింకిట్ తాజాగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల విభాగంలో మరో అడుగు ముందుకేసింది. ల్యాప్‌టాప్స్, మానిటర్స్, ప్రింటర్స్‌ను 10 నిమిషాల్లో డెలివరీ చేయనున్నట్లు ప్రకటించింది. హెచ్‌పీ, లెనోవో, కెనాన్, జీబ్రానిక్స్, ఎంఎస్‌ఐ వంటి బ్రాండ్లతో చేతులు కలిపినట్లు కంపెనీ వెల్లడించింది. మరిన్ని ఉత్పత్తులను జోడించనున్నట్లు తెలిపింది. ప్రస్తుతానికి ఈ సేవలు మెట్రో నగరాల్లోని కస్టమర్లకు అందించనున్నట్లు బ్లింకిట్ సీఈవో అల్బీందర్ ధిండ్సా తెలిపారు.

జోస్ ఆలుక్కాస్ సంక్రాంతి ఆఫర్లు

హైదరాబాద్: సంక్రాంతి సందర్భంగా జోస్ ఆలుక్కాస్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. వజ్రాభరణాలపై 20%, ప్లాటినం కలెక్షన్లపై 7% తగ్గింపు అందిస్తుంది. వెండి ఆభరణాల కొనుగోలుపై ఎలాంటి తరుగు ఛార్జీలు ఉండవు. పాత బంగారాన్ని బీఐఎస్ హెచ్‌యూఐడీ హాల్‌మార్క్ బంగారు ఆభరణాలతో మార్చుకునే సదుపాయం కల్పిస్తుంది. కస్టమర్ల సంక్రాంతి సంబరాలకు జోస్ ఆలుక్కాస్ అద్భుత డిస్కౌంట్లు, ప్రయోజనాలను జోడిస్తున్నందుకు సంతోషంగా ఉందని చైర్మన్ జోస్ ఆలుక్కాస్ తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో.. 2024-25లో నిధుల సమీకరణ జోరు: సెబి / వ్యక్తిగత రుణాలపై స్థిర వడ్డీ రేటు: ఆర్‌బీఐ



ఎలక్ట్రిక్ కిసిక్!

కొత్త ఏడాదిలో ఎలక్ట్రిక్ ఎస్‌యూవీలు దుమ్మురేపేందుకు ఫుల్ చార్జ్ అవుతున్నాయి. దేశీ కంపెనీలతో పాటు విదేశీ దిగ్గజాలు సైతం భారత్ మార్కెట్లోకి పలు కొంగొత్త మోడళ్లను విడుదల చేసే సన్నాహాల్లో ఉన్నాయి. ముఖ్యంగా దేశీ కార్ల దిగ్గజం మారుతీ సుజుకీ తన ఎలక్ట్రిక్ జర్నీ షురూ చేస్తోంది. ఎలాన్ మస్క్ టెస్లా కూడా ఈ ఏడాదే మన ఈవీ మార్కెట్ రేసుకు సిద్ధమవుతోంది. ఈ నెలలో జరగనున్న అతిపెద్ద భారత్ మొబిలిటీ ఆటో షోలో అనేక కంపెనీలు 'ఎలక్ట్రిక్' ఆవిష్కరణలతో ఫాస్ట్ ట్రాక్‌లో దూసుకెళ్లనున్నాయి.

కొత్త ఏడాదిలో ఈ-ఎస్‌యూవీల జాతర...

- ఈ-విటారాతో మారుతీ సుజుకీ అరంగేట్రం
- జాబితాలో మహీంద్రా, టాటా, ఎంజీ, హ్యుందాయ్, టయోటా, బీవైడీ
- ఆటో షోలో ఆవిష్కరణలకు రెడీ
- భారత్‌లోకి తొలిసారి టెస్లా ఈవీలు!

గతేడాది రికార్డు ఈవీ అమ్మకాలతో జోష్ మీదున్న వాహన దిగ్గజాలు... 2025లో రెట్టించిన ఉత్సాహంతో గ్రీన్ కార్ల కుంభమేళాకు సై అంటున్నాయి. ఈ ఏడాది కొత్తగా రోడ్డెక్కనున్న ఈవీల్లో అత్యధికంగా ఎస్‌యూవీలే కావడం విశేషం! కాలుష్యానికి చెక్ చెప్పడం, క్రూడ్ దిగుమతుల భారాన్ని తగ్గించుకునే చర్యల్లో భాగంగా పర్యావరణానుకూల వాహనాలను ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తోంది. దీంతో దాదాపు దేశంలోని అన్ని కార్ల కంపెనీలూ ఎలక్ట్రిక్ మార్కెట్లో వాటా కొల్లగొట్టేందుకు పోటీ పడుతున్నాయి. ఇందులో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది దేశీ కార్ల అగ్రగామి మారుతీ. సంప్రదాయ పెట్రోల్, డీజిల్ వాహన రంగంలో ఎదురులేని రారాజుగా ఉన్న మారుతీ తొలిసారి ఈవీ అరంగేట్రం చేస్తోంది. హ్యుందాయ్‌తో పాటు లగ్జరీ దిగ్గజాలు మెర్సిడెస్, ఆడి, స్కోడా కూడా తగ్గేదేలే అంటున్నాయి. ఇక ఎలక్ట్రిక్ వాహన మార్కెట్లో టాప్‌గేర్‌లో దూసుకుపోతున్న టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్, మహీంద్రాతో సహా చైనా దిగ్గజం బీవైడీ ఈవీ డ్రైవ్‌తో పోటీ మరింత హీటెక్కనుంది. వీటి ప్రారంభ ధరలు రూ. 16 లక్షల నుంచి రూ. 80 లక్షల రేంజ్‌లో ఉండొచ్చని అంచనా.


ఆటో ఎక్స్‌పో వేదికగా...


అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భారత్ మొబిలిటీ మెగా ఆటో షో (జనవరి 17–22 వరకు)లో 16 కార్ల కంపెనీలు కొలువుదీరనున్నాయి. ఇందులో పెట్రోలు, డీజిల్, హైబ్రిడ్ వాహనాలు ఉన్నప్పటికీ ఈసారి ఆధిపత్యం ఈవీలదే. అయితే అందరి కళ్లూ మారుతీ తొలి పూర్తి బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం (బీఈవీ) ఈ-విటారా పైనే ఉన్నాయి. దీని రేంజ్ 500 కిలోమీటర్లకు మించి ఉంటుందని, ధర రూ.15 లక్షలతో ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. హ్యుందాయ్ క్రెటా ఈవీ కూడా ఆసక్తి రేకెత్తిస్తోంది. ఇక గతేడాది మార్కెట్ వాటాను కొద్దిగా పెంచుకున్న మహీంద్రా ఈ ఏడాది ఎలక్ట్రిక్ గేర్ మారుస్తోంది. రెండు ఈవీ ఎస్‌యూవీలను రోడ్డెక్కించనుంది. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఎలక్ట్రిక్ వాటా 2024లో ఏకంగా రెట్టింపై 21 శాతానికి ఎగబాకింది. విండ్సర్‌తో భారత్ ఈవీ మార్కెట్లో సంచలనానికి తెరతీసింది. గడిచిన 3 నెలల్లో 10 వేలకు పైగా విక్రయాలతో అదరగొట్టింది. బ్యాటరీ రెంటల్ సర్వీస్ (బీఏఏఎస్)ను అందించడం వల్ల కారు ధర కస్టమర్లకు మరింత అందుబాటులోకి వచ్చినట్లయింది. హ్యుందాయ్ వెన్యూ, కియా కారెన్స్ ఈవీలు కూడా క్యూలో ఉన్నాయి.

2025 ఎలక్ట్రిక్ రైడ్..

కంపెనీ	మోడల్	ప్రారంభ ధర (రూ.లలో)*
మహీంద్రా	బీఈ6	19 లక్షలు
మహీంద్రా	ఎక్స్‌ఈవీ 9ఈ	22 లక్షలు
మారుతీ	ఈ-విటారా	25 లక్షలు
జేఎస్‌డబ్ల్యూ ఎంజీ	సైబర్‌స్టర్	80 లక్షలు
హ్యుందాయ్	క్రెటా ఈవీ	22 లక్షలు
హ్యుందాయ్	అయోనిక్6	50 లక్షలు
కియా	కారెన్స్	16 లక్షలు
టాటా మోటార్స్	హ్యారియర్	24 లక్షలు
టాటా మోటార్స్	సఫారీ	26 లక్షలు
స్కోడా	ఎన్యాక్	50 లక్షలు
టయోటా	అర్బన్ క్రూయిజర్	20 లక్షలు
బీవైడీ	జీఏసీ3	25 లక్షలు
టెస్లా	మోడల్ ఎస్, 3	70 లక్షలు

* అంచనా






అన్ని కంపెనీలూ ఎలక్ట్రిక్ బాట పడుతుండటంతో టాటా మోటార్స్ వాటా గతేడాది 62%కి (2023లో 73%) తగ్గింది. అయితే, సియరా, సఫారీ, హ్యారియర్ ఎస్‌యూవీ ఈవీలతో మార్కెట్‌ను షేక్ చేసేందుకు రెడీ అవుతోంది.

టెస్లా వచ్చేస్తోంది...

భారత్‌లో ఎంట్రీ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్న ఎలక్ట్రిక్ కార్ కింగ్ టెస్లా ఈ ఏడాది ముహూర్తం ఖరారు చేసింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఘన విజయం, ప్రభుత్వంలో ఎలాన్ మస్క్ కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో దిగుమతి సుంకం విషయంలో త్వరలోనే భారత్ సర్కారుతో సయోధ్య కుదిరే అవకాశం ఉందని అధికార వర్గాల సమాచారం. దేశంలో టెస్లా ప్లాంట్ ఏర్పాటు చేయాలని మోదీ సర్కారు పట్టుబడుతుండగా.. ముందుగా దిగుమతి రూట్లో వచ్చేందుకు మస్క్ మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే బెంగళూరు ఆర్‌ఓసీలో టెస్లా ఇండియా మోటార్స్ అండ్ ఎనర్జీ పేరుతో కంపెనీ రిజిస్టర్ కూడా చేసుకుంది. పలు నగరాల్లో రిటైల్ షోరూమ్స్ ఏర్పాటు కోసం కంపెనీ లొకేషన్లను అన్వేషిస్తోంది. తొలుత కొన్ని మోడళ్లను (మోడల్ ఎస్, మోడల్ 3) పూర్తిగా దిగుమతి చేసుకుని ఇక్కడ విక్రయించనుంది. వీటి ప్రారంభ రూ. 70 లక్షలు ఉంటుందని పరిశ్రమ వర్గాలు లెక్కలేస్తున్నాయి.

- సాక్షి, బిజినెస్ డెస్క్





మూడో రోజూ నష్టాలే

241 పాయింట్లు పతనమైన సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్ మూడోరోజూ అమ్మకాల ఒత్తిడికి లోనైంది. కార్పొరేట్ ఆదాయాలపై ఆందోళనలతో ఫైనాన్స్, బ్యాంక్ షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 241 పాయింట్లు పతనమై 77,379 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 95 పాయింట్లు పతనమై 23,431 వద్ద నిలిచింది.

- డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు మెప్పించడంతో టీసీఎస్ షేరు 6% పెరిగి రూ.4,266 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.82,818 కోట్లు పెరిగి రూ.15.43 లక్షల కోట్లకు చేసింది. టీసీఎస్ షేరు ర్యాలీతో ఇదే రంగానికి చెదిన టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్, విప్రో, ఎల్‌టీఐఎం, పెర్సిస్టెంట్ షేర్లు 5–3 శాతం లాభపడ్డాయి.
- ఈక్విటీ మార్కెట్ వరుస పతనంతో ఇన్వెస్టర్లు 3 రోజుల్లో రూ.12.07 లక్షల కోట్లు కోల్పోయారు. బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.429.67 లక్షల కోట్లకు దిగివచ్చింది.

రూపాయి @ 86.04

రూపాయి తొలిసారి 86 స్థాయిని కోల్పోయింది. డాలర్ మారకంలో శుక్రవారం 18 పైసలు బలహీనపడి 86.04 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరగడం, డాలర్ ఇండెక్స్ ర్యాలీ, ఈక్విటీ మార్కెట్లో అనిశ్చితులు దేశీయ కరెన్సీపై ఒత్తిడి పెంచాయని నిపుణులు తెలిపారు.

6 నెలల గరిష్టానికి ఐఐపీ

- నవంబర్‌లో 5.2 శాతం పెరుగుదల



న్యూఢిల్లీ: పండుగ సీజన్ డిమాండ్, తయారీ రంగం పుంజుకోవడం తదితర అంశాల కారణంగా గతేడాది నవంబర్‌లో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధి ఆరు నెలల గరిష్టానికి చేరింది. 5.2 శాతంగా నమోదైంది. అంతక్రితం ఏడాది నవంబర్‌లో ఇది 2.5 శాతం. చివరిసారిగా 2024 మేలో ఐఐపీ వృద్ధి అత్యధికంగా 6.3 శాతం స్థాయిలో నమోదైంది. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఏప్రిల్–నవంబర్ మధ్య వ్యవధిలో ఐఐపీ వృద్ధి 4.1 శాతంగా ఉంది. అంతక్రితం ఏడాది ఈ వ్యవధిలో 6.5 శాతంగా నమోదైంది.



పోరాడి ఓడిన యూకీ-ఒలివెట్టి జోడీ

ఏఎస్‌బీ క్లాసిక్ ఆక్లాండ్ ఓపెన్-ఏటీపీ 250 టెన్నిస్ టోర్నీలో భారత డబుల్స్ ప్లేయర్ యూకీ బాంబ్రీ పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో యూకీ బాంబ్రీ (భారత్)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) ద్వయం 3-6, 6-1, 5-10తో 'సూపర్ టైబ్రేక్'లో టాప్ సీడ్ నికోల్ మెక్‌టిక్ (క్రొయేషియా)-మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జోడీ చేతిలో ఓడిపోయింది. 71 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ, ఒలివెట్టి ఒక్క ఏస్ కూడా సంధించకుండానే ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేయడం గమనార్హం. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయిన యూకీ-ఒలివెట్టి ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేశారు. చెరో సెట్ గెలిచాక నిర్ణాయక 'సూపర్ టైబ్రేక్'లో మెక్‌టిక్-వీనస్ ద్వయం పైచేయి సాధించి ఫైనల్లోకి ప్రవేశించింది. సెమీఫైనల్లో ఓడిన యూకీ-ఒలివెట్టి జంటకు 11,310 డాలర్ల (రూ. 9 లక్షల 74 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ

కౌలాలంపూర్: కొత్త ఏడాదిని టైటిల్‌తో ప్రారంభించాలనే లక్ష్యం దిశగా భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఒక అడుగు ముందుకు వేసింది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో సాత్విక్-చిరాగ్ ద్వయం సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ జంట 26-24, 21-15తో యె సిన్ ఓంగ్-ఈ యి టియో (మలేసియా) జోడీపై గెలిచింది. 49 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్, మహారాష్ట్ర ప్లేయర్ చిరాగ్ తొలి గేమ్‌లో నాలుగు గేమ్ పాయింట్లు కాపాడుకోవడం విశేషం. రెండో గేమ్‌లోనూ భారత జోడీకి గట్టిపోటీ లభించింది. ఒకదశలో సాత్విక్-చిరాగ్ 8-11తో వెనుకబడ్డారు. కానీ భారత జంట ఇదే స్కోరు వద్ద వరుసగా నాలుగు పాయింట్లు గెలిచి 12-11తో ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత స్కోరు 12-12తో సమమైంది. ఈ దశలో సాత్విక్-చిరాగ్ వరుసగా మూడు పాయింట్లు నెగ్గి 15-12తో ముందంజ వేశారు. అదే జోరులో గేమ్‌ను సొంతం చేసుకున్న సాత్విక్-చిరాగ్ వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకున్నారు. నేడు జరిగే సెమీఫైనల్లో కిమ్ వన్ హో-సియో సెయంగ్ జే (దక్షిణ కొరియా)లతో సాత్విక్-చిరాగ్ తలపడతారు.

నిశేష్ జోరుకు మోన్‌ఫిల్స్ బ్రేక్

ఆక్లాండ్: ఏఎస్‌బీ క్లాసిక్ ఆక్లాండ్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో తెలుగు సంతతి అమెరికన్ టీనేజర్ నిశేష్ బసవరెడ్డి విజయ పరంపరకు బ్రేక్ పడింది. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 133వ ర్యాంకర్ నిశేష్ 6-7 (5/7), 4-6తో ప్రపంచ 52వ ర్యాంకర్, ఫ్రాన్స్ సీనియర్ స్టార్ ప్లేయర్ గేల్ మోన్‌ఫిల్స్ చేతిలో ఓడిపోయాడు. మోన్‌ఫిల్స్‌తో 1 గంట 46 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో 19 ఏళ్ల నిశేష్ మూడు ఏస్‌లు సంధించాడు. తొలి సెట్‌లో ఇద్దరూ తమ సర్వీస్‌లను కాపాడుకోవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో మోన్‌ఫిల్స్ పైచేయి సాధించాడు. రెండో సెట్ కూడా హోరాహోరీగా సాగింది. స్కోరు 4-4 వద్ద ఉన్నప్పుడు తొమ్మిదో గేమ్‌లో నిశేష్ సర్వీస్‌ను మోన్‌ఫిల్స్ బ్రేక్ చేసి 5-4తో ముందంజ వేశాడు. ఆ తర్వాత పదో గేమ్‌లో తన సర్వీస్‌ను నిలబెట్టుకున్న మోన్‌ఫిల్స్ విజయాన్ని ఖరారు చేసుకొని కెరీర్‌లో 35వసారి ఏటీపీ టోర్నీలో ఫైనల్‌కు చేరుకున్నాడు. సెమీస్‌లో ఓడిన నిశేష్‌కు 35,480 డాలర్ల (రూ. 30 లక్షల 54 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 100 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. సోమవారం విడుదల చేసే ఏటీపీ ర్యాంకింగ్స్‌లో నిశేష్ 27 స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ 106వ ర్యాంక్‌కు చేరుకోనున్నాడు. ఈనెల 12న మొదలయ్యే ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ తొలి రౌండ్‌లో పదిసార్లు చాంపియన్, సెర్బియా దిగ్గజం జొకోవిచ్‌తో నిశేష్ తలపడతాడు.


నిశేష్

ప్రతీక, తేజల్ గెలిపించగా...

తొలి వన్డే భారత మహిళలదే

- మెరిసిన యువ బ్యాటర్లు
- 6 వికెట్లతో ఐర్లాండ్ ఓటమి
- రేపు రెండో వన్డే

రాజ్‌కోట్: భారత మహిళల క్రికెట్ జట్టులో ఇటీవలే కొత్తగా వచ్చిన ఇద్దరు యువ బ్యాటర్లు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సత్తా చాటారు. వన్డే కెరీర్‌లో కేవలం నాలుగో మ్యాచ్ ఆడుతున్న ప్రతీక రావల్, తేజస్ హసబ్నిస్ చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వీరిద్దరి ఆటకు సీనియర్ స్మృతి మంధాన తోడవటంతో ఐర్లాండ్ మహిళలతో జరిగిన తొలి వన్డే భారత్ ఖాతాలో చేరింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేయగా... భారత్ 34.3 ఓవర్లలో 4 వికెట్లకు 241 పరుగులు సాధించి గెలిచింది. సిరీస్‌లో భారత్ 1-0తో ముందంజలో నిలవగా, రెండో వన్డే ఆదివారం జరుగుతుంది.

రాణించిన గాబీ, లియా...

భారత్ కట్టుదిట్టమైన బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కోలేక ఐర్లాండ్ ఇబ్బంది పడింది. 29 పరుగుల వ్యవధిలో జట్టు తొలి నాలుగు వికెట్లు చేజార్చుకుంది. ఈ దశలో కెప్టెన్ గాబీ లూయిస్ (129 బంతుల్లో 92; 15 ఫోర్లు), లియా పాల్ (73 బంతుల్లో 59; 7 ఫోర్లు) కలిసి జట్టును ఆదుకున్నారు. 25 ఓవర్ల పాటు పట్టుదలగా క్రీజులో నిలబడిన ఈ జోడీ ఐదో వికెట్‌కు 117 పరుగులు జోడించింది. ఈ క్రమంలో గాబీ 75 బంతుల్లో, లియా 58 బంతుల్లో అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. కండరాల నొప్పితో బాధపడుతూ ఆడిన గాబీ త్రుటిలో తన తొలి సెంచరీని చేజార్చుకుంది. భారత్ పేలవ ఫీల్డింగ్ కూడా ఐర్లాండ్‌కు కలిసొచ్చింది. మన ఫీల్డర్లు నాలుగు సునాయాస క్యాచ్‌లు వదిలేశారు. ఇందులో ఒకటి గాబీ క్యాచ్, మరో రెండు లియా క్యాచ్‌లు కాగా...చివర్లో ఎర్లీన్ కెల్లీ (25 బంతుల్లో 28; 4 ఫోర్లు) క్యాచ్ కూడా వదిలేయడంతో ఐర్లాండ్ 50 ఓవర్లు ఆడగలిగింది.

భారీ భాగస్వామ్యం...

'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ప్రతీక రావల్ (96 బంతుల్లో 89; 10 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ స్మృతి మంధాన (29 బంతుల్లో 41; 6 ఫోర్లు, 1 సిక్స్) కలిసి వేగంగా ఛేదనను ప్రారంభించారు. వీరిద్దరు 10.1 ఓవర్లలోనే 70 పరుగులు జోడించడం విశేషం. ఆ తర్వాత తక్కువ వ్యవధిలోనే హర్లీన్ డియోల్ (32 బంతుల్లో 20; 2 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (6 బంతుల్లో 9; 2 ఫోర్లు) వెనుదిరిగారు.


తేజల్


గాబీ లూయిస్

ఇలాంటి స్థితిలో ప్రతీకకు తేజల్ (46 బంతుల్లో 53 నాటౌట్; 9 ఫోర్లు) జత కలిసింది. వీరిద్దరు దూకుడుగా ఆడుతూ జట్టును వేగంగా గెలుపు దిశగా తీసుకుపోయారు. 70 బంతుల్లో ప్రతీక, 43 బంతుల్లో తేజల్ హాఫ్ సెంచరీలు పూర్తయ్యాయి. భారత్ విజయం కోసం మరో 21 పరుగులు కావాల్సి ఉండగా, ప్రతీక 75 పరుగుల వద్ద ఉంది. ఈ దశలో మాగ్వైర్ బౌలింగ్‌లో 2 ఫోర్లు, సిక్స్‌తో 89కి చేరిన ఆమె మరో భారీ షాట్‌కు ప్రయత్నించి వెనుదిరిగింది. తేజల్‌తో కలిసి రిచా ఘోష్ (8 నాటౌట్) ఆట ముగించింది. ఈ మ్యాచ్‌తో సయాలీ సత్‌ఘరే భారత్ తరఫున వన్డేల్లో అరంగేట్రం చేసిన 152వ ప్లేయర్‌గా గుర్తింపు పొందింది.

స్కోరు వివరాలు

ఐర్లాండ్ ఇన్నింగ్స్: సారా ఫోర్బ్స్ (సి) దీప్తి (బి) సాధు 9; గాబీ లూయిస్ (సి అండ్ బి) దీప్తి 92; యునా రేమండ్ (రనౌట్) 5; ప్రెండర్‌గాస్ట్ (స్టంప్డ్) రిచా ఘోష్ (బి) ప్రియ 9; డెలానీ (బి) ప్రియా మిశ్రా 0; లియా పాల్ (రనౌట్) 59; క్రిస్టినా కూల్టర్ (నాటౌట్) 15; ఎర్లీన్ కెల్లీ (ఎల్బీ) (బి) సయాలీ 28; జార్జినా (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 238. వికెట్ల పతనం**: 1-27, 2-34, 3-56, 4-56, 5-173, 6-194, 7-230. **బౌలింగ్:** టిటాస్ సాధు 9-1-48-1, సయాలీ సత్‌ఘరే 10-2-43-1, సైమా ఠాకూర్ 10-0-30-0, ప్రియా మిశ్రా 9-1-56-2, దీప్తి శర్మ 10-1-41-1, ప్రతీక రావల్ 2-0-14-0.

భారత్ ఇన్నింగ్స్: స్మృతి (సి) ప్రెండర్‌గాస్ట్ (బి) సార్జంట్ 41; ప్రతీక రావల్ (సి) ప్రెండర్‌గాస్ట్ (బి) మాగ్వైర్ 89; హర్లీన్ డియోల్ (సి) ప్రెండర్‌గాస్ట్ (బి) మాగ్వైర్ 20; జెమీమా (స్టంప్డ్) కూల్టర్ (బి) మాగ్వైర్ 9; తేజల్ (నాటౌట్) 53; రిచా ఘోష్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (34.3 ఓవర్లలో 4 వికెట్లకు) 241. వికెట్ల పతనం:** 1-70, 2-101, 3-116, 4-232. **బౌలింగ్:** ఒర్లా ప్రెండర్‌గాస్ట్ 4.4-0-28-0, జార్జినా డెంప్సీ 5.3-0-50-0, ఎర్లీన్ కెల్లీ 6-0-29-0, ఫ్రేయా సార్జంట్ 8-0-38-1, ఎయిమీ మాగ్వైర్ 8-1-57-3, లౌరా డెలానీ 2.2-0-36-0.


ప్రతీక

క్రికెట్ 'మనసు' చదివింది
టీమిండియాలో కొత్త కెరటం
ప్రతీక రావల్‌పై కథనం
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



శాటిలైట్ కింగ్ అమెరికా

ప్రపంచంలో 2024 నవంబరు నాటికి.. అంతరిక్షంలోకి అత్యధిక శాటిలైట్లు పంపిన దేశం అమెరికా. ప్రపంచంలోని టాప్ 10 దేశాలు పంపిన ఉపగ్రహాలన్నీ కలిపినా కూడా అమెరికా సాటి రావు. దీన్ని బట్టి అంతరిక్ష పరిశోధనలకు అమెరికా ఎంత ప్రాధాన్యత ఇస్తుందో.. అమెరికా అంతరిక్ష సంస్థ నాసాకు ఎంత భారీ మొత్తంలో బడ్జెట్ కేటాయిస్తోందో అర్థం చేసుకోవచ్చు. 2024–25 బడ్జెట్‌లో భారత ప్రభుత్వం అంతరిక్ష విభాగానికి కేటాయించింది రూ.13,043 కోట్లు. అమెరికా 2023–24 ఆర్థిక సంవత్సరంలో అంతరిక్ష విభాగానికి కేటాయించింది రూ.2.33 లక్షల కోట్లు.

దేశం	శాటిలైట్ల సంఖ్య
అమెరికా	8,530
రష్యా సహా 15 సోవియట్ యూనియన్ దేశాలు	1,545
చైనా	724
యూకే	658
జపాన్	208
ఫ్రాన్స్	105
భారత్	105
యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ	95

ఆధారం : స్టాటిస్టా

మాన్యువల్‌గానూ 'భూభారతి' దరఖాస్తులు

ఆన్‌లైన్ పోర్టల్‌తోపాటు నేరుగా తహసీల్ ఆఫీసుల్లో భూసమస్యలపై ఫిర్యాదులు చేసే అవకాశం !

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా... ఇకపై మాన్యువల్ (ఆఫ్‌లైన్)గా దరఖాస్తులకు ప్రభుత్వం వీలుకల్పించనుంది. రైతులు వీలుంటే ఆన్‌లైన్‌లో పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, లేదంటే సంబంధిత తహ సీల్దార్ కార్యాలయానికి వెళ్లి రాతపూర్వక దరఖాస్తు సమర్పించవచ్చని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు భూభారతి కొత్త చట్టం మార్గదర్శకాలను సిద్ధం చేస్తున్నట్టు పేర్కొంటున్నాయి. రెవెన్యూ అధికారులు రాతపూర్వక అర్జీ ని పరిశీలించిన అనంతరం.. ఆయా రైతుల సమస్యకు సంబంధించిన వివరాలను భూభారతి పోర్టల్‌లోని కొత్త ఆప్షన్‌లో నమోదు చేస్తారని వివరిస్తున్నాయి. ఇలా నమోదు చేసిన సమయంలో ఆ దరఖాస్తుకు ఒక నంబర్ కేటాయిస్తారని... ఆ నంబర్ ఆధారంగా దరఖాస్తు పురోగతి ని తెలుసుకునే వీలుంటుందని చెబుతున్నాయి.

ప్రస్తుతం పాస్ పుస్తకాలు పాతవే..




కొత్త పాసు పుస్తకాలు అవసరం లేదని.. తప్పులు లేకుండా సక్రమంగా ఉన్న పాత పాస్‌బుక్‌లు యథాతథంగా చెల్లుబాటు అవుతాయని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఇందుకోసం చట్టంలో 2 ప్రత్యేక క్లాజులు పొందు పరిచారని వివరిస్తున్నాయి. సెక్షన్ 5 (7) ప్రకారం పాసు పుస్తకం లేని వారికి, పాసు పుస్తకం అప్‌డేట్ చేయాలని కోరిన వారికి మాత్రమే కొత్త పాసు పుస్తకాలు జారీ చేసే అధికారాన్ని ఈ చట్టం కల్పిస్తోంది. సెక్షన్ 10(1) ప్రకారం హక్కుల రికార్డులో పేరున మోదైౖ ఉన్న ప్రతి యజమానికి నిర్దేశిత అధికారి పాసు పుస్తకం కమ్ టైటిల్ డీడ్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే తమకు కొత్త పాసు పుస్తకం కావాలని దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే కొత్తవి ఇస్తారు. తప్పులను సరిచేయాలని తహసీల్దార్లకు దరఖాస్తు చేసుకున్న వారికి కూడా కొత్త పాసు పుస్తకాలు ఇస్తారు. కొత్తగా అమల్లోకి వచ్చే కాలమ్స్ కేవలం పహాణీకి మాత్రమే పరిమితమవుతాయని, పాస్ పుస్తకాల్లో రావని.. కొత్తగా ఎవరైనా పాస్ పుస్తకానికి దరఖాస్తు చేసుకుంటే కొత్తవి ఇస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు.

ఇప్పటి దాకా మీ సేవకు వెళ్లేవారు

ఇప్పటివరకు అమల్లో ఉన్న విధానం ప్రకారం.. మీ సేవ కేంద్రానికి వెళ్లి ధరణి పోర్టల్‌లోని 33 ప్రత్యేక మాడ్యూళ్ల ద్వారా భూసంబంధిత సమస్యలపై దరఖాస్తు చేసుకునేవారు. దరఖాస్తులను ఆన్‌లైన్ అంగీకరించేందుకు అవసరమైన విధంగా సిద్ధం చేసుకోవడం, అప్‌లోడ్ చేయాల్సిన ఫొటోల పరిమాణం వంటి సమస్యలు రైతులకు ఎదురయ్యాయి. ఇందుకోసం రైతులు మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఒకటికి నాలుగుసార్లు తిరిగి దరఖాస్తు చేసినా... సరైన మాడ్యూల్‌లో దరఖాస్తు చేసుకోకపోతే తిరస్కరణకు గురయ్యేవి. ఈ తిరస్కరణ కారణాలు కూడా రైతులకు తెలిసే అవకాశం లేకపోయింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టంలో అటు ఆన్‌లైన్‌తో పాటు ఇటు మాన్యువల్ దరఖాస్తులకు కూడా అవకాశం కల్పించాలనే నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఇటీవల అసెంబ్లీ ఆమోదించిన బిల్లులో పేర్కొన్న సెక్షన్ 4లోని 5, 6 క్లాజుల ప్రకారం.. భూమి హక్కుల రికార్డులో తప్పులు నమోదైనా, మార్పులు చేయాల్సి ఉన్నా నిర్దేశిత అధికారికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్లాజుల్లో ఎక్కడా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొనలేదు. అలాగని మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంటుందనీ వివరించలేదు. కానీ ఈ క్లాజుల ప్రకారమే చట్టం మార్గదర్శకాల్లో ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా మాన్యువల్ దరఖాస్తులకు అవకాశం కల్పిస్తారని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

టుడేస్ గ్రాఫిక్..



ప్రాణాలకు 'పొగ'!

ధూమపానం అలవాటుతో ఆయుర్దాయానికి ముప్పు

ఒక్కో సిగరెట్‌కు పురుషులు 17, మహిళలు 22 నిమిషాల చొప్పున జీవిత కాలం కోల్పోతారు

లండన్ వర్సిటీ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి



సాక్షి, అమరావతి: ధూమపాన వ్యసనం ఆయుష్షుకు పొగబెడుతోందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ధూమపాన ప్రియులు కాల్చే ఒక సిగరెట్ 20 నిమిషాల జీవిత కాలాన్ని తగ్గిస్తుందని లండన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వెల్లడించారు. ఒక సిగరెట్ పురుషుల్లో 17 నిమిషాలు, మహిళల్లో 22 నిమిషాల చొప్పున ఆయుర్దాయాన్ని తగ్గిస్తాయని తెలిపారు. రోజుకు 10 సిగరెట్లు తాగే వ్యక్తి ఎనిమిది రోజులు పొగ తాగడం మానేస్తే అతను తన జీవిత కాలంలో ఒక రోజును కోల్పోకుండా ఉంటాడని స్పష్టం చేశారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దేశంలో 15–49 వయస్సు పురుషుల్లో 38 శాతం మంది ధూమపానం, ఇతర పొగాకు ఉత్పత్తులు వినియోగిస్తున్నారు. ధూమపానం విరమణతో ఆయుర్దాయం వృద్ధి చెందుతుందని పలు అంతర్జాతీయ పరిశోధనలు స్పష్టం చేశాయి. ఈ వ్యసనానికి బానిసైన వారు ధూమపానం విరమించిన గంటల వ్యవధి నుంచే అనేక లాభాలుంటాయని అమెరికన్ కేన్సర్ సొసైటీ వెల్లడించింది. వ్యసనపరులతో పోలిస్తే అలవాటు లేని వ్యక్తుల ఆయు ర్దాయానికి పదేళ్లు అధికమని తెలిపింది. ఒకటి నుంచి 9 నెలల పాటు ధూమపానాన్ని విరమిస్తే దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు దూరమవుతాయని స్పష్టం చేసింది. ఏడాది అనంతరం గుండె జబ్బుల ప్రమాదం సగానికి తగ్గిపోతుందని, 2 నుంచి 5 ఏళ్ల తర్వాత నోరు, గొంతు, అన్నవాహిక, మూత్రాశయ కేన్సర్ ప్రమాదం సగానికి తగ్గుతుందని వెల్లడించింది.

5 రాష్ట్రాల్లో సైబర్ పోలీసుల దాడులు

రూ. 5.29 కోట్లు కాజేసిన 23 మంది నేరగాళ్ల అరెస్ట్



పీటీ వారెంట్లపై నగరానికి తీసుకొచ్చి రిమాండ్

వివరాలు వెల్లడించిన సైబర్ క్రైం డీసీపీ కవిత

సాక్షి, హైదరాబాద్: కొరియర్‌లో డ్రగ్స్ పార్సిళ్లు వచ్చాయంటూ బెదిరింపులు..వలపు వలలు.. పెట్టుబడుల ఆశజూపి నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో మోసాలు.. ఇలా రకరకాల పేర్లతో నగరవాసులను డిజిటల్ అరెస్టు చేసి ఏకంగా రూ. 5.29 కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్ల ఆటను హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు కట్టించారు. ఐదు రాష్ట్రాల్లో మెరుపుదాడులు చేసి 23 మందిని అరెస్టు చేశారు. శుక్రవారం సీసీఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ఆర్‌జీ శివమారుతితో కలిసి సైబర్ క్రైం డీసీపీ కవిత ఆ వివరాలను వెల్లడించారు. సైబర్ కేటుగాళ్లపై హైదరాబాద్‌లో 14, రాష్ట్రంలో 30 కేసులు ఉండగా దేశవ్యాప్తంగా 359 కేసులు నమోదైనట్లు తెలిపారు. వాటిలో రూ. 5.29 కోట్లతో ముడిపడి ఉన్న 113 కీలక కేసులను ఎంచుకొని ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఏసీపీ ఆర్‌జీ శివమారుతి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు రాజు, ప్రమోద్‌కుమార్, సీతారాములు, కె.ప్రసాద్‌రావు, నరేష్, మధులత తమ బృందాలతో యూపీ, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీలో వరుస దాడులు చేసి సైబర్ నేరగాళ్లతోపాటు వారికి బ్యాంకు ఖాతాలు అందిస్తున్న, దళారులుగా వ్యవహరిస్తున్న 23 మందిని పట్టుకున్నామని, నిందితుల నుంచి రూ. 40 వేలు, సెల్‌ఫోన్లు, ల్యాప్ టాప్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను ఆయా రాష్ట్రాల్లోని కోర్టుల్లో హాజరుపరిచి పీటీ వారెంట్‌పై సిటీకి తీసుకొచ్చి రిమాండ్‌కు తరలించామన్నారు.

కీలక కేసులు ఇలా...

హైదరాబాద్‌కు చెందిన వృద్ధుడి (70) బ్యాంకు ఖాతాను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు రూ.1.9 కోట్లు కాజేశారు. ఈ మొత్తాన్ని బదిలీ చేసుకోవడానికి యూపీలో ఓ స్వచ్ఛంద సంస్థను నడిపే కమలేష్ కుమారి సహకరించింది. కమీషన్ తీసుకొని తన సంస్థ ఖాతా వివరాలను సైబర్ నేరగాళ్లకు అందించింది. యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. నగరానికి చెందిన ఓ బాధితుడిని సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు చేసి రూ. 34 లక్షలు కాజేశారు. ముంబైకి చెందిన కొరియర్ కంపెనీ ప్రతినిధులుగా మాట్లాడిన సైబర్ నేరగాళ్లు.. అక్రమ వస్తువులు పార్శిల్‌లో ఉన్నాయంటూ భయపెట్టి డబ్బు కొట్టేశారు. వారికి సహకరించిన గుజరాత్‌వాసులు సంజీవ్‌కుమార్, రోహిత్ కుమార్ సైబర్ పోలీసులకు చిక్కారు. హైదరాబాద్‌కు చెందిన ఓ బాధితుడికి పెట్టుబడుల పేరుతో ఎర వేసిన సైబర్ కేటుగాళ్లు.. అతన్ని ఓ వాట్సాప్ గ్రూపులో చేర్చి నకిలీ వర్చువల్ ఖాతా తెరిచారు. అందులో లాభా లు చూపిస్తూ మొత్తం రూ. 2.95 కోట్లను పెట్టుబడిగా పెట్టించి స్వాహా చేశారు. ఈ కేసులో సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలు అందించిన బెంగళూరువాసులు సమీర్, దీపక్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

'మెస్రం' పాదయాత్ర షురూ

28న నాగోబా జాతర



పాదయాత్రగా వెళ్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: నాగోబా జాతరలో భాగంగా ప్రధా న ఘట్టమైన పవిత్ర గంగాజల సేకరణ యా త్రకు మెస్రం వంశీయులు శ్రీకారం చుట్టా రు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లా పూర్ నుంచి శుక్రవారం పాదయాత్రగా బయ ల్దేరి వెళ్లారు. ముందుగా ఝరి (కలశం) దేవత కు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కు లు తీర్చుకున్నారు. అనంతరం వంశపెద్దల సమ క్షంలో పాదయాత్ర ప్రారంభించారు. 17న మంచిర్యాల జిల్లా గోదావరి నది వద్ద గల హస్తిన మడుగుకు చేరుకుంటారు. ప్రత్యేక పూ జల మధ్య పవిత్ర గంగాజలం సేకరించి తిరు గు పయనమవుతారు. 28న తిరిగి కేస్లా పూర్ కు చేరుకుని రాత్రి 10.30 సమయంలో నాగో బాను పవిత్ర జలాలతో అభిషేకించి జాతర ప్రారంభించనున్నట్లు వంశపెద్దలు చెప్పారు.

టూవీలర్.. కొనుగోళ్లు సూపర్

దేశంలో యువత మోటారు సైకిళ్లపై ఎక్కువ ఆసక్తి చూపుతోంది. ఫలితంగా 2023తో పోలిస్తే 2024లో ద్విచక్ర వాహనాల అమ్మకాలు భారీగా పెరిగాయి. రికార్డు స్థాయిలో మోటారు సైకిళ్లు అమ్ముడయ్యాయి. 2023 జనవరి– నవంబరు కాలంలో 29.56 లక్షల టూవీలర్లు అమ్ముడైతే.. 2024లో అదే సమయంలో 36 లక్షలకుపైగా అమ్ముడవడం విశేషం. అంటే దాదాపు 22 శాతం వృద్ధి నమోదైంది. ప్రత్యేకించి అప్పట్లో 2,796 మోపెడ్లు అమ్ముడైతే, గతేడాది 6,166 అమ్ముడయ్యాయి.



విభాగం	2023-24 జనవరి-నవంబరు (లక్షల్లో)	వృద్ధి శాతం
స్కూటర్లు	4.56 / 5.30	16.34
మోటారు సైకిళ్లు	24.97 / 30.66	22.75
మొత్తం	29.56 / 36.02	21.85

ఆధారం: భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (సియామ్)

పామాయిల్ ఆరోగ్యకరమే

రిఫైన్డ్ ఆయిల్స్ వాడకంతో హృద్రోగ సమస్యలు వస్తున్నాయనేది అవాస్తవం

'ఒటాయ్' జాతీయ సదస్సులో ఎన్ఐఎన్ మాజీ డైరెక్టర్ శశికిరణ్



వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న వక్తలు

లాలాపేట: పామాయిల్ వంట నూనె ప్రమాదకరం కాదని.. దీన్ని వంటల్లో ఉపయోగించడం ఆరోగ్యకరమేనని పోషకాహార జాతీయ సంస్థ (ఎన్ఐఎన్) మాజీ డైరెక్టర్ బి.శశికిరణ్ తెలిపారు. వంటనూనెల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. అఖిల భారత వంటనూనెల సాంకేతిక నిపుణుల వార్షిక సమ్మేళనం (ఒటాయ్) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–ఐఐసీటీ ఆడిటోరియంలో 79వ సమావేశం జరిగింది. ఆహార, ఆహారేతర రంగాల్లో ఆయిల్ పామ్ ఉత్పత్తి ప్రక్రియలో వచ్చిన తాజా మార్పులపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శశికిరణ్ మాట్లాడుతూ రిఫైన్డ్ ఆయిల్స్, నూనెలను ఎక్కువగా తీసుకోవడం ద్వారా నూనెల్లోని కొవ్వులతో గుండె సంబంధిత సమస్యలు వస్తున్నాయనేది వాస్తవం కాదన్నారు. ప్రతి 200 గ్రాముల ఆహారంలో 30 శాతం ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండాలనేది ఆరోగ్య సంస్థలు, నిపుణులు చెబుతున్నారని గుర్తుచేశారు. ఈ సదస్సులో పామాయిల్‌లో ఉన్న పోషక విలువలను తెలియజేస్తూ పోస్టర్ ప్రజెంటేషన్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం పలువురికి ప్రతిభా పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో ఒటాయ్ జాతీయ అధ్యక్షుడు డా. రాజీవ్ చురీ, ఐఐసీటీ డైరెక్టర్ డా.డి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ 16 కాదు.. 20

20 కోచ్‌ల రైలు సేవలు నేటి నుంచి అందుబాటులోకి

సంక్రాంతి రద్దీ నేపథ్యంలో వేగంగా నిర్ణయం తీసుకున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య తిరిగే వందేభారత్ రైళ్ల కోచ్‌లు పెరిగాయి. 2023 సంక్రాంతి రోజున స్వయంగా ప్రధాని మోదీ సికింద్రాబాద్ స్టేషన్‌కు వచ్చి జెండా ఊపి ప్రారంభించిన సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ (నం.20833/20834) రైలుకు ఇప్పటి వరకు 16 కోచ్‌లు ఉండగా,శనివారం నుంచి 20 కోచ్‌లతో నడవ నుంది. ఇదే మార్గంలో గతేడాది మార్చిలో 8 కోచ్ లతో రెండో వందేభారత్(నం.20707/ 20708) ప్రారంభం కాగా, 16 కోచ్‌లతో మరో రెండు రోజుల్లో ఇది పట్టాలెక్కనుంది. సంక్రాంతి రద్దీతో ఒకేసారి రెండు సర్వీసుల కోచ్‌ల సంఖ్య పెంచటం విశేషం.

130 శాతానికి మించిన ఆక్యుపెన్సీ రేషియో

ప్రారంభం నుంచీ తొలి రైలు 130 శాతానికి మించిన ఆక్యుపెన్సీ రేషియోతో పరుగులు పెడుతోంది. రెండో వందేభారత్ రైలును ప్రారంభించినా, దీని ఆక్యుపెన్సీ రేషియో తగ్గలేదు. ప్రస్తుతం సగటు ఆక్యుపెన్సీ రేషియో 138 శాతంగా నమోదవుతోంది. దీంతో కోచ్‌ల సంఖ్య పెంచాలని ఇటీవల అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదించారు. ఆమేరకు సానుకూల నిర్ణయం తీసుకున్న బోర్డు, నాలుగు అదనపు కోచ్‌లను మంజూరు చేసింది. సంక్రాంతి రద్దీ అధికంగా ఉండటంతో వెంటనే 20 కోచ్‌ల సర్వీసును నడపబోతున్నారు. ప్రస్తుతం



దేశంలో మూడు రూట్లలో 20 కోచ్‌ల వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. ఇప్పుడు నాలుగో సర్వీసుగా విశాఖ–సికింద్రాబాద్ రూట్‌లో నడవనుంది.

రెండు సర్వీసుల కోచ్‌ల సంఖ్య పెంపూ ఓ రికార్డే..

ఒకేమార్గంలో రెండు వందేభారత్ రైళ్లు తిరుగుతూ, 130 శాతాన్ని మించి ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతున్న మార్గంగా సికింద్రాబాద్-విశాఖ మార్గం ఇప్పటికే ఓ రికార్డు సృష్టించింది. ఇలా ఒకే మార్గంలో తిరుగుతున్న రెండు వందేభారత్‌లకు ఒకేసారి కోచ్‌ల సంఖ్య పెంచటం ఇదే తొలిసారి కావటం విశేషం.

- విశాఖపట్నంలో ఉదయం బయలుదేరి మధ్యాహ్నం సికింద్రాబాద్‌కు చేరుకొని, మధ్యాహ్నం సికింద్రాబాద్‌లో బయలుదేరి రాత్రి విశాఖపట్నం చేరుకునే 16 కోచ్‌ల వందేభారత్‌లో 14 చైర్‌కార్ కోచ్‌లు, 2 ఎగ్జిక్యూటివ్ కోచ్‌లుంటున్నాయి. ఈ రెండు రకాల కోచ్‌లలో కలిపి మొత్తం 1,128 సీట్లుంటున్నాయి. శనివారం నుంచి 18 చైర్‌కార్ కోచ్‌లు, 2 ఎగ్జిక్యూటివ్ కోచ్‌లతో కలిపి రెండింటిలో కలిపి మొత్తం 1,440 సీట్లు ఉంటాయి.
- ఇక సికింద్రాబాద్‌లో ఉదయం బయలుదేరి మధ్యాహ్నం విశాఖపట్నం చేరుకొని, తిరిగి మధ్యాహ్నం బయలుదేరి రాత్రి సికింద్రాబాద్ చేరుకునే 8 కోచ్‌ల వందేభారత్‌లో ప్రస్తుతం ఏడు చైర్‌కార్ కోచ్‌లు, ఒక ఎగ్జిక్యూటివ్ కోచ్ ఉంటున్నాయి. వీటిల్లో మొత్తం సీట్ల సంఖ్య 530. ఇప్పుడు చైర్‌కార్ కోచ్‌ల సంఖ్య 14కు, ఎగ్జిక్యూటివ్ కోచ్‌ల సంఖ్య 2కు చేరి సీట్ల సంఖ్య 1,128కు పెరుగుతాయి.

నాగ్‌పూర్ వందేభారత్‌లో తగ్గనున్న కోచ్‌ల సంఖ్య!

సికింద్రాబాద్–నాగ్‌పూర్ మధ్య నేరుగా 20 కోచ్‌లతో ప్రారంభమైన తొలి వందేభారత్ రైలు ఇదే. ప్రారంభం నుంచి దీనికి ప్రయాణి కుల ఆదరణ లేదు. ఆక్యుపెన్సీ రేషియో కేవ లం 20% గా నమోదవుతోంది. దేశంలో అత్యంత తక్కువ ఆదరణ ఉన్న సర్వీసుగా ఇది నిలి చింది. ఈ రెండు నగరాల మధ్య రోజుకు సగ టున ఆరు సాధారణ రైళ్లు (వారానికి ఒకటి లాంటివి కూడా కలుపుకొని) నడుస్తున్నాయి. దీంతో అధిక చార్జీలుండే వందేభారత్ వైపు వారు దృష్టి సారించటం లేదు. దీంతో కోచ్‌ల సంఖ్యను ఏకంగా 8కి తగ్గించాలని కూడా నిర్ణ యించారు. దీన్ని నాగ్‌పూర్ ప్రజాప్రతినిధులు వ్యతిరేకిస్తున్నారు. అయితే త్వరలో నాగ్‌పూర్ సర్వీసు కోచ్‌ల సంఖ్యను తగ్గించే అవకాశముంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.





సకినాల పిండి కలుపుతూ



సకినాలు చేస్తున్న లక్ష్మి

అప్పాల పూర్



- సుల్తానాపూర్‌లో అందరికీ ఇదే ఉపాధి
- ఆర్డరిస్తే.. విదేశాలకు సైతం 'సారె' సరఫరా
- స్వయం ఉపాధితో ఆదర్శంగా నిలుస్తున్న మహిళలు

సాక్షి, పెద్దపల్లి: సంక్రాంతి పండుగ అనగానే పిండి వంటలు గుర్తుకొస్తాయి.. కానీ అప్పాలు అంటే సుల్తానాపూర్ గ్రామం గుర్తుకొస్తుంది. ఆ ఊరే అప్పాలకు కేరాఫ్ అడ్రస్. ఆ గ్రామస్తుల క్వాలిటీయే వారి బ్రాండ్. చూస్తేనే నోరూరించే పిండి వంటలు. ఒక్కఫోన్ చేస్తే చాలు.. ఎంచక్కా పిండివంటలు మన ఇంటికి వచ్చేస్తాయి. శుభకార్యాలకు కావాల్సిన సారెలో అందించే అన్నిరకాల పిండివంటలను తయారుచేసి తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఇతర దేశాలకూ సరఫరా చేస్తూ స్వయం ఉపాధి పొందుతూ.. మరికొంతమందికి ఉపాధి ఇస్తూ లాభాల బాటలో పయనిస్తున్నారు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సుల్తానాపూర్ గ్రామానికి చెందిన మహిళలు.

8 గ్రూప్‌లు.. 400 మంది వర్కర్లు

గ్రూప్‌నకు ఎటువంటి పేరు, బ్రాండ్ లేకపోయినా, క్వాలిటీతో మొదట తమ గ్రూప్ సభ్యులు, వారి బంధువులు, స్నేహితులకు ఆర్డర్లపై అప్పాలు తయారు చేసి ఇచ్చేవారు. అలా నోటిమాటతో క్వాలిటీ నచ్చి ఆర్డర్లు పెరుగుతూపోయాయి. దాదాపు ఏడాదికి రూ.50 లక్షల పైనే ఆర్డర్లు వస్తుండటంతో అప్పాలు కాల్చడానికి, పిండి పిసకడానికి, సకినాలు చుట్టడానికి, ఇతరత్రా పనులకు రోజువారి వర్కర్ల సాయం తీసుకుంటూ వారికి కూడా ఉపాధి కల్పిస్తున్నారు. వీరిని చూసి గ్రామంలో మరో 8 సంఘాలు ఏర్పడ్డాయి. ఒక్కో గ్రూప్‌లో పదిమంది సభ్యులతోపాటు, వారికి సాయం పనికి వచ్చే 50మంది వర్కర్లతో పాటు, పిండిగిర్ని, ట్రాలీ, కట్టెలు కొట్టేవారు తదితరులతో కలిసి దాదాపు 400 మందికిపైగా ఆ గ్రామంలో అప్పాలతో ఉపాధి పొందుతున్నారు.

మాకు చేసివ్వరా...

పదిహేడేళ్ల క్రితం సుల్తానాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి లీడర్‌గా పదిమంది సభ్యులతో ఒక గ్రూప్‌గా ఏర్పడ్డారు. ఇంటివద్దే ఉంటూ చిన్న మొత్తాలతో ఏదైనా వ్యాపారం చేయాలనుకున్నారు. పలురకాలుగా ఆలోచిస్తున్న సమయంలో గ్రూప్‌లోని ఒక సభ్యురాలి ఇంట్లో వివాహ వేడుకకు పెద్దమొత్తంలో అప్పాలు తయారు చేయాల్సి వచ్చింది. దీంతో తమ గ్రూప్ సభ్యుల సహకారంతో ఆ పెళ్లికి కావాల్సిన సారెను అందరూ కలిసి సరదాగా సిద్ధం చేశారు. దీంతో ఆ వేడుకకు వచ్చిన బంధువులు 'మా బిడ్డ సీమంతం ఉంది కొంచెం చేసి పెడతారా? మా కొడుకు, కోడలు అమెరికా వెళుతున్నారు.. అప్పాలు చేసి పెడతారా'అని అడగటంతో వారికి వీరు సైతం చేసిచ్చారు. అయితే ఊళ్లో ఉన్న మనకే సారె తయారు చేయడానికి ఇతరుల సహాయంతో చేయాల్సిన పరిస్థితి నెలకొందని, సిటీలో ఉన్నవారి పరిస్థితి ఏమిటి? వారు అప్పాలు పెద్దమొత్తంలో ఎలా తయారు చేసుకుంటారు? అనే ఆలోచన లక్ష్మికి తట్టింది. దీన్నే ఉపాధిగా ఎందుకు మార్చుకోకూడదని గ్రూప్ సభ్యులకు తెలిపింది. తెలిసిన పని, తక్కువ పెట్టుబడితో కూడినది కావటంతో అందరూ సరేనన్నారు. దీంతో అప్పాలు చేయడం ఉపాధిగా మలుచుకొని లక్షణంగా లక్షలు సంపాదిస్తున్నారు.

బాహుబలి అప్పాలు..

32 వరుసలతో చక్రాల్లా సకినాలు, కిలో పరిమాణంలో లడ్డూ, గరిజ, బెల్లం అరిసెలు, నువ్వుల లడ్డూ, మురుకులు, చెగోడీలు, గవ్వలు, ఖారా, ఇతరత్రా వంటకాలను పెద్దఎత్తున తయారు చేయడం వీరి ప్రత్యేకత.



అప్పాలు కాల్చుతున్న మహిళలు



అరిసెల కోసం చక్కెర పాకం

ఆర్డర్‌పై విదేశాలకు



మా గ్రామంలో 17 ఏళ్లుగా ఆర్డర్‌పై అప్పాలను తయారు చేస్తూ ఎగుమతి చేస్తున్నాం. అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ వంటి దేశాలు, తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్రకు సైతం పంపిస్తున్నాం. ఏడాదిలో రూ.50లక్షలపైగా ఆర్డర్లు వస్తాయి. తయారు చేసి వారు కోరుకున్న సమయానికి అందజేస్తాం.

– తానిపత్తి లక్ష్మీదేవి, గ్రూప్ లీడర్

కలిసి పనిచేస్తాం



మా బంధువులం అందరం కలిసి అప్పాలను తయారు చేస్తాం. ప్రతీ ఒక్కరికి రోజుకు రూ.500 నుంచి రూ.600 వరకు గిట్టుబాటు అవుతుంది. ఆర్డర్లు ఎక్కువ వస్తే ఇతర గ్రూప్‌లతో పంచుకుంటాం. అందరం కలిసి పనిచేసుకుంటూ పిల్లలను మంచిగా సెటిల్ చేశాం.

– అలివేణి, సుల్తానాపూర్

ఆర్డర్లపై తయారీ



మా గ్రూప్ ద్వారా ఆర్డర్లపై సుమారు 11 ఏళ్లుగా అప్పాలను తయారు చేస్తూ విజయవాడ, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ నగరాలతోపాటు లండన్, అమెరికాకు పంపిస్తున్నాం. మా గ్రూపు సభ్యులకు ఉపాధి కల్పించటంతోపాటు ఇతరులకు సైతం ఉపాధి కల్పిస్తున్నందుకు సంతోషంగా ఉంది.

– మాధవి, శ్రీరామ గ్రూప్ నిర్వాహకురాలు

నాణ్యమైన వంటకాలు



మా గ్రామంలో 8 గ్రూపులు అప్పాల తయారీలో నిమగ్నమై పనిచేస్తున్నాయి. నాణ్యమైన పదార్థాలతో తయారయ్యే వంటకాలు అత్యంత రుచికరంగా ఉండటంతో సుల్తాన్‌పూర్ అప్పాలకు ఎక్కడా లేనంత డిమాండ్ మార్కెట్‌లో ఉంది. మహిళలు సైతం ఆర్థికంగా బలపడి తమ పిల్లలను విదేశాలకు పంపి చదివించే స్థితికి వచ్చారు.

– పల్లె హరీశ్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్

కొమురవెల్లిలో దేవుని చెట్టు

- కష్టాలు తీరాలంటూ ఇక్కడే పట్నాలు
- ముడుపు కట్టడం కూడా ఆనవాయితీ

సాక్షి, సిద్దిపేట: ఏ దేవాలయానికి వెళ్లినా సహజంగా రావి, వేప చెట్లే దర్శనమిస్తాయి. కానీ సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలోని మల్లికార్జునస్వామి దేవాలయంలో మాత్రం గంగరేగు చెట్టు కనిపిస్తుంది. స్వామివారి మండపానికి ఎదురుగా ఉన్న గంగరేగు చెట్టు వద్దనే భక్తులు పట్నాలు వేసి, మొక్కులు చెల్లిస్తారు. చెట్టుకు ముడుపు కూడా కడతారు.

మొక్కులన్నీ ఇక్కడే..

ప్రతి ఏడాది మూడు నెలల పాటు కొమురవెల్లి జాతర జరుగుతుంది. జనవరి 19వ తేదీ నుంచి ప్రారంభమై..మార్చి 24న అగ్ని గుండాల ప్రవేశంతో జాతర ముగుస్తుంది. బుధ, ఆదివారాల్లో భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామిని దర్శించుకున్న తర్వాత 'కష్టాలు తీరిస్తే గంగరేగు చెట్టు కింద పట్నం వేస్తాం'అని మొక్కుకుంటారు. సమస్యలు తీరగానే సకుటుంబంగా కొమురవెల్లికి తరలివస్తారు. ఒగ్గు పూజారితో గంగరేగు చెట్టు కింద మల్లన్న పట్నాలు వేయిస్తారు. చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఇక్కడే కొబ్బరికాయలు కొట్టి, మొక్కులు చెల్లించుకుంటారు. స్వామివారికి తలనీలాలు సమర్పించేది కూడా ఇక్కడే. కల్యాణకట్టలో కత్తిరించిన తలనీలాలను వెంట తెచ్చుకొని, గంగరేగు చెట్టు మొదల్లో వేయడం ఆనవాయితీ. ఈ చెట్టుకు బంతిపూల మాల వేసి, స్వయంగా స్వామివారికే అలంకరించిన అనుభూతిని పొందుతారు.

ఎప్పుడూ పచ్చగా...

ఈ గంగరేగు చెట్టుకు ఎంతో మహిమ ఉంటుందని భక్తులు విశ్వసిస్తారు. వాతావరణంలో ఎన్ని మార్పులు వచ్చినా, ఈ చెట్టు మాత్రం ఏడాది పొడవునా పచ్చదనంతో కళకళలాడుతూనే ఉంటుంది.



ముడుపులు కడుతున్న భక్తులు

మంచి జరుగుతుందని..



గంగరేగు చెట్టును దేవుడు చెట్టుగా భావిస్తారు. గంగరేగు చెట్టు ఆకుతోపాటు స్వామి వారి చేతిలోని బండారి తినడం వలన ఆరోగ్యంగా ఉండటంతోపాటు మంచి జరుగుతుంది. కొన్ని సంవత్సరాలుగా భక్తుల ముడుపులు, పట్నాలు వేస్తారు.

– మహాదేవుని మల్లికార్జున్, వంశపారంపర్య అర్చకుడు

ఇందుకు కారణం స్వామి మహిమేనని నమ్ముతారు. ఈ చెట్టు ఆకుతోపాటు స్వామి చేతిలో బండారి(పసుపు) తింటే అనారోగ్యం దూరమవుతుందని భక్తుల నమ్మకం. మల్లన్న దర్శనానికి వచ్చిన భక్తులు ఈ చెట్టు ఆకులను వెంట తీసుకెళ్లి, అనారోగ్యంతో ఉన్న కుటుంబ సభ్యులకు తినిపిస్తూ ఉంటారు. ఆకును తిన్నవారు పరిపూర్ణ ఆరోగ్యవంతులు కాగానే, వారిని మల్లన్న దేవాలయానికి తీసుకొచ్చి.. స్వామి దర్శనం చేయించడంతోపాటు గంగరేగు చెట్టుకు ప్రదక్షిణలు చేయించి మొక్కులు చెల్లించుకుంటారు. ప్రతి సంవత్సరం 10 లక్షలకు పైగా భక్తులు కొమురవెల్లి మల్లన్నను దర్శించుకుంటారు.



కొమురవెల్లి దేవాలయ ప్రాంగణంలో గంగరేగు చెట్టు

ఎస్‌ఐలుగా 187 మంది ఏఎస్‌ఐలు

ఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పోలీస్‌శాఖలోని 187 మంది ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు మల్టీ జోన్–2 ఐజీ సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 1989, 1990 బ్యాచ్‌లో పోలీస్ కానిస్టేబుళ్లుగా విధుల్లో చేరిన వీరికి.. హెడ్ కానిస్టేబుల్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి కల్పించారు. ఆ క్రమంలో ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సూచనలకు అనుగుణంగా.. డీజీపీ డాక్టర్ జితేందర్, తెలంగాణ ట్రైనింగ్స్ డీజీ అభిలాష బిష్త్ చొరవతో సంక్రాంతి కానుకగా ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించారు.

'మ్యూజిక్ టీచర్ల' జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యాసంస్థల్లో మ్యూజిక్ టీచర్ల ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల ప్రాథమిక జాబితాను తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు శుక్రవారం విడుదల చేసింది. దీన్ని గురుకుల బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు బోర్డు చైర్మన్ బి.సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన 96 మంది అభ్యర్థులకు ఆయా సొసైటీలు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించిన తర్వాత నియామక పత్రాలు అందిస్తారని వివరించారు.

'షష్టి పూర్తి' సమ్మేళనం



అంకాపూర్‌లో కలుసుకున్న 1959-60 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పెర్కిట్(ఆర్మూర్): వారంతా 1959-60 లో ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివారు. ఉన్నత విద్యాభ్యాసం చేసి ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఉద్యోగ విరమణ కూడా చేశారు. పాఠశాల విద్య పూర్తి చేసుకుని అరవై నాలుగేళ్లవుతున్న సందర్భంగా.. వీరి అపూర్వ సమ్మేళనానికి ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని లచ్చా గౌడ్ కాంప్లెక్స్ వేదికైంది. ఆ బ్యాచ్‌కు చెందిన వారు శుక్రవారం కలుసుకుని నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుని.. సందడి చేశారు.

ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడండి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసివాళ్లు.. ఒళ్లు జాగ్రత్త పెట్టుకొని మాట్లాడాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధులు చనగాని దయాకర్, లింగం యాదవ్, వచన్ కుమార్, శ్రీకాంత్‌లతో కలిసి మాట్లాడారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించమన్నారు. కేటీఆర్ అవినీతి కేసులో విచారణ బృందం దర్యాప్తు చేస్తుంటే.. బీఆర్ఎస్ నేతలే జేజేలు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్ల తెలంగాణ రాష్ట్రాన్ని లూటీ చేశారని, చేసిన అప్పులు, అవినీతితో తెలంగాణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

తొలివారంలో జీతాల చెల్లింపుపై హర్షం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వోద్యోగుల మాదిరిగానే.. గ్రామ పంచాయతీ ఉద్యోగులకు కూడా ప్రతీ నెలా మొదటి వారంలో జీతాలు చెల్లిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంపై తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలకు సంఘ అధ్యక్షుడు మామిడాల నర్సింహులు ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం నేతలు క్షీరాభిషేకం చేశారు.

క్లుప్తంగా...

నౌకా నిర్మాణ హబ్‌గా ఏపీ

పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి : సీఎం చంద్రబాబునాయుడు మార్గదర్శకాల మేరకు ప్రపంచంలో నౌకా నిర్మాణ (షిప్ బిల్డింగ్) హబ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేస్తామని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. రాష్ట్రానికి 1,053 కిమీల తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుని నౌకా నిర్మాణ పరిశ్రమలను నెలకొల్పడం ద్వారా నౌకా నిర్మాణంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టామన్నారు. వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం రాష్ట్రంలో నౌకా నిర్మాణ పరిశ్రమను అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. దేశంలో అతిపెద్ద నౌకా నిర్మాణ పరిశ్రమను నిర్వహిస్తున్న గార్డెన్ రీచ్‌షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) సంస్థ ప్రతినిధులతో ఆయన చర్చించారు. రాష్ట్రంలో నౌకా నిర్మాణ పరిశ్రమను అభివృద్ధి చేయడానికి ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు (ఏపీఎంబీ) ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) జారీచేసిందని సురేష్‌కుమార్ వివరించారు. గతంలో హ్యుందాయ్ హెవీ ఇండస్ట్రీస్, కొరియన్ షిప్ బిల్డర్స్ సంస్థలు ఏపీఎంబీతో కలిసి పనిచేశాయన్నారు. రాష్ట్రంలో నౌకా నిర్మాణ పరిశ్రమ ఏర్పాటుకు అనువైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని జీఆర్ఎస్ఈ ప్రతినిధులు చెప్పారు. పెట్టుబడులు పెడితే రాయితీలు ఇస్తామని వారికి సురేష్‌కుమార్ హామీ ఇచ్చారు.

భర్త మరణాన్ని తట్టుకోలేక భార్య మృతి



కోట: ఎంతో అన్యోన్యంగా జీవించిన వృద్ధ దంపతులు, ఒకరిని విడిచి మరొకరు ఉండలేక గంటల వ్యవధిలోనే ప్రాణాలు వదిలిన సంఘటన తిరుపతి జిల్లా కోట మండలం తిన్నెలపూడిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మన్నె సుబ్బరామయ్య(80)గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో శుక్రవారం కుటుంబసభ్యులు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు. తనకు తోడునీడగా నిలిచిన భర్త మృతిని తట్టుకోలేని భార్య శేషమ్మ(75) ఆయన మృతదేహం వద్ద రోదిస్తూ శుక్రవారం ఉదయం ప్రాణాలు విడిచింది. వీరికి ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తల్లిదండ్రులు ఇద్దరు గంటల వ్యవధిలోనే మృతి చెందడంతో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరికీ ఒకేసారి అంత్యక్రియలు పూర్తిచేశారు.

పోలీసుల దర్యాప్తు ఆధారంగా చర్యలు

సెల్‌ఫోన్ల వ్యవహారంపై ఐజీ ఇండ్ల శ్రీనివాస్ వ్యాఖ్య



ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీల బ్యారక్‌ల వద్ద దొరికిన నాలుగు సెల్‌ఫోన్ల వ్యవహారంపై పోలీసులు దర్యాప్తులో వెల్లడైన విషయాల ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాస్ తెలిపారు. విశాఖ కేంద్ర కారాగారాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. జైలు డిప్యూటీ సూపరింటెండెంట్లు ప్రవీణ్‌కుమార్, జవహర్‌బాబు, జైలర్లతో కలిసి పలు విభాగాలను పరిశీలించారు. బ్యారక్‌ల వద్ద ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న భోజనం, వసతి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ఇటీవల సెల్‌ఫోన్‌లు దొరికిన బ్యారక్‌లను పరిశీలించి.. సెల్‌ఫోన్‌లు ఎక్కడ దాచిపెట్టారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇక్కడ జైలులో మరింత పటిష్టమైన రక్షణ చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం 9 సీసీ కెమెరాలు పని చేస్తున్నాయని, వాటి సంఖ్యను 496కు పెంచుతామన్నారు. రాష్ట్రంలోని అన్ని జైళ్లలో 400 మంది సిబ్బంది నియామకానికి సన్నాహాలు జరుగుతున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జైళ్లలో రూ.100 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. సుమారు 200 మంది అర్హులైన శిక్ష పడిన ఖైదీల క్షమాభిక్ష కోసం ప్రభుత్వానికి జాబితా పంపించామని, ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం కోసం వేచి ఉన్నట్లు ఐజీ తెలిపారు.

ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే..

తిరుపతి తొక్కిసలాటపై మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: తిరుపతి తొక్కిసలాట ఘటనకు కారణం ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమేనని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ మండిపడ్డారు. టీటీడీ చైర్మన్, ఈఓ, అదనపు ఈఓలపై క్రిమినల్ కేసులు నమోదుచేసి, వెంటనే వారిని అరెస్టు చేయాలని, లేదంటే ప్రజాప్రయోజన వ్యాజ్యం వేస్తానని ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో హెచ్చరించారు. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై పాలకవర్గం, అధికారులు సమావేశమై చర్యలు చేపట్టకపోవడం దారుణమని విమర్శించారు. టీటీడీ టికెట్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముకోవడంవల్లే ఈ దుస్థితి తలెత్తిందని హర్షకుమార్ చెప్పారు. ఇటీవల తిరుమల లడ్డూ కల్తీపై గళమెత్తిన పీఠాధిపతులు, మఠాధిపతులు ఈ తొక్కిసలాట ఘటనపై మౌనం వహించడం సరికాదన్నారు.

నృత్య పోటీల్లో..శ్రీరాధాకృష్ణ 'హై'లైట్



మామిడిపల్లి దివ్యశ్రీ గంగ

- ఎల్లలు దాటి ప్రతిభ చాటిన నృత్య తరంగాలు
- సత్తా చాటుతున్న శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం
- 14 మంది కళాకారులకు బహుమతులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ‘గోదావరి నీటిని తాగితే కళాకారులవుతారు’ అనేది నానుడి. దీనిని నిజం చేస్తూ అనేక మంది సంగీత, నృత్య కళాకారులు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. మరికొందరు సరిహద్దులను దాటి ప్రపంచవ్యాప్తంగా సత్తా చాటుతున్నారు. చరిత్ర పుటల్లో తమదైన ముద్రను వేసి రాజమహేంద్రవరం ఖ్యాతిని నలుదిశలా చాటుతున్నారు. ఆ కోవలోకే శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం చేరింది. ఈనెల 2న మలేషియాలోని టీఎంసీ ఆడిటోరియంలో జరిగిన పోటీల్లో 14 బహుమతులను గెలుచుకుని ఇక్కడి కళాకారులు ప్రతిభ చాటారు. ఇందులో ప్రథమ బహుమతి ఉండటం విశేషం. మలేషియాలోని స్వర్ణ మరియమ్మన్ కుచాంగ్ వారు ఇంటర్నేషనల్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ పోటీలను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఇందులో 13 దేశాల నుంచి 615 మంది కళాకారులు పాల్గొన్నారు. గాత్రం, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, క్లాసికల్ డ్యాన్స్, సెమీ క్లాసికల్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించారు. దీన్లో శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం నుంచి 68 మంది విద్యార్థులు పాల్గొని 14 మంది బహుమతులు గెలుచుకున్నారు.

ఆన్‌లైన్‌లో పోటీలు

మలేషియాలో జరిగిన ఈ పోటీల్లో ఆన్‌లైన్ ద్వారా కళాకారులు తమ ప్రతిభను కనబరిచారు. వీటిని రికార్డ్ చేసుకున్న నిర్వాహకులు అన్నీ పరిశీలించాక బహుమతులు ప్రకటించారు. స్థానిక శ్రీరాధాకృష్ణ క్షేత్రం మొత్తం 14 బహుమతులు దక్కించుకుంది. ఇందులో మొదటి బహుమతి కూచిపూడి నాట్యానికి రాగా, ఐదు ద్వితీయ బహుమతుల్లో రెండు గాత్రం, ఒకటి సెమీ క్లాసికల్, రెండు కూచిపూడికి వచ్చాయి. తృతీయ బహుమతులు రెండు కూచిపూడి నృత్యానికి, సెమీ క్లాసికల్‌కు రెండు, గాత్రానికి ఒకటి వచ్చాయి. ఇవి కాకుండా కన్సొలేషన్ బహుమతులు సెమీ క్లాసికల్‌కు ఒకటి, కూచిపూడి నృత్యానికి రెండు వచ్చాయి. ఆయా బహుమతులను మలేషియా నుంచి కొరియర్లో మంగళవారం కళాక్షేత్రానికి వచ్చాయి. ఈ బహుమతులను శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర నిర్వాహకులు డాక్టర్ జి.వి. నారాయణ, డాక్టర్ ఉమా జయశ్రీ కళాకారులకు అందజేశారు.

చదువుతో పాటు డ్యాన్స్ కూడా...



నేను పదో తరగతి చదువుతున్నా. ఆరేళ్ల నుంచి కూచిపూడితో పాటు కర్ణాటక సంగీతం నేర్చుకుంటున్నా. మలేషియాలో జరిగిన పోటీల్లో సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి వచ్చింది. నాట్యాచార్యులు ఉమ జయశ్రీ నాట్య సాధన చేస్తున్నా. అలాగే చదువుకూ సమయం కేటాయిస్తున్నా.

– చెరుకుమిల్లి సిరిచందన

నాట్యం అంటే ప్రాణం



నేను ఏడో తరగతి చదువుతున్నాను. నాకు నృత్యం అంటే ప్రాణం. మలేషియాలో జరిగిన పోటీలో ద్వితీయ బహుమతి వచ్చింది. నేను 2024లో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ ప్రతి ప్రముఖ దేవాలయంలో నృత్య నీరాజన కార్యక్రమంలో పాల్గొన్నా.

– కె.హర్షిత కావ్య

అనేక బహుమతులు వచ్చాయి



నేను ఐదోతరగతి చదువుతున్నాను. మలేషియా పోటీలో సెమీ క్లాసికల్ జూనియర్ కేటగిరీలో ద్వితీయ స్థానం సాధించా. 2023 జూన్‌లో శ్రీరాధాకృష్ణ కళాక్షేత్రం వారు నిర్వహించిన హనుమాన్ చాలీసాను 14 గంటల 2 నిమిషాల పాటు 101 మంది కళాకారులతో కలసి నృత్యం చేసినందుకు గోల్డెన్ స్టార్, భారత్ వరల్డ్ రికార్డ్, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందా.

– ధర్నాలకోట శరణ్య

పల్లెలన్నీ ఘుమఘుమ..





- పిండి వంటలతో ఊరూరా సందడి వాతావరణం
- ఇంటింటా సంక్రాంతి శోభ
- స్వీటు షాపుల్లోను సంక్రాంతి వంటకాలకు పెద్దపీట
- అధిక సంఖ్యలో వస్తున్న ఆర్డర్లు
- ‘పశ్చిమ’లో రూ.కోట్లల్లో వ్యాపారం

సాక్షి, భీమవరం : పండుగలు సమీపిస్తుండటంతో పల్లెల్లో ఇళ్లు పాకశాలలవుతున్నాయి. సంప్రదాయ పిండివంటల తయారీతో ఘుమఘుమలాడు తున్నాయి. సంక్రాంతి పిండి వంటల కోసం అధిక సంఖ్యలో వస్తున్న ఆర్డర్లతో స్వీట్‌స్టాల్స్, కేటరింగ్ నిర్వాహకుల ద్వారా రూ.కోట్లల్లో వ్యాపారం జరుగుతోంది. సంక్రాంతి పండుగల కోసం ధనిక, పేద తారతమ్యం లేకుండా పల్లెల్లోని ప్రతి ఇంటా పిండివంటల తయారుచేస్తుంటారు. కొత్తగా మార్కెట్‌లోకి ఎన్నిరకాల స్వీట్లు వచ్చినా గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ సంప్రదాయ పిండివంటలదే పైచేయి. కరకరలాడే జంతికలు, నోటిలో కరిగిపోయే వెన్నప్పాలు, నమిలేకొద్ది మాధుర్యాన్నిచ్చే పొంగడాలు, పంటికి పనిచెప్పే చక్కిడాలు, కరకరలతో నోటిని తీపిచేసే గజ్జికాయలు, నేతి ఘుమఘుమలతో నోరూరించే సున్నుండలు, మాధుర్యాన్నిచ్చే అరిసెలు, పోకుండలు, కమ్మగా కారంగా ఉండే కారబూందీ.. రుచిలో వేటికవే సాటి. ఎవరికి వారు స్తోమతను బట్టి ఆయా రకాల పిండివంటలను చేస్తుంటారు. కొత్తగా వివాహం జరిగిన ఇంట్లో అల్లుడి కోసం అత్తలు చాలా వెరైటీలనే సిద్ధంచేస్తారు. ఇరుగుపొరుగు వారు ఒకరి పిండివంటలు మరొకరి ఇస్తూ పల్లె ఆప్యాయతలను పంచుకుంటారు. పండుగలు ముగిశాక దూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు తిరిగి వెళ్లే సమయంలో పిండివంటలను ఇచ్చి పంపుతుంటారు. ప్రస్తుతం గ్రామాల్లో పిండి వంటలు సిద్ధంచేసే పనిలో మహిళలు నిమగ్నమయ్యారు. ఇరుగుపొరుగు ఒకరికొకరు సాయం చేసుకుంటున్నారు.

స్వీట్‌షాపుల్లో సంక్రాంతి సందడి..

ఇళ్ల వద్ద పిండివంటలు తయారుచేసుకునే తీరికలేక స్వీట్‌షాపుల్లో కొనుగోలు చేస్తున్న వారి సంఖ్య పట్టణాల్లో పెరుగుతోంది. ఏడాది పొడవునా బెంగాలీ, కలకండ, కోవా, కాజూ పేస్ట్ తదితర వెరైటీ స్వీట్స్ తయారుచేసే స్వీట్స్‌షాపుల నిర్వాహకులు సంక్రాంతి పండుగల కోసం సంప్రదాయ పిండి వంటలు సిద్ధం చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం తదితర చోట్ల పేరొందిన స్వీట్ షాపులతో పాటు చిన్నపాటి దుకాణాల్లోనూ వీటి తయారీ ఎక్కువగా కనిపిస్తోంది. భీమవరం రూరల్ చినఅమిరం, కాళ్ల మండలం కోపల్లె, ఆకివీడు మండలం అయి భీమవరం, సిద్ధాపురం, యలమంచిలి మండలం కలగంపూడి తదితర చోట్ల ఇళ్ల వద్ద మహిళలు పిండి వంటల తయారీ ద్వారా ఉపాధి పొందుతున్నారు. సంక్రాంతి వారం రోజులు షాపుల్లో రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పిండి వంటల వ్యాపారం జరుగుతుందంటున్నారు. పండుగల నిమిత్తం జిల్లాలో రూ.15 కోట్లకు పైగా పిండి వంటల వ్యాపారం జరుగుతుందని అంచనా.

పిండి వంటల్లో బామ్మల తర్ఫీదు..

ఏడాది పొడవునా చదువుల్లో బిజీగా గడిపే యువతులు పండుగొస్తుందంటే సొంత ఊళ్లకొచ్చి అమ్మమ్మలు, నానమ్మల చెంతకు చేరిపోతుంటారు. ఏం నేర్పింపారని మెట్టనింట మమ్మల్ని ఆడిపోసుకుంటారే అంటూ వృద్ధులు వారికి రకరకాల వంటలు నేర్పించడం పల్లెల్లో సర్వసాధారణం. మా రోజుల్లో ఇలా కాదమ్మా ఒక్కసారి చూడగానే అలా నేర్చుకునే వాళ్లమని పెద్దవారి దెప్పిపొడుపులు.. ఆన్‌లైన్‌లో ఆర్డరు పెడితే ఇట్టే వస్తాయంటూ మనువరాళ్లు చేసే సందడితో ఇంటింట పండుగ వాతావరణం కనిపిస్తుంది.

కొనకాంబరం.. కాసుల వర్షం





- పూల సాగుతో అధిక ఆదాయం గడిస్తున్న రైతులు
- ధరలు స్థిరంగా ఉండడంతో అన్నదాతల్లో హర్షం

తాడిమర్రి: సొంత భూమి ఉన్న రైతులు సంవత్సరం పొడవునా ఆదాయం పొందాలంటే కనకాంబరం సాగు చేపట్టటం చాలా ఉత్తతమని ప్రయోగాత్మకంగా నిరూపించారు సత్యసాయి జిల్లా తాడిమర్రి మండల రైతులు. వేరుశనగ, వరి తదితర సంప్రదాయ పంటల సాగులో నష్టపోయిన రైతులు ఇటీవల పూల సాగుపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే జిల్లాలో 380 ఎకరాల్లో కనకాంబరం పూల సాగులోకి వచ్చింది. ఇందులోనూ తాడిమర్రి మండలంలోని చిల్లకొండయ్యపల్లి, పుల్లానారాయణపల్లి, ఏకపాదంపల్లి, భీమరాయునిపేట, ఎం.అగ్రహారం, మర్రిమాకులపల్లి తదితర గ్రామాల్లో రైతులు అత్యధికంగా కనకాంబరం సాగునే చేపట్టారు.

కనకాంబరాలకు డిమాండ్ ఎక్కువ..

చెన్నై, బెంగుళూరు, తిరుపతి, హైదరాబాద్ తదితర నగరాల్లో కనకాంబరం పూలకు చాలా డిమాండ్ ఉంది. తాడిమర్రి మండలంలో కనకాంబరాలను సాగు చేసిన రైతులు దిగుబడులను బత్తలపల్లిలో పూల మండీల ద్వారా ప్రధాన నగరాలకు ఎగుమతి చేస్తుంటారు. జూన్ నుంచి డిసెంబర్ ఆఖరు వరకు సాధారణంగా ఉన్న ధరలు జనవరిలో తగ్గు ముఖం పడతాయి. కానీ, ఈ ఏడాది ఇప్పటికీ రైతులకు గిట్టుబాటు ధరనే లభ్యమవుతోంది.

సాగులో తలెత్తే ప్రధాన సమస్యలు..

కనకాంబరం సాగులో తలెత్తే ప్రధాన సమస్యల నివారణకు ఉద్యానవన శాఖ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. నులిపురుగుల సమస్య నివారణకు దుక్కిలో వేపపిండి వేసుకోవాలి. అలాగే కార్బోఫ్యూరాన్ 3–4 గుళికలను ఎకరానికి 400 గ్రాముల ప్రకారం ఇసుకలో కలిపి చల్లుకుంటే నులిపురుగు నివారణ సాధ్యమవుతుంది. పేనుబంక నివారణకు మిథైల్ డెమటాన్ లేదా డైమిథోయేట్ 2 ఎం.ఎల్.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తెగులు సోకినట్లు కనిపిస్తే కాపర్ ఆక్సీ క్లోరైడ్ అర కిలో ఎకరానికి చొప్పున డ్రిప్పు ద్వారా అందించవచ్చు.

నెలకు రూ.లక్షకు పైగా ఆదాయం

- కనకాంబరం సాగులో నీటి వాడకం తక్కువగా ఉంటుంది.
- సాధారణంగా కనకాంబరం పూలు ఏడాది పొడవునా కాస్తూనే ఉంటాయి.
- ఒకసారి నాటితే సుమారు మూడు, నాలుగేళ్ల పాటు పంట దిగుబడి వస్తుంది.
- పంటను సాగు చేసిన మూడు, నాలుగు నెలలకు కోతకు వస్తాయి.
- ఐదు రోజులకు ఒక కోత చొప్పున నెలకు ఆరు కోతలు ఉంటాయి.
- ఎకరా విస్తీర్ణంలో ప్రతి కోతకు 20 నుంచి 25 కిలోల పూల దిగుబడి ఉంటుంది.
- సాధారణ రోజుల్లో కిలో కనకాంబరాలు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు అమ్ముడు పోతాయి. పండుగ రోజుల్లో రూ.1,100 నుంచి రూ.1,200 వరకు ధర పలుకుతుంటాయి.
- ఐదు రోజులకు ఓ కోత చొప్పున నెలకు 6 కోతలతో రూ.లక్షకు పైగా ఆదాయం ఉంటుంది.
- అధిక దిగుబడులు, పూల నాణ్యతకు వేరుశనగ చెక్క, వేపపిండి, డీఏపీ తదితర ఎరువులను వాడాల్సి ఉంటుంది.

లాభాలు వస్తున్నాయి



ఆరు నెలల క్రితం ఒక ఎకరంలో కనకాంబరాల సాగు చేపట్టాను. మూడు నెలలుగా పూలు కోతకు వస్తున్నాయి. సేంద్రీయ ఎరువులు వాడాను దీంతో పూలు ఎంతో నాణ్యతగా ఉంటున్నాయి. కనకాంబరం సాగు ఎంతో లాభదాయకంగా ఉంది.

– చెడిపోతుల శివయ్య, చిల్లకొండయ్యపల్లి, తాడిమర్రి

రూ.16 వేలు రాయితీ ఇస్తాం



కనకాంబరాలు సాగుకు ముందుకు వచ్చే రైతులకు హెక్టారుకు రూ.16 వేలు చొప్పున రాయితీనిస్తాం. 25 సెంట్లలో సాగు చేసినా, అర ఎకరం, ఒక ఎకరంలో సాగు చేసినా సబ్సిడీ అందజేస్తాం. పంటను సాగు చేసిన ప్రతి రైతు సచివాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలి.

– అమరేశ్వరి, ఉద్యావన శాఖ అధికారి, ధర్మవరం డివిజన్

రైతుల ఆస్తులు వేలం

ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నిర్ణయం

- కూటమి ప్రభుత్వం వచ్చీ రావడంతోనే స్వాధీనానికి శ్రీకారం
- రైతులకు ముమ్మరంగా సెక్షన్–71 కింద నోటీసులు
- మరోవైపు.. ఎగ్జిక్యూషన్ పిటిషన్‌లు ఫైల్ చేస్తున్న డీసీసీబీ, పీఏసీఎస్‌లు
- జూన్ నుంచి డిసెంబరు వరకు 1,457 మంది సెక్షన్–71 కింద నోటీసులు
- వ్యవసాయం కలిసిరాక నష్టాల్లో మునిగినా కనికరించని సర్కారు

కర్నూలు (అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీబీ) బకాయిలను రాబట్టుకునేందుకు రైతుల ఆస్తులను వేలం వేసేందుకు రంగం సిద్ధంచేస్తున్నారు. రైతులకు అవసరమైన రుణాలను పంపిణీచేసి ఆదుకోవాల్సి ఉండగా.. గతంలో ఎప్పుడూలేని విధంగా ఆ విషయంలో పూర్తిగా వెనుకబడింది. పైగా ఇప్పుడు వారి ఆస్తులను విక్రయించి బకాయిలకు జమచేసుకునేందుకు న్యాయ ప్రక్రియ కూడా మొదలుపెట్టింది. ఇందులో భాగంగా తాకట్టు పెట్టిన ఆస్తులను వేలం పాట ద్వారా విక్రయించే ప్రక్రియను జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, పీఏసీఎస్‌లు ముమ్మరం చేశాయి. ఈ ఏడాది జూన్ నుంచి ఒకవైపు సెక్షన్–71 కింద నోటీసులివ్వడం, మరోవైపు ఎగ్జిక్యూషన్ పిటిషన్ (ఈపీ) ఫైల్‌చేయడం వంటివి జరుగుతున్నాయి. అలాగే, 2024 జూన్ నుంచి డిసెంబరు వరకు రూ.122.82 కోట్ల బకాయిలను రాబట్టుకునేందుకు 1,457 మంది రైతులకు సహకార చట్టం సెక్షన్–71 కింద నోటీసులు ఇచ్చారు. ఇదే సమయంలో 522 మంది రైతుల నుంచి రూ.41.92 కోట్లను రాబట్టేందుకు ఈపీలు కూడా దాఖలు చేశారు. ఆస్తుల అమ్మకానికి డిక్రీ కూడా చేయడం గమనార్హం. నిజానికి.. ఈ ఏడాది అన్ని రకాలుగా వ్యవసాయం కలిసిరాక నష్టాల బారిన పడినా రైతుల ఆస్తుల విక్రయాలకు డీసీసీబీ రంగం సిద్ధంచేయడంపట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాటి రోజులు మళ్లీ పునరావృతం..

2014–15 నుంచి 2018–19 వరకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, పీఏసీఎస్‌లు పాత బకాయిలను రాబట్టుకునేందుకు రైతుల జీవితాలతో చెలగాటమాడాయి. మళ్లీ అదే పరిస్థితి ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోను పునరావృతమవుతోంది. బకాయిలు పేరుకుపోవడానికి బ్యాంకు, పీఏసీఎస్ సిబ్బంది అవినీతి అక్రమాలే కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్వల్పకాలిక రుణమైన, దీర్ఘకాలిక రుణమైన రైతులు కమీషన్లు ఇచ్చుకోకపోతే రుణాలిచ్చే పరిస్థితిలేదు. వెరిఫికేషన్ కోసం వెళ్లే అధికారులకూ ముడుపులు సమర్పించాల్సిందే. రూ.లక్ష రుణం తీసుకుంటే చేతికి వచ్చేది రూ.80 వేలే. రికవరీ మాత్రం రూ.లక్ష చేయాల్సిందే. ఈ కారణాలతోనే అనేకమంది రైతులు రుణాలు తిరిగి చెల్లించలేకపోతున్నారు. దీంతో వీరి ఆస్తుల వేలంపాట ద్వారా విక్రయించి బకాయిలు జమచేసుకుంటున్నారు.

రూ.5 కోట్లు రుణాలు ఇస్తే ఒట్టు..

2024–25 ఆర్థిక సంవత్సరంలో రుణాల పంపిణీ కోసం ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బ్రాంచీలకు, పీఏసీఎస్‌లకు రూ.330 కోట్ల బడ్జెట్ ఇచ్చింది. ఈ బడ్జెట్ పూర్తయితే అదనంగా ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉంది. దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాల పంపిణీకి ఈ బడ్జెట్‌ని వినియోగించాలి. బడ్జెట్ దండిగా ఉన్నప్పటికీ రుణాల పంపిణీ మాత్రం పెద్దగాలేదు. వాణిజ్య బ్యాంకులకు రైతులు పోటెత్తుతుంటే జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బ్రాంచీల్లో మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితి కనిపిస్తోంది. ప్రతిఏటా జూలై నుంచి నవంబరు లేదా డిసెంబరు మూడవ వారం వరకే రుణాలు పంపిణీ చేస్తారు. ఆ తర్వాత రికవరీపై దృష్టిసారిస్తారు. ఈ నేపథ్యంలో.. రుణాల పంపిణీకి ఇంత పెద్ద మొత్తం కేటాయించినప్పటికీ ఇప్పటివరకు రుణాల పంపిణీ రూ.5 కోట్లలోపే ఉండటం గమనార్హం.



ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయం

లాభాల బాట పట్టించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం..

నష్టాల ఊబిలో చిక్కుకున్న కర్నూలు డీసీసీబీకి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఊపిరిపోసింది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు కేడీసీసీబీ రుణాలు పంపిణీచేసే ఏర్పాటుచేసింది. కస్టమ్స్ హయ్యరింగ్ సెంటర్లు, మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలకు డీసీసీబీ రుణాలు అందజేసింది. గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా బ్యాంకు లోనింగ్ భారీగా పెరిగింది. వైఎస్సార్‌సీపీ హయాంలో దశాబ్దాల నాటి నష్టాలను అధిగమించి నికర లాభాల్లోకి వచ్చింది. 2022–23, 2023–24 సంవత్సరాల్లో గణనీయమైన నికర ఆదాయం పొందింది. రికార్డు స్థాయిలో ఏకంగా రూ.10 కోట్లు లాభం ఆర్జించగా.. సభ్యులైన పీఏసీఎస్‌లకు రూ.4 కోట్లు డివిడెండ్ ఇచ్చింది. రాయలసీమ జిల్లాల్లోనే అత్యధిక టర్నోవర్ కలిగిన బ్యాంకుగా వరుసగా రెండేళ్లు అవార్డు కూడా అందుకుంది. నికర లాభాల్లోకి వచ్చిన కేడీసీసీబీ మళ్లీ నష్టాల్లోకి వచ్చి బలహీనమైన బ్యాంకుగా రికార్డు నమోదుచేసుకోవడం ఆందోళన కలిగించే విషయం.

రైతుల ఆస్తుల స్వాధీనానికి రంగం సిద్ధం..

ఇక కల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో బకాయిపడిన రైతులు 70 మందికి జూన్ నుంచి సెక్షన్–71 కింద నోటీసులిచ్చారు. తర్వాత 30 మంది రైతులకు ఈపీ దాఖలు చేశారు. కొంతమంది బకాయిలు చెల్లించారు. 20 మంది రైతులు స్పందించకపోవడంతో వారి ఆస్తుల వేలానికి చర్యలు తీసుకున్నారు. దీంతో 13 మంది రైతులు బకాయిలు చెల్లించారు. ఇక ఏడుగురు స్పందించకపోవడంతో వారి ఆస్తులను పీఏసీఎస్ పరం చేసుకోవడానికి చర్యలు చేపట్టారు.

తిరుపతి తొక్కిసలాట ప్రభుత్వ వైఫల్యమే

వైఎస్సార్‌సీపీ రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం



సాక్షి, అమరావతి: తిరుపతిలో తొక్కిసలాట ఘటన చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యమేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం ధ్వజమెత్తారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. టోకెన్ల జారీ విషయంలో కనీస ఏర్పాట్లు చేయకుండా అభంశుభం తెలియని ఆరుగుర్ని పొట్టన పెట్టుకోవడమే కాకుండా, ఈ ఘటన వెనుక కుట్రకోణం ఉందంటూ ప్రభుత్వ పెద్దలు ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. గుడ్డకాల్చి మొహంపై వేసినట్టుగా చంద్రబాబు వైఫల్యంతో ఏ ఘటన జరిగినా.. దానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ముడిపెట్టి ఆరోపణలు చేయడం వారికి అలవాటుగా మారిందన్నారు. గడచిన ఐదేళ్లలో వైకుంఠ ద్వారా దర్శనానికి లక్షలాది మంది భక్తులు తరలివచ్చినా ఏనాడూ ఇబ్బందిపడలేదన్నారు. కానీ.. చంద్రబాబు తన భజన కోసం అధికార గణాన్ని తన వెంట తిప్పుకుని భక్తుల ప్రాణాలు తీశారని ధ్వజమెత్తారు. ఈ ఘటనలో తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కిందిస్థాయి అధికారులను బలి చేయడం సరికాదన్నారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాయపడిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఖర్చులతో పూర్తి వైద్యసాయం అందించి రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. కల్తీ నెయ్యి అంటూ శ్రీవారి పవిత్రమైన ప్రసాదం ప్రతిష్టను దిగజార్చిన విషయాన్ని భక్తులు మరిచి పోలేదన్నారు. బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ సీఎం వైఎస్ జగన్‌ను అడ్డుకోవడం వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకేనని పేర్కొన్నారు.

• సంక్రాంతి వచ్చింది

గాలిపటమా పద పద







పిల్లలూ! సంక్రాంతి పండగ రాగానే ఖాళీ మైదానాల్లో గాలిపటాలు ఎగురుతాయి. చిన్నా పెద్దా అందరూ గాలిపటాలు ఎగరేసి అవి ఆకాశంలో తోక ఊపుతూ ఎగురుతూ ఉంటే సంబర పడతారు. ఈ సీజన్‌లో రకరకాల గాలిపటాలను తయారు చేసి అమ్ముతారు. పిల్లలు వాటిని కొనుక్కుంటారు. కొన్నిసార్లు తెగిన గాలిపటాలు దొరికితే సంబరపడతారు. మరి ఆ గాలిపటాల చరిత్రేమిటో తెలుసా?

గాలిపటం పుట్టిన తేదీ కచ్చితంగా ఎవరికీ తెలియదు. అయితే రెండు వేల సంవత్సరాల క్రితం చైనాలో ఓ రైతు బలమైన గాలికి తన టోపీ ఎగిరిపోకుండా ఒక తీగను కట్టాడని మొదటి గాలిపటం అలా పుట్టిందని కొందరు అంటారు. అయితే క్రీ.పూ.200లో హాన్ రాజ వంశానికి చెందిన చైనీస్ జనరల్ హాన్‌హ్సిన్ తాను దాడి చేస్తున్న నగరం గోడలపై గాలిపటాన్ని ఎగురవేసినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. గాలిపటాలు ఎగిరిన ఎత్తును బట్టి సైన్యం రక్షణగోడలు దాటడానికి ఎంత దూరం సొరంగం తవ్వాల్సి ఉంటుందో అతను అంచనా వేసేవాడట.

ఆ తర్వాత కాలంలో గాలిపటాలు ప్రాచుర్యం పొందాయి. చైనా నుండి కొరియాకు ఆ తర్వాత ఆసియా అంతటికీ వచ్చిన గాలిపటాలు భారతదేశానికి చేరుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వాతావరణాన్ని అంచనా వేసేందుకు గాలిపటాలను వాడేవారు. 13వ శతాబ్దపు మరాఠీ సాధువు, కవి నామదేవ కవిత్వంలో గాలిపటాల ప్రస్తావన ఉంది. 16వ శతాబ్దపు మరాఠీ కవులు దాసోపంత్, ఏకనాథ వంటివారి పాటలు, పద్యాల్లోనూ గాలిపటాల గురించి ఉంది. తులసీదాస్ 'రామచరిత్ మానస్'లో కూడా గాలిపటాల గురించి ప్రస్తావన ఉంది. దేశంలో మొఘలుల పాలన వచ్చాక గాలిపటాల ఎగురవేయడం క్రీడగా మారింది. ప్రస్తుతం చిన్నాపెద్దా తేడా లేకుండా సంక్రాంతి సమయంలో చాలామంది గాలిపటాలు ఎగరేస్తారు. గాలిపటాల తయారీ వందల కోట్ల రూపాయల పరిశ్రమగా మారింది.

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గాలిపటాల కోసం ప్రత్యేకంగా మ్యూజియం ఉంది. భాను షా అనే వ్యక్తి సేకరించిన గాలిపటాలతో 1984లో దీన్ని ప్రారంభించారు. ఇక్కడ 100 రకాల గాలిపటాలతోపాటు వాటి తయారీ పద్ధతులు, వాటి కోసం వాడే వస్తువుల గురించి వివరిస్తారు. గుజరాత్ రాష్ట్రంలోనే 1989 నుంచి ప్రభుత్వం 'అంతర్జాతీయ గాలిపటాల పండుగ' నిర్వహిస్తోంది. ఎక్కడెక్కడి నుంచో జనం వచ్చి ఇక్కడ గాలిపటాలు ఎగరేస్తారు.

అయితే గాలిపటాలు ఎగరేసేటప్పుడు చైనా మాంజా(దారం) వాడకూడదు. ఆ మాంజా నైలాన్‌తో తయారవుతుంది. దానికి గాజుపొడి పూస్తారు. దీనివల్ల దారం పదునుగా ఉండి కోసుకుపోయే ప్రమాదం ఉంది. ఏటా సంక్రాంతి సీజన్లో పక్షులు, పిల్లలూ అనేకమంది గాయపడుతుంటారు. అలాగే ఎత్తైన ప్రదేశాలు, మేడల మీద గాలిపటాలు ఎగరేయడం కూడా చాలా ప్రమాదకరం. ఏమరుపాటుగా ఉంటే కాలు జారి కిందపడే అవకాశం ఉంది. కాబట్టి మీరు గాలిపటాలు ఎగరేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోండి. హాయిగా, ఆనందంగా పటాలు గాలిలోకి ఎగరేయండి

కిడ్స్ లెట్స్ క్రూజ్ టు ఆఫ్రికా...

• సినిమా చూద్దామా?



కిడ్స్... మీరెప్పుడైనా ఆఫ్రికా ఫారెస్ట్ చూశారా! మీరు ఇప్పటిదాకా చూసినా చూడకపోయినా ఈ మూవీతో మీరు ఆఫ్రికా ఫారెస్ట్ చూడవచ్చు. మీరే కాదు మీతో పాటు ఓ సూపర్ కో పాసింజర్ కూడా ఉంది. అదే మనందరికీ ఇష్టమైన పాండా. అదేలాగంటారా ప్రైమ్ వీడియో ఓటిటి లో స్ట్రీమ్ అవుతున్న పాండా బేర్ ఇన్ ఆఫ్రికా మూవీని అర్జెంట్ గా చూసేయండి. ఈ మూవీ మొత్తం ఆఫ్రికా ఫారెస్ట్ లోని సూపర్ విజువల్స్ తో మంచి కామెడీతో ఉంటుంది. పాండా బేర్ ఇన్ ఆఫ్రికా మూవీ స్టోరీ ఏంటంటే...ఇథలిక్ విలేజ్ లో పాంగ్ అనే ఓ యంగ్ పాండా ఉంటుంది. దానికి జీలాంగ్ అనే ఓ చిన్న డ్రాగన్ మంచి ఫ్రెండ్. లయన్ కింగ్ డమ్ వాళ్ళు తమ యంగ్ లయన్ కి గిఫ్ట్ గా ఇవ్వడానికి జీలాంగ్ డ్రాగన్ ను ఆఫ్రికాకి కిడ్నాప్ చేస్తారు. అప్పుడు పాంగ్ తన ఇంకో మంకీ ఫ్రెండ్ జోజోతో కలిసి జీలాంగ్ డ్రాగన్ ను సేవ్ చేయడానికి ఆఫ్రికా బయలుదేరుతుంది. పాంగ్ లాంటి చిన్న పాండా జీలాంగ్ లాంటి పెద్ద డ్రాగన్ ను ఆఫ్రికా వెళ్ళి సేవ్ చేస్తుందా లేదా అన్నది మాత్రం మీరు పాండా బేర్ ఇన్ ఆఫ్రికా మూవీ లోనే చూడాలి. ఈ మూవీ మొత్తం పాండా చేసే స్టంట్స్, పాండా మంకీ ఫ్రెండ్ జోజో చేసే అల్లరి అలాగే వాళ్ళతో కలిసే మరో హైనా చేసే కామెడీ చాలా బాగుంటుంది. సో కిడ్స్ బకల్ అప్ విత్ రిమోట్ అండ్ క్రూస్ టు ప్రైమ్ వీడియో టు విట్నెస్ ఆఫ్రికా విత్ పాండా బేర్.

• పాడుదాం గేయం

సంబరాల సంక్రాంతి

వచ్చిందంట వరాల సంక్రాంతి
తెచ్చిందంట ఇంటింటా నవకాంతి
ముత్యాల ముగ్గులు.. పసిడి రంగులతో
వాకిళ్లు మొత్తం కళకళలాడాయి

ధాన్యలక్ష్మి నేడు ఇల్లు చేరింది
పాడిపంటలతో ఊరు మురిసింది
భోగి మంటలతో వెలుగు నిండింది
పిల్లల బోసి నవ్వుల్లో పండగ విరిసింది

హరిదాసు కీర్తనకు మనసు మురిసింది
బసవన్న చిందు కనువిందు చేసింది
పూలబాలల హొయలన్ని
ఇంటికంతా సంక్రాంతి శోభ తెచ్చింది

వచ్చిందంట వరాల సంక్రాంతి
తెచ్చిందంట ఇంటింటా నవకాంతి
ముత్యాల ముగ్గులు.. పసిడి రంగులతో
వాకిళ్లు మొత్తం కళకళలాడాయి



• మహనీయులు

వీరనారి



పిల్లలూ! మనలో కొందరు చిన్న కష్టం వస్తే ఏం చేయాలో తెలియక కంగారు పడిపోతుంటారు. ఏమీ చేయలేనట్టు దిగులుతో అక్కడే ఆగిపోతారు. కానీ ఆమె మాత్రం అలా చేయలేదు. ధైర్యంగా నిలిచింది. శత్రువులను ఎదురించింది.

ఆమె వారణాసిలో పుట్టింది. వాళ్ళది సంప్రదాయ కుటుంబం. ఆమె తల్లి ఆధ్యాత్మిక చింతన కలిగిన వ్యక్తి. ధైర్యవంతురాలు. కుమార్తెను అదే పద్ధతిలో పెంచి అందరిచేతా మెప్పును పొందింది. 14 ఏళ్ల వయసులో ఆ అమ్మాయికి ఓ రాజుతో వివాహం జరిగింది. కాని కొద్దికాలానికే ఆమె భర్త మరణించాడు.

భర్త మరణంతో కుంగిపోకుండా, ఆయన చివరి కోరిక మేరకు ఓ అబ్బాయిని దత్తత తీసుకుంది. ఆ దత్తత చెల్లదని అప్పటి ఈస్ట్ ఇండియా కంపెనీ అడ్డుపుల్ల వేసింది. వారసులు లేరు కాబట్టి తమ నిబంధన ప్రకారం రాజ్యాన్ని కలిపేసుకుంటామని ఆ దుర్మార్గులు అన్నారు. ఆమె ఒప్పుకోలేదు. తన రాజ్యప్రజలు పరుల పాలన కింద బతకడాన్ని సహించలేనంది. తన రాజ్యాన్ని ఇచ్చే ప్రసక్తే లేదని ఖరాఖండీగా చెప్పింది. ఈస్ట్ ఇండియా కంపెనీ యుద్ధం ప్రకటించింది. ఆమె ఏమాత్రం భయపడలేదు. బిడ్డను నడుముకు కట్టుకొని కదన రంగంలోకి దూకింది. ఆమె ధైర్యం చూసి శత్రువులు బెదిరిపోయారు. అయితే వారి సైన్యం ఎక్కువగా ఉండటంతో వారిని ఆపడం ఆమె వల్ల కాలేదు. తాను శత్రువులకు చిక్కకూడదని దూరంగా వెళ్లిపోయింది. ఆ సమయంలో జరిగిన దాడి కారణంగా ప్రాణాలు విడిచింది.

అంతటి ధైర్యసాహసాలు చూపిన ఆమే వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి. తన రాజ్యం ఈస్ట్ ఇండియా కంపెనీ అధీనంలోకి వెళ్లకూడదని, తన ప్రజలు పరులకు దాస్యం చేయకూడదని భావించి, అందుకోసం తన ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాడారు. చివరకు వీరమరణం పొందారు. మీరూ ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ఎల్లప్పుడూ ధైర్యంగా ఉండాలి.



భోగి మంటల రహస్యం

సంక్రాంతికి ముందు రోజు వచ్చే 'భోగి' నాడు తప్పకుండా భోగి మంట వేస్తారు. ఇంట్లోని పాతసామాన్లు, కర్రలు, పనికిరాని వస్తువులను ఒకచోట చేర్చి మంట పెడతారు. దీనికి కారణమేంటో తెలుసా? సంక్రాంతి సమయంలో సూర్యుడు భూమికి దూరంగా ఉండటంతో ఉష్ణోగ్రతలు తగ్గి, చలి తీవ్రత పెరుగుతుంది. ఆ వాతావరణాన్ని తట్టుకునేందుకు భోగి మంటలు వేస్తారు. ఆ మంటల్లో పాత బట్టలు, చెక్కలు, వస్తువులు వేయడం ద్వారా ఇంట్లో వ్యర్థమైన వస్తువులు, మన మనసులో వ్యర్థమైన ఆలోచనలు ఉండకుండా చూసుకోవాలని చెప్తారు. మనలోని చెడు ఆలోచనలను దహించి, మంచి ఆలోచనలను పెంచేలా ఉండాలని సూచిస్తారు. అదే భోగిమంటల్లోని రహస్యం.

• కథ

కొన్నవీ పాయే... కొట్టుకొచ్చినవీ పాయే...







ఒక అడవిలో ఒక నక్క వుండేది. దాని ఇంటిలో బియ్యం అయిపోయాయి. పక్కనే వున్న ఊరిలో కొందామని బండి కట్టుకోని బైలు దేరింది. ఆ ఊరిలో రంగయ్య అనే అతను అంగడి నడుపుతూ వున్నాడు.

సరుకులు కొనడానికి నక్క ఆ అంగడి దగ్గరికి వచ్చింది. కాని అది అన్నం టైము కావడంతో రంగయ్య కాక రంగయ్య చిన్న కొడుకు ఉన్నాడు. వాణ్ణి చూసిన నక్క ఎలాగైనా సరే ఆ పిల్లోన్ని మోసం చేసి సరుకులు కొట్టెయ్యాలి అనుకుంది.

నక్క ఆ పిల్లోనితో 'ఏం అల్లుడూ బాగున్నావా' అంటూ తీయగా మాటలు కలిపి 'ఒక బియ్యం మూట కావాలి. ఎంత' అని అడిగింది. ఆ పిల్లోడు ధర చెప్పగానే 'ఇదిగో డబ్బులు తీసుకో... సరిగా వున్నాయో లేదో లెక్కబెట్టుకో' అంటూ డబ్బులు చేతిలో పెడుతున్నట్టు దగ్గరికి తీసుకుపోయి, ఆ పిల్లోడు అందుకోక ముందే వదిలేసింది. దాంతో ఆ డబ్బులన్నీ అంగడిలో చెల్లాచెదురుగా పడిపోయాయి.

దాంతో ఆ పిల్లోడు డబ్బులు ఏరుకుందామని కిందికి వంగాడు. వెంటనే కన్ను మూసి తెరిచేంతలోగా ఆ దొంగనక్క అంగడి బైటున్న బొరుగుల సంచీని, చెక్కర సంచీని ఎత్తి బండిలో వేసి, అవి కనబడకుండా దుప్పటి కప్పేసి, ఏమీ ఎరగని నంగనాచిలా గమ్మున నిలబడింది.ఆ పిల్లోడు కిందపడిన డబ్బులన్నీ ఏరి లెక్క చూసుకొని 'సరిపోయినాయిలే నక్కమామా... బియ్యం మూట తీసుకోపో' అన్నాడు. నక్క అలాగేనని బియ్యం మూట ఎత్తి బండిలో వేసుకుని సంబరంగా తిరిగి బైలుదేరింది.

కొంచెం దూరం పోయాక ఒక్కసారిగా ఆకాశమంతా నల్లని మబ్బులు కమ్ముకున్నాయి. ఝుమ్మని పెద్దగాలి లేచింది. ఆ గాలి వేగానికి బండిపైన కప్పిన దుప్పటి ఎగిరిపోయింది. లోపల బొరుగుల మూట ఒక్కసారిగా ఎగిరి దభీమని కింద పడింది. అలా పడడం పడడం దానికి కట్టిన తాడు విడిపోయింది. అంతే... సంచీలోంచి బొరుగులన్నీ రివ్వున గాలితో పాటు పైకి లేచాయి. ఆకాశమంతా తెల్లగా బొరుగులతో నిండిపోయింది. నక్క అదిరిపడి 'అయ్యో... నా బొరుగులు' అని బండి దిగి లబలబలాడుకుంటా వచ్చింది. కానీ అప్పటికే సంచీలో ఒక్క బొరుగు కూడా మిగల లేదు. అంతా ఖాళీ.

నక్క బాధ పడతా మరలా బైలు దేరింది. కానీ కొంచం దూరం పోయిందో లేదో నల్లని మబ్బుల నుంచి వాన మొదలైంది. బండిలో చెక్కర మూట ఆ వానకు నిమిషాల్లో తడిసిపోయింది. మూటలోంచి చెక్కరంతా పాకంలా మారి ఉత్త సంచీ మిగిలింది. అది చూసి ఆ దొంగనక్క 'అయ్యయ్యో... చెక్కర మొత్తం కరిగిపోయిందే' అని తెగ బాధ పడింది.

అంతలో ఆకాశంలో గుండెలు అదిరిపోయేలా ఉరుములు ఉరిమాయి. ఆ చప్పుడుకు భయపడిన ఎద్దులు వేగంగా పరుగులు తీశాయి. అవి అలా అదిరిపడి వురుకుతా వుంటే దారిలో ఒక పెద్ద రాయి అడ్డం వచ్చింది. బండి సక్కగా పోయి మురికి గుంతలో పడింది. అంతే... బండిలోని బియ్యం మూట ఎగిరి ఆ మురికి గుంతలో పడి మునిగిపోయింది. అది చూసి నక్క నోట మాట రాలేదు.

'కరకరలాడే బొరుగులూ దొరక లేదు. తీయతీయని చెక్కరా మిగల లేదు. వండుకునే బియ్యమూ దక్కలేదు. ఎక్కి వచ్చిన బండీ మిగల లేదు. కొట్టు కొచ్చినవీ పోయాయి. కొనుక్కొచ్చినవీ పోయాయి. ఇదంతా ఆ చిన్న పిల్లోన్ని మోసం చేసినందుకే. ఇంకెప్పుడూ ఇలాంటి దొంగపనులు చేయగూడదు' అనుకొంది.

- డా.ఎమ్.హరికిషన్

భలే.. భలే.. భోగి పళ్లు



మీలో కొంతమంది భోగి పండగనాడు భోగి పళ్లు పోయించుకుని ఉంటారు. భోగి నాడు చిన్నపిల్లలకు పోసే రేగుపళ్లనే భోగిపళ్లు అని అంటారు. సాయంత్రం వేళ పెద్దవాళ్లను పిలిచి గుప్పిట నిండా రేగుపళ్లు, చిల్లర డబ్బులు, బంతిపూలరెక్కలు, చెరుకు ముక్కలని తీసుకుని, మూడుసార్లు ఐదేళ్ల లోపు పిల్లల చుట్టూ తిప్పి వారి తల మీద పోస్తారు. దాన్నే 'భోగిపళ్లు పోయడం' అంటారు. ఇలా ఎందుకు చేస్తారో తెలుసా?

రేగుపండు భారతదేశపు ఉపఖండంలోనే పుట్టిందని ఓ నమ్మకం. అందుకే దాన్ని 'ఇండియన్ డేట్' అని పిలుస్తారు. మనదేశ వాతావరణంలో రేగి ఎలాంటిచోటైనా పెరుగుతుంది. అన్ని పరిస్థితులనూ తట్టుకొని నిలబడుతుంది. రేగుని సంప్రదాయ వైద్యంలో వాడతారు. చాలా రకాల వ్యాధులకు రేగుపండు ఔషధంగా పనిచేస్తుంది. ఆ పండ్ల నుంచి వచ్చే వాసన పీలిస్తే మనసు ఆహ్లాదంగా ఉంటుంది. చిన్న పిల్లల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది కాబట్టి, రేగుపళ్లు పోయడం ద్వారా వారిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని నమ్ముతారు. పైగా రేగుపళ్లు తినడం వల్ల జీర్ణసంబంధమైన వ్యాధులు రావు. అలాగే బంతిపూలతో కలిపి రేగిపళ్లను పోయడం వల్ల చర్మసంబంధమైన వ్యాధులు దూరమవుతాయి. ఇన్ని ప్రయోజనాలున్నాయి కాబట్టే భోగి పండుగ నాడు చిన్నారులకు భోగిపళ్లు పోసి, ఆశీర్వదిస్తారు.

బిజినెస్ రీల్

స్విగ్గీ సర్వ్స్ ద్వారా పేదలకు ఆహారం

న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీ సేవల్లో ఉన్న స్విగ్గీ తాజాగా స్విగ్గీ సర్వ్స్ పేరుతో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా హోటళ్లు, రెస్టారెంట్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను సేకరించి పేదలకు పంపిణీ చేస్తారు. వాలంటీర్లతో నడిచే నిధుల రహిత సంస్థ రాబిన్ హుడ్ ఆర్మీతో స్విగ్గీ చేతులు కలిపింది. స్విగ్గీ సర్వ్స్ సేవలు ప్రస్తుతం 33 నగరాల్లో అందుబాటులోకి తెచ్చారు. మరిన్ని నగరాలకు ఈ సేవలను విస్తరిస్తామని స్విగ్గీ ఫుడ్ మార్కెట్‌ప్లేస్ సీఈవో రోహిత్ కపూర్ తెలిపారు. 'ఇది వ్యర్థాలను తగ్గించడం మాత్రమే కాదు. అర్థవంతమైన ప్రభావాన్ని సృష్టించడం. భోజనం వృథా కాకుండా చూసుకోవడం' అని అన్నారు. 2030 నాటికి 5 కోట్ల మీల్స్ అందించాలని ఇరు సంస్థలు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి.

బీఈ నైపుణ్యాభివృద్ధి కేంద్రం ప్రారంభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బయోలాజికల్ ఈ. లిమిటెడ్ సీఎస్ఆర్ విభాగమైన డాక్టర్ విజయ్ కుమార్ దాట్ల ఫౌండేషన్, హైదరాబాద్‌లో బీఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించింది. తెలంగాణ ప్రభుత్వం, జీహెచ్ఎంసీతో కలిసి దీన్ని ఏర్పాటు చేసినట్లు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ త్రిషన్య రాజు తెలిపారు. ఉద్యోగ నైపుణ్యాల్లో శిక్షణ పొందదల్చుకున్న వారు ఇందులో పేరు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కేంద్రంలో ఏటా 600–720 మందికి ఫార్మా, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, రిటైలింగ్ తదితర అంశాల్లో ఉచిత శిక్షణ ఇస్తారు. ఒకేషనల్ కోర్సుల్లో చేరేందుకు ఎటువంటి విద్యార్హతలు అవసరం లేదు. కాగా, పారిశ్రామిక కోర్సులకు కనీసం 10వ తరగతి, ఐటీఐ వంటి విద్యార్హతలు ఉండాలి.

ఇరెడా లాభం జూమ్

క్యూ3లో రూ. 425 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో పీఎస్‌యూ దిగ్గజం ఇండియన్ రెనెవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఇరెడా) ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 27 శాతం ఎగసి రూ. 425 కోట్లను అధిగమించింది. ఇందుకు ఆదాయం పుంజుకోవడం దోహదపడింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 336 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఇక మొత్తం టర్నోవర్ మరింత అధికంగా 36 శాతం జంప్‌చేసి రూ. 1,699 కోట్లకు చేరింది. గతేడాది క్యూ3లో రూ. 1,253 కోట్ల ఆదాయం నమోదైంది. నెట్‌వర్త్ 21 శాతం బలపడి రూ. 9,842 కోట్లను తాకింది. పునరుత్పాదక ఇంధనాలవైపు దేశాన్ని నడిపించేందుకు కంపెనీ కట్టుబడి ఉన్నట్లు సీఎండీ ప్రదీప్ కుమార్ దాస్ పేర్కొన్నారు.

ఇరెడా షేరు ఎన్ఎస్ఈలో దాదాపు 6 శాతం పతనమై రూ. 204 దిగువన ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

11-1-2025	
విశాఖ	520–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	490–00
వరంగల్	492–00
రిటైల్ ధర	5.50

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TCS	4,265.00	5.6
TECHM	1,701.80	3.59
HCLTECH	1,997.10	3.22
INFY	1,965.80	2.53
WIPRO	299.65	2.51

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	532.15	-5.3
INDUSINDBK	938.8	-4.29
ADANIENT	2,380.10	-3.95
NTPC	308.2	-3.79
BEL	270.8	-3.72

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,916
ఎన్ఎస్ఈ	93,384
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,90,610
ఎఫ్ఐఐ	- 2,255
డీఐఐ	+ 3,962

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	76.26	$ 73.92
బ్రెంట్	79.31	$ 76.92

2025 జోరు

నిధుల సమీకరణలో

- 21 శాతం వృద్ధితో రూ. 14.27 లక్షల కోట్లకు
- ఎన్ఎస్ఐఎం సదస్సులో సెబీ చీఫ్ బచ్ అంచనా
- రూ. 250 కనీస పెట్టుబడితో సిప్ పథకాలకు సై
- ఎస్ఎంఈ ప్రతిపాదనలకు వేగంగా అనుమతులు



ఎన్ఎస్ఐఎం సదస్సులో సెబీ చీఫ్ మాధవీ పురీ బచ్ తదితర అధికారులు

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25)లో క్యాపిటల్ మార్కెట్ల ద్వారా నిధుల సమీకరణ జోరందుకున్నట్లు సెబీ చీఫ్ మాధవీ పురీ బచ్ పేర్కొన్నారు. మార్చితో ముగియనున్న పూర్తి ఏడాదికి 21 శాతం ఎగసి రూ. 14.27 లక్షల కోట్లకు చేరే వీలున్నట్లు అంచనా వేశారు. గతేడాది(2023–24)లో ఈక్విటీ, డెట్ మార్కెట్ల నుంచి రూ. 11.8 లక్షల కోట్లు మాత్రమే సమకూర్చుకున్నట్లు ప్రస్తావించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్(ఎన్ఎస్ఐఎం) నిర్వహించిన ఒక సదస్సులో బచ్ పలు అంశాలను వివరించారు. ఈ ఏడాది తొలి 9 నెలల్లో(ఏప్రిల్–డిసెంబర్) కంపెనీలు ఈక్విటీల నుంచి రూ. 3.3 లక్షల కోట్లు, రుణ మార్గాల ద్వారా రూ. 7.3 లక్షల కోట్లు అందుకున్నట్లు తెలియజేశారు. వెరసి రూ. 10.7 లక్షల కోట్లు సమీకరించినట్లు వెల్లడించారు. ఇక చివరి త్రైమాసికాన్ని(జనవరి–మార్చి) కూడా పరిగణిస్తే ఈక్విటీ, డెట్ విభాగాల ద్వారా సుమారు రూ. 14.27 లక్షల కోట్లను అందుకునే వీలున్నట్లు బచ్ అంచనా వేశారు.

ఇకపై ఇన్విట్స్ అదుర్స్

నిజానికి ఈ ఏడాది తొలి 9 నెలల్లో మునిసిపల్ బాండ్లుసహా రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు (ఇన్విట్స్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్విట్స్ ద్వారా సమీకరించిన నిధులు రూ. 10,000 కోట్లు మాత్రమేనని బచ్ వెల్లడించారు. అయితే వచ్చే దశాబ్దంలో వీటిలో యాక్టివిటీ భారీగా పెరగనున్నట్లు అంచనా వేశారు. దీంతో ఈక్విటీ, డెట్ మార్కెట్ల నుంచి సమీకరించే నిధులను అధిగమించనున్నట్లు అభిప్రాయపడ్డారు. ఎన్ఐఎస్ఎంను క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

ఎస్ఎంఈలకు దన్ను

చిన్న, మధ్యతరహా సంస్థ(ఎస్ఎంఈ)ల బోర్డు ప్రతిపాదనలకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేసే ప్రణాళికల్లో ఉన్నట్లు బచ్ పేర్కొన్నారు. క్లియరింగ్‌లకు పడుతున్న సమయాన్ని కుదించే యోచనలో ఉన్నట్లు తెలియజేశారు. ఎస్ఎంఈ ప్రతిపాదనలను అనుమతించేందుకు సెబీ 3 నెలల గడువును తీసుకుంటున్నదని, బ్యాంకులైతే 15 నిముషాలలో ముందస్తు అనుమతులు మంజూరు చేస్తున్నాయని బచ్ వ్యాఖ్యానించారు. దీంతో అనుమతుల జారీలో మరింత సాంకేతికతను వినియోగించనున్నట్లు తెలియజేశారు.

ఐపీవోల వరద

ఇటీవల కొద్ది నెలలుగా పబ్లిక్ ఇష్యూలు వెల్లువెత్తుతుండటంతో అప్రమత్తత పెరిగినట్లు బచ్ తెలియజేశారు. పలు కంపెనీలు సెబీ తలుపు తడుతున్నప్పటికీ ఇతర మార్గాలకూ ప్రాధాన్యత ఇవ్వవలసి ఉన్నట్లు పేర్కొన్నారు. వీటిలో ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్లు, ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్లు, రైట్స్ ఇష్యూలు తదితరాలను ప్రస్తావించారు. రైట్స్ జారీలో వ్యవస్థలను ఆధునీకరిస్తున్నట్లు, ఇందుకు కంపెనీలు సైతం సన్నద్ధంకావలసి ఉన్నట్లు వెల్లడించారు. కాగా.. మ్యూచువల్ ఫండ్ల కొత్త ఆఫర్లకు వేగవంత అనుమతులిస్తున్నామని, ఇకపై రూ. 250 కనీస పెట్టుబడులతో సిప్ పథకాలను అనుమతించనున్నట్లు తెలియజేశారు. గత కొన్నేళ్లలో దేశీయంగా పెట్టుబడులు పుంజుకోవడంతో విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడు నమోదయ్యే ఆటుపోట్లు తగ్గినట్లు వివరించారు.

చిన్న సంస్థల రుణాల ట్రాకింగ్‌కు ప్రత్యేక సంస్థ ఉండాలి

ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి



చిన్న వ్యాపార సంస్థలు తీసుకునే రుణాలు లేదా ఈక్విటీ కింద సమీకరించే సద్వినియోగం అవుతున్నాయో లేదో పరిశీలించేందుకు మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థలాంటిదేదైనా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చైర్మన్ సీఎస్ శెట్టి అభిప్రాయపడ్డారు. 'నిధులను దేని కోసం తీసుకుంటున్నారో కచ్చితంగా ఆ అవసరానికే వినియోగించేలా చూసేందుకు ఒక యంత్రాంగం అవసరం. రుణంగా లేదా ఈక్విటీ కింద తీసుకున్న నిధుల వినియోగాన్ని ట్రాక్ చేసే అధికారాలతో ప్రత్యేక మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థలాంటిది ఉండాలి' అని ఎన్ఐఎస్ఎం నిర్వహించిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. ఇలాంటి సంస్థను ఏర్పాటు చేయడం వల్ల రుణదాతలు, ఇన్వెస్టర్లకు కొంత భరోసా లభించగలదని శెట్టి చెప్పారు. చిన్న వ్యాపార సంస్థలు సమీకరించిన నిధులను అంతిమంగా ఉపయోగించే తీరుతెన్నులపై ఆందోళన వ్యక్తమవుతుండటం, నిధుల వినియోగాన్ని పర్యవేక్షించాలంటూ బ్యాంకులపై ఆర్‌బీఐ కూడా ఒత్తిడి పెంచుతుండటం తదితర పరిణామాల నేపథ్యంలో శెట్టి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఎదగాలంటే దేశీయంగా పొదుపు రేటు మరింత పెరగాలని, ఇందులో క్యాపిటల్ మార్కెట్లు కూడా కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని శెట్టి చెప్పారు. క్రెడిట్ రేటింగ్స్‌ను పొందాలంటే చిన్న, మధ్య తరహా సంస్థలకు సరైన ఆర్థిక వివరాల రికార్డులు గానీ ఆర్థిక వనరులు గానీ ఉండవని, అలాంటి సంస్థలకు రుణాలివ్వడంలో రిస్కులను మదింపు చేయడం బ్యాంకులకు కష్టతరంగా ఉంటుందని పేర్కొన్నారు.

వ్యక్తిగత రుణాలపై స్థిర వడ్డీ రేటు

ఈఎంఐ రూపంలో ఇచ్చే వాటికి తప్పనిసరి ● స్పష్టం చేసిన ఆర్‌బీఐ



ముంబై: నెలవారీ సమాన వాయిదాలపై (ఈఎంఐ) మంజూరు చేసే అన్ని వ్యక్తిగత రుణాల్లో బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు తప్పనిసరిగా స్థిర వడ్డీ రేటు ఉత్పత్తిని అందించాల్సిందేనని ఆర్‌బీఐ ప్రకటించింది. వడ్డీ రేటు ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ విధానంతో లేక ఇంటర్నల్ బెంచ్‌మార్క్ విధానంతో అనుసంధానమైనదా? అన్న దానితో సంబంధం లేకుండా అన్ని ఈఎంఐ ఆధారిత వ్యక్తిగత రుణాలకు ఇది అమలవుతుందని స్పష్టం చేసింది. రుణాన్ని మంజూరు చేసే సమయంలోనే వర్తించే వార్షిక వడ్డీ రేటు (ఏపీఆర్)ను కీలక సమాచార నివేదిక (కేఎఫ్ఎస్), రుణ ఒప్పంద పత్రాల్లో బ్యాంక్‌లు, ఇతర నియంత్రిత సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు)వెల్లడించాల్సి ఉంటుందని పేర్కొంది. రుణ కాల వ్యవధిలో ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ రేటు కారణంగా ఈఎంఐ/లేదా కాల వ్యవధిని పెంచేట్టు అయితే ఆ విషయాన్ని తప్పకుండా రుణగ్రహీతకు తెలియజేయాలని తెలిపింది. ప్రతి త్రైమాసికానికి ఒకసారి లోన్ అకౌంట్ స్టేట్‌మెంట్‌ను జారీ చేయాలని, అందులో అప్పటి వరకు చెల్లించిన వడ్డీ, అసలు ఎంత?, ఇంకా ఎన్ని ఈఎంఐలు మిగిలి ఉన్నాయనే సమాచారం ఉండాలని పేర్కొంది. ఈఎంఐ ద్వారా రుణాన్ని చెల్లించే వారికి స్థిర వడ్డీ రేటును లేదా కాల వ్యవధిని పెంచుకునే అవకాశం కల్పించాలని 2023 ఆగస్ట్‌లోనే బ్యాంక్‌లను ఆర్‌బీఐ ఆదేశించడం గమనార్హం. దీనికి సంబంధించి సందేహాలపై తాజా స్పష్టతనిచ్చింది.

2025లో ఐపీవోల వెల్లువ

కొటక్ మహీంద్రా క్యాపిటల్ అంచనా



ముంబై: ప్రైమరీ మార్కెట్ల జోరు ఈ కేలండర్ ఏడాది(2025)లోనూ సరికొత్త రికార్డులను నెలకొల్పనున్నట్లు కొటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ అభిప్రాయపడింది. పలు దిగ్గజాలు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యేందుకు సన్నాహాలు చేపట్టడంతో 2025లో 35 బిలియన్ డాలర్ల సమీకరణకు వీలున్నట్లు అంచనా వేసింది. 2024లో 91 కంపెనీలు ఐపీవోల ద్వారా రూ. 1.67 లక్షల కోట్లు సమకూర్చుకున్న సంగతి తెలిసిందే. ఇది ప్రైమరీ మార్కెట్ల చరిత్రలోనే అత్యధికంకాగా.. ఈ ఏడాది మరిన్ని కంపెనీలు పబ్లిక్ ఇష్యూలకు రానున్నాయి. జాబితాలో ఫైనాన్షియల్ సర్వీసుల రంగం టాప్ ర్యాంకులో నిలవనున్నట్లు కొటక్ మహీంద్రా క్యాపిటల్ పేర్కొంది. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, అవాన్సే ఫైనాన్షియల్ సర్వీసెస్, టాటా క్యాపిటల్ తదితర దిగ్గజాలు ఉమ్మడిగా 9 బిలియన్ డాలర్లు సమీకరించే ప్రణాళికల్లో ఉన్నట్లు వెల్లడించింది. ఈ బాటలో డిజిటల్ టెక్ కంపెనీలు ఈకామ్ ఎక్స్‌ప్రెస్, ఓలా, జెప్టో, పెప్పర్‌ఫ్రై తదితరాలు 5 బిలియన్ డాలర్లపైగా కన్నేసినట్లు తెలియజేసింది.

ఇష్యూ పరిమాణం అప్

పలు కంపెనీలు ఐపీవోల ద్వారా పెట్టుబడుల సమీకరణపై దృష్టి పెట్టడంతో ఇష్యూ పరిమాణంసైతం పెరిగే వీలున్నట్లు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ కొటక్ మహీంద్రా క్యాపిటల్ వివరించింది. ప్రైమరీ, సెకండరీ మార్కెట్ల జోరు కారణంగా 2024లో లిస్టింగ్ రోజు సగటు ప్రీమియం 33 శాతానికి ఎగసినట్లు వెల్లడించింది. గతేడాది విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు పెట్టుబడులకు సెకండరీ మార్కెట్లకంటే పబ్లిక్ ఇష్యూలపట్లే అత్యంత మక్కువ చూపినట్లు పేర్కొంది. ఆటో రంగ దిగ్గజం హ్యుందాయ్ చేపట్టిన రూ. 27,000 కోట్ల పబ్లిక్ ఇష్యూ నేపథ్యంలో పలు ఎంఎన్‌సీలు సైతం దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ వైపు ఆకర్షితమవుతున్నట్లు వివరించింది.

భారత్ వృద్ధి 6.6 శాతం

- 2025లో నమోదు చేస్తుంది
- బలంగా పెట్టుబడులు, వినియోగం
- ఐక్యరాజ్యసమితి నివేదిక అంచనా



యునైటెడ్ నేషన్స్: భారత ఆర్థిక వ్యవస్థపై ఐక్యరాజ్యసమితి ఆశావహ దృక్పథాన్ని ప్రకటించింది. 2025లో భారత్ జీడీపీ 6.6 శాతం వృద్ధి సాధిస్తుందని అంచనా వేసింది. ప్రైవేటు వినియోగం, పెట్టుబడులు బలంగా ఉండడం వృద్ధికి మద్దతునిస్తుందని పేర్కొంది. మౌలికరంగ వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం చేస్తున్న మూలధన వ్యయాల ప్రభావం రానున్న సంవత్సరాల్లో ఆర్థిక వ్యవస్థపై ఎన్నో రెట్లు ఉంటుందని అంచనా వేసింది. 'ప్రపంచ ఆర్థిక పరిస్థితి, అవకాశాలు 2025' పేరుతో ఐక్యరాజ్యసమితి ఒక నివేదికను విడుదల చేసింది. భారత్ జీడీపీ 2024లో 6.8 శాతం వృద్ధి చెందగా, 2025లో 6.6 శాతం, 2026లో 6.8 శాతం చొప్పున వృద్ధి చెందుతుందని ఈ నివేదికలో అంచనాలు వెల్లడించింది. సేవలు, ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి కొన్ని రకాల వస్తు ఎగుమతుల్లో బలమైన వృద్ధి భారత ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలుస్తుందని తెలిపింది. 2024లో వర్షాలు ఆశాజనకంగా ఉండడం 2025లో వ్యవసాయ ఉత్పాదకతను పెంచుతుందని పేర్కొంది. భారత్‌లో భారీ స్థాయి మౌలిక ప్రాజెక్టులు, ఫిజికల్, డిజిటల్ అనుసంధానత, సోషల్ ఇన్‌ఫ్రాపై ప్రభుత్వం చేస్తున్న వ్యయాలు 2025లోనూ బలంగా కొనసాగుతాయని అంచనా వేసింది.

ద్రవ్యోల్బణం దిగొస్తుంది..

భారత్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 2024లో 4.8 శాతం ఉండగా, 2025లో 4.3 శాతానికి దిగొస్తుందని ఐక్యరాజ్యసమితి నివేదిక అంచనా వేసింది. మధ్యకాలానికి ఆర్‌బీఐ లక్షిత పరిధి అయిన 2–6 శాతం మధ్యే ఉంటుందని పేర్కొంది. భారత్‌లో ఉపాధి మార్కెట్ 2024 వ్యాప్తంగా బలంగా ఉన్నట్టు, కార్మికుల భాగస్వామ్యం రికార్డు స్థాయిలో ఉన్నట్టు తెలిపింది. పట్టణ ప్రాంత నిరుద్యోగం 2023లో 6.7 శాతంగా ఉంటే, 2024లో 6.6 శాతంగా ఉన్నట్టు వెల్లడించింది. ఉద్యోగాల్లో మహిళల భాగస్వామ్యం మెరుగుపడినట్టు తెలిపింది. ఇక అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ 2025లో 2.8 శాతం, 2026లో 2.9 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేస్తుందని అంచనా వేసింది. 2023, 2024లో 2.8 శాతంగా ఉండడం గమనార్హం.

ఎక్కువ గంటలు పనిచేస్తే

సక్సెస్ వస్తుందా?

ఎల్అండ్‌టీ చైర్మన్ వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు



న్యూఢిల్లీ: ''ఆదివారాలు కూడా ఆఫీస్‌కు రండి. వారానికి 90 గంటలు పనిచేయండి''అంటూ ఎల్అండ్‌టీ చైర్మన్ ఎస్ ఎన్ సుబ్రమణియన్ చేసిన వ్యాఖ్యలపై ప్రముఖ పారిశ్రామికవేత్తలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ గంటలు పనిచేస్తే విజయం వస్తుందన్న గ్యారంటీ ఏమీ లేదని, కష్టపడి పనిచేయడం ముఖ్యమని, ఏది ఉన్నా ఉన్నత స్థాయి మేనేజ్‌మెంట్ నుంచే ఇది అమలు కావాలన్న అభిప్రాయాలు వినిపించాయి. అంతేకాదు, ఎల్అండ్‌టీ ఉద్యోగుల సగటు మధ్యస్త వేతనం కంటే 534 రెట్లు అధికంగా రూ.51 కోట్ల వేతనాన్ని 2023–24 ఆర్థిక సంవత్సరానికి సుబ్రమణియన్ తీసుకోవడం పైనా సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. ''వారంలో 90 గంటలా? సండేని సన్ డ్యూటీగా ఎందుకు పేరు మార్చకూడదు. వారంలో ఒకరోజు సెలవుదినాన్ని ఒక భావనగా మార్చేయండి'' అంటూ ఆర్‌పీజీ ఎంటర్ ప్రైజెస్ చైర్మన్ హర్ష గోయెంకా 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. కష్టపడి, స్మార్ట్‌గా పనిచేయడాన్ని తాను విశ్వసిస్తానన్నారు. జీవితాన్ని పూర్తిగా కార్యాలయానికే అంకితం చేయడం వల్ల విజయం రాకపోగా, అగ్ని రాజుకుంటుందన్నారు. ఉద్యోగం–జీవితం మధ్య సమతుల్యత అన్నది ఐచ్ఛికం కాదని, తప్పనిసరి అని పేర్కొన్నారు. మారికో చైర్మన్ హర్ష్ మారివాలా కూడా ఇదే మాదిరి అభిప్రాయాన్ని ఎక్స్‌పై వ్యక్తం చేశారు. ''విజయానికి కష్టపడి పనిచేయడం అన్నది కీలకం. ఇందుకు ఎన్ని గంటలు పనిచేశామన్నది ముఖ్యం కాదు. నాణ్యత, ఆ పని పట్ల అభిరుచి విజయాన్ని నిర్ణయిస్తాయి''అని పేర్కొన్నారు. బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్ ఓ టీవీ ఛానల్‌తో మాట్లాడిన సందర్భంగా దీనిపై స్పందించారు. ''ఇది అగ్ర స్థాయి ఉద్యోగుల నుంచి ప్రారంభిద్దాం. ఫలితమిస్తుందని తేలితే అప్పుడు మిగిలిన వారికి అమలు చేద్దాం''అని పేర్కొన్నారు.

ఎంఎఫ్ఐలకు ఆర్థిక సహకారం అవసరం

- సవాళ్లను అధిగమించేందుకు దన్నుగా నిలవాలి
- ప్రభుత్వానికి సూక్ష్మ రుణ సంస్థల వినతి
- పరిశ్రమ ప్రతినిధులతో ఆర్థిక శాఖ సమావేశం



ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి నాగరాజు

న్యూఢిల్లీ: సూక్ష్మ రుణ సంస్థలు (ఎంఎఫ్ఐ) ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు వీలుగా ప్రత్యేకమైన నిధి ఏర్పాటుతోపాటు ప్రభుత్వం నుంచి సహకారం అవసరమని ఈ రంగం స్పష్టం చేసింది. పేదల రుణ అవసరాలను తీర్చడంలో ముఖ్య భూమిక పోషిస్తున్న సూక్ష్మ రుణ పరిశ్రమ (ఎంఎఫ్ఐ) ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలను అర్థం చేసుకునేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి నాగరాజు ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం సా–ధన్ ఈడీ, సీఈవో జిజి మామెన్ మీడియాతో మాట్లాడారు. అనియంత్రిత సంస్థలను ఏరిపారేయాలని, అలాంటి సంస్థలు అనుసరిస్తున్న దారుణమైన రుణ వసూళ్ల విధానాలకు చెక్ పెట్టాలని సూచించినట్టు చెప్పారు. రుణాలకు ఆధార్‌ను తప్పనిసరి డాక్యుమెంట్‌గా చేయాలని కోరినట్టు తెలిపారు. ప్రస్తుతం ఎంఎఫ్ఐలు రుణ గ్రహీతల నుంచి ఆధార్ తీసుకునేందుకు అనుమతి లేదు. పరిశ్రమకు ప్రత్యేకమైన నిధుల యంత్రాంగం ఉండాలని డిమాండ్ చేసినట్టు చెప్పారు. కరోనా సమయంలో రూ.25,000 కోట్లతో ఆర్‌బీఐ ప్రత్యేక విండో ప్రారంభించడాన్ని ప్రస్తావించినట్టు తెలిపారు. క్రెడిట్ గ్యారంటీని కూడా పరిశీలించాలని కోరినట్టు చెప్పారు.

పెరిగిపోయిన మొండి బకాయిలు

మొండి పద్దులు పెరిగిపోతుండడంతో ఎంఎఫ్ఐలు అప్రమత్త ధోరణితో వ్యవహరిస్తున్నాయి. దీంతో సెప్టెంబర్ త్రైమాసికం చివరికి సూక్ష్మ రుణ రంగంలో రుణాల అవుట్ స్టాండింగ్ (తిరిగి రావాల్సిన మొత్తం/నికర రుణ పోర్ట్‌ఫోలియో) 4.3 శాతానికి (రూ.4.14 లక్షల కోట్లు) తగ్గినట్టు క్రెడిట్ సమాచార సంస్థ 'క్రిఫ్ హై మార్క్' నివేదిక వెల్లడించింది. అదే సమయంలో మొండి బకాయిలు పెరిగిపోయినట్టు తెలిపింది. ''1–30 రోజుల వరకు చెల్లింపులు చేయని రుణాలు జూన్ త్రైమాసికం చివరికి 1.2 శాతంగా ఉంటే, సెప్టెంబర్ చివరికి 2.1 శాతానికి పెరిగాయి. 31–180 రోజుల వరకు చెల్లింపులు చేయని రుణాలు ఇదే కాలంలో 2.7 శాతం నుంచి 4.3 శాతానికి ఎగిశాయి''అని వెల్లడించింది. బీహార్, తమిళనాడు, యూపీ, ఒడిశా రాష్ట్రాల్లో సూక్ష్మ రుణాల చెల్లింపుల నిలిపివేతలు ఎక్కువగా ఉన్నట్టు, పెరిగిన వసూలు కాని రుణాల్లో మూడింట రెండొంతులు ఈ రాష్ట్రాల నుంచే ఉన్నట్టు తెలిపింది. ఒకే రుణ గ్రహీత మూడు లేదా అంతకంటే ఎక్కువ సంస్థల నుంచి రుణాలు తీసుకోవడం తగ్గడాన్ని సానుకూలతగా పేర్కొంది.

అదానీ విల్మర్‌లో వాటా విక్రయం

- షేరుకి రూ. 275 ఫ్లోర్ ధర
- 13.5 శాతం వాటా అమ్మకం
- రూ. 4,850 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ తాజాగా ఎఫ్ఎంసీజీ సంస్థ అదానీ విల్మర్‌లో 13.5 శాతం వాటా విక్రయించింది. ఫార్చ్యూన్ బ్రాండ్ వంట నూనెలు, ఫుడ్ ప్రొడక్టుల కంపెనీలో 17.54 కోట్ల షేర్లను షేరుకి రూ. 275 ఫ్లోర్(కనీస) ధరలో అమ్మివేసింది. తద్వారా విల్మర్‌తో ఏర్పాటు చేసిన భాగస్వామ్య కంపెనీ(జేవీ) నుంచి వైదొలగనుంది. వెరసి కీలకంకాని బిజినెస్‌ల నుంచి తప్పుకోవడం ద్వారా గ్రూప్‌నకు ప్రధానమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై దృష్టి పెట్టనుంది. భాగస్వామి విల్మర్‌కు వాటా విక్రయించనున్నట్లు గత నెలలో అదానీ గ్రూప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అనుబంధ సంస్థ అదానీ కమోడిటీస్ ఎల్ఎల్‌పీ ద్వారా 13.5 శాతం వాటాను సంస్థాగత ఇన్వెస్టర్లకు విక్రయించింది. దీనిలో అదనంగా విక్రయించే వీలున్న 6.5 శాతం వాటా(8.44 కోట్ల షేర్లు) సైతం కలసి ఉన్నట్లు వెల్లడించింది. మార్కెట్లు క్షీణతలో ఉన్నప్పటికీ ఆఫర్ ఫర్ సేల్‌కు దేశ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించినట్లు అదానీ గ్రూప్ తెలియజేసింది. దీంతో 1.96 కోట్ల షేర్లను అదనంగా ఆఫర్ చేయనున్నట్లు వెల్లడించింది. అంటే 17.54 కోట్ల షేర్లు(13.5 శాతం వాటా) ప్రస్తుతం విక్రయించగా.. మరో 1.96 కోట్ల(1.5 శాతం వాటా)ను సోమవారం(13న) రిటైల్ ఇన్వెస్టర్లకు ఆఫర్ చేయనున్నట్లు వివరించింది. అంటే మొత్తం 19.5 కోట్ల షేర్ల(15.01 శాతం వాటా)ను అమ్మివేయనున్నట్లు వెల్లడించింది. ఈ లావాదేవీ తదుపరి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25)లో 3.15 బిలియన్ డాలర్ల ఈక్విటీ పెట్టుబడులను సమకూర్చుకున్నట్లవుతుందని అదానీ గ్రూప్ తెలియజేసింది.

పబ్లిక్‌కు కనీస వాటా

తాజా వాటా విక్రయ నేపథ్యంలో పబ్లిక్‌కు కనీస వాటా నిబంధనలను అమలు చేసినట్లు అదానీ విల్మర్ పేర్కొంది. ప్రస్తుతం ప్రమోటర్లకు 74.37 శాతం, పబ్లిక్‌కు 25.63 శాతం వాటా ఉన్నట్లు తెలియజేసింది. తదుపరి దశలో ఒప్పందం ప్రకారం మిగిలిన వాటాను విల్మర్‌కు షేరుకి రూ. 305 ధర మించకుండా విక్రయించనున్నట్లు తెలియజేసింది. లావాదేవీకి ముందు కంపెనీలో అదానీ గ్రూప్‌నకు 43.94 శాతం వాటా ఉన్న విషయం విదితమే. నిజానికి విల్మర్‌కు 31 శాతం వాటా విక్రయానికి ఒప్పందం కుదిరినప్పటికీ ఆఫర్ ఫర్ సేల్‌కు లభించిన స్పందన ఆధారంగా మిగిలిన వాటా ను విక్రయించనుంది. మార్చి31లోగా మొత్తం వాటా విక్రయం పూర్తికానున్నట్లు అదానీ గ్రూప్ వెల్లడించింది.

ఈ నేపథ్యంలో అదానీ విల్మర్ షేరు బీఎస్ఈలో 10 శాతం పతనమై రూ. 292 దిగువన స్థిరపడింది.

భారత జట్టులో కొత్త కెరటం ప్రతీక రావల్

బ్యాటర్‌గా సత్తా చాటుతున్న సైకాలజీ స్టూడెంట్

క్రికెట్ 'మనసు' చదివింది!

చిన్నప్పటి నుంచి చదువులో చురుకైన అమ్మాయి... మరోవైపు అంతే స్థాయిలో క్రికెట్ అంటే విపరీతమైన ఇష్టం... ఈ రెండింటిని సమన్వయం చేసుకోవడం అంత సులువు కాదు కాబట్టి ఏదో ఒకదానిని ఎంచుకోమని సన్నిహితులు చెప్పారు. కానీ ఇష్టంలో కష్టం ఉండదని ఆ అమ్మాయి నమ్మింది. అందుకే ఒకవైపు చదువులో ఉత్తమ విద్యార్థినిగా ఉంటూనే తనకు నచ్చిన రీతిలో క్రికెట్‌లో కూడా సాధనను కొనసాగించింది. ఫలితంగా ప్లస్ టు స్థాయిలో మంచి మార్కులు సాధించడం మాత్రమే కాదు... ప్రొఫెషనల్ క్రికెటర్‌గా కూడా మారింది. ఇప్పుడు సైకాలజీ చదువుతూనే ఏకంగా భారత సీనియర్ జట్టులోకి ఎంపికైంది. ఓపెనర్‌గా భారత్ తరఫున ఆడిన 4 వన్డేల్లో 2 అర్ధసెంచరీలు సాధించిన ఢిల్లీ అమ్మాయి ప్రతీక రావల్ భవిష్యత్తులో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. –సాక్షి క్రీడా విభాగం



భారత జట్టులో స్మృతి మంధానతో పాటు మరో ఓపెనర్‌గా షఫాలీ వర్మ ఐదేళ్ల పాటు రెగ్యులర్‌గా జట్టులో ఉంది. 16 ఏళ్లు పూర్తి కాక ముందే జట్టులోకి వచ్చిన షఫాలీ సంచలన బ్యాటింగ్, దూకుడైన శైలితో దూసుకుపోయింది. అయితే వరుస వైఫల్యాల తర్వాత సెలక్టర్లు షఫాలీపై వేటు వేసి కొత్త ఓపెనర్‌గా ప్రతీక రావల్‌ను ఎంపిక చేశారు. షఫాలీ స్థానంలో వచ్చిన ప్లేయర్ నుంచి సహజంగానే అలాంటి ధాటిని అంతా ఆశిస్తారు. ఇప్పుడు నిలకడైన ప్రదర్శనతో 24 ఏళ్ల ప్రతీక తాను అందుకు తగిన దానినే అని నిరూపించుకునే ప్రయత్నంలో ఉంది. ఆడిన 4 వన్డేల్లో ఆమె 82 స్ట్రయిక్‌రేట్‌తో వరుసగా 40, 76, 18, 89 పరుగులు సాధించి కెరీర్‌లో శుభారంభం చేసింది. దేశవాళీలో నిలకడైన ప్రదర్శన ఆమెకు ఈ అవకాశం కల్పించింది. మూడేళ్ల క్రితం వన్డే టోర్నీలో 155 బంతుల్లో 161 పరుగులు చేసి ఢిల్లీని నాకౌట్ చేర్చడంతో ప్రతీకకు తొలిసారి గుర్తింపు లభించింది. ఆ తర్వాత బీసీసీఐ అండర్–23 టోర్నీలో 7 ఇన్నింగ్స్‌లలో 411 పరుగులతో టోర్నీలో రెండో అత్యధిక స్కోరర్‌గా నిలవడంతో పాటు ఢిల్లీ సెమీఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించింది.

తండ్రి అండదండలతో...

ఢిల్లీలోని పశ్చిమ పటేల్ నగరంలో ఉండే ప్రదీప్ రావల్ కుటుంబం కేబుల్ టీవీ వ్యాపారంలో ఉంది. ప్రదీప్ అటు బిజినెస్‌లో భాగం కావడంతో పాటు ఢిల్లీ క్రికెట్ సంఘంలో బీసీసీఐ సర్టిఫైడ్ అంపైర్‌గా కూడా పని చేస్తున్నారు. చిన్నప్పటి నుంచి తండ్రితో కలిసి చాలాసార్లు మైదానానికి వెళ్లిన ప్రతీకకు సహజంగానే క్రికెట్‌పై ఆసక్తి ఏర్పడింది. దాంతో 10 ఏళ్ల వయసు ఉన్న తన కూతురిని కోచ్ శ్రవణ్ కుమార్ వద్ద శిక్షణ కోసం ప్రదీప్ చేర్పించారు. భారత ఆటగాళ్లు ఇషాంత్ శర్మ, నితీశ్ రాణా తదితరులకు కోచ్‌గా వ్యవహరించిన శ్రవణ్‌కు మంచి గుర్తింపు ఉంది. శ్రవణ్ శిక్షణ ఇచ్చిన తొలి అమ్మాయి ప్రతీకనే కావడం విశేషం. ఆ తర్వాత స్కూల్ స్థాయి నుంచి కాలేజీ వరకు వేర్వేరు చోట్ల చక్కటి ప్రదర్శనలతో ఆమె ఆకట్టుకుంది. క్రికెట్‌తో పాటు బాస్కెట్‌బాల్ కూడా బాగా ఆడుతూ వచ్చిన ప్రతీక 2019 జాతీయ క్రీడల్లో స్వర్ణం గెలిచిన ఢిల్లీ జట్టులో సభ్యురాలిగా కూడా ఉంది. సీబీఎస్‌ఈ ప్లస్ 2 పరీక్షల్లో 92.5 శాతం మార్కులతో ఆమె ఉత్తీర్ణురాలు కావడం విశేషం.

నిలకడైన ప్రదర్శనతో...

భిన్న రంగాల్లో సత్తా చాటుతున్నా... ప్రతీక అసలు లక్ష్యం మాత్రం క్రికెట్ వైపే సాగింది. దాంతో అండర్–17 స్థాయిలో మరింత మెరుగైన శిక్షణ అవసరమని భావించిన ఆమె రైల్వే కోచ్ ధ్యాని వద్ద చేరి తన ఆటకు మరింత మెరుగులు దిద్దుకుంది. 2022–23 దేశవాళీ వన్డే సీజన్‌లో 14 మ్యాచ్‌లలో కలిపి 552 పరుగులు చేయడం ద్వారా తన స్థాయిని పెంచుకుంది. మరోవైపు ఢిల్లీ మహిళల జట్టు కోచ్, మాజీ ఆటగాడు దిశాంత్ యాజ్ఞిక్ కూడా ఆమె ఆటను తీర్చిదిద్దడంలో సహకరించాడు. బీసీసీఐ అండర్–23 స్థాయి టి20 టోర్నీలో కూడా రాణించిన ప్రతీక ఢిల్లీ ఫైనల్ చేరడంలో తన వంతు పాత్ర పోషించింది. ఈ ప్రదర్శనలు చూస్తే జాతీయ జట్టుకు ఎంతో దూరంలో లేదని అందరికీ అర్థమైంది.

మానసికంగా దృఢంగా...

'నేను ఒకప్పుడు క్రికెటర్ కావాలని కలగన్నాను గానీ అది సాధ్యం కాలేదు. ఇప్పుడు నా కూతురి రూపంలో నా కోరిక తీరింది' అని ప్రదీప్ రావల్ గర్వంగా చెప్పుకుంటున్నారు. బీసీసీఐ విధుల్లో భాగంగా తండ్రి వడోదరలో ఉన్న సమయంలోనే ఆమెకు తొలి వన్డే ఆడే అవకాశం రావడం యాదృచ్ఛికం. తన కళ్ల ముందు భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ప్రతీకను చూస్తూ ఆ తండ్రి పుత్రికోత్సాహంతో కన్నీళ్లపర్యంతమయ్యారు. సైకాలజీలో గ్రాడ్యుయేషన్ చేసిన ప్రతీక... తన చదువు క్రికెట్ కెరీర్‌కూ ఉపయోగపడుతోందని చెప్పుకుంది. 'మనుషుల మనస్తత్వాలను చదవడం గురించి నాకు బాగా తెలుసు. దానిని అర్థం చేసుకోగలిగితే అటు మైదానంలో, మైదానం బయట కూడా పని సులువవుతుంది. మ్యాచ్‌కు ముందు ఇప్పుడు ఏం చేయాలో, తర్వాత ఏం చేయాలో అనే విషయంపై నాతో నేను సానుకూలంగా మాట్లాడుకుంటా. బ్యాటింగ్ చేసేటప్పుడు కూడా నేను అత్యుత్తమ ప్లేయర్‌గా, ఏదైనా చేయగలనని భావించుకుంటా. అది నాకు సైకాలజీనే నేర్పింది' అని ఆమె వ్యాఖ్యానించింది. ప్రస్తుత జోరును కొనసాగించి ఈ ఏడాది స్వదేశంలో వన్డే వరల్డ్ కప్ టీమ్‌లో భాగం కావాలని ప్రతీక ప్రస్తుత లక్ష్యంగా పెట్టుకుంది.



రేపు జై షాకు సన్మానం

ఎస్‌జీఎంలో సత్కరించనున్న బీసీసీఐ

ముంబై: భారత్ నుంచి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్ అయిన జై షాను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఘనంగా సన్మానించనుంది. రేపు జరిగే ప్రత్యేక సర్వ సభ్య సమావేశం (ఎస్‌జీఎం)లో ఐసీసీ నూతన చైర్మన్‌ను సన్మానించనున్నట్లు బోర్డు వర్గాలు తెలిపాయి. బోర్డు సెక్రటరీగా ఉన్న జై షా గతేడాది ఆగస్టులో జరిగిన ఐసీసీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అతి పిన్న వయసులో ఐసీసీ చైర్మన్ అయిన క్రికెట్ పరిపాలకుడిగా ఘనత వహించారు. అయితే మాజీ చైర్మన్ గ్రెగ్ బార్క్లే పదవీ కాలం నవంబర్ 30 వరకు ఉండటంతో జై షా కాస్త ఆలస్యంగా డిసెంబర్ 1న పదవీ బాధ్యతలు చేపట్టారు. 2019 అక్టోబర్ నుంచి బోర్డు కార్యదర్శిగా, 2021 జనవరి నుంచి ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) చైర్మన్‌గా కీలకపాత్ర పోషించిన జై షా ఇప్పుడు ఐసీసీ పీఠాన్ని అధిరోహించారు. నిజానికి బీసీసీఐ ఆఫీస్ బేరర్ కాకపోవడంతో ఎస్‌జీఎంలో జై షా పాల్గొనేందుకు వీల్లేదు. అయితే మీటింగ్‌కు ముందు లేదంటే తర్వాత ఆయన్ని సత్కరించే అవకాశముంది.



2022లో నాపై విష ప్రయోగం జరిగింది: జొకోవిచ్



మెల్‌బోర్న్: మూడేళ్ల క్రితం ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆడేందుకు వచ్చినపుడు తనపై విష ప్రయోగం జరిగిన మాట నిజమేనని సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ఆలస్యంగా వెల్లడించాడు. 2022 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడేందుకు రాగా తనకు వడ్డించిన ఆహారంలో తీవ్రస్థాయిలో మెర్క్యూరీ, లోహం అవశేషాలున్నట్లు పరీక్షల్లో తెలిందని చెప్పాడు. 'దీనిపై జీకే మేగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పాను. ఇప్పుడు మళ్లీ స్పందించకుండా ఉండాలనుకుంటున్నా. అందుకు నన్ను నేను అభినందించుకోవాలి. ఎందుకంటే ఇక్కడికొచ్చిన పని వేరు. ఈ స్పందన వేరు. ఇక్కడ నేను టోర్నీ ఆడాలి. ఆ పనేదో చూసుకుంటే మంచిది' అని అన్నాడు. ఆసక్తి గలవారికి మరిన్ని వివరాలు కావాలనుకుంటే తాను ఇంటర్వ్యూ ఇచ్చిన మేగజైన్‌ను తిరగేస్తే బాగుంటుందని పేర్కొన్నాడు. మూడేళ్ల క్రితం కోవిడ్–19 వ్యాక్సిన్ తీసుకోని కారణంగా జొకోను టోర్నీ ఆడేందుకు నిరాకరించారు. విమానాశ్రయంలోని హోటల్ గదిలోనే నిర్బంధించారు. 'ఆ సమయంలో నాకు ఇచ్చిన ఆహారం తినడం వల్లే అస్వస్థతకు గురయ్యాను. కానీ ఈ విషయాన్ని ఇప్పటివరకు ఎవరికీ, ఎక్కడ చెప్పనేలేదు. సెర్బియా వెళ్లాక ల్యాబ్ పరీక్షల్లో అత్యధిక స్థాయిలో ప్రమాదకర మెర్క్యూరీ, లెడ్ అవశేషాలు ఉన్నట్లు తేలింది' అని 37 ఏళ్ల నొవాక్ గత చేదు అనుభవాన్ని తాజాగా వివరించాడు. ప్రస్తుతం 24 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్‌తో ఉన్న ఈ సెర్బియన్ సూపర్ స్టార్ 25వ రికార్డు టైటిల్‌పై దృష్టి పెట్టాడు.

వరుణ్ అరోన్ వీడ్కోలు

అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలిగిన భారత మాజీ బౌలర్

న్యూఢిల్లీ: భారత మాజీ పేసర్ వరుణ్ అరోన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఒకప్పుడు భారత వేగవంతమైన బౌలర్‌గా గుర్తింపు తెచ్చుకున్న 35 ఏళ్ల అరోన్... గాయాల బారినపడి ఎక్కువ కాలం జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించలేకపోయాడు. టీమిండియా తరఫున 9 టెస్టులు, 9 వన్డేలు ఆడిన అరోన్... సుదీర్ఘ ఫార్మాట్‌లో 18, వన్డేల్లో 11 వికెట్లు పడగొట్టాడు. 2011లో జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేసిన అరోన్ చివరిసారి 2015లో టీమిండియాకు ఆడాడు. 'గత 20 ఏళ్లుగా నా ఆశ, శ్వాస వేగంగా బౌలింగ్ చేయడమే. ఎంతో గుర్తింపునిచ్చిన ఆటకు ఈ రోజుతో రిటైర్మెంట్ చెబుతున్నా' అని ఆరోన్ శుక్రవారం సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించాడు. 2010–11 విజయ్ హజారే ట్రోఫీలో అద్వితీయ ప్రదర్శన కనబర్చి నిలకడగా 150 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు విసిరి జాతీయ జట్టులోకి వచ్చిన ఆరోన్... ఆ తర్వాత ఫామ్ కోల్పోయి, గాయాలతో జాతీయ జట్టుకు దూరమయ్యాడు. సుదీర్ఘ ఫార్మాట్ నుంచి గత ఏడాదే తప్పుకున్న అరోన్... ఇకపై పరిమిత ఓవర్లలోనూ ఆడనని వెల్లడించాడు. 'గాయాల కారణంగా శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డా. సహకరించిన బీసీసీఐ, జార్ఖండ్ క్రికెట్ సంఘం, కోచ్‌లు, సహచరులు, అభిమానులకు ధన్యవాదాలు. ఫాస్ట్ బౌలింగ్ అనేది నా తొలి ప్రేమ. ఆటకు దూరమైనా దానికి దూరం కాలేను' అని ఆరోన్ వెల్లడించాడు. ఐపీఎల్లో ఢిల్లీ డేర్ డెవిల్స్ (ఇప్పుడు క్యాపిటల్స్), కింగ్స్ ఎలెవన్ పంజాబ్ (ఇప్పుడు పంజాబ్ కింగ్స్), కోల్‌కతా నైట్‌రైడర్స్, రాజస్తాన్ రాయల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్లకు ఆరోన్ ప్రాతినిధ్యం వహించాడు. చివరిసారిగా 2022లో ఐపీఎల్‌లో ఆడిన ఆరోన్ అదే ఏడాది ఐపీఎల్ విజేతగా నిలిచిన గుజరాత్ టైటాన్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు.



న్యూఢిల్లీ: భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా 2024 సంవత్సరానికిగానూ ప్రపంచ ఉత్తమ జావెలిన్ త్రోయర్‌గా ఎంపికయ్యాడు. అమెరికాకు చెందిన ప్రముఖ మేగజైన్ 'ట్రాక్ అండ్ ఫీల్డ్ న్యూస్' ప్రకటించిన ర్యాంకింగ్స్ జాబితాలో... పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన 27 ఏళ్ల నీరజ్ చోప్రా అగ్రస్థానం దక్కించుకున్నాడు. 'ట్రాక్ అండ్ ఫీల్డ్ న్యూస్' మేగజైన్‌కు 78 ఏళ్ల చరిత్ర ఉంది. 2024లో డైమండ్ లీగ్‌లో ఒక్క విజయం కూడా సాధించని నీరజ్... దోహా, లుసానే, బ్రస్సెల్స్ ఈవెంట్లలో రెండో స్థానంలో నిలిచాడు. ఫిన్‌లాండ్‌లో జరిగిన పావో నుర్మీ గేమ్స్‌లో నీరజ్ టైటిల్ సాధించాడు. రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా)తో పోటీపడి నీరజ్ ఈ జాబితాలో అగ్రస్థానం దక్కించుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన పీటర్స్... గత ఏడాది డైమండ్ లీగ్ మూడు ఈవెంట్లలో విజేతగా నిలిచాడు. 2023లోనూ నీరజ్ ఈ జాబితాలో 'టాప్' ప్లేస్‌లో నిలిచాడు. 'అగ్రస్థానం కోసం నీరజ్ చోప్రా, పీటర్స్ మధ్య గట్టి పోటీ సాగింది. గత ఏడాది నీరజ్ డైమండ్ లీగ్ టైటిల్ నెగ్గకపోయినా 3–2తో పీటర్స్‌పై ఆధిక్యంలో నిలిచాడు. ఒలింపిక్ చాంపియన్, పాకిస్తాన్ త్రోయర్ అర్షద్ నదీమ్ ఐదో స్థానం దక్కించుకున్నాడు' అని మేగజైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.



2024 ప్రపంచ ఉత్తమ జావెలిన్ త్రోయర్ నీరజ్

ఎంపిక చేసిన అమెరికా ప్రముఖ మేగజైన్ 'ట్రాక్ అండ్ ఫీల్డ్ న్యూస్'

తమిళనాడు డ్రాగన్స్ విజయపరంపర

రూర్కేలా: హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్)లో తమిళనాడు డ్రాగన్స్ జట్టు జోరు కొనసాగుతోంది. వరుస విజయాలతో దూసుకెళ్తున్న డ్రాగన్స్ నాలుగో గెలుపును తమ ఖాతాలో వేసుకుంది. శుక్రవారం జరిగిన పోరులో తమిళనాడు డ్రాగన్స్ 2–1 గోల్స్ తేడాతో ష్రాచి రార్ బెంగాల్ టైగర్స్‌పై విజయం సాధించింది. తమిళనాడు డ్రాగన్స్ తరఫున సెల్వం కార్తీ (16వ నిమిషంలో), ఉత్తమ్ సింగ్ (37వ నిమిషంలో) చెరో ఫీల్డ్ గోల్ సాధించారు. బెంగాల్ టైగర్స్ తరఫున రూపిందర్ పాల్ సింగ్ (35వ నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు. తొలి క్వార్టర్‌లో ఇరు జట్లు గోల్ చేసేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం కాగా... రెండో క్వార్టర్ ఆరంభంలోనే కార్తి గోల్‌తో తమిళనాడు బోణీ కొట్టింది. మూడో క్వార్టర్‌లో టైగర్స్ ప్లేయర్ రూపిందర్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచడంతో స్కోరు సమం కాగా... మరో రెండు నిమిషాల వ్యవధిలో ఉత్తమ్ సింగ్ గోల్ చేయడంతో డ్రాగన్స్ తిరిగి ఆధిక్యంలోకి వెళ్లింది. చివరి వరకు అదే జోరు కొనసాగించిన తమిళనాడు జట్టు విజయం సాధించింది. తాజా సీజన్‌లో 5 మ్యాచ్‌లాడి నాలుగు విజయాలు సాధించిన డ్రాగన్స్ 12 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో నిలిచింది. 5 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 2 పరాజయాలతో 9 పాయింట్లు ఖాతాలో వేసుకున్న బెంగాల్ టైగర్స్ పట్టికలో రెండో స్థానంలో ఉంది. లీగ్‌లో భాగంగా శనివారం జరిగే మ్యాచ్‌ల్లో హైదరాబాద్ తూఫాన్స్‌తో సూర్మా హాకీ క్లబ్, ఢిల్లీ ఎస్జీ పైపర్స్‌తో యూపీ రుద్రాస్ తలపడతాయి.



చాంపియన్స్ ట్రోఫీకి అయూబ్ దూరం!

గాయం నుంచి కోలుకునేందుకు మరింత సమయం

కరాచీ: చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కాకముందే పాకిస్తాన్ జట్టుకు దెబ్బ పడింది. పాకిస్తాన్ రైజింగ్ స్టార్ సయీమ్ అయూబ్ ఈ మెగా టోర్నీకి దూరమవడం ఖాయమైంది. దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు సందర్భంగా 22 ఏళ్ల అయూబ్ గాయపడ్డాడు. ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో అయూబ్ మడమకు గాయం కాగా... దాని నుంచి కోలుకునేందుకు కనీసం ఆరు వారాల సమయం పడుతుందని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తెలిపింది. అయితే గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో అతడు అంత త్వరగా తిరిగి మైదానంలో అడుగు పెట్టకపోవచ్చని అయూబ్‌కు చికిత్స చేస్తున్న వైద్య బృందం వెల్లడించింది. మెరుగైన చికిత్స కోసం పీసీబీ అయూబ్‌ను లండన్‌కు తరలించింది. 'అంత త్వరగా తగ్గే గాయం కాదు. తొందరపడి తిరిగి క్రికెట్ ఆడితే... మడమలో ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంది' అని తాజాగా వైద్యులు తెలిపారు. సొంతగడ్డపై వచ్చే నెల 19 నుంచి చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానున్న నేపథ్యంలో... ప్రాథమిక జట్టులో అయూబ్‌ను ఎంపిక చేయాలా వద్దా అని పీసీబీ తర్జనభర్జనలో ఉంది. ప్రధాన టోర్నీకి అతడు అందుబాటులో ఉండకపోతే 2023లో వన్డే ప్రపంచకప్‌లో చివరిసారి జాతీయ జట్టు తరఫున ఆడిన ఫఖర్ జమాన్‌కు తిరిగి పిలుపు దక్కే అవకాశం ఉంది. గత ఏడాది నవంబర్‌లో ఆస్ట్రేలియాపై వన్డేల్లో అరంగేట్రం చేసిన అయూబ్ 9 వన్డేలు ఆడి 3 సెంచరీలు, 1 అర్ధ సెంచరీ సహాయంతో 515 పరుగులు చేశాడు. పార్ట్‌టైమ్ ఆఫ్ స్పిన్నర్ కూడా అయిన అయూబ్ 5 వికెట్లు పడగొట్టాడు.



పంత్ డిఫెన్స్ అద్భుతం: అశ్విన్


చెన్నై: సాధారణంగా రిషభ్ పంత్ బ్యాటింగ్‌లో అందరూ అతని దూకుడునే చూస్తారు. భారీ షాట్ ఆడే ప్రయత్నంలో అతను వెనుదిరిగిన సందర్భాలే చాలా ఎక్కువ. అయితే పంత్ డిఫెన్స్ కూడా అభేద్యమని, అతను పట్టుదలగా నిలబడితే ఎన్ని బంతులైనా ఆడగలడని స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్న అశ్విన్ తన సహచరుడి బ్యాటింగ్‌పై ప్రశంసలు కురిపించాడు. ఇటీవల సిడ్నీ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లలో భిన్న తరహాలో పంత్ ఆడిన తీరును అశ్విన్ గుర్తు చేశాడు. 'రిషభ్ పంత్‌లో అన్ని రకాల షాట్లు ఆడే సామర్థ్యం ఉంది. అయితే అతడి నుంచి మనం ఏం ఆశిస్తున్నామో అతనికి స్పష్టంగా చెప్పాలి. అతడి డిఫెన్స్ కూడా ఎంత బాగుంటుందంటే 200 బంతులు కూడా ఆడగలడు. తన బలమేంటో తనకే పూర్తిగా తెలీదు. మిడిల్ గేమ్‌లో పరిస్థితికి తగినట్లుగా ఆడటం అలవాటు చేసుకుంటే ప్రతీ మ్యాచ్‌లో పంత్ సెంచరీ కొట్టగలడు. డిఫెన్స్ ఆడుతూ అతను అవుట్ కావడం చాలా అరుదు. నెట్స్‌లో నేను ఎన్నోసార్లు అతనికి బౌలింగ్ చేశాను. అతడు ఎల్బీడబ్ల్యూగా లేదా బంతి ఎడ్జ్ తీసుకుంటూ ఎప్పుడూ అవుట్ కాలేదు. గత కొన్నేళ్లుగా టెస్టుల్లో బ్యాటింగ్ చాలా కష్టంగా మారిపోయింది. అలాంటి సమయంలో పంత్ ఆడుతున్నాడు' అని అశ్విన్ విశ్లేషించాడు.

అక్కడ అనారోగ్యం నిషిద్ధం

నిషిద్ధ ప్రకటనలంటే ఎలా ఉంటాయి? చెత్త వేయొద్దనో, ఫలానా ప్రాంతంలోకి ప్రవేశించొద్దనో ఉంటాయి. కదా! కానీ దక్షిణ ఇటలీలో ఉన్న కాలాబ్రియా ప్రాంతంలోని చిన్న పట్టణమైన బెల్కాస్ట్రో మాత్రం వింతైన ప్రకటన చేసింది. ఆ పట్టణంలో ప్రజలు అనారోగ్యానికి గురికావడం నిషిద్ధం! అవును!! ''వైద్య సాయం అవసరమయ్యే ఎలాంటి అనారోగ్యానికీ లోనవొద్దు. ముఖ్యంగా అత్యవసర చికిత్స అవసరమయ్యే ఎలాంటి అనారోగ్యం బారినా పడొద్దు''అంటూ బెలాస్ట్రో మేయర్ ఆంటోనియో టార్చియా ఉత్తర్వులు జారీ చేశారు! అంతేకాదు.. గృహ ప్రమాదాలను నివారించడానికి హానికారకమైన ఎలాంటి కార్యక్రమాలూ నిర్వహించొద్దని, ఇల్లు విడిచి ప్రయాణాలు చేయొద్దని, ఆటలు నేర్చుకోవద్దని, ఎక్కువ సేపు కదలకుండా కూర్చోవద్దని... ఇలా పలు ఆదేశాలతో ఏకంగా ఆర్డినెన్సే జారీ చేశారు! మరోవైపు పర్యాటకులను తమ పట్టణానికి స్వాగతించారు కూడా. ''మా చిన్న గ్రామంలో ఓ వారం పాటు నివసించండి. సురక్షితంగా ఉండటానికి ప్రయత్నించండి. ఎందుకంటే ఆరోగ్యం పాడైతే ఎలాంటి వైద్య సేవలు కావాలన్నా 45 కి.మీ. దూరంలోని కాటాంజారో వెళ్లాల్సి ఉంటుంది''అంటూ వారినీ హెచ్చరించారు!

నగరానికి పెద్ద దిక్కయిన మేయరే ఇలాంటి ఆదేశాలివ్వడం ఆశ్చర్యమే అయినా అందుకు కారణం లేకపోలేదు. 1,300 మంది జనాభా ఉన్న బెల్కాస్ట్రోలో ఉన్నది ఒకే ఒక ఆరోగ్య కేంద్రం. దాన్నీ తరచూ మూసేస్తారు. వైద్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండరు. ఎమర్జెన్సీ వస్తే కాటంజారో నగరమే దిక్కు. పరిస్థితులను మార్చేందుకు ఎన్నోసార్లు విఫలయత్నం చేసిన మీదట మేయర్ చివరికిలా వ్యంగ్య ప్రకటన చేశారు! అదీ సంగతి. సమస్యలను పరిష్కరించేలా ప్రాంతీయ, ఆరోగ్య అధికారులను రెచ్చగొట్టేందుకే ఇలా ఉత్తర్వులిచ్చినట్టు మేయర్ తెలిపారు. పట్టణంలోని ప్రజారోగ్య కేంద్రం క్రమం తప్పకుండా తెరుచుకునేదాకా ఆర్డినెన్స్ అమల్లో ఉంటుందన్నారు. బెలాస్ట్రో ఇటలీలోని అత్యంత పేద ప్రాంతాలలో ఒకటైన కాలాబ్రియా పరిధిలో ఉంటుంది. యువకులు భారీగా నగరాలకు వలస పోతారు. జనాభా క్షీణిస్తుండటంతో పల్లె, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తే డబ్బు చెల్లించడానికి కూడా ప్రభుత్వాలు ముందుకొస్తున్నాయి. అక్కడ అనేక పట్టణాలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్



ఈ ఫొటో పిల్లలు పెన్సిల్‌తో గీసిన దయగ్రంలా ఉంది కదూ. నిజానికిది జర్మనీలోని హనోవర్ నగరంలోని చారిత్రక హెర్రెన్‌హౌజెన్ గార్డెన్, మంచు దుప్పటి కప్పుకుని ఇలా చిత్రంగా మారిపోయింది.

మహా కుంభమేళాలో తెలుగు కీర్తి

- కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్ర నాట్య ప్రదర్శనలకు కేంద్రం అనుమతి
- దేశవ్యాప్తంగా 160 మంది కళాకారులను ఎంపిక చేసిన సాంస్కృతి శాఖ
- వీరిలో పద్మజా రెడ్డి, ఆనంద శంకర్ జయంత్, దీపికా రెడ్డి, కళాకృష్ణ
- నమామీ గంగే, శివసతాయం, శివ పల్లవి థీమ్స్‌తో నృత్య ప్రదర్శనలు

సాక్షి, న్యూఢిల్లీ: భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక కుంభమేళా. 144 ఏళ్లకు ఒకసారి జరిగే మహా కుంభమేళాకు సర్వం సన్నద్ధమైంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్ త్రివేణి సంగమంలో ఈనెల 13 నుంచి వచ్చే నెల 26వ తేదీ వరకు అంటే 45 రోజుల పాటు జరిగే ఈ వేడుకకు ప్రభుత్వం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రయాగరాజ్ వేదికగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ, కథక్, మణిపూరి, సిత్రియా తదితర నాట్యాలతో పాటు సంగీత కచేరీలు నిర్వహిస్తున్నారు. ఇందుకు దేశవ్యాప్తంగా 160 మంది నృత్యకళాకారులను ఎంపిక చేశారు. వీరిలో హైదరాబాద్‌కు చెందిన నలుగురు ఉండటం విశేషం. పద్మశ్రీ, ఎస్ఎన్ఏ అవార్డు గ్రహీత పద్మజా రెడ్డి, పద్మశ్రీ, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ఆనంద శంకర్ జయంత్, కేంద్ర సంగీత నాటక అకాడెమీ పురస్కార గ్రహీత దీపికా రెడ్డి, ఎస్ఎన్ఏ అవార్డు గ్రహీత కళాకృష్ణ మహా కుంభమేళాలో నృత్య ప్రదర్శన చేయనున్నారు.

'శివోహం'తో ఆనంద

'శివోహం'ఇతివృత్తంతో లక్షలాది మంది భక్తులను అలరించనున్నారు పద్మశ్రీ గ్రహీత ఆనంద శంకర్ జయంత్. దశాబ్దాలుగా భరతనాట్యంలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సాధించుకున్న ఆనంద శంకర్ జయంత్ 144 ఏళ్ల మహా కుంభమేళాలో తెలుగు వారిలో తొలి ప్రదర్శన ఇవ్వనున్నారు. 'గణేశ తాళనం, స్కంధ మయుర, దేవీ ఉపాసకం, శివోహం'లపై 45 నిమిషాల పాటు 17మంది నృత్య కళాకారులతో కలిసి ఆమె నాట్యమాడనున్నారు. ఇటువంటి మహోత్సవాల్లో ప్రదర్శన ఇవ్వడం అనేది జన్మధన్యంగా భావిస్తున్నారు భారతనాట్య నృత్య కళాకారిణి ఆనంద శంకర్ జయంత్.



శుక్రవారం ప్రయాగరాజ్‌లో ధర్మ ధ్వజ పూజల్లో సాధువులు పాల్గొన్న దృశ్యం

'శివసతాయం'తో దీపికా రెడ్డి

'కూచిపూడి కళ కోసం జీవితాన్ని అంకితం చేశా'అనే మాట ముమ్మాటికీ నిజం అంటారు కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత, తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్ పర్సన్'దీపికా రెడ్డి. నాట్యమే ఊపిరిగా అనేక ప్రదర్శనలు ఇచ్చిన దీపికా రెడ్డి మహా కుంభమేళాలో ఆమె తన ప్రదర్శనను ఇవ్వనున్నారు. 'శివ సతాయం'అనే థీంతో దాదాపు 50 నిమిషాల పాటు 12మంది నృత్య కళాకారులతో కలిసి ప్రదర్శన చేయనున్నారు. ఈ నృత్యం ద్వారా గంగ అవతరణ, గంగ ద్వారా అందరికీ మంచి జరగాలనే కాన్సెప్ట్‌తో ఈనెల 26వ తేదీన దీపికా రెడ్డి మహా కుంభమేళాలో ప్రదర్శన ఇవ్వనున్నారు.

'శివపల్లవి'తో కళాకృష్ణ

తెలుగు సాంప్రదాయ నృత్యాలైన ఆంధ్ర నాట్యం, పేరిణి వంటి వాటిలో ప్రపంచస్థాయిలో విశేష ఆదరణ సొంతం చేసుకున్న కళాకారుడు కళాకృష్ణ. ఎస్ఎన్ఏ అవార్డుతో పాటు, రాష్ట్రప్రభుత్వం పలు అవార్డులతో ఆయనను సత్కరించింది. 24.02.2025 న మహా కుంభమేళాలో 'శివపల్లవి'థీంతో ఐదుగురుతో కలిసి ప్రదర్శన చేయనున్నారు. గంగ, పంచముఖస్తోత్రాలు, నీలకంఠ మహాదేవ కీర్తన ఈ మూడు అంశాలను 30 నిమిషాల్లో కళ్లకు కట్టినట్లుగా తన అపారమైన అనుభవంతో కుంభమేళాలో భక్తులను అలరించనున్నారు.

'నమామి గంగే'తో పద్మజా రెడ్డి

కూచిపూడి నృత్యంతో కళాప్రపంచంలో తనకంటూ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న కళాకారిణి, పద్మశ్రీ అవార్డు గ్రహీత పద్మజా రెడ్డి ఈ మహాకుంభామేళాలో నృత్యప్రదర్శన చేయనున్నారు. దాదాపు 3వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చిన పద్మజా రెడ్డి 'ప్రణవ్'ఇన్‌స్టిట్యూట్ ద్వారా అనేక మందికి నృత్యాన్ని పరిచయం చేస్తున్నారు. 10.02.2025న 30 నృత్యకళాకారులతో కుంభమేళాలో 'నమామి గంగే'అనే థీంతో ప్రదర్శన చేయనున్నారు. ఇటీవల కాలంలో గంగానది కలుషితానికి గురైంది, గంగను ఎలా పరిరక్షించుకోవాలి, భావితరాలకు గంగ ప్రాముఖ్యతను వివరించాలనే అంశాలపై సుమారు గంట పాటు 'నమామి గంగే'అనే ఇతివృత్తంతో అక్కడ ప్రదర్శన ఇవ్వనున్నారు.

హెల్మెట్ లేకుండా నడిచినందుకు ఫైన్!

సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆపి, 'హెల్మెట్ పెట్టుకోనందుకు ఫైన్ కట్టు'అంటాడు ఓ సినిమాలో ట్రాఫిక్ పోలీస్. మధ్యప్రదేశ్‌లో పోలీసులు మరో అడుగు ముందుకేశారు! రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తికి హెల్మెట్ పెట్టుకోలేదంటూ రూ.300 జరిమానా విధించారు! పన్నా జిల్లాలో అజయ్‌గఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ వింత ఘటన జరిగింది. సుశీల్ కుమార్ శుక్లా అనే వ్యక్తి తన కుమార్తె పుట్టినరోజు వేడుకలకు అతిథులను ఆహ్వానించేందుకు వెళ్తుండగా ఓ పోలీసు వాహనం అడ్డగించింది. బలవంతంగా వాహనంలోకి ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. కుమార్తె పుట్టినరోజు వేడుకలకు ఇంటికి వెళ్లాల్సి ఉందని చెప్పినా పోలీసులు విన్పించుకోలేదు. పక్కనే ఉన్న ఓ బైకు రిజిస్ట్రేషన్ నంబర్ రాసి మరీ, హెల్మెట్ లేకుండా వాహనం నడిపావంటూ శుక్లాకు జరిమానా విధించారు. దాంతో ఆయన ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో ఆధారంగా తప్పక చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఒకే రోజు వెయ్యి ఉద్యోగాలకు దరఖాస్తు

కృత్రిమ మేధ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచీ నెటిజన్లు దాన్ని ఏదోలా ఉపయోగిస్తూనే ఉన్నారు. ఉద్యోగ దరఖాస్తులకు సహాయపడే రెజ్యూమేలు, కవర్ లెటర్లు, మెమోరాండాలు, ఇతర పత్రాలను రూపొందించడానికి ఏఐ వాడకం పరిపాటిగా మారింది. ఆ క్రమంలో కృత్రిమ మేధ వాడకాన్ని మరో స్థాయికి తీసుకెళ్లాడో వ్యక్తి. ఏఐ సాయంతో ఏకంగా 1,000 ఉద్యోగాలకు దరఖాస్తు చేశాడు. ఏఐ బాట్‌ను సృష్టించి తన అర్హతలకు అనుగుణమైన ఉద్యోగాలకు రెజ్యూమే పంపేలా తయారు చేశాడు. తర్వాత మనవాడు హాయిగా నిద్రపోయాడు. ఏఐ బోట్ మాత్రం రాత్రింబవళ్లూ పని చేసి మరీ రెజ్యూమేలు పంపింది. దాని శ్రమ ఊరికే పోలేదు. మనవాడు తెల్లారి లేచి చూసేసరికి అనూహ్య ఫలితాలు వచ్చాయి. ఏకంగా 50 ఇంటర్వ్యూలకు కాల్స్ వచ్చాయి. ఈ విషయాన్ని అతను రెడిట్‌లో షేర్ చేసుకున్నాడు. ''నా ఉద్యోగ వేటను ఏఐ బాట్ సులభతరం చేసింది. నేను హాయిగా పడుకుంటే పనులన్నీ పూర్తి చేసింది''అని పేర్కొన్నాడు!

- సాక్షి, నేషనల్ డెస్క్

నేవీ మాజీ అధికారి పెంపుడు శునకాలు అదృశ్యం

సెక్యూరిటీ ఏజెన్సీ, గార్డుపై పోలీసు కేసు

బారాబంకీ: నావికాదళం మాజీ అధికారి పెంపుడు కుక్కలు రెండు కనిపించకుండా పోయిన ఘటన యూపీ పోలీసులకు సవాల్‌గా మారింది. నేవీ రిటైర్డు అధికారి అజయ్ కుమార్ పాండే సఫేదాబాద్‌లోని షాలిమార్ ప్యారడైజ్ రెసిడెన్షియల్ కాలనీలో ఉంటున్నారు. ఆయన గత డిసెంబర్ 28వ తేదీన ముంబై వెళ్లారు. అదే రోజు, ఆయన ఇంటికి కాపలాగా ఉన్న సెక్యూరిటీ గార్డులు ఆవరణలో అమర్చిన సీసీ టీవీ కెమెరాలను ఆఫ్ చేసి పెంపుడు శునకాలైన సింబ, లైలాలను ఎటో ఎత్తుకెళ్లిపోయారు. జనవరి 7వ తేదీన ఈ విషయమై సంబంధిత సెక్యూరిటీ ఏజెన్సీతోపాటు సెక్యూరిటీ గార్డు చంద్ర కుమార్‌పై కొత్వాలీ పోలీసులకు పాండే ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం సింబ, లైలా పేర్లను లక్నో మునిసిపల్ కార్పొరేషన్‌లో కూడా నమోదు చేయించినట్లు అందులో పేర్కొన్నారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు కుక్కల జాడ కనిపెట్టేందుకు సమీపంలోని నివాసప్రాంతాల్లో రహదారులు, హైవేలపై అమర్చిన దాదాపు 50 సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. ఎక్కడా ఎటువంటి ఆనవాళ్లు వారికి లభించలేదు. ఇప్పుడిక బారాబంకీ- లక్నోల మధ్య ఉన్న లక్నో-అయోధ్య హైవేతోని ఫుటేజీని పరిశీలించే పనిలో ఉన్నామన్నారు.

వచ్చే రెండేళ్లలో 50 అమృత్ భారత్ రైళ్లు

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

చెన్నై: చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ(ఐసీఎఫ్) వచ్చే రెండేళ్లలో నవీకరించిన అమృత్ భారత్ వెర్షన్‌లోని 50 రైళ్లను ఉత్పత్తి చేయనుందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. 2024 జనవరిలో ప్రధాని మోదీ ప్రారంభించిన అమృత్ భారత్ వెర్షన్ 1.0తో పోలిస్తే అమృత్ భారత్ వెర్షన్ 2.0లో ప్రధానంగా మాడ్యులర్ టాయిలెట్లు, ఎమర్జెన్సీ బ్రేకింగ్ సిస్టమ్ వంటి 12 ఆధునిక వసతులున్నాయన్నారు. శుక్రవారం ఆయన ఐసీఎఫ్‌లోని అమృత్ భారత్ వెర్షన్ 2.0 రైళ్ల ఉత్పత్తి యూనిట్‌ను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. దిగువ, మధ్య తరగతి ప్రజలే లక్ష్యంగా ఈ రైళ్లు కొత్త డిజైన్‌తో రూపొందుతున్నాయన్నారు. ఇందులో సౌకర్యవంతమైన సీట్లు, చార్జింగ్ పాయింట్లు, సెల్ ఫోన్, వాటర్ బాటిల్ హోల్డర్లు వంటివి కూడా ఉంటాయని చెప్పారు. అదేవిధంగా రైలు ప్రమాదాలను నివారించే 'కవచ్'నెట్‌వర్క్‌ను ఇప్పటి వరకు 10 వేల లోకోమోటివ్‌లతోపాటు 15 వేల కిలోమీటర్ల ట్రాక్‌కు అమర్చడం పూర్తయిందని వివరించారు.

వెలుగులోకి కొత్త పంగోలిన్ జాతులు

కోల్‌కతా: అరుణాచల్ ప్రదేశ్, అస్సాంలలో కొత్త పంగోలిన్ జాతులను జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జెడ్ఎస్ఐ) శాస్త్రవేత్తలు గుర్తించారు. మనిస్ పెంటాడాక్టిలా అనే శాస్త్రీయ నామం కలిగిన చైనీస్ పంగోలిన్‌ను ఇవి 34 లక్షల ఏళ్ల క్రితం ఇవి వేరుపడి కొత్తగా జాతిగా ఏర్పడ్డాయని శాస్త్రవేత్తలు తెలిపారు. వీటిని మనిస్ ఇండో-బర్మానికా లేదా ఇండో-బర్మీస్ పంగోలిన్‌గా వారు పేర్కొన్నారు. వీటిని వెలుగులోకి తేవడంతో పంగోలిన్‌ల పరిణామ వైవిధ్యం గురించిన మరిన్ని అంశాలను అధ్యయనం చేసేందుకు వీలయిందని చెప్పారు.

ప్రవాసీ అవార్డులు ప్రదానం చేసిన ముర్ము

అందుకున్న ట్రినిడాడ్ టొబాగో అధ్యక్షురాలు సహా 26 మంది..

భువనేశ్వర్: ట్రినిడాడ్ టొబాగో అధ్యక్షురాలు క్రిస్టిన్ కార్లా కంగాలూ సహా 26 మంది ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డులను అందుకున్నారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో 18వ ప్రవాసీ భారతీయ దివస్ ముగింపు కార్యక్రమం సందర్భంగా శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అవార్డులను ప్రదానం చేశారు. గ్రహీతలకు రాష్ట్రపతి ముర్ము అభినందనలు తెలిపారు. వీరి విజయ గాథలు మన దేశానికి గర్వకారణం, ప్రపంచానికి స్ఫూర్తి దాయకమని చెప్పారు. అధ్యక్షురాలు కంగాలూ ట్రినిడాడ్ టొబాగో దేశాన్ని విజయవంతంగా ముందుకు నడుపుతున్నారని.. మహిళలు, భారత సంతతి ప్రజలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని కొనియాడారు. అవార్డు గ్రహీతల్లో ఆస్ట్రేలియాకు చెందిన అజయ్ రాణె, ఆస్ట్రియాకు చెందిన మరియలెనా జోవాన్ ఫెర్నాండెజ్, ఫిజీకి చెందిన స్వామీ సంయుక్తానంద్, గుయానాకు చెందిన సరస్వతీ విద్యా నికేతన్, జపాన్‌కు చెందిన లేఖ్ రాజ్ జునెజా, కిర్గిజ్‌స్తాన్‌కు చెందిన ప్రేమ్ కుమార్, లావోస్‌కు చెందిన సౌఖ్యవీ చౌధురి ఉన్నారు.

రష్యా ఇంధన రంగంపై అమెరికా ఆంక్షలు

జాబితాలో రెండు భారత కంపెనీలు

వాషింగ్టన్: రష్యాపై విధించిన ఆంక్షలను తోసిరాజని ఆ దేశం నుంచి ద్రవీకృత సహజ వాయువు(ఎల్ఎన్‌జీ)ను రవాణా చేస్తున్నాయంటూ రెండు భారత కంపెనీలపై బైడెన్ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. రష్యాపై తాము అమలు చేస్తున్న ఆంక్షలను ఉల్లంఘించారంటూ శుక్రవారం 200కు పైగా కంపెనీలు, వ్యక్తుల పేర్లను అమెరికా ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. ఇందులో భారత్‌కు చెందిన స్కైహార్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, అవిజన్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కూడా ఉన్నాయి. వీటితోపాటు అక్కడి నుంచి చమురును రవాణా చేస్తున్న మరో 180కి పైగా నౌకలను బ్లాక్ చేసిన ఆస్తిగా పరిగణిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రష్యా ఖనిజ, ఇంధన రంగంతోపాటు అణు ఇంధన సంస్థ రొజటామ్‌పైనా ఆంక్షలు విధించింది. రష్యా ఇంధన రంగం ద్వారా వచ్చే ఆదాయాన్ని అడ్డుకుని, ఉక్రెయిన్‌పై అక్రమ యుద్ధానికి నిధుల లభ్యతను తగ్గించడం ద్వారా రష్యా అధ్యక్షుడు పుతిన్ సామర్థ్యాలను దెబ్బతీయడమే తమ ఆంక్షల లక్ష్యమని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ పేర్కొన్నారు.

మళ్లీ బీజేపీలోకి రఘుబర్ దాస్

రాంచీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ మళ్లీ బీజేపీలో చేరారు. శుక్రవారం రాంచీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన్ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ కాషాయ కండువా కప్పి ఆహ్వానించారు. 1980 తర్వాత పార్టీ సభ్యత్వాన్ని రెండోసారి తీసుకున్నందుకు తనకు చాలా సంతోషంగా ఉందని, రాష్ట్రంలో పార్టీ తిరిగి అధికారంలోకి ఖాయమని చెప్పారు. 2014-2019 సంవత్సరాల్లో జార్ఖండ్ సీఎంగా ఉన్న రఘుబర్ దాస్.. 2023లో ఒడిశా గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. రఘుబర్ దాస్ డిసెంబర్ 24న గవర్నర్ గిరీకి రాజీనామా చేశారు.

జీఎస్టీ నోటీసులపై సుప్రీంకోర్టు స్టే

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు, కేసినోలు రూ.లక్ష కోట్ల మేర పన్ను ఎగవేతలకు పాల్పడ్డాయనే ఆరోపణలపై జీఎస్టీ అధికారులిచ్చిన షోకాజ్ నోటీసులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. గేమింగ్ కంపెనీలపై చర్యలు, ఇతర అంశాలపై ఇరు పక్షాల వాదనలు వినాల్సి ఉన్నందున అప్పటి దాకా యథాతథ స్థితిని కొనసాగించాలని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఆదేశాలిచ్చింది. తదుపరి విచారణను మార్చి 18వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. ఆన్‌లైన్ గేమింగ్ వేదికలపై బెట్ పూర్తి విలువలో 28 శాతం మేరకు జీఎస్టీగా చెల్లించాల్సి ఉంటుందని 2023 ఆగస్టులో జీఎస్టీ కౌన్సిల్ స్పష్టం చేసింది. దీనిని సవాల్ చేస్తూ గేమింగ్ సంస్థలు వివిధ హైకోర్టుల్లో దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారిస్తోంది.

జాట్లు తలరాతలు మార్చేస్తారు..!

- ఢిల్లీలోని 12 స్థానాల్లో ఈ వర్గం ప్రభావం
- మొత్తం ఓటర్లలో 7-8శాతం వాటా
- చాలా చోట్ల 8 నుంచి 28 శాతం వరకు జనాభా
- ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే సామర్థ్యం
- వీరిపైనే ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ ఆశలు

సాక్షి, న్యూఢిల్లీ: జాట్లను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలంటూ ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ రాసిన లేఖతో హస్తినలో ఈ సామాజిక వర్గం పేరుమీద రాజకీయం వేడెక్కింది. ఢిల్లీ రాజకీయాల్లో జాట్లకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. సుమారు 12 ప్రాంతాల్లో 8 నుంచి 28 శాతం వరకు జాట్లున్నారు. ఢిల్లీకి హరియాణా రాష్ట్రంతో సరిహద్దు ఉంది. సుమారు 225 సరిహద్దు గ్రామాల్లో బలమైన సంఖ్యలో జాట్లున్నారు. ఫలితంగా, చాలా అసెంబ్లీ నియోజకవర్గాలలో వీరి ఓట్లు నిర్ణయాత్మకంగా మారాయి. ఇక్కడి మొత్తం ఓటర్లలో 7నుంచి 8 శాతం వాటా వీరిదే. వాయువ్య ఢిల్లీ, పశ్చిమ ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ లోక్‌సభ నియోజకవర్గాలలో వీరి సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల రాజకీయ ప్రాముఖ్యత పెరుగుతూ వస్తోంది. ఇటు అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, అటు బీజేపీ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జాట్ల అనుగ్రహంపైనే ఆశలు పెట్టుకున్నాయి. వారిని ఆకర్షించేందుకు ఆప్, బీజేపీ పోటీ పడుతున్నాయి. ఢిల్లీలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జాట్ల ప్రభావం ఎక్కువగా ఉందని గణాంకాలు చెబుతున్నాయి. ఇక్కడ 8నుంచి 28 శాతం జాట్ల జనాభా ఉందంటున్నాయి. ముండ్కా అసెంబ్లీ నియోజకవర్గంలో 28 శాతం, నజఫ్‌గఢ్‌లో 25, నరేలా, బిజ్వాసన్‌లలో 23, బవానా, నాంగ్‌లోయి జాట్‌లలో 20, మటియాలా, మెహ్రోలిల్లో 16, ఉత్తమ్‌నగర్‌లో 15, వికాస్‌పురిలో 10, ఛత్తర్‌పూర్‌లో 9, కిరాడిలో 8శాతం వరకు జాట్లు ఉన్నారు. వీరి ఓట్లు ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి.

కైలాశ్‌ను జాట్ నేతగా ప్రమోట్ చేసిన ఆప్

ఒకప్పుడు 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి మంచి పట్టు ఉండేది. అయితే, 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ నుంచి పోటీ చేసిన 8 మంది జాట్ ఎమ్మెల్యేలు, 2020లో 9 మంది ఎమ్మెల్యేలు విజయం సాధించారు. దీంతో ఈ ప్రాంతాలపై ఆప్ మంచి పట్టు సాధించింది. జాట్ నేతగా కైలాశ్ గెహ్లాట్‌ను ప్రమోట్ చేసి మంత్రి పదవిని కట్టబెట్టింది. అయితే, ప్రస్తుతం ఆయన బీజేపీలో ఉన్నారు.

కొన్ని చోట్ల బీజేపీకి అనుకూలం

గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో జాట్‌ల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీ ఆశించిన ఫలితాలు సాధించలేదు. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం మంచి ఆధిక్యం కనబరిచింది. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా జాట్ల ప్రాబల్యం ఉన్న వార్డుల్లో బీజేపీ పనితీరు సంతృప్తికరంగానే ఉంది. పొరుగు రాష్ట్రమైన హరియాణాలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా జాట్ ప్రభావిత ప్రాంతాల్లో బీజేపీ విజయం సాధించింది. అలాగే న్యూఢిల్లీ స్థానం నుంచి అర్వింద్ కేజ్రీవాల్‌పై పోటీ చేస్తున్న పర్వేశ్ వర్మ కూడా జాట్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తే. పర్వేశ్‌కు టికెట్ ఇచ్చి జాట్ల ఓట్లు రాబట్టేందుకు ప్రయత్నిస్తోంది బీజేపీ.

మీరట్‌లో దారుణం

- ముగ్గురు చిన్నారులు, దంపతులు దారుణ హత్య

మీరట్: ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ నగరంలో దారుణం చోటుచేసుకుంది. దంపతులు, వారి 8 ఏళ్లలోపు ముగ్గురు కుమార్తెలు దారుణ హత్యకు గురవడం సంచలనం రేపింది. పాత గొడవలే ఈ దారుణానికి కారణమని భావిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ జరుపుతున్నారు. లిసారి గేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుహైల్ గార్డెన్ ప్రాంతంలోని ఓ ఇంట్లో ఇటీవలే మొయిన్ అలియాస్ మోయినుద్దీన్(52), అస్మా(45)దంపతులు అద్దెకు దిగారు. వీరికి ముగ్గురు కుమార్తెలు అఫ్సా(8), అజీజా(4), అడీబా(1)ఉన్నారు. మొయిన్ దంపతులు బుధవారం నుంచి కనిపించకపోవడంతో అస్మా సోదరుడు షమీమ్, మొయిన్ సోదరుడు సలీ వారుండే ఇంటికి వచ్చి చూడగా బయట తాళం వేసి ఉంది. శుక్రవారం అతికష్టమ్మీద ఇంటి పైకప్పును తొలగించి, లోపలికి వెళ్లి చూడగా భయానక దృశ్యాలు కనిపించాయి. పడుకునే మంచానికి ఉన్న అరలో ముగ్గురు చిన్నారుల మృతదేహాలు కుక్కి ఉండగా దంపతులను బెడ్‌షీట్‌లో చుట్టి పడేశారు. వీరి కాళ్లు కట్టేసి ఉన్నాయి. షమీమ్, సలీమ్‌లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అస్మా చిన్న మరదలు, ఆమె ఇద్దరు సోదరులతోపాటు మరికొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న మరో అనుమానితుడి కోసం గాలింపు చేపట్టారు. ఇది తెలిసిన వారి పనే కావొచ్చని పోలీసులు తెలిపారు.

ఇంటర్‌పోల్ మొట్టమొదటి సిల్వర్ నోటీస్



న్యూఢిల్లీ: సభ్య దేశాలకు రంగుల కోడ్ కలిగిన నోటీసులు జారీ చేసే ఇంటర్ పోల్ (ఇంటర్నేషనల్ పోలీస్ కో ఆపరేషన్ ఆర్గనైజేషన్) అమ్ముల పొదిలో మరో ఆయుధం చేరింది. సరిహద్దులు దాటి వెళ్లే అక్రమ సంపదను గుర్తించేందుకు మొట్టమొదటిసారిగా సిల్వర్ నోటీస్ జారీ చేసింది. ఈ మేరకు చేపట్టిన పైలట్ ప్రాజెక్టులో భారత్ సహా 54 సభ్య దేశాలు, ప్రాంతాలున్నాయని ఇంటర్ పోల్ శుక్రవారం తెలిపింది. సీనియర్ మాఫియా ముఠా సభ్యుడికి చెందిన ఆస్తుల వివరాలను కనుగొనాలంటూ ఇటలీ చేసిన వినతి మేరకు ఈ నోటీస్ జారీ చేశామంది. అయితే, ఆ వ్యక్తి ఎవరనేది సభ్య దేశాలకు మాత్రమే తెలుస్తుందని స్పష్టం చేసింది. ఈ ఏడాది నవంబర్ వరకు ఈ నోటీస్ అమల్లో ఉంటుందని వివరించింది. అక్రమాలు, అవినీతి, డ్రగ్స్ రవాణా, పర్యావరణ సంబంధ నేరాలు, ఇతర తీవ్ర అభియోగాలు ఎదుర్కొంటున్న వారికి సంబంధించిన ఆస్తులను గుర్తించేందుకు సిల్వర్ నోటీస్ జారీ చేస్తామని ఇంటర్ పోల్ తెలిపింది. ఈ నోటీసులను అవసరమైతే మొత్తం 196 సభ్య దేశాలకు లేదా ఎంపికైన దేశాలకు పంపవచ్చని పేర్కొంది. ఇటువంటి నేరగాళ్లు సంపాదించిన సొత్తును స్వాధీనం చేసుకోవడం ద్వారా సంస్థాగత నేరాలను అరికట్టేందుకు అక్రమార్కుల నెట్‌వర్క్‌ను ఛేదించవచ్చని వివరించింది. కాగా, ప్రస్తుతం భారత్‌కు చెందిన కనీసం 10 మంది నేరగాళ్లు ఇతర దేశాల్లో ఉంటున్నారు. వీరు ఎంత మొత్తం నల్లధనాన్ని ఇతర దేశాలకు తరలించారనే దానిపై కచ్చితమైన సమాచారమేదీ లేదు. తాజా పరిణామంతో, మనం కూడా మెహుల్ చోక్సీ తదితర పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్ల నుంచి నల్లధనాన్ని వెనక్కి తెప్పించేందుకు సిల్వర్ నోటీస్ జారీ చేయాలని కోరేందుకు అవకాశం ఏర్పడిందని ఓ అధికారి తెలిపారు.

ఆ 8 నోటీసులు ఏవంటే..

ఫ్రాన్సులోని లియోన్ నగరం కేంద్రంగా ఇంటర్‌పోల్ కార్యకలాపాలు సాగిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సభ్య దేశాల నుంచి అవసరమైన సమాచారం కోసం ఇంటర్‌పోల్ ప్రస్తుతం 8 రకాల కోడెడ్ నోటీసులను జారీ చేస్తోంది. ఇందులో రెడ్ నోటీస్‌ను మరో దేశంలో దాక్కున్న పరారైన నేరగాడిని పట్టుకునేందుకు లేదా గుర్తించేందుకు సభ్యదేశం విజ్ఞప్తి మేరకు జారీ చేస్తుంది. యెల్లో నోటీస్‌ను కనిపించకుండా పోయిన వారిని, ముఖ్యంగా చిన్నారులను వెదికి పట్టుకునేందుకు జారీ చేస్తుంది. ఓ నేర ఘటన దర్యాప్తులో భాగంగా ఓ వ్యక్తిని లేదా ప్రాంతాన్ని గుర్తించేందుకు బ్లూ నోటీస్‌ను పంపుతుంది. ప్రజల భద్రతకు ప్రమాదకరంగా మారిన వ్యక్తి, అతడి నేర కార్యకలాపాలపై గ్రీన్ నోటీసును, గుర్తు తెలియని మృతదేహాలకు సంబంధించిన సమాచారం కోసం బ్లాక్ నోటీసును, ఒక ఘటన, వ్యక్తి లేదా వస్తువు, ప్రక్రియ కారణంగా ప్రజల భద్రతకు ప్రమాదమని భావిస్తే ఆరెంజ్ నోటీసును, నేరగాళ్లు అవలంభించే వివిధ ఆయుధాలు, లక్ష్యాలు, రహస్య విధానాలకు సంబంధించిన సమాచారంతో పర్పుల్ నోటీసును సభ్య దేశాలకు పంపుతుంది. అంతేకాదు, ఐరాస సర్వప్రతినిధి సభ వివిధ వ్యక్తులు, సంస్థలు లక్ష్యంగా విధించే ఆంక్షలకు సంబంధించిన నోటీసులను సైతం ఇంటర్‌పోల్ జారీ చేస్తుంది.

సాక్షి ప్లస్
శనివారం । 11-1-2025

యమునా తీరంలో వెలసిన.. అందమైన నగరం

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

సికిందర్ లోడి యమునా నదీ తీరంలో ఆగ్రా నగరాన్ని నిర్మించాడు. లోడిలకు ఇది రెండో రాజధాని. మొగలుల కాలంలోనూ ఆగ్రా రాజధానిగా ఉంది. అక్బర్ నిర్మించిన కోట, షాజహాన్ నిర్మించిన తాజ్‌మహల్, మోతీ మసీదు ఇక్కడి ప్రధాన కట్టడాలు. 17వ శతాబ్దంలో వివిధ వాణిజ్య మార్గాలకు ఇది కూడలిగా విలసిల్లింది. ఆగ్రా సమీపంలో అక్బర్ 'ఫతేపూర్ సిక్రీ' నిర్మించాడు.



ఢిల్లీ సుల్తాన్‌లు

తుగ్లక్ వంశం (క్రీ.శ. 1320-1414)

తుగ్లక్‌లు తరుష్క తెగకు చెందినవారు. ఈ వంశంలో మహమ్మద్ బిన్ తుగ్లక్, ఫిరోజ్ షా తుగ్లక్ ప్రసిద్ధమైనవారు.

గియాస్ ఉద్దీన్ (క్రీ.శ. 1320-1325): ఘజీమాలిక్ గియాస్ ఉద్దీన్ 'తుగ్లక్' వంశ పాలనను ప్రారంభించాడు. ఇతడి కుమారుడైన జునాఖాన్ కాకతీయ రాజు ప్రతాపరుద్రుడిపై దండెత్తి ఓడించాడు. ఓరుగల్లు పేరును 'సుల్తాన్‌పూర్'గా మార్చి ఢిల్లీ రాజ్యంలో విలీనం చేశాడు. తండ్రిని హత్య చేసి జునాఖాన్ 'మహమ్మద్ బిన్ తుగ్లక్'గా ఢిల్లీ సింహాసనాన్ని అధిష్ఠించాడు.

మహమ్మద్ బిన్ తుగ్లక్ (క్రీ.శ. 1325 - 1351): మహమ్మద్ బిన్ తుగ్లక్ మధ్యయుగ చక్రవర్తులందరిలో ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉన్నపాలకుడు. సమకాలీన ప్రభువుల్లో అత్యంత ప్రతిభావంతుడిగా పేరు పొందాడు. ఇతడు బహు భాషా కోవిదుడు. గణిత, తర్క, ఖగోళ, వైద్య, భౌతిక, తత్త్వ శాస్త్రాలను అధ్యయనం చేశాడు. పరమత సహనం ఉన్న వ్యక్తి. ఇన్ని సద్గుణాలున్నప్పటికీ తొందరపాటు ఎక్కువ. మొండిగా నిర్ణయాలు తీసుకునేవాడు. అదుపులేని కోపం ప్రదర్శించేవాడు. అందువల్ల చరిత్రకారులు ఇతడిని 'విరుద్ధ గుణాల నిలయుడు'గా పేర్కొన్నారు. 1327లో రాజధానిని ఢిల్లీ నుంచి దౌలతాబాద్‌కు మార్చాడు. 1329లో రాగి నాణేలను ప్రవేశపెట్టాడు. 1337లో నాగర్ కోటపై విజయం సాధించాడు. ఇతడు వివిధ సంస్కరణలు చేపట్టినప్పటికీ దూరదృష్టి లేకపోవడంతో అవి విఫలమయ్యాయి.

ఫిరోజ్ షా తుగ్లక్ (క్రీ.శ 1351-1386): సైన్యానికి జాగీర్లు ఇచ్చే పద్ధతిని తిరిగి ప్రవేశ పెట్టాడు. బానిసల అవసరాలను తీర్చడానికి ప్రభుత్వ శాఖను ఏర్పాటు చేశాడు. ముస్లిమేతరుల(హిందువులు)పై 'జిజియా' పన్ను, ముస్లింల ఆస్తులపై 2.5 శాతం పన్ను 'జకత్' విధించాడు. పండిన పంటలో పదో వంతు భాగాన్ని పన్ను (ఖరజ్) రూపంలో వసూలు చేసేవాడు. యుద్ధంలో సాధించిన ధనంలో 1/5వ భాగం ప్రభుత్వానికి, 4/5వ భాగం సైనికులకు ఇచ్చే శాడు. ఇతడి కాలంలో జియా ఉద్దీన్ బరానీ హిందూ-సంస్కృత గ్రంథాలను పర్షియన్ భాషలోకి అనువదించాడు.

ఫిరోజ్ షా శాంతికాముకుడు. ఇతడు యుద్ధాల పట్ల విముఖత చూపాడు. ఇతడికి ధైర్య సాహసాలు, యుద్ధ నిర్వహణా సామర్థ్యాలు తక్కువ. అందువల్ల ఇతడి కాలంలో విజయనగర, బహమనీ రాజ్యాలు ఏర్పడ్డాయి; బెంగాల్‌లోనూ స్వతంత్ర పాలన ప్రారంభమైంది.

ఫిరోజ్ షా ప్రజా సంక్షేమం కోసం పాటుపడ్డాడు. నీటిపారుదల సౌకర్యాలు కల్పించాడు. ఫతేబాద్, హిస్సార్, ఫిరోజాబాద్, జాన్‌పూర్ మొదలైన నూతన నగరాలను నిర్మించాడు. కఠిన శిక్షలను రద్దు చేశాడు. బానిసల అవసరాలకు ప్రత్యేక శాఖను నెలకొల్పాడు.

తుగ్లక్ వంశ చివరి పాలకులు: ఫిరోజ్ షా తర్వాత తుగ్లక్ షా అధికారంలోకి వచ్చాడు. ఢిల్లీ సర్దార్‌లు ఏడాది కాలంలోనే (1389) ఇతడిని తొలగించి మహమ్మద్‌ను సుల్తాన్‌గా నియమించారు. ఆ తర్వాత నాసిరుద్దీన్ మహమ్మద్ సింహాసనం అధిష్ఠించాడు. 1398లో తైమూర్ దండయాత్ర జరిగింది. 1414లో తుగ్లక్ వంశం పూర్తిగా అంతరించింది.

సయ్యద్ వంశం (క్రీ.శ. 1414-1451)

తైమూర్ ప్రతినిధి 'ఖిజిర్‌ఖాన్' ఢిల్లీని ఆక్రమించి 1414లో సయ్యద్ వంశాన్ని స్థాపించాడు. ఈ వంశంలో నలుగురి పాలనలో రాజ్యం అల్లకల్లోలంగా మారింది. దీంతో లోడి వంశానికి చెందిన బహలాల్ లోడి ఢిల్లీని ఆక్రమించాడు.

లోడి వంశం (క్రీ.శ. 1451-1526)

ఈ వంశాన్ని బహలాల్ లోడి స్థాపించాడు. ఇతడు అఫ్గాన్ తెగకు చెందినవాడు. ఇతడి కుమారుడైన 'సికిందర్ లోడి' భూమిని కొలవడానికి 'సికిందర్ గజ్' పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఆగ్రా నగరాన్ని కూడా ఇతడే నిర్మించాడు. ఇబ్రహీం లోడి 1526లో బాబర్‌తో జరిగిన 'పానిపట్ యుద్ధం'లో ఓడిపోయాడు. దీంతో లోడి వంశం అంతమైంది.

భక్తి, సూఫీ ఉద్యమాలు

భక్తి అంటే ఇష్టదైవంపై గాఢమైన అనురాగం. భక్తి ఉద్యమకారులు మూఢాచారాలు, కర్మలను ప్రతిఘటించారు. హిందువుల్లో ఈ భక్తి సిద్ధాంతం అతి ప్రాచీనమైంది. దీన్ని ఉపనిషత్తులు, భగవద్గీతలో గమనించవచ్చు. భక్తి ఉద్యమం 15, 16 శతాబ్దాల్లో ఉత్తర భారతదేశంలో శక్తివంతంగా మారింది. ఇస్లాం మత ప్రభావంతో అనేక మంది మతాచార్యులు దేవుడి ఏకత్వం, మానవ సౌభ్రాతృత్వాన్ని ప్రచారం చేయడానికి ముందుకు వచ్చారు. ఇదే సమయంలో హిందూమతంలో అనేక దూరాచారాలు చోటు చేసుకున్నాయి. విగ్రహారాధన, అస్పృశ్యత, వర్ణభేదాలు, దురాచారాలు అధికమయ్యాయి. దీంతో చాలా మంది హిందూమత సంస్కారాన్ని కోరుకున్నారు.

భక్తి ఉద్యమ గురువులు దేశ భాషల్లో సామాన్య జనానికి అర్థమయ్యేవిధంగా దృష్టాంతాలతో కథలు బోధించారు. నిమ్న జాతుల ఉద్ధరణ కోసం వీరు వర్ణభేదాలను ఖండించారు.

శంకరాచార్యులు: ఈయన కేరళలోని 'కాలిడి' గ్రామంలో జన్మించారు. అద్వైత మత సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. జీవాత్మ, పరమాత్మలో ఐక్యం కావడమే మోక్షం, ఈ జ్ఞానం సాధించినవాడే జీవన్ముఖుడు అని చెప్పారు. యాంత్రికమైన ఆచారాలు, కర్మకాండలను తీవ్రంగా నిరసించారు. భారతదేశంలో అద్వైత వేదాంత మత సిద్ధాంతాలను ప్రచారం చేశారు. భగవద్గీత, ఉపనిషత్తులు, వేదాంత సూత్రాలకు భాష్యాలు రాసి అద్వైత సూత్రాన్ని ప్రబోధించారు. భక్తి, జ్ఞానం, కర్మ, వైరాగ్య మార్గాల ద్వారా మోక్షాన్ని పొందొచ్చని చెప్పారు. ఆయన దేశ నలుమూలలా తన సిద్ధాంతాలను ప్రచారం చేశారు. దీని కోసం శృంగేరి (మైసూర్ దక్షిణ ప్రాంతం), ద్వారకా (గుజరాత్ పశ్చిమ ప్రాంతం), పూరీ(ఒడిశా తూర్పు ప్రాంతం), బదరీ (ఉత్తరప్రదేశ్ ఉత్తరప్రాంతం)లో మఠాలను స్థాపించారు. శంకరాచార్యుడి విధానాన్ని 'ఉత్తర మీమాంస'గా పేర్కొంటారు.

రామానుజాచార్యులు: ఈయన మద్రాసు సమీపంలోని పెరంబుదూర్ గ్రామంలో జన్మించారు. విశిష్టాద్వైతాన్ని ప్రచారం చేశారు. జీవాత్మ పరమాత్మ సామీప్యం పొందడమే మోక్షమని, మోక్షానికి విష్ణుభక్తే మార్గమని రామానుజుడు బోధించారు. ఈయన కులతత్వాన్ని ఖండించారు.

మధ్వాచార్యులు: ఈయన కర్ణాటకలోని ఉడిపి పట్టణ సమీపం వేలి గ్రామంలో 1199లో జన్మించారు. మధ్వాచార్యులు 'ద్వైత' మత ప్రతిష్టాపకులు. ఇందులో మూడు సత్య పదార్థాలను పేర్కొన్నారు. అవి.. ఆదిబ్రహ్మ, జీవుడు, ప్రపంచం. ఈయన వైష్ణవభక్తి మార్గాన్ని ప్రచారం చేశారు.

రామానందుడు: వైష్ణవ మత ప్రచారానికి సంబంధించిన అగ్రగణ్యుల్లో రామానందుడు ఒకరు. మధ్యయుగంలో భక్తి ఉద్యమం ప్రధానంగా ఈయనతోనే ప్రారంభమైంది. ఈయన ఇష్టదైవాలు రాముడు, సీత. రాజపుత్ర వనిత మీరాబాయి ఈయన శిష్యురాలు.

వల్లభాచార్యుడు: ఈయన 1449లో బెనారస్ నగరంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు కాశీలో స్థిరపడ్డ తెలుగు బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. వల్లభాచార్యుల ఇష్టదైవం కృష్ణుడు. ఈయన కృష్ణతత్వాన్ని ప్రచారం చేశారు. 'శుద్ధ అద్వైత' మతాన్ని ప్రబోధించారు.

చైతన్యుడు (1485-1533): బెంగాల్‌లోని నవద్వీపంలో 1486లో ఈయన జన్మించారు. చైతన్యుడు భక్తిభావంతో రాధాకృష్ణుల ప్రేమతత్వాన్ని ప్రబోధించడానికి జీవితం అంకితం చేశారు. ఈయన వల్లభాచార్యుల సమకాలీకులు.

కబీరు: ఈయన రామానందుడి శిష్యుల్లో గొప్పవారు. వర్ణభేదాలు, విగ్రహారాధనను నిరసించాడు. 'అల్లా' ఒక్కడేనని, ఈశ్వరుడు సర్వవ్యాప్తి అని ఈయన ప్రబోధించారు. భజనను ముక్తికి మార్గంగా ప్రచారం చేశారు. కబీరు శిష్యవర్గంలో హిందువులు, ముస్లింలు ఉన్నారు.

గురునానక్: ఈయన సిక్కు మత స్థాపకుడు. లాహోర్ సమీపంలోని తల్వండి గ్రామంలో 1469లో క్షత్రియ కుటుంబంలో జన్మించారు. ఏకేశ్వరోపాసన, ప్రేమ, భక్తి మార్గం ఈయన ముఖ్య సిద్ధాంతాలు. వర్ణభేదాలు, విగ్రహారాధనను నిరసించారు. దేవుడు సత్య స్వరూపుడని, ఆరాధించడానికి గురువు అవసరమని ఈయన పేర్కొన్నారు. గురునానక్ 1538లో మరణించారు.

తుకారం: ఈయన మరాఠా కబీర్‌గా గుర్తింపు పొందారు. పరిశుద్ధ హృదయం, నైతిక ఔన్నత్యం భక్తి సాధనాలని చెప్పారు. విగ్రహారాధనను నిరసించారు. ఈయన పద్యాలు శివాజీని ఎంతగానో ఆకర్షించాయి.

నామదేవుడు: ఈయన 15వ శతాబ్దంలో మహారాష్ట్రలో జన్మించారు. దుస్తులకు అద్దకం వేసే వృత్తి చేసేవారు. భక్తి మార్గం ముక్తికి ముఖ్య సాధనంగా బోధించారు. ఏకేశ్వరోపాసనాన్ని బలపర్చారు. ఈయన విగ్రహారాధన, కర్మకాండలను ఖండించారు.

తులసీదాసు: 1532లో జన్మించారు. 'రామచరిత మానస్' రచించారు. తులసీదాసు అద్వైతాన్ని అనుసరించారు. ఈయన అక్బర్ సమకాలీకులు.

వేమన: ఈయన ఆంధ్రదేశంలోని నీతి బోధకుల్లో గొప్పవారు. ప్రజాకవి. ఈయన రాసిన నీతి శతకాలు ప్రజల్లో బాగా వ్యాప్తి చెందాయి. వేమన అర్థంలేని సాంప్రదాయాలు, వర్ణభేదాలు, విగ్రహారాధనను ఖండించారు.

సూఫీ మతం

భక్తి ఉద్యమం మాదిరిగా సూఫీ మతం కూడా సాంఘిక, మత రంగాల్లో ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేసింది. భారత్‌లో తురుష్కుల పాలన నెలకొన్న తర్వాత సూఫీలు మనదేశానికి వచ్చారు. 'మానవుడు ప్రేమతో భగవంతుడిలో లీనం కాగలడు' అనేది సూఫీ మత ముఖ్య సిద్ధాంతం. సూఫీలు ప్రేమకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఇతర మతస్థుల పట్ల సహనంతో వ్యవహరించేవారు.

సూఫీ ప్రవక్తల్లో కొంత మంది హిందూ మతం వల్ల ప్రభావితమయ్యారు. భగవంతుడిని చేరుకోవడానికి అనేక మార్గాలు ఉంటాయని సూఫీలు విశ్వసించారు. వీరు సంఘానికి దూరంగా, ప్రత్యేక స్థలాల్లో నివసించేవారు. కర్మకాండలకు వ్యతిరేకంగా భక్తి ఉద్యమం ప్రారంభమైన విధంగా మహమ్మదీయ మతంలోని కొన్ని సాంప్రదాయాలకు వ్యతిరేకంగా సూఫీ మతం ప్రారంభమైంది.

సూఫీలు ఉపవాసాలు, ధ్యానం లాంటి హిందూ ఆచారాలను పాటించారు. భారత్‌లో ముఖ్యంగా మూడు సూఫీ శాఖలున్నాయి. వీటిలో ముఖ్యమైంది 'చిస్తి'. ఈ శాఖాధిపతి అజ్మీర్‌కు చెందిన మొయినుద్దీన్ చిస్తీ. ఈయన 13వ శతాబ్దానికి చెందినవారు. భక్తి సంగీతంతో భగవంతుడి సాన్నిధ్యం పొందవచ్చని చిస్తీ విశ్వసించారు. సుప్రసిద్ధ కవి అమీర్ ఖుస్రూ సహా అనేక మంది ఈయన అనుచరులు. చిస్తీ అనుచరులు ఎక్కువగా ఢిల్లీ ప్రాంతంలో ఉన్నారు.

సూఫీల్లో రెండో శాఖ నాయకుడు షేక్ షహాబుద్దీన్ సుహ్రావర్ది. ఈయన శిష్యులు ఎక్కువగా సింధ్ ప్రాంతంలో ఉన్నారు. మూడో సూఫీశాఖ గురువు ఫిరదౌసి అనుచరులు ఎక్కువగా బిహార్ ప్రాంతంలో ఉన్నారు. నిజాముద్దీన్ అవులియా కూడా సూఫీ మతగురువుల్లో ముఖ్యులు. సూఫీ నాయకులు సమానత్వాన్ని ప్రవచించారు. బడుగు వర్గాలకు చెందిన రైతులు, కార్మికులు, కూలీలను ఆకర్షించారు.

మూత్రపిండాల అధ్యయనాన్ని ఏమంటారు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ



జీవుల దేహంలోని మలిన పదార్థాలను బయటికి పంపడాన్నే విసర్జన అంటారు. మానవుడిలో ఒక జత మూత్ర పిండాలు ఉంటాయి. వీటి అధ్యయనాన్ని నెఫ్రాలజీ అంటారు. ఒక వ్యక్తి రోజుకు సుమారు 1 నుంచి1.5 లీటర్ల మూత్రాన్ని విసర్జిస్తాడు. మానవ శరీరంలో అవయవ మార్పిడి చేసిన మొదటి అవయవం 'మూత్ర పిండం'. కృత్రిమ అవయవాల అధ్యయనాన్ని బయోనిక్స్ అంటారు.

విసర్జన వ్యవస్థ

శరీరంలో జీవక్రియల ఫలితంగా ఏర్పడిన నీరు, కార్బన్ డై ఆక్సైడ్, నత్రజని సంబంధ వ్యర్థ పదార్థాలను దేహం నుంచి బయటకు పంపడాన్ని విసర్జన అంటారు. విసర్జన క్రియను అధ్యయనం చేసే శాస్త్రం యూరాలజీ. మానవుడిలో ఒక జత మూత్రపిండాలు విసర్జన క్రియను నిర్వర్తిస్తాయి. మూత్ర పిండాలు విసర్జనతో పాటు రక్తం, కణజాలాల ద్రవాభిసరణ పీడనం, అయాన్లను సమతుల్యం చేస్తాయి.

విసర్జన పద్ధతులు - జీవుల రకాలు

అమ్మోనోటెలిక్ జీవులు: అమ్మోనియాను విసర్జించే జీవులను అమ్మోనోటెలిక్ జీవులు అంటారు. దీని విష స్వభావం అధికంగా ఉంటుంది. **ఉదా:** అమీబా, హైడ్రా, అస్థి చేపలు, డిప్నాయ్ చేపలు, రొయ్యలు, పీతలు, నత్త, ఆల్చిప్ప, చిరుకప్ప, సముద్ర క్షీరదాలు (డాల్ఫిన్స్, తిమింగలం)

యూరికోటెలిక్ జీవులు: యూరికామ్లాన్ని విసర్జిస్తాయి. విషస్వభావం చాలా తక్కువ. నీటికొరత ఉండే ఎడారి జీవుల్లో ఈ విధానం కనిపిస్తుంది. **ఉదా:** కీటకాలు (ఆర్థోపొడ) సరీసృపాలు (బల్లి, పాము, తొండ, మొసలి, తాబేలు), పక్షులు. కప్ప సుప్తావస్థ దశలో యూరికామ్లాన్ని విసర్జిస్తుంది.

యూరియోటెలిక్ జీవులు: యూరియాను విసర్జిస్తాయి. **ఉదా:** మంచినీటి చేపలు, వానపాము, ఉభయచరాలు (ప్రౌఢకప్ప), క్షీరదాలు (మానవుడు). మొదటిసారి కృత్రిమంగా తయారు చేసిన జీవ సమ్మేళనం 'యూరియా'. దీని రసాయన నామం 'కార్బమైడ్'

మానవ విసర్జన వ్యవస్థ

మానవుడి విసర్జన వ్యవస్థలో జత మూత్రపిండాలు, జత మూత్ర నాళాలు, మూత్రాశయం, ప్రసేకం ఉంటాయి. పక్షుల్లో మూత్రాశయం ఉండదు. విసర్జక వ్యవస్థ ప్రాథమిక కర్తవ్యం రక్తం, శరీర ద్రవాల అయాన్ల సమతాస్థితిని కాపాడటం. ద్వితీయ కర్తవ్యం నత్రజని సంబంధ వ్యర్థ పదార్థాల విసర్జన.

మూత్ర పిండాలు (కిడ్నీలు)

- మూత్ర పిండాల అధ్యయనాన్ని నెఫ్రాలజీ అంటారు.
- మూత్ర పిండాలు చిక్కుడు గింజ ఆకారంలో, ముదురు ఎరుపు రంగులో ఉంటాయి.
- కాలేయం వల్ల ఎడమ మూత్ర పిండం కంటే కుడి మూత్రపిండం కొద్దిగా దిగువన అమరి ఉంటుంది.
- మూత్ర పిండాలు 120 నుంచి 170 గ్రాముల బరువుంటాయి. ఇవి వెన్నెముకకు ఇరువైపులా, పృష్ఠ శరీర కుడ్యాన్ని అంటిపెట్టుకొని ఉంటాయి.
- మూత్ర పిండాలకు హృదయం నుంచి వృక్క ధమని రక్తాన్ని సరఫరా చేస్తుంది.
- మూత్ర పిండాల నుంచి హృదయానికి రక్తాన్ని తీసుకుపోయే సిరను వృక్కసిర అంటారు.
- నిలువుకోతలో మూత్ర పిండం వెలుపలి భాగాన్ని వల్కలం (కోర్టెక్స్), లోపలి భాగాన్ని దవ్వ అంటారు.
- మూత్రపిండం పుటాకార అంచులో ఉండే నొక్కును నాభి అంటారు.
- నాభి ద్వారా వృక్కసిర, మూత్రనాళాలు బయటకు వస్తాయి.
- మూత్ర పిండాల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణాలు మూత్రనాళికలు (నెఫ్రాన్లు)

మూత్రనాళికలు (నెఫ్రాన్లు)

ఒక్కో మూత్ర పిండంలో 12 లక్షల (1.2 మిలియన్లు) నెఫ్రాన్లు ఉంటాయి. ప్రతి నెఫ్రాన్ (మూత్ర నాళిక)లో రెండు భాగాలుంటాయి. అవి.

ఎ) భౌమన్స్ గుళిక

బి) నాళికా భాగం.

భౌమన్స్ గుళిక: ఇది ఒక గిన్నెవంటి భాగం. వృక్క ధమని మూత్రపిండంలోకి ప్రవేశించి అనేక ధమనికలుగా విభజన చెందుతుంది. భౌమన్ గుళికలోకి ఒక అభివాహి ధమనిక ప్రవేశించి అనేక రక్త కేశనాళికలుగా చీలి, రక్త కేశ నాళికాగుచ్ఛాన్ని ఏర్పరుస్తుంది. దీనిలోని సూక్ష్మ రంధ్రాల ద్వారా రక్తంలోని నీరు,మలినాలు భౌమన్స్ గుళికలోకి చేరుతాయి. ఈ వడబోతను సూక్ష్మగాలనం(అల్ట్రాఫిల్టరేషన్) అంటారు. భౌమన్స్ గుళికలో రక్తంలోని మలినాలు ఫిల్టరై ప్రాథమిక మూత్రం ఏర్పడుతుంది. దీనిలో గ్లూకోజ్, కొన్ని క్లోరైడ్లు, విటమిన్లు ఉంటాయి.

నాళికాభాగం: ఇది భౌమన్స్ గుళిక వెనకభాగం. దీనిలో మూడు ఉప భాగాలు ఉన్నాయి.

ఎ) **సమీప సంవళిత నాళం:** ఇది ముడతలు పడి ఉంటుంది. దీనిలో 60 శాతం నీరు పునఃశోషణం చెందుతుంది.

బి) **హెన్లీ శిఖ్యం:** ఇది తలపిన్ను / సి ఆకారంలో ఉంటుంది. ఇందులో 20 శాతం నీరు పునఃశోషణం చెందుతుంది

సి) **దూరాగ్రసంవళిత నాళం:** దీనిద్వారా 15 శాతం నీరు పునః శోషణం అవుతుంది.

- రక్తం వడపోతలో రెండు మూత్ర పిండాల్లో నిమిషానికి 125 మి.లీ, రోజుకు 180 లీటర్లు మూత్రం ఏర్పడుతుంది. ఇందులో 178.5 లీటర్ల మూత్రం పునఃశోషణం చెందుతుంది. రోజుకు 1.5 లీటర్ల మూత్రం విసర్జితమవుతుంది.

3. **మూత్రాశయం**

- మూత్రనాళాల నుంచి మూత్రం మూత్రాశయంలోకి చేరి అక్కడ నిల్వ ఉంటుంది. మూత్రాశయం నుంచి ప్రసేకం ద్వారా మూత్ర విసర్జన జరుగుతుంది. పెద్దవారిలో మూత్రవిసర్జన నియంత్రిత చర్య కాని చిన్న పిల్లల్లో అనియంత్రిత చర్య.

మూత్రం (యూరిన్) లక్షణాలు

ఒక వ్యక్తి రోజుకు సుమారు 1 నుంచి 1.5 లీటర్ల మూత్రాన్ని విసర్జిస్తాడు. మూత్రంలో 96 శాతం నీరు, 2 శాతం యూరియా, 2 శాతం అకర్బన పదార్థాలుంటాయి.మానవుడు మూత్రం ద్వారా రోజుకు సుమారు 25 నుంచి 30గ్రాముల యూరియా విసర్జిస్తాడు.

యూరోక్రోమ్ అనే వర్ణద్రవ్యం వల్ల మూత్రం లేత పసుపు రంగులో ఉంటుంది. మూత్రం కొద్దిగా ఆమ్ల స్వభావంలో ఉంటుంది. దీని పీహెచ్ '6'. మానవుడి మూత్రంలో 'సి' విటమిన్ ఉంటుంది. మూత్రం శరీరంలో ఎక్కువ కాలం నిల్వ ఉంటే యూరియా 'అమ్మోనియా' అనే విష పదార్థంగా మారుతుంది. అమ్మోనియా వల్ల మూత్రానికి ఘాటైన వాసన వస్తుంది. విసర్జితమైన మూత్రం కొంత సమయానికి వాసన వస్తుంది. మూత్రంలో గ్లూకోజ్, సోడియం ఉండవు. మధుమేహ వ్యాధిగ్రస్తుల మూత్రంలో గ్లూకోజ్ ఉంటుంది.

విసర్జనలో ఇతర అవయవాల పాత్ర

మూత్రపిండాలతో పాటు ఊపిరితిత్తులు,కాలేయం, చర్మం కూడా వ్యర్థ పదార్థాలను విసర్జిస్తాయి.

1. **ఊపిరితిత్తులు:** రోజుకు 18 లీటర్ల కార్బన్ డై ఆక్సైడ్, 300 నుంచి 500 మి.లీ. తేమను బయటకు పంపుతాయి
2. **కాలేయం:** ఇది మానవ శరీరంలో అతిపెద్ద గ్రంథి. ఇది వయసు మళ్లిన ఎర్రరక్త కణాలను విచ్ఛిన్నం చేసి హీమోగ్లోబిన్‌ను బైల్ వర్ణకాలుగా మారుస్తుంది.
3. **చర్మం:** చర్మంలోని స్వేద గ్రంథులు చెమట రూపంలో మలినాలను విసర్జిస్తాయి. మానవుడి స్వేదంలో నీరు, లవణాలు (ఉప్పు/ సోడియం క్లోరైడ్), కొవ్వులు, కొద్దిగా యూరియా ఉంటాయి.

కృత్రిమ మూత్ర పిండం:

- మూత్రపిండాలు పనిచేయని వారిలో రక్తంలోని మలినాలను తొలగించడానికి ఉపయోగించే యంత్రమే కృత్రిమ మూత్రపిండం (డయాలైజర్). దీన్ని విలియం కోల్ఫ్ కనుగొన్నారు. దీన్ని ఆవిష్కరించిన రోజు మార్చి 13ను ప్రపంచ కిడ్నీ దినోత్సవంగా జరుపుకుంటున్నారు. డయాలసిస్ చేయడానికి 2-6 గంటలు పడుతుంది.

మూత్రపిండాల మార్పిడి:

- మూత్రపిండాలు పూర్తిగా పనిచేయని వ్యక్తికి దాత నుంచి సేకరించిన కిడ్నీని అమర్చడాన్నే ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటారు.
- మానవ శరీరంలో అవయవ మార్పిడి చేసిన మొదటి అవయవం'మూత్రపిండం'. కృత్రిమ అవయవాల అధ్యయనాన్ని బయోనిక్స్ అంటారు.

మూత్రపిండాల్లో రాళ్లు: కాల్షియం ఆక్సలేట్ (ఎక్కువ మొత్తం), కాల్షియం ఫాస్ఫేట్, యూరియాతో ఏర్పడిన స్ఫటికాలను కిడ్నీ స్టోన్స్ అంటారు. వీటి వల్ల నెఫ్రాన్లు నశించి మూత్ర విసర్జన సమయంలో నొప్పి వస్తుంది.

మూత్ర పరీక్ష - విశ్లేషణ: మూత్రం క్లినికల్ డయాగ్నసిస్ ద్వారా రోగ నిర్ధారణ చేస్తారు. కొన్ని పరీక్షలు...

1. గ్లైకోన్యూరియా అంటే మూత్రంలో గ్లూకోజ్ ఉండటం (డయాబెటీస్ మిలిటస్ వ్యాధి).
2. కీటోన్యూరియా (మూత్రంలో కీటోన్ దేహాలు ఉంటాయి)
3. హిమటూరియా (మూత్రంలో రక్తం)
4. ఆల్కిప్టాన్యూరియా (నలుపురంగు మూత్ర విసర్జన, ఇది జన్యుసంబంధ వ్యాధి)
5. ఎన్యూరియా (మూత్రపిండాల్లో మూత్రం ఏర్పడకపోవడం)
6. నెఫ్రోసిస్ (హై బీపీ ఉన్న వారి మూత్ర పిండాల్లోని నెఫ్రాన్లు చితికిపోతాయి).
7. ఆల్బ్యునూరియా (మూత్రంలో ప్రొటీన్లు ఉంటాయి)
8. వృక్కకాల్క్యులీ (మూత్రపిండంలో రాళ్లు)
9. **డయాబెటీస్ ఇన్‌సిపిడస్:** అధిక మూత్ర విసర్జన (డై యూరియా).
10. **హెచ్.సి.జి. లేదా గ్రావెడిక్స్ టెస్ట్:** హ్యూమన్ క్రానిక్ గోనాడోట్రోపిక్ హార్మోన్. గర్భిణుల మూత్రంలో ఈ హార్మోన్ ఉంటుంది.

విసర్జక అవయవాలు - రకాలు

విసర్జక అవయవాలు	జీవులు
1. సంకోచ రిక్తికలు	ప్రొటోజోవా జీవులు (అమీబా, పారమీషియం)
2. జ్వాలా కణాలు (ఫ్లేమ్‌సెల్స్)	ప్లాటి హెల్మింథిస్ జీవులు (బద్దెపురుగు, టేప్ వార్మ్)
3. వృక్కాలు	అనిలెడ (వానపాము, జలగ)
4. మాల్ఫీజియన్ నాళికలు	ఆర్థ్రోపొడ (బొద్దింక, ఈగ)
5. హరిత గ్రంథులు	ఆర్థ్రోపొడ (రొయ్యలు, పీతలు)
6. కోక్సల్ గ్రంథులు	ఆర్థ్రోపొడ (తేలు)
7. కీబర్స్ అవయవం	మొలస్కా (నత్తలు)
8. బొజానస్ అవయవం	మొలస్కా (ఆల్చిప్ప)
9. మూత్రపిండాలు (కిడ్నీ)	చేప, ఉభయ చరాలు, సరీసృపాలు, పక్షులు, క్షీరదాలు

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కింది వాటిలో విసర్జన క్రియతో సంబంధం లేని అవయవం ఏది?
   1) స్వేద గ్రంథి 2) మూత్రపిండం
   3) ఊపిరితిత్తులు 4) లాలాజల గ్రంథులు
2. మొదటిసారి కృత్రిమంగా తయారు చేసిన జీవ సమ్మేళనం?
   1) మీథేన్ 2) బెంజీన్
   3) గ్లూకోజ్ 4) యూరియా
3. యూరియా రసాయన నామం?
   1) క్లోరో ఈథేన్ 2) ఎన్యూరిన్
   3) నైట్రిన్ 4) కార్బమైడ్
4. ఆరోగ్యవంతమైన వ్యక్తి మూత్రంలో గ్లూకోజ్ శాతం ఎంత?
   1) 0.1 శాతం 2) 2 శాతం
   3) 95 శాతం 4) 0 శాతం
5. మూత్రం పసుపు రంగులో ఉండటానికి కారణమైన పదార్థం?
   1) ఆల్బుమిన్ 2) సల్ఫర్
   3) యూరోక్రోమ్ 4) లెగ్ హీమోగ్లోబిన్
6. సాధారణంగా మూత్రం ద్వారా విసర్జితమయ్యే పదార్థం ఏది?
   1) పంచదార 2) గ్లూకోజ్
   3) క్రియాటిన్ 4) ప్రొటీన్
7. అప్పుడే విసర్జించిన మూత్రానికి ఎలాంటి వాసన ఉండదు. కానీ విసర్జించిన కొద్దిసేపటి తర్వాత మూత్రానికి ఘాటైన వాసన ఎందుకు వస్తుంది?
   1) యూరియా అమ్మోనియాగా తిరిగి యూరియాగా మారే వలయ చర్యల ద్వారా
   2) బ్యాక్టీరియా ప్రభావంతో యూరియా అమ్మోనియాగా మారడం వల్ల
   3) మూత్రంలోని యూరియా, యూరికామ్లంగా మారడం
   4) యూరియా, యూరికామ్లం, క్రియాటిన్ అమ్మోనియాగా మారడం
8. మానవుడి మూత్రపిండాల్లో ఏర్పడే రాళ్లలో అధికంగా ఉండే పదార్థం?
   1) కాల్షియం ఆక్సలేట్
   2) సోడియం ఎసిటేట్
   3) మెగ్నీషియం ఫాస్ఫేట్
   4) పైవన్నీ
9. చక్కెర వ్యాధిగ్రస్తుడి మూత్ర నమూనాలో ఉండేది?
   1) లాక్టోజ్ 2) మాల్టోజ్
   3) గ్లూకోజ్ 4) సుక్రోజ్

సమాధానాలు

1) 4 2) 4 3) 4 4) 4 5) 3
6) 3 7) 2 8) 1 9) 3

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

కేవీ రంగారెడ్డి ఏ జిల్లాలో జన్మించారు?

తెలంగాణ వైతాళికులు

కొండా వెంకటరంగారెడ్డి (1890-1970)



కొండా వెంకటరంగారెడ్డి 'అత్రాపు బల్దా' (హైదరాబాద్) జిల్లాలోని 'మంగళారం'గ్రామంలో 1890లో జన్మించారు. తండ్రి చెన్నారెడ్డి, తల్లి బుచ్చమ్మ. చెన్నారెడ్డి గ్రామ పోలీసు పటేల్‌గా పనిచేశారు. నాడు అత్రాపు బల్దా జిల్లాలోని భూములన్నీ నిజాం నవాబు సర్ఫేఖాస్‌గా ఉండేవి. ఈ భూముల నుంచి వచ్చే ఆదాయాన్ని నవాబు సొంత ఖర్చుల కోసం (సర్ఫేఖాస్) వినియోగించేవారు. ఇలాంటి గ్రామాల్లో ప్రజా సంక్షేమాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ప్రభుత్వ పాఠశాలలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో చెన్నారెడ్డి సొంత ఖర్చులతో ఒక వీధి బడిని ఏర్పాటు చేసి విద్యాభ్యాసం చేసే అవకాశం కల్పించారు. తండ్రి స్థాపించిన వీధిబడిలోనే కొండా వెంకటరంగారెడ్డి ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు.

మిడిల్ స్కూల్ విద్యాభ్యాసం తర్వాత 1909లో 'వకాలత్' (న్యాయశాస్త్రం)లో పట్టా పొందారు. తర్వాత న్యాయశాస్త్రంలో 'దర్జైదువ్వం', 'దర్జై అవ్వల్' సర్టిఫికెట్లు పొందారు. హైకోర్టులో 'దర్జై అవ్వల్' వకీల్‌గా శిక్షణ పొందారు. తెలంగాణ ప్రాంతంలో న్యాయవాద వృత్తికి సంబంధించిన పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం 'లా ఇన్‌స్టిట్యూట్'ను ఏర్పాటు చేసి 1911 నుంచి 1923 వరకు సేవలు అందించారు. కొండా వెంకటరంగారెడ్డి 1910 నుంచి 1920 వరకు అనేక రెవెన్యూ, సివిల్, క్రిమినల్ కేసుల్లో విజయం సాధించారు. 1935 నుంచి 1940 వరకు హైకోర్టులో 'వకాలత్' చేశారు.

వెంకట రంగారెడ్డి ప్రజాసేవ

నిజాం పాలనలో ప్రభుత్వ ఉద్యోగులు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు ప్రజలపై జరిపే అత్యాచారాలు, అన్యాయాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, రైతుల న్యాయమైన హక్కుల కోసం వెంకటరంగారెడ్డి ధైర్యంగా పోరాడారు. ఈయనకు భూస్వాములు, జాగీర్దార్ల కేసులు వచ్చేవి కాదు. పేద రైతుల పక్షాన న్యాయ పోరాటం చేసి అనతికాలంలోనే తెలంగాణ ప్రజల 'దీనజన బాంధవుడు', 'పేదల పెన్నిధి', 'రైతు బాంధవుడు'గా పేరు పొందారు.

నిజాం ప్రభుత్వం నెలకొల్పిన శాసన పరిషత్‌కు కొండా వెంకటరంగారెడ్డి 1939లో న్యాయవాదుల స్థానం నుంచి ఎన్నికయ్యారు. శాసన పరిషత్‌లో ప్రజాభ్యుదయం, సామాజిక న్యాయానికి దోహదం చేసే అనేక బిల్లులు ప్రవేశపెట్టారు. ఈయన ప్రవేశపెట్టిన బిల్లుల్లో ముఖ్యమైనవి.. స్త్రీలకు వారసత్వ హక్కు, బాల్య వివాహాల నిషేధం, వితంతు వివాహాలు చట్ట సమ్మతం, అంటరానితనం నిర్మూలన, జాగీర్దారీ విధానం రద్దు, సంస్థానంలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి పబ్లిక్ సర్వీసు కమిషన్ ఏర్పాటు,బావుల కింద వ్యవసాయం చేసే భూములపై నీటి పన్ను రద్దు చేయడం. వీటిని నిజాం నవాబు అనుమతితో శాసనసభలో ప్రవేశపెట్టాల్సి ఉండేది. అత్యధిక మంది ప్రజలు ఈ సంస్కరణలకు వ్యతిరేకమనే కారణంతో నిజాం నవాబు ఈ బిల్లులను తిరస్కరించారు. ఒక్క బాల్య వివాహాలకు సంబంధించిన బిల్లును మాత్రమే ప్రజాభిప్రాయ సేకరణకు నవాబు అంగీకరించారు. దీని కోసం హైకోర్టు న్యాయమూర్తిని నియమించారు. అయినప్పటికీ ఈ అభ్యుదయకరమైన, విప్లవాత్మక బిల్లులు ఇతర ప్రాంతాల సాంఘికోద్యమాలపై ప్రభావం చూపాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

కొండా వెంకటరంగారెడ్డి 1886 నుంచి 1917 వరకు హైదరాబాద్ హైకోర్టు జ్యుడీషియల్ కమిటీ వెలువరించిన తీర్పులన్నింటినీ క్రోడీకరించి రెండు సంపుటాలుగా ప్రచురించారు. ఇది న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరమైన గ్రంథంగా గుర్తింపు పొందింది.

కొండా వెంకటరంగారెడ్డి తదితరుల ప్రోత్సాహంతో 1918లో రాజా బహద్దూర్ వెంకట్రామారెడ్డి 'రెడ్డి హాస్టల్' స్థాపించారు. దీనికి వెంకటరంగారెడ్డి కార్యదర్శిగా పదేళ్లు సేవలందించారు. రెడ్డి హాస్టల్‌ను మొదట 'రెడ్డి బోర్డింగ్'గా వ్యవహరించేవారు. తర్వాత ఇది రెడ్డి హాస్టల్‌గా రూపాంతరం చెందింది. కొండా వెంకటరంగారెడ్డి దీనికి కార్యదర్శిగా, కోశాధికారిగా, అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం పనిచేశారు.



తాను నిజమని నమ్మిన, అంతరాత్మకు సమంజసమని తోచిన విషయాన్ని సూటిగా, స్పష్టంగా, నిర్భయంగా వ్యక్తం చేసిన, నిష్కల్మష హృదయం ఉన్న వ్యక్తి - కొండా వెంకటరంగారెడ్డి. తెలంగాణ ప్రజల పట్ల ఆయనకు అపారమైన ప్రేమ ఉండేది. తెలంగాణ ప్రజలు కూడా ఆయనపట్ల అమితమైన గౌరవం చూపారు. ప్రజలు ఆయనను ఆప్యాయంగా 'తెలంగాణా బాబాయ్' అని పిలుచుకునేవారు.

ముఖ్యమైన అంశాలు

- రెడ్డి జనసంఘం పక్షాన తెలుగు బోధనాభాషగా జాంబాగ్‌లో మాధ్యమిక పాఠశాలను ఏర్పాటు చేయడంలో వెంకటరంగారెడ్డి విశేషమైన కృషి చేశారు.
- షా అలీబండాలో ఉన్నత పాఠశాల, ఫీల్ఖానాలోని ఆంధ్ర సరస్వతీ బాలికా పాఠశాలను ఈయన అభివృద్ధి చేశారు.
- నారాయణగూడలోని బాలికోన్నత పాఠశాల, లాల్ దర్వాజలోని వెంకట్రావు స్మారక నిధి ఉన్నత పాఠశాల, ఆర్.బి.వి.ఆర్. మహిళా కళాశాల, గగన్‌మహల్‌లోని ఆంధ్ర విద్యాలయ కళాశాల(ప్రస్తుత ఏవీ కాలేజ్), చిక్కడపల్లిలోని ఆంధ్ర విద్యాలయం మొదలైనవన్నీ నేటికీ ఉత్తమ విద్యా సంస్థలుగా సేవలందిస్తున్నాయి. వీటి అభివృద్ధిలో వెంకటరంగారెడ్డి కృషి ఉంది.
- శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం, వేమనాంధ్ర భాషా నిలయం, బాల సరస్వతీ గ్రంథాలయం, ఆంధ్ర సారస్వత పరిషత్, దక్షిణ భారత హిందీ ప్రచార సభ, ఇందిరా సేవా సదన్, గ్రంథాలయాల స్థాపనలోనూ కొండా వెంకటరంగారెడ్డి విశేష కృషి చేశారు.
- కొండా వెంకటరంగారెడ్డి 70వ జన్మదినం సందర్భంగా 1960లో ఆయన పేరు మీద ఆర్.బి.వి.ఆర్. మహిళా కళాశాల ఆవరణలో 'రెడ్డి బాలికా వసతి గృహం' నిర్మించారు.
- 1921లో 'ఆంధ్ర జన సంఘం' స్థాపించడంలో ఈయణ్ని మూల పురుషుడిగా పేర్కొంటారు.
- జోగిపేటలో సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన ఆంధ్ర మహాసభ మొదటి సమావేశం జరిగింది. ఇందులో రంగారెడ్డి కీలకపాత్ర పోషించారు.
- 1936లో షాద్‌నగర్‌లో నిర్వహించిన 5వ, 1943లో హైదరాబాద్‌లో నిర్వహించిన 7వ ఆంధ్ర మహాసభలకు కొండా వెంకటరంగారెడ్డి అధ్యక్షుడిగా వ్యవహరించారు.
- హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో కలవాలని 1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొండా వెంకటరంగారెడ్డి తెలంగాణ జిల్లాల్లో పర్యటించి ప్రజలను ఉత్తేజపరిచారు.
- తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో రజాకార్ల దురాగతాలు.. ముఖ్యంగా దోపిడీలు, గృహ దహనాలు నిత్యకృత్యమవడం వల్ల భారత ప్రభుత్వం కె.ఎం. మున్షీని హైదరాబాద్ ఏజెంట్ జనరల్‌గా నియమించింది. వెంకటరంగారెడ్డి ఆయనకు తెలంగాణ ప్రజల బాధలను వివరించారు.
- భారత ప్రభుత్వం 1948 సెప్టెంబర్ 13న హైదరాబాద్ సంస్థానంపై 'పోలీసు చర్య' జరిపింది. రజాకార్ల నాయకుడైన సయ్యద్ కాశిం రజ్వీ బందీ అయ్యాడు. మేజర్ జనరల్ చౌదరీ మిలటరీ గవర్నర్‌గా నియమితుడయ్యాడు.
- 1950లో కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ రాష్ట్రంలో మిలటరీ ప్రభుత్వాన్ని రద్దుచేసి సీనియర్ ఐసీఎస్ అధికారి ఎం.కె. వెల్లోడిని ముఖ్యమంత్రిగా నియమించింది.
- భారత పార్లమెంట్‌కు హైదరాబాద్ సంస్థానం నుంచి 25 మంది సభ్యులను నియమించారు. వీరిలో కొండా వెంకటరంగారెడ్డి ఒకరు.
- 1952లో హైదరాబాద్ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించింది.
- హైదరాబాద్ సంస్థానంలో బూర్గుల రామకృష్ణారావు నాయకత్వంలో 1952లో మొదటి ప్రజా ప్రభుత్వం ఏర్పాటైంది. ఈయన మంత్రివర్గంలో వెంకటరంగారెడ్డి ఎక్సైజ్, కస్టమ్స్, అటవీశాఖలు నిర్వహించారు.
- కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కోసం 'ఫజల్ అలీ' అధ్యక్షతన కమిటీ నియమించింది. హైదరాబాద్ విభజన జరగాలని ఈ కమిటీ పేర్కొంది. తెలంగాణ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా రూపొందించాలని పేర్కొంది.
- రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ (ఎస్ఆర్‌సీ) నివేదిక తర్వాత అనేక తర్జనభర్జనలు జరిగాయి.
- కొండా వెంకటరంగారెడ్డి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడాలని వాదించారు. ఈయన నాయకత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది.
- నాటి హైదరాబాద్ రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి మర్రి చెన్నారెడ్డి తెలంగాణ జిల్లాల్లో పర్యటించి ప్రజల అభిప్రాయం సేకరించారు. అత్యధిక ప్రజలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలని కోరుతున్నట్లు ఆయన ప్రకటించారు.
- ఇదే సమయంలో కొంత మంది విశాలాంధ్ర ఏర్పాటు కోసం ఉద్యమించారు.
- ఆంధ్రా - తెలంగాణ నాయకుల మధ్య పెద్ద మనుషుల ఒప్పందం జరిగింది.
- ఈ ఒప్పందం ప్రకారం 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. దీనికి నీలం సంజీవ రెడ్డి ప్రథమ ముఖ్యమంత్రి అయ్యారు.
- కొండా వెంకటరంగారెడ్డి పేరు మీదే రంగారెడ్డి జిల్లా పేరు వచ్చింది.
- 1957లో తెలంగాణ ప్రాంతంలో జరిగిన ఎన్నికల్లో రంగారెడ్డి శాసనసభకు తిరిగి ఎన్నికయ్యారు.
- దామోదరం సంజీవయ్య మంత్రివర్గంలోనూ కొండా వెంకటరంగారెడ్డి పనిచేశారు.
- 1962లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ ముఠా తగదాల ఫలితంగా రంగారెడ్డి ఓడిపోయారు.
- 1969లో తెలంగాణాను తిరిగి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలనే ఉద్యమానికి రంగారెడ్డి నాయకత్వం వహించారు.

1970 జూలై 24న కొండా వెంకట రంగారెడ్డి మరణించారు. తెలంగాణ ప్రజల హక్కులు, విద్యాభివృద్ధి, రైతులు, పేద ప్రజల అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి ప్రశంసనీయమైంది.

మాదిరి ప్రశ్నలు

1. కొండా వెంకటరంగారెడ్డి ఏ జిల్లాలో జన్మించారు?
   1) మెదక్ 2) కరీంనగర్
   3) హైదరాబాద్ (అత్రాపు బల్దా జిల్లా)
   4) మహబూబ్‌నగర్
2. సర్ఫేఖాస్ అంటే ఏమిటి?
   1) నిజాం నవాబు సొంత ఖర్చుల కోసం సేద్యం చేసే భూములు
   2) బంగారు నాణేలు
   3) ఉన్నత న్యాయస్థానం
   4) బహుమతులు
3. నిజాం నవాబు నెలకొల్పిన 'శాసన పరిషత్'కు కొండా వెంకటరంగారెడ్డి న్యాయవాదుల స్థానం నుంచి ఎప్పుడు ఎన్నికయ్యారు?
   1) 1956 2) 1946
   3) 1939 4) 1950
4. హైదరాబాద్ సంస్థానంలో 'ఆంధ్ర జనసంఘం' ఎప్పుడు స్థాపించారు?
   1) 1921 2) 1920 3) 1936 4) 1946
5. కొండా వెంకటరంగారెడ్డి అధ్యక్షతన 5వ ఆంధ్ర మహాసభ ఎప్పుడు? ఎక్కడ జరిగింది?
   1) 1940, హైదరాబాద్
   2) 1936, షాద్‌నగర్
   3) 1930, జోగిపేట (మెదక్ జిల్లా)
   4) 1928, సిరిసిల్ల (కరీంనగర్)
6. 1943లో హైదరాబాద్‌లో నిర్వహించిన 7వ ఆంధ్ర మహాసభకు అధ్యక్షుడిగా ఎవరు వ్యవహరించారు?
   1) స్వామి రామానంద తీర్థ
   2) కాశీనాథ్ వైద్య
   3) సురవరం ప్రతాపరెడ్డి
   4) కొండా వెంకటరంగారెడ్డి
7. హైదరాబాద్ సంస్థానంపై 'పోలీసు చర్య' ఎప్పుడు జరిగింది?
   1) 1942 సెప్టెంబర్ 17
   2) 1946 ఆగస్టు 9
   3) 1950 నవంబర్ 10
   4) 1948 సెప్టెంబర్ 13
8. హైదరాబాద్ సంస్థానంలో 1952లో ఎవరి నాయకత్వంలో ప్రథమ ప్రజా ప్రభుత్వం ఏర్పడింది?
   1) కొండా వెంకటరంగారెడ్డి
   2) మర్రి చెన్నారెడ్డి
   3) బూర్గుల రామకృష్ణారావు
   4) రామానంద తీర్థ
9. కొండా వెంకటరంగారెడ్డి ఎప్పుడు మరణించారు?
   1) 1970 2) 1969 3) 1968 4) 1958

సమాధానాలు


1) 3; 2) 1; 3) 3; 4) 1; 5) 2; 6) 4; 7) 4; 8) 3; 9) 1.

What is the code for "both"?

MODEL QUESTIONS

Directions (Q. No. 1-5): Observe the statements carefully and choose the option by finding out the validity of the given conclusions.

1. **Statements:**
   All Desks are Cats.
   Some Cats are plants.
   All plants are Trees.
   Conclusions:
   I) Some Trees are Desks.
   II) No Desk is a Tree.
   III) All Trees being plants is a possibility
   1) Only I, II and III follow
   2) Only II and III follow
   3) Only III with Either I or II follows
   4) I and III follow
   5) None of these
2. **Statements:**
   All flowers are buds.
   All buds are roots.
   All roots are cots.
   Conclusions:
   I) Some cots are definitely not buds
   II) All cots are buds
   III) All those roots which are flowers must be buds
   1) Only II and III follow
   2) Only I and III follow
   3) Either I or II and III follow
   4) All follow
   5) None of these
3. **Statements:**
   All canteens are restaurants.
   Some restaurants are shops.
   Some shops are plots.
   Conclusions:
   I) Some plots are restaurants.
   II) Some restaurants are canteens.
   III) Some plots which are shops need not necessarily be restaurants.
   1) Only I and III follow
   2) Only II and III follow
   3) Either I or III and II follow
   4) All follow 5) None of these
4. **Statements:**
   No wafer is ring.
   All pastries are wafers.
   All diamonds are rings.
   Conclusions:
   I) Some diamonds are wafers.
   II) No ring is wafer
   III) No any rastry is diamond
   1) Only I and II follow
   2) Only II and III follow
   3) Either I or II and III follow
   4) All follow 5) None of these
5. **Statements:**
   All scales are pens.
   Some pens are bulbs.
   All bulbs are sockets.
   Conclusions:
   I) At least Some sockets are pens.
   II) Some pens are scales.
   III) All sockets can never be scales
   1) Only I and II follow
   2) All follow
   3) Either I or III and II follow
   4) None follows 5) None of these



Directions (Q. No. 6 -10): Study the following information carefully to answer the given questions.

A word and number arrangement machine, when given an input line of words and numbers, re-arranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement.

Input: sim favour 7 oder 87 38 cold 75 travel 6 uncover 5 virus 2

Step I: cold sim favour 7 oder 87 38 75 travel 6 uncover 5 virus 2

Step II: cold 87 sim favour 7 oder 38 75 travel 6 uncover 5 virus 2

Step III: cold 87 favour sim 7 oder 38 75 travel 6 uncover 5 virus 2

Step IV: cold 87 favour 75 sim 7 oder 38 travel 6 uncover 5 virus 2

Step V: cold 87 favour 75 oder sim 7 38 travel 6 uncover 5 virus 2

Step VI: cold 87 favour 75 oder 38 sim 7 travel 6 uncover 5 virus 2

Step VI is the last step of the rearrangement of the above input.

As per the rules followed in the above steps, answer the following questions.

6. **Input:** odd as 55 45 65 said more 85
   Which of the following steps will be the last step?
   1) Sixth 2) Seventh 3) Eighth
   4) Fifth 5) None of these
7. **Step III of an input:** bad 71 door 42 54 tomorrow fame 69
   Which of the following steps will be the last but one step?
   1) V 2) VI 3) VII
   4) VIII 5) None of these
8. **Step II of an input:** end 48 22 30 hold game 11 make
   Which of the following is definitely the input?
   1) 22 end 48 30 hold game 11 make
   2) 48 11 end 30 hold game make 22
   3) end hold game make 48 22 30 11
   4) Can't be determined
   5) None of these
9. **Input:** marriage has fit 17 always 90 36 49
   Which of the following will be step III?
   1) always 90 marriage 49 has fit 17 36
   2) always 90 fit marriage has 17 36 49
   3) always 90 fit 49 marriage has 17 36
   4) Can't be determined
   5) None of these
10. **Input:** born all 18 68 74 game need 39
    Which of the following is step II?
    1) all 68 born 18 74 game need 39
    2) all 74 born 18 68 game need 39
    3) all 74 born 68 game 39 need 18
    4) Can't be determined
    5) None of these

Directions (Q. No. 11-14): Study the following information to answer the given questions.


In a certain code language, "chi na le ba pi" means "Federer and Nadal are rivals", "ki ba lo tha" means "both rivals plays tennis", "da ki chi" means "Federer plays excellent", "tha na da" means "excellent and tennis" and "mu ki" means "children plays".

11. What is the code for "Nadal"?
    1) le 2) pi 3) ba
    4) Either le or pi 5) None
12. What is the code for "both"?
    1) ba 2) ki 3) lo
    4) Can't be determined
    5) None of these
13. Which of the following is the code for "Nadal and rivals are children"?
    1) chi na ki le pi 2) pi le na ba mu
    3) ba mu le ki pi 4) chi pi le ba mu
    5) None of these
14. Which of the following may be the code for "some rivals plays excellent"?
    1) ba da fi ki 2) lo da no ki
    3) ki fi ba le 4) da ba tha fi
    5) None of these


Key and Explanations

1.

Basic Diagram



Alternate Diagram




As all the given statements are affirmative, "All Trees being plants is a possibility" is valid.

Based on the above diagrams, both I and II conclusions form a complementary pair.


Answer is "Only III with either I or II" follows. *Ans: 3*

2.

Basic Diagram




Alternate Diagram



As all the given statements are affirmative, there is a possibility of "All cots are buds". Hence, both I & II conclusions form a complementary pair. Answer is "only III with Either I or II" follows. *Ans: 3*

3.


Basic Diagram



Clearly, only II and III conclusion are valid. *Ans: 2*

4.


Basic Diagram



"No ring is wafer" is a valid conclusion as the statement given is "No wafer is ring". No pastry is diamond is also valid. Hence, conclusion II and III follow. *Ans: 2*

5.

Basic Diagram



Clearly, both I and II conclusions are valid. As all the statements are affirmative "All sockets can be scales" follows. Hence, conclusion III is not valid. *Ans: 1*

(6-10):

6. The machine rearranges one word and one number in alternate steps. Words are rearranged in alphabetical order while numbers are rearranged in descending order.
   Input: odd as 55 45 65 said more 85
   Step I: as odd 55 45 65 said more 85
   Step II: as 85 odd 55 45 65 said more
   Step III: as 85 more odd 55 45 65 said
   Step IV: as 85 more 65 odd 55 45 said
   Step V: as 85 more 65 odd 55 said 45
   Ans: 4
7. **Step III:** bad 71 door 42 54 tomorrow fame 69
   Step IV: bad 71 door 69 42 54 tomorrow fame
   Step V: bad 71 door 69 fame 42 54 tomorrow
   Step VI: bad 71 door 69 fame 54 42 tomorrow
   Step VII: bad 71 door 69 fame 54 tomorrow 42
   Ans: 2
8. We can't proceed backward. *Ans: 4*
9. **Input:** marriage has fit 17 always 90 36 49
   Step I: always marriage has fit 17 90 36 49
   Step II: always 90 marriage has fit 17 36 49
   Step III: always 90 fit marriage has 17 36 49
   Ans: 2
10. **Input:** born all 18 68 74 game need 39
    Step I: all born 18 68 74 game need 39
    Step II: all 74 born 18 68 game need 39
    Ans: 2

(11-14):

chi na le ba pi → Federer and Nadal are rivals ... (1)
ki ba lo tha → Both rivals plays tennis ... (2)
da ki chi → Federer plays excellent ... (3)
tha na da → excellent and tennis ... (4)
mu ki → children plays ... (5)
From (1) and (3), chi → Federer
From (1) and (2), ba → rivals
From (1) and (4), na → and
From (1), le pi → Nadal are.. (6)
Since neither "Nadal" nor "are" is common with any other equation, so we can't find the exact code for "Nadal". It may be either "le" or "pi".
From (2), (3) and (5),
ki → plays and mu → children
From (2) and (4), tha → tennis
From (3) and (4), da → excellent
From (2), lo → both
11) 4;
12) 3;
13) 2;
14) 1.